భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

మార్చి 1955


సంపుటము 32 : : సంచిక 3

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మార్చి 1955

త్రివర్ణ చిత్రము : సైనికుడు—చిత్రకారుడు : శ్రీ సి. యస్. యన్. పట్నాయక్



సైనికుడు

చిత్రకారుడు: సి. యస్. యన్. పట్నాయక్

నీలగిరి ప్రాంతంలో లభించిన 20 శతాబ్దాలనాటి మృణ్మయశిల్పానికి ప్రతిచిత్రం

పునర్నవమ్

దా శ ర థి

అబద్ధాలాడడమంత సులభం
అవదు సుమా కవిత అల్లడం,
అయితే హరిశ్చంద్రు నంతగా
అలమటించ నక్కరలేదు కావ్యకల్పనకు.

దూరాన పొడిగాలి దెబ్బలకు
తునాతునలై పోయిన ఆకులతో
ముసలి మొహంపడిన వృక్షంమీద
యౌవనం చిగిరించడం కవిత్వం.

రోజూ కనపడే నక్షత్రాల్లోనే
రోజూ కనపడని కొత్తదనం చూచి
రోజూ పొందని ఆనందానుభూతి
పొందడం అంటేనే కవిత్వం.

మనకంటే లక్షయేండ్లు పెద్దది
మన నెత్తిమీదున్న ఆకాశం
దూది పింజెల్లాంటి కొత్త మబ్బుల్తో
తొంగిచూడ్డమే పునర్నవం.

మనసు మల్లె పొదల్లోంచి
పసందైన వాసనలు పీచి
అవి పద్యాల సీసాల్లో
అనంతకాలం నిలిస్తే కవిత్వం.

ఆకాశమంత యెత్తు కోర్కెలను
అధః పాతాళంలోకి తొక్కే లోకాన్ని
అమాంతం మింగేయగల శక్తిని
ఆర్జించడం 'అపోలో'వద్ద నేర్చుకో

'పోపు'లాంటి మతాధికారిని
కూపంలోకి దొర్లించే బలాన్ని
'లూథర్'వద్ద సంపాదించుకుని
మౌఢ్యానికి గోరీ కట్టుకో

కవి మేధామండలం లోని
గదులు గదులు కలవేసి తిరిగి
ఎందులో ఏమేం చమత్కారాలున్నవో
ఎక్కించు నీ ఖాతాబుక్కులో

మనం చూస్తున్న ప్రపంచం కన్న
మానసిక లోకం ఎంత పెద్దదో
ఊహా మాన దండంతో కొలిచి
ఒక లెక్క తయారుచేసి చూపు.

ఎత్తైన ఆశా శైలం
నెత్తమ్ముల చెంత నిలచి
పద్యాల పావురాళ్లని
బహు దిశల్లోకి విసరు.

వాటి రెక్కలకు రంగు లద్ది
వాటి కాళ్లకు గజ్జెలు కట్టి
వాటికి నేరేడుపళ్లు తినిపించి
ఆనందిస్తాను నేను.

ఆకురాల్చిన మనస్సుల్లో
అప్పుడే పూలు పూస్తున్నాయి;
పునర్నవ కాలం వచ్చింది,
పూచింది లోకం హర్షంతో.

రుడాల్ఫ్ వాలంటినో వలె
ప్రతివాడూ అందగాడు
అమృతభావనా వీధిలో
ప్రతివాడూ కాళిదాసు.

పోవాలి కృత్రిమాల చీకటి
అప్పుడు వెలుగుతుంది మనఃకుటి;
రావాలి మన నరాల్లోకి జవం
అప్పుడర్థమౌతుంది పునర్నవం!

విజేత

శ్రీ యస్. జీ. కె. ప్రతాపరావు

పాత్రలు

అరిస్టాటిల్	సెల్యూకస్
అలెగ్జాండరు	సేవకుడు
పురుషోత్తముడు	రుక్సానా

* * అలెగ్జాండరు ఇరాను రాజ్యాన్ని గెలిచి ఆక్రమించుకున్నాడు—ఆ రోజుల్లో ఇరాను రాజ ప్రాసాదంలో:

అరిస్టాటిల్ : అలెగ్జాండర్!......

అలెగ్జాండర్ : (ఆశ్చర్యంగా) గురుదేవులు!!...

అరి : ఇంత అకస్మాత్తుగా రావడం నీ కాశ్చర్యంగా వుంది కదూ...?

అలె : అవును స్వామీ! మీరు వస్తున్నట్లు వార్తయినా పంపలేదే?

అరి : ఆలసిస్తే పరిస్థితులు విషమిస్తాయని వెంటనే వచ్చాను.

అలె : మన రాజధానిలో ఏదైనా ప్రమాదము జరిగిందా? గ్రీసు ప్రజలకు క్షేమమే గదా?

అరి : నీ బొందిలో ప్రాణమున్నంతవరకూ గ్రీసు వైపు కన్నెత్తి చూడడాని కెవరికీ ధైర్యం చాలదు నాయనా!

అలె : మరి...?

అరి : ప్రమాదమంతా యిక్కడే సంభవించింది.

అలె : ఇక్కడా! ఆశ్చర్యంగా ఉంది!

అరి : అవును! లోకవిజయం చేయాలనే నీ దీక్ష ఇరానులో పటాపంచలు కాబోతున్నది. నేటితో గ్రీకుల ఔన్నత్యం అంతరించబోతోంది. నీ శౌర్య పరాక్రమాలకు సంకెళ్లు పడబోతున్నయ్.

అలె : గురుదేవుల మాటలు నా కర్థం కావడం లేదు. ఇప్పుడంతటి అపాయమేమి వచ్చిందంటారు?

అరి : (చిన్ని నవ్వు) అపాయమున్నదని నీకు తోచదు గనుకనే నేను రావలసివచ్చింది. రాజ్యం తరువాత రాజ్యాన్ని గెలుస్తూ, విజయగర్వంతో, సమరోత్సాహంతో యిన్నాళ్లూ ముందుకు సాగుతూ వచ్చావు; కాని నేడు ఇరాను రాకుమారి నిన్ను ప్రత్యక్షంగా ఖైదు చేసి వేసింది. నీవు ముందంజ వేయలేక పోతున్నావు.

అలె : ఇందులో ఇరాను రాకుమారి ప్రమేయమేమున్నది గురుదేవా!

అరి : నిదర్శనాలు కావాలా? అప్రతిహత శూరుణ్ణి, ప్రపంచ విజేతను తన వలపుతో విలాసాలతో బంధించగలిగింది. బ్రహ్మచర్యమే దీక్షగా బయలుదేరిన నిన్ను ఆటబొమ్మను చేసి ఆడిస్తోంది. యోగిని భోగిని చేస్తోంది. ప్రకృతిని జయిస్తానంటోంది. నీ శక్తివాహినికి చెలియలి కట్టవేస్తోంది. ఈ ప్రమేయం చాలదా?

అలె : మీరు అపోహపడుతున్నా రనడానికి సాహసిస్తున్నాను.

అరి : నీవు ఆ మాట అంటావని నాకు తెలుసు. స్త్రీ సంపర్కము లేని నీవు, స్త్రీ శక్తి నూహించలేవు. ఆదిశక్తికి ప్రతిరూపం స్త్రీ. తన మేధాశక్తిచే తలచిన కార్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగించుకోగల దీక్ష స్త్రీ కుంటుంది. తన క్రీగంటి చూపులతో సామ్రాజ్యాన్ని గడగడ లాడించగల సామంతురాలు స్త్రీ. ప్రళయాన్ని సృష్టించగల సమర్థురాలు. దేశదేశాల పురాణాలు ఏకకంఠంలో స్త్రీ శక్తిని ఉద్ఘోషిస్తున్నయ్. పసివాడివి. నీకేం తెలుసు నాయనా?

అలె : రుక్సానా అంతటి సమర్థురాలనుకోను,

అరి : గ్రీకు జాతి గౌరవం నిలపాలంటే, నీ కీర్తి చిరస్థాయిగా వుండాలంటే నీవు ముందుకు సాగాలి. నీవు ప్రపంచ సార్వభౌముడుగా దేశానికి తిరిగిరావాలని నీ ప్రజలకోరిక. ప్రస్తుతం ఇరాను రాకుమారిని నీ బాటనుండి తొలగించుకో. నీ కార్యశూరతకు ఏ విఘ్నమూ కలుగకుండా చూడటమే నావిధి; అదే నా ఆగమనానికి కారణం.

అలె : గురుదేవా, మీ ఆజ్ఞ తప్పక శిరసావహిస్తాను. ఎల్లప్పుడూ, నా క్షేమం దేశక్షేమం కోరే మీ అభీష్టమే నెరవేరనియ్యండి. త్వరలోనే తరలి వస్తాను.

అరి : నేను యింతకుముందే నీ దండనాయకులను సామంతులను హెచ్చరించాను. వారు సర్వకాల సర్వావస్థలయందూ నీకు చేదోడు వాదోడుగా నుంటామని ప్రమాణాలు చేశారు. క్షేమంగా నీ దండయాత్రలు ముగించుకొని విజయగర్వితై స్వదేశానికి తిరిగి రమ్ము. గ్రీసు తన వీరపుత్రుణ్ణి ఆహ్వానించుటకు తహతహలాడుతోంది.

అలె : మీ దీవనలుండగా నా కేభయము లేదు. అపజయము ఏ దిక్కునా కనుపించదు. మీ ఆజ్ఞలను పాలించే బాధ్యత నాది. మీరు నిస్సంకోచంగా ఉండండి.

అరి : నా కెంతో సంతోషంగా ఉంది. నా రాక విఫలమవుతుందేమో అని భయపడ్డాను. అరిస్టాటిల్ మాట నిలబెట్టావు. విజయలక్ష్మి నిన్ను వరించుగాక. నాపని పూర్తయింది. దేశానికి తిరిగి వెడతాను నాయనా!

అలె : సరే అలాగే.

2

రుక్సానా: ప్రభువు లేదో దీర్ఘసమాలోచనలో ఉన్నారని నన్ను ద్వారపాలకు లడ్డగించారు. మీ రుక్సానా ఎరుగకూడనంతటి రహస్య విషయాలు చర్చిస్తున్నారా?

అలె : అవును రుక్సానా, గురుదేవులు అరిస్టాటిల్ మహాశయులు వచ్చారు. వారితో రాచరిక విషయాలు ముచ్చటిస్తున్నాను.

రుక్సా : మీ దేశంలో అంతా క్షేమమేగదా?

అలె : ఆఁ.

రుక్సా : గురుదేవులు ఏమంటారు?

అలె : ప్రపంచాన్ని జయించి సామ్రాట్టువి కమ్మని దీవించారు. నా పురోగమనమునకుగల నిరోధములను సూచించారు. వాటిని తొలగించే ఉపాయములనుపదేశించారు. కర్తవ్యాన్ని మరచిపోనని ప్రతిజ్ఞ చేయించుకున్నారు.

రుక్సా : ఇప్పుడు మీ దీక్షకంతరాయమేమొచ్చింది?

అలె : ఒక స్త్రీ.

రుక్సా : స్త్రీయా? ఎవరా అదృష్టవంతురాలు?

అలె : నీవే.

రుక్సా : నేనా?

అలె : అవును. నీలోని ఏదో మహత్తర శక్తి నన్ను కట్టిపెట్టింది. నీ యవ్వనం నాకు మత్తును కలిగించింది. నేను దేనికొరకై బయలుదేరానో ఆ విషయమే మరచిపోయాను. నా మార్గాన్ని నిరోధించావు. నా శక్తికి సంకెళ్లు వేశావు.

రుక్సా : ప్రభూ! యివి మీ మాటలు కావు మీ గురుదేవులే పలికిస్తున్నారు. నా స్వామిని నే నెరుగనా? ఇంతలోనే యింతమార్పా? మీరు అపోహపడుతున్నారు. స్త్రీ ఆదిశక్తి; ఒక్కసారి ఆలోచించండి. మీ జన్మకు కారణం ఎవరు? మీలో పౌరుష కార్యాలు రేకెత్తించిందెవరు? ప్రకృతి ఎవరు? స్త్రీలోని మాతృత్వాన్ని సౌకుమార్యాన్ని ద్వేషించమనా మీ గురువులు నేర్పింది? స్త్రీ జాతికి వన్నెముక: దేశానికి జీవకర్ర. మగసిరికొక అలంకారం, ఇంటికొక అభరణం, జీవితంలో సగభాగం, అట్టి స్త్రీని తృణీకరించమనా మీ గురువులుపదేశించింది?

అలె : ఏది ఏమైనా, గురువుల ఆజ్ఞను పాలించవలసిందే. ఆయన అనుభవశాలి. మహాపురుషుడు నీపాటి తెలియదా ఆయనకు?

రుక్సా : ప్రభూ, మీరు నన్ను విడిచివెళ్లిపోతే నా గతి ఏమిటి? నే నేంచెయ్యాలి? జీవితమంతా ఒంటరిగా గడపవలసిందేనా? నేను నిర్మించుకున్న ఊహాసౌధాలన్నీ కూలిపోవలసిందేనా? మీ వాగ్దానాలన్నీ గాలిమూటలేనా?

[ఏడుస్తుంది]

అలె : రుక్సానా, అనవసరంగా ఎందుకు కంటతడి పెడతావు?

రుక్సా : ప్రభూ, మిమ్ములనే నా సర్వస్వంగా భావించాను. నా హృదయాన్ని మీ కంకితం చేసుకున్నాను. మీ చెంత ఒకలతగా బ్రతుకుదామని ఆశపడ్డాను. మీరు కాదంటే ....(ఏడుస్తుంది)

అలె : రుక్, విచారించకు నేను నిన్ను తృణీకరించడంలేదు. కాని నిన్ను నా వెంట తీసుకెళ్ళడానికిది సమయం కాదు. నిన్ను నా

హృదయరాణిగా తప్పక చేసుకుంటాను. నామాట నమ్ము. నిన్ను మనసారా ప్రేమించాను. అలెగ్జాండరు సార్వభౌముణ్ణి ప్రప్రథమంగా నీవ వలపులో బంధించగలిగిన కీర్తి నీకే దక్కుతుంది.

రుక్నా : ప్రభూ! నిజమేనా? నన్ను నేనే నమ్మలేకపోతున్నాను. మీ హృదయంమీద నా కింకా హక్కుందా? ఆఆశ వదులుకున్నాను. మీరు మళ్లీ చిగురింపచేశారు. (ఆవేశంతో) ప్రభూ! మీపాద దాసిగా నన్ననుగ్రహిస్తారా?

అలె : రుక్నానా!

రుక్నా : ప్రభూ!

అలె : నన్ను ప్రణయ సామ్రాజ్యంలో అడుగు పెట్టించిన నిన్నెలా మరచిపోతాను రుక్... అది అనూహ్యం. పోగలు చిమ్మే నీ కళ్లు, కలువలాంటి నీముఖం, ఈ గులాబి చెక్కిళ్లు, మరువడానికి ఎవరి తరం? ఈ సార్వభౌముడి శక్యం మాత్రంకాదు. నీ వెప్పుడూ నాదానివే. ప్రపంచంలో ఏ శక్తీ మనిద్దరినీ వేరుచేయలేదు.

రుక్నా : మీ గురుదేవుల కోరిక నన్ను తృణీకరించమనే గదా?

అలె : కాదు. గురుదేవులు కర్తవ్యాన్ని మరువవద్దన్నారు. అందుకు నీ వద్దు తొలగుతున్నానన్నది నిజం. ప్రథమస్థానం కర్తవ్యానిది. ప్రపంచాన్ని జయించాలి. దానికెట్టి విఘ్నమూ రాకూడదు. తూర్పున హిందూదేశము మిగిలింది. దాన్ని జయిస్తే మిగతా చిన్నరాజ్యాల్ని అవలీలగా జయించవచ్చు. అప్పుడు నా విధి నెరవేర్చినవాణ్ణవుతాను. తరువాత నా హృదయాన్న ధిక్షించు. ఎవ్వరికీ అభ్యంతరముండదు.

రుక్నా : ఇన్ని దేశాలు గెల్చారు. మీ రాజ్యకాంక్ష యింకా తీరలేదా?

అలె : రాజ్యకాంక్ష... (నవ్వుతాడు) ప్రపంచానికి సామ్రాట్టు నవుతానని ప్రతిజ్ఞచేశాను. నా నియమం కొనసాగవలసిందే.

రుక్నా : ప్రభూ! హిందూదేశాన్ని జయించటం మీరనుకున్నంత తేలికగాదు. ఇరాకు, ఇరాను లాంటి చిన్న రాజ్యాలను గెలిచినట్లుగాదు. ఆ దేశపతిని మాహించటమే అసాధ్యం. హైందవవీరులలో ఒక ప్రాణమున్నా మిమ్మలను ప్రతిఘటిస్తుంది. హిందువులు ప్రతిభాశాలులు, పౌరుషవంతులు, వీరసింహములు...

అలె : ఎంతటి ధీశాలురైనా అలెగ్జాండరు ముందు తలొగ్గవలసిందే, ప్రణమిల్లవలసిందే. ప్రపంచ విజేతకు హిందూదేశ మొక లెక్కా?

రుక్నా : మీ పరాక్రమాన్ని సంశయించడం కాదు. కాని రెండు సింహాలు ఢీకొంటే అంతిమ శ్వాసవరకు పోరాడతాయి. రక్తం కాలువలు గడుతుంది. దేశం స్మశానమైపోతుంది. ఎందుకీ యుద్ధం? స్మశానాన్నేలడానికా?

అలె : గురుదేవులు సత్యం వచించారు. నన్నిప్పుడే పెడదారికి లాగుతున్నావు. నీ వెంత ప్రయత్నించినా నేను దండయాత్రలను విరమిస్తాననుట కల్ల.

రుక్నా : మీరు బాగా ఆలోచించండి ప్రభూ!

అలె : ఇక ఆ ప్రసక్తే వద్దు—

రుక్నా : అశుభం పలకకూడదు. అయినా యుద్ధంలో విజయం తారుమారయితే నా మాంగల్యం నా జీవితం ఏమవుతాయో ఆలోచించారా ప్రభూ! నా ప్రార్థన వినండి. ఈ యుద్ధం తలపెట్ట............

అలె : (కోపంగా) రుక్నానా, ఆపు......... నా మంచిచెడ్డలు నేను చూచుకోగలను... ......ఎవరక్కడ...... ద్వారపాలకా, సైన్యాధిపతి సెల్యూకసును నా ఆజ్ఞగా పిలుచుకు రా...

3

* * ఆనాడు హోలీపండుగ. భారతీయులకు పర్వదినం. జానపద గేయాలు వినిపిస్తూంటాయి. స్థానేశ్వరం రాజమహాలులో:

సేవకుడు: జయము! జయము! మహారాజులకు.

పురు : ఏమి సేవకా?

సేవ : ప్రభువుల దర్శనార్థం ఒక పరదేశ యువతి అరుదెంచినది. ఆజ్ఞయిచ్చినచో ఆమెను ప్రవేశపెట్టెదను.

పురుషోత్తముడు: వెంటనే ప్రవేశపెట్టుము.

సేవ : చిత్తము ప్రభూ...(వెళ్ళిపోవును)

(రుక్నానా ప్రవేశించి)

రుక్నా : పురుషోత్తమ మహారాజులకు జయము.

పురు : రమ్ము సోదరీ! కూర్చొనుము. నీవు ఎవరమ్మా, ఏం పనిమీద వచ్చావు?

రుక్నా : నేను ఇరాను రాకుమారిని; నా పేరు రుక్నానా; మా రాజ్యము పరపీడనమయ్యె

వని తమకు తెలిసియే యుండును. పవిత్ర పాంచాలదేశమునకు నిన్న నే వచ్చితిని.

పురు : నీకీ దుర్గతి పట్టినందుకు చాలా చింతిస్తున్నాను. నీవు మా రాజ్యంలో ఉండడానికి మా కెట్టి అభ్యంతరమూ లేదు. అంతఃపురములో తగు ఏర్పాట్లు చేయిస్తాను.

రుక్నా : మీ ఉదారతకు నే నెంతో కృతజ్ఞురాలిని. నేటికి నా కష్టములన్నీ గట్టెక్కినవి. నా కెంతో ఆనందంగా ఉంది.

పురు : మా రాజ్యంలో నీ కెట్టి నిరాదరణయు ఉండబోదు. నిర్భయంగా ఉండచ్చునమ్మా!

రుక్నా : ఈ దీనురాలిదో చిన్న విన్నపము.

పురు : నిస్సంకోచంగా చెప్పమ్మా.

రుక్నా : ఈ ఉదయం నేను పురుష వేషంలో ఊరిలో తిరుగుచుండగా ఒక చిన్న సంఘటన జరిగింది. ఈనాడు హోలీపండుగ కదా! ఒక యువకునికి అక్కచెల్లెండ్రు లేరు. అతనికి రక్షరేఖ కట్టించుకునే భాగ్యంలేక పోయిందని ఎంతో విచారపడుతున్నాడు. అప్పుడు పక్కయింటి యజమాని వచ్చి "విచారించకు నాయనా, నీవేకాదు, అక్కచెల్లెండ్రులేని వారెంతమందో మన రాజ్యంలో ఉన్నారు. మన మహారాజు పురుషోత్తమునకే ఈ భాగ్యంలేదు. విచారించి ప్రయోజనంలేదు" అని తన పుత్రికచేత రక్షరేఖ ఆ యువకునికి కట్టించెను, ఈ మాట విన్నతోడనే మీ వద్దకు వచ్చాను. మీకు రక్ష కట్టే భాగ్యం నాకు కల్పించాలి.

పురు : ఇంతేనా? తప్పకుండా కట్టమ్మా! ఈరోజున నీ విలా అకస్మాత్తుగా వచ్చి రక్షరేఖ కట్టడం నా అదృష్టం అనుకోవాలి. అదిగో రక్ష. తీసుకువచ్చి కట్టమ్మా!

రుక్నా : మహారాజును నేను 'అన్నా!' అని పిలువవచ్చునా?

పురు : నిస్సందేహంగా; ఈనాటినుంచీ నీవు నా చెల్లెలివి. రక్ష కట్టు చెల్లీ..... మా ఆచారం ప్రకారం రక్షరేఖను కట్టావు. మా సంప్రదాయం ప్రకారం బహుమతిని కూడా పొందాలి. ఏదైనా కోరుకో చెల్లీ.

రుక్నా : నా క్కావలసింది ఆశ్రయం. అది అడుగకుండానే నాకు ప్రసాదించారు.

పురు : అది మా ధర్మం. విధిగా నిర్వహించాము. మహారాజుగా ఆశ్రయం యిచ్చాను. అన్నగా యిప్పుడు కోరుకోమంటున్నాను. నీక్కావలసిం దడుగమ్మా.

రుక్నా : ....

పురు : ఏమమ్మా! సంశయిస్తున్నావు. నీ కోరిక నెరవేరదనా?

రుక్నా : మీ రాగ్రహించి తిరస్కరిస్తే...?

పురు : అట్టిది ఎన్నడూ జరుగదు. నిర్భయంగా అడుగు.

రుక్నా : నా మాంగల్యరక్ష కావాలి.

పురు : నీ సౌభాగ్యంకోసం నా ప్రాణాలను సహితం యిస్తాను. నీ భర్త ఎవరు? ఇప్పుడొచ్చిన అపాయ మేమిటో వివరించి చెప్పమ్మా! నా శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తాను.

రుక్నా : నా భర్త మీ పరమశత్రువు అలెగ్జాండరు.

పురు : అలెగ్జాండర్ !

రుక్నా : అవును. మీ రాజ్యంమీద దండెత్తబోతున్న గ్రీకు రాజు. మీరిద్దరూ రణరంగంలో తారసిల్లితే ఆయన ప్రాణాల్ని కనికరించి నన్ను సౌభాగ్యవతిని చెయ్యండి. ఇదే నా కోరిక అంగీకరిస్తారా?

పురు : రుక్నానా! ఎంత విషమ సమస్య తెచ్చిపెట్టావు నాకు!

రుక్నా : ఆడిన మాట తప్పనని అభయ మిచ్చారు. ఇప్పుడు వెనుదీస్తారా?

పురు : చెల్లీ, నీ కోరిక నెరవేరుతుంది. నా అరమరికలో అతని ప్రాణంపోనివ్వను. సుమంగళిగా వర్ధిల్లు. నీకు నా ఆశీస్సులు.

రుక్నా : నా కోరిక మన్నిస్తారనే ధైర్యం ఉండబట్టే అడిగాను. మీకు కష్టం కలిగించినందుకు క్షమించండి. మీ దేశస్థులుకూడా నన్ను క్షమిస్తారని ఆశిస్తాను.

పురు : సరే, యిక నీవువెళ్లి విశ్రమించమ్మా!...

4

* * స్థానేశ్వరం—రణభేరీలు మ్రోగింపబడుతూంటాయి.

పురు : దండనాయకులారా! సైనికులారా! నేడు మనకు పరీక్షాసమయము. గ్రీకు సైన్యములు మన పట్టణంవైపు వస్తున్నాయి. శత్రువు బలశాలి. పెద్దసైన్యముతో మనమీద దండెత్తబోతున్నాడు. మన పొరుగు రాజ్యమైన తక్షశిలరాజు అంభికూడా దేశద్రోహియై గ్రీకు రాజుకు సహాయము చేయుచున్నాడు. మనం మన పరాక్రమాన్ని, పౌరుషపటిమను చూపించే సమయ మాసన్నమయినది. దేశ

గౌరవం నిలపాలి. హిందూ జాతీయతను రక్షించాలి. దేశరక్షణ మీ యోధులందరి మీదా ఆధారపడివుంది. సింహాలవలె పోరాడండి. శత్రువును తుత్తునియలు చేయండి. భారతప్రతిష్ఠను నిలబెట్టండి. రణరంగానికి పదండి. ఉరకండి ముందుకు.

[జై పురుషోత్తమ మహారాజుకు జై అనే నినాదాలు—సైన్యాలు బయలుదేరుతున్న కోలాహలము]

రుక్సా : మహారాజులకు జయము!

పురు : ఎవరది? పురుష వేషమున రుక్సానా?

రుక్సా : నేను కూడా యుద్ధమునకు రావలెనని యున్నది. అనుజ్ఞ యిచ్చెదరా?

పురు : ఏమీ! నా అభయమందు నమ్మకము లేదా?

రుక్సా : అలా అనకండి ప్రభూ! రణరంగమున హిందూ సైనికుల శౌర్య పరాక్రమాలు చూడాలని కోరిక కలిగి అడుగుతున్నాను. మీరు వలదంటే......

పురు : నా కభ్యంతరము లేదు. నీకు యుద్ధాన్ని చూడగల ధైర్యముంటే బయలుదేరు.

[భేరీల శబ్దములు—జయ జయా రావములు. ఏనుగుల ఘీంకారములు, అశ్వముల సకిలింపులు, కాల్బలముల గర్జనలు, కత్తులు కలసిన శబ్దములు. యుద్ధ నినాదములు.]

5

* * నాల్గవ రోజు యుద్ధము జరుగుతుండగా:

రుక్సా : అదుగో నా ప్రభువులు అలెగ్జాండరు: పురుషోత్తమ మహారాజుతో తారసిల్లుతున్నారు.. ఇద్దరూ శూరాగ్రేసరులే....ఇద్దరూ ప్రతిభా సంపన్నులే...అదుగో వీరిని చూచి సైనికులు విజృంభించుచున్నారు...ఏమి పట్టుదలలు......ప్రపంచానికి ప్రళయ మాసన్నమైనట్లు కనిపిస్తోంది......విజయలక్ష్మి ఎవరిని వరిస్తుందో......ఆఁ ఆఁ నా ప్రభువుల అశ్వము కూలిపోయిందా! అలెగ్జాండరు సార్వభౌములు నిస్సహాయులై నేల నొరిగిపోయారా !......అదుగో పురుషోత్తమ మహారాజు నా ప్రభువులమీద కురికారు... ప్రభూ!......(పెద్ద కేక వేసి ఏడుస్తుంది) ఏమిటది,...మహారాజు ఇంకను కత్తి దింపలేదే......నిశ్చేష్టులై ఏమలా చూస్తున్నారు......నే కట్టిన రక్షరేఖనా....ఆ రక్ష నాకు సౌభాగ్య భిక్ష పెట్టిందా?... ....అరె...మహారాజును గ్రీకు సైనికులు బంధించుచున్నారు. మృత్యుదేవత ముఖాన వున్న అలెగ్జాండరుకు విజయమా!.......... పురుషోత్తమా, ధర్మదేవతవు! అన్నమాట చెల్లించుకున్నావు. మానవుల్లో మాణిక్యానివి. హిందూ జాతి రత్నానివి. నీకివే నా నమస్సులు.........

[అలెగ్జాండరు చక్రవర్తికి జై......విజయ భేరీలు, కాహళార్భటులు]

6

* * యుద్ధము ముగిసిన మర్నాడు. అలెగ్జాండరు శిబిరములో:

అలె : పురుషోత్తమ సార్వభౌమునకు స్వాగతము!

పురు : అలెగ్జాండరు చక్రవర్తికి జయము.

అలె : యుద్ధంలో మీరు ఓడిపోయినను ఎప్పుడూ స్వతంత్రులే. మీ రాజ్యమున పరరాజ పరిపాలన సాగుట అసంభవమని మాకు తోస్తున్నది. ఇకమీదకూడా మీ రాజ్యానికి ప్రభువులు మీరే. మేముకోరేది మీరు మాకు స్నేహితులుగా వుండడమే.

పురు : మా కది సమ్మతమే. అలెగ్జాండరు ఎప్పుడు వచ్చినను పాంచాల స్వాగతమిస్తుంది.

అలె : మహారాజా! మీవల్ల మా కింకొక సహాయము కావలెను. మా ముందు దండయాత్రలకు ఘనసైనిక సహాయము అవసరముంటుంది. మిత్రులుగా మీరు దీనిని పాటిస్తారని తలుస్తాను.

పురు : మీ కోర్కె నంగీకరించలేను. శాంతి నాకాంక్షించే మా జాతి మీ యుద్ధోన్మాదానికి తోడ్పడలేదు. స్నేహ మను పేరున మీరు మమ్ము సామంతులుగ జేసికొనుచున్నారు.

[బయటనుంచి సైనికుల అరుపులు వినబడతవి.]

అలె : సెల్యూకస్! ఏమిటా గోల? సైనికు లింకను తిరుగబడుచున్నారా?

సెల్యూ : అవును ప్రభూ! మన సైన్యములో ఎవరో దుర్మార్గులు విప్లవం లేవదీశారు. ఏ ఒక్కని పలుకరించినా స్వదేశమునకు తిరిగి పోదామనే మాట తప్ప మరియొకటి లేదు. ఇళ్లు

వదలి పడిపోనేండ్లయినదని వాపోవుచున్నారు. ప్రభువులు శాసించినను వారు వినుటలేరు.

అలె : అంత దూరము వచ్చినదా? ఈ విప్లవము నడుపుచున్న ముఖ్య నాయకులను, కారకులని అనుమానమున్న వారిని వెంటనే తీసుకురా. నేను కనుక్కుంటాను. వెళ్లు......
పురుషోత్తమ మహారాజా! సహాయనిరాకరణ మీ తుది నిర్ణయమా?

పురు : అవును. పరసులతో రాజ్యము మా కనవసరము. మా రాజ్యమును మేమే నాటికయినా గెల్చుకోగలమనే ధైర్యము మాకుంది. మీరు ఈ పురుషోత్తముని బంధించవచ్చు. కాని వేలాది పురుషోత్తములు పాంచాలములో పెరుగుతున్నారు. వారి దేశభక్తి, స్వాతంత్ర్య తృష్ణ అచంచలము. పాంచాలను స్వతంత్రం చేసేవరకు నిద్రపోరు. ఆ శక్తిని ఎవరూ ఆపలేరు.

[పురుష వేషంలోవున్న రుక్సానా సెల్యూకస్‌లు ప్రవేశం]

అలె : ఏమి సెల్యూకస్...

సెల్యూ: మన శిబిరములలో ఈ క్రొత్త వ్యక్తి కనుపించాడు. ఇతడు మన సైనికుడు కాడు. విప్లవాని కితడే కారకుడని రూఢిగా తెలుస్తోంది. ప్రభువులు విచారించవలెను.

అలె : ఎవరవోయి నీవు? మా సైన్యంలో విప్లవానికి కారణం నువ్వేనా?

రుక్సా : ఆఁ నేనే. నాకు న్యాయమని తోచినది నేను చేశాను. అది ధర్మమని మీ సైనికులకు నిరూపించాను.

అలె : ఏమి నీ స్థైర్యం! ఎవరిఎదుట మాట్లాడుతున్నావో తెలుసా?

రుక్సా : ఆఁ! అలెగ్జాండరు సార్వభౌముని యెదుట.... నాడు ప్రభువుల ప్రాణములను రక్షించినది కూడా నేనే. యుద్ధమున విజయము పురుషోత్తమమహారాజు లదే. తెలియక గర్వపడుతున్నారు అంతే. మీ ఊహ కందని విషయాలను వెల్లడించడానికే మీ శిబిరాలలో ప్రవేశించాను.

అలె : నోటి కివ్వము వచ్చినట్లు మాట్లాడుతున్నావు పర్యవసాన మాలోచించావా?

రుక్సా : నిజం నా పక్షమైనప్పుడు భయమెందుకు? నిరూపించ గల సమర్థతవుండే ముందుకు వచ్చాను.

అలె : నీ మాటలకు రుజువు?

రుక్సా : రణరంగంలో ప్రభువులు గుర్రం మీదనుండి నేల కొరిగినప్పుడు పురుషోత్తముని ఖడ్గము మీదికి వచ్చిన సమయం గుర్తుంచవచ్చు! అప్పుడు మహారాజు ప్రభువులను తన ఖడ్గాని కెందుకు ఎరవేయలేదో తెలుసా? నేను మహారాజుకు కట్టిన రక్షరేఖ. వారి చేతిన ఉన్నది చూడండి! అదే రుజువు. వారికి చెల్లెలినై మీ ప్రాణభిక్ష వరముగా కోరుకొన్నాను. నా కోరిక వారికి విషమసమస్య అయినప్పటికీ యుద్ధభూమిలో గుర్తుంచుకున్నారు. విజయలక్ష్మిని చేపట్టి కూడా అపజయమును చిరునవ్వుతో స్వీకరించారు. వారి జాతి ఉదారత, ధర్మనిరతి, సౌశీల్యము, నిరూపించుకున్నారు. పురుషోత్తము సార్వభౌములను సన్మానించుమని వేడుతున్నాను.

పురు : రుక్సానా!

అలె : రుక్సానా! (ఆశ్చర్యంగా) నీవా...?

రుక్సా : అవును...ప్రభూ...

అలె : ప్రేయసీ, నాకోసం యింతటి సాహస కార్యానికి పూనుకొన్నావా?......

పురు : భావిలో చరిత్ర ఏమన్నా, చెల్లెలిగా నీ ముద్దు చెల్లించుకున్నానమ్మా!.......

రుక్సా : నా కా భాగ్యం నిలిపినందుకు మీ కాజన్మాంతం కృతజ్ఞురాలినే.

అలె : రుక్!......

రుక్సా : ప్రభూ!......

అలె : రుక్!......

రుక్సా : ప్రభూ!......(మోహంతో)

[యవనిక]

అపోహ*

శ్రీ మెట్టా వెంకటేశ్వరరావు

శ్రీరామమూర్తీ జగ్గయ్యా అయిదారేళ్ళ యీడు నుంచీ స్నేహితులు. ఇద్దరూ ఒక వ్యాపారంలో భాగస్వాముల్లాగా గోలీకాయలాడుకునే రోజుల్లో కూడా గెల్చుకున్నవి ఒక సంచీలో పోసుకుని వాటిని కానీలకీ అర్ధణాలకీ అమ్మి వచ్చిన డబ్బులతో యేమైనా కొనుక్కుని ఇద్దరూ చెరికాస్తా తినేవాళ్లు. జగ్గయ్య తండ్రి రెండెకరాల ఆసామీ; ఎలాగో వెళ్ళదోస్తున్నాడు కాలాన్ని. మూర్తి తాత మొదట్లో ఏమీ లేనివాడే అయినా వ్యవహార తెలివిగలవాడు. సమయం కనిపెట్టి కమీషన్ వ్యాపారం ప్రారంభించాడు. అవి పిచ్చిరోజులు; 'అరవ సోల్యం ఇరవై ఒకటి' పద్ధతిలో కొలిచి రైతుల్ని మోసంచేసి సంపాదించాడు. తర్వాత పసుపు వ్యాపారంలో వేలకి వేలు సంపాదించాడు. ఎన్నిరకాల డబ్బు సంపాదించటానికి వీలౌతుందో అన్నిరకాలా సంపాదించి వందెకరాల ఆసామీగా చచ్చిపోయాడు. ఆయన కొడుకు రామస్వామి మహాభోగి; నాటకాలూ భోగం కొంపలూ; వేషం వెయ్యటానికివచ్చి కిరాయి డబ్బులమాట ఎలావున్నా పట్టుచీర కట్టుకుపోని భోగంది లేదు. ఎలాగైతేనేం నలభైయేళ్ళొచ్చేసరికి బాకీలవాళ్లు దయదల్చి వదిలిపెట్టిన కొంప తప్పితే వేరే దమ్మిడీ ఆస్తిలేకుండా చేశాడు. తను వచ్చినపని పూర్తయినట్టు మరో నాలుగేళ్ళకు ఈ లోకం వదిలిపెట్టేడు. అతను చనిపోయేటప్పటికి మూర్తి ఎనిమిదేళ్లవాడు ఇప్పుడు పదిహేనేళ్ళు. స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు. ఇల్లూ దాంట్లోవున్న చిల్లర వస్తువులూ అమ్ముకుంటూ, బాగా వున్నరోజుల్లో దగ్గరచేరి కాజేసినవాళ్ళున్నా కృతజ్ఞతవుండి ఇస్తే దాంతో ఇంతకాలమూ కాలక్షేపం చేస్తూ వస్తున్నారు.

మూర్తికీ జగ్గయ్యకీ చిన్నప్పట్నుంచీ స్నేహం. ఇద్దరూ కలిసి ఫోర్తుఫారందాకా పొరుగూరి హైస్కూల్లో చదివేరు. ఆ క్లాసు జగ్గయ్య తప్పేడు. తండ్రి చావకొట్టేడు. చదువుకునే రోజుల్లో పుస్తకాలకని తండ్రి నడిగీ లేకపోతే తల్లిని బ్రతిమాలీ యివ్వకపోతే పెరుగూ పాలూ అమ్మగా వాళ్ళల్లోనో తిరగమోత పెట్టెల్లోనో దాచినవి కాజేస్తూ అవి దొరక్కపోతే చాటుగా కోమటింటికి బియ్యం చేరవేస్తూ యేదోవిధంగా డబ్బులు సంపాదించి మూర్తికి కావలసిన పుస్తకాలు కూడా తనే కొనేవాడు. క్లాసు పుస్తకాలు ఇద్దరిదగ్గరా చెరిసగముండేవి. నోట్సులు మూర్తే వ్రాసేవాడు. తాను బెంచెక్కేవాడు. ఇద్దరూ కలిసి చదువుకునేవాళ్లు. మూర్తి చదువుతూంటే తను పడుకుని వింటూండేవాడు. మధ్యలో తెలియకుండానే నిద్రపోయేవాడు. పాపం యెలాగోలా మూడవ ఫారందాకా నెట్టేశాడు. పైన చేతకాలేదు, నాలుగవ ఫారం తప్పితే తండ్రి చావకొట్టేడు. ఇక చెప్పించ నన్నాడు. నే నసలు చదవ నన్నాడు తను. అంతే—తరా మళ్ళీ బడి తెరిచిన తర్వాత వెళ్లమని తండ్రెన్ని సార్లు కొట్టినా హరిశ్చంద్రుడిల్లే మాట నిలబెట్టుకొన్నాడు.

అయితే చదువు మానినంతమాత్రాన వాళ్ళ స్నేహం పిసరంకూడా తగ్గలేదు. జగ్గయ్య పొలం వెళ్లి సాయంత్రం నాలుగ్గంటలకల్లా గేదెలకి గడ్డికోసుకొచ్చి పడేసి పొరుగూరి హైస్కూలునుంచి వచ్చే మూర్తికి యెదురుపోయేవాడు. సగం దార్లో యిద్దరూ కలుసుకునేవాళ్ళు. ఊళ్లోకి వచ్చి కాలవ గట్టుమీద నేకాసేపు చెడుగుడు ఆడుకుని యింటికి పోయి స్నానం చేసి భోంచేసేవాళ్ళు. జగ్గయ్య మెల్లిగా తండ్రి విస్తరిముందు కూర్చోగానే బయటకెళ్లి దార్లో కొట్లో ఒక కాని బీడీలు కొనుక్కుని మూర్తి యింటికి వెళ్లి—వాళ్లమ్మ కూడా యింట్లో అన్నం తింటూ వుంటుంది గాబట్టి నిర్భయంగా మూర్తి చదువుకునే లాంతరులో బీడీ ముట్టించుకుని—అది అయిపోయేదాకా మాట్లాడుకుని తిరిగి యింటికి వెళ్ళిపోయేవాడు. కాస్త యింట్లోనూ పొలానా పనిచేస్తున్నాడు గాబట్టి జగ్గయ్యకి తల్లి ఒక దస్తీలో యిచ్చే డబ్బు అణాలూ బేడలనుంచీ అర్ధరూపాయికి హెచ్చింది.

---

* ఆంధ్రవిశ్వకళాపరిషత్ ఆంధ్రభాషాసమితి పోటీ (1953) ప్రథమ బహుమతికథ

మూర్తికి పుస్తకం కావాల్సొచ్చినప్పుడల్లా జగ్గయ్య తల్లికి తాఖీదు చేరేది. దాన్ని ఖాతరు చెయ్యకపోతే తిరగమూత పెట్టెకి సోదా. అది తృప్తి పరచకపోతే బియ్యపుడబ్బాకి మూడుతుంది. కొద్దికొద్ది అవసరాల కెలాగో యీ పద్ధతులతో జగ్గయ్య సంబాళించుకునేవాడు.

కాని యిప్పుడు పెద్ద చిక్కొచ్చిపడింది. మూర్తి స్కూలుఫైనల్ పరీక్ష ఫీజు పదిహేను రూపాయ లొక్కసారిగా కట్టవలసి వచ్చింది. బీద విద్యార్థి అని జీతం తగ్గించారేగాని పరీక్ష ఫీజు తగ్గిస్తారా? మూర్తి తల్లి యెన్నిచోట్లనో ప్రయత్నించింది. ఎవరిస్తారు. క్రొత్తగా అయితే యెవరన్నా యిస్తారు పదేళ్ళబట్టీ మామూలేనాయె. అందరి హృదయాల్లో దయకికూడా కాలదోషం పట్టింది. వారు వీర్నీ వీరు వార్నీ అడగమన్నారు. ఎంత ప్రయత్నించినా పదికంటే దొరకలేదు. పదిహేనవ తారీఖు రేపు, ఫీజు కట్టటానికి ఆఖరురోజు. ఆరోజు సాయంత్రం మూర్తి దిగాలుగా ఉన్నాడు. మామూలు ప్రకారమే జగ్గయ్య అతన్ని కలుసుకున్నాడు. విషయం తెలుసుకున్నాడు. 'మాద్దాంలే' అన్నాడు. ఎవరికివాళ్లు వెళ్లిపోయారు.

అయిదురూపాయిలు—ఒక్కసారిగా. మూర్తి పొరపాటు చేశాడు. కొద్దిరోజుల క్రితం చెప్పి ఉన్నట్టయితే కొన్ని కిస్తీలలో సంతరించేవాడు. ఒక్కదఫాలో కావాల్సొచ్చేటప్పటికి ఇబ్బంది పట్టుకుంది. అయితే మూర్తి యీ డబ్బువిషయం చాలారోజుల బట్టీ ఆలోచిస్తూ ఉన్నాడుగాని ఆ ఆలోచనలో జగ్గయ్య తగలటానికి వీల్లేదు. అంత ముఖ్యం విషయంలో జగ్గయ్య ప్రసక్తి ఉండటానికి వీల్లేదు. అందుకనే చెప్పలేదు. ఆ భారం తల్లిమీద వేసిపెట్టేడు. ఇంటికి వెళ్ళింతర్వాత జగ్గయ్య గొప్పపని చేస్తున్నాడే గాని ఆలోచనంతా ఆ విషయాన్ని గురించే. ఆలోచించగా ఆలోచించగా మెఱుపుతీగలాగా ఒక ఉపాయం తట్టింది. ఒక పనిని సాధించాలని నిజమైనకోరిక కనక ఉన్నట్టయితే యేదో ఒక తరహా సాయం దొరక్కపోదు. అయితే ఆ ఉపాయాన్ని ఆచరణలో పెట్టే శక్తి కావాలి—తన భోజనం పెందరాడే ముగించుకున్నాడు. రాత్రి ఎనిమిది గంటలైంది. లోపలి యింట్లో తల్లి తండ్రికి వడ్డిస్తున్నది. మెల్లిగా పెట్టెదగ్గర కెళ్ళేడు. చల్లగా తెరిచేడు. తల్లి ఒక్కసారె కట్టుకుని మళ్ళీ మడతపెట్టి పెట్టెలో పెట్టిన చీరతీసి చొక్కా లోపలగా చంకలో పెట్టుకుని పైన తువాల కప్పుకుని యెకాయెకి ఏనాది భాగవతం దగ్గర కెళ్ళేడు. భాగవతం అయిపోయేదాకా కూర్చుని అందర్నీ యిళ్ళకి వెళ్లనిచ్చి మెల్లిగా యేనాది భాగవతుల గుడిసెదగ్గర కెళ్ళి సరాసరి నాయకురాల్ని కలుసుకుని చీరె బేరంపెట్టేడు. కనుక్కుంటే మమ్మల్ని తంతారండి. మాదీవూరు కాదులే అన్నాడు. "అయితే ఎంతకిస్తావ్?" "పదిరూపాయలు"; రెండు రూపాయల కియ్యమంది. ఆఖరిబేరం 5 రూపాయలు చెప్పేడు. అక్ఖర్లేదంది. చాలా అవసరమన్నాడు. పాపం జాలికలిగింది కాబోలు మూడురూపాయల కియ్యమంది. వెనక్కి మళ్ళేడు. పిలిచి, నాటకానికి పుచ్చుకున్న అయిదురూపాయలూ అతని చేతిలో పెట్టి చీరతీసుకుంది. నాలుగైదుసార్లు నోటు పరామర్శించుకుని లాగూ జేబులో పెట్టుకుని యింటికి చేరేడు.

అంతా నిద్రపోతున్నారు. మంచాలమీద ఖాళీ లేదు. న్యాయమైతే ఉండాలి. అమ్మదగ్గర బుల్లి తమ్ముడుంటాడు. అయితేళ్లి చెల్లెల్ని నాన్న పక్కలో పెట్టుకుంటాడు. ఏడేళ్ళ తమ్ముడూ, తనూ ఒక మంచంమీద. కాని నాన్న ఒక్కడూ ఒక మంచం ఆక్రమించాడు. పెద్దతమ్ముడుదగ్గర చెల్లెలు పడుకుంది. నాన్నపక్కలో పడుకుంటే—'అమ్మో'. పోనీ చెల్లెల్ని యథాస్థానానికి చేరిస్తే—ఒద్దులే. ఈ పూట ఒంటరిగా పడుకోవటం మంచిది. స్వంత తమ్ముడైతే మటుకేం—ఏడేళ్ళవాడైతేమటుకేం—డబ్బువిషయంలో నమ్మరాదు. చల్లటి అరుగుమీద పడుకుని తుండుగుడ్డ కప్పుకున్నాడు. ఎందుకనో యెప్పుడూ లేంది యివాళ దొంగలొస్తారని భయంగా ఉంది. నిద్దరపట్టటం లేదు. ఎలా పడుతుంది. తన దగ్గర 'పైకొ' వుంది. తన జీవితంలో యింతవఱకూ తన యిష్టంవచ్చిన ఖర్చు చెయ్యటానికి హక్కున్న యింత ముఖ్యం ఒక్కసారిగా యెప్పుడూ తనవద్ద లేదు. ఏదో రకంగా వేలకివేలు యినప్పెట్టెలోకి చేర్చినవాళ్ళ బాధంతా పడ్డాడు. తనొచ్చి రెండుగంటలు కాలేదు తెల్లవారింది. ఏనాది వాళ్లగిరగిరి నాలుగింటిదాకా ఎసురుతారు. తండ్రిలేచి చుట్ట వెలిగించుకుని మంచం క్రింద కర్రతీసుకున్నాడు. కన్ను సగం తెరిచి చూస్తున్నాడు—గుండెలు దడదడ కొట్టుకున్నయ్. లేవ్వే! తెల్లవారిందని అమ్మని చిన్న కేక వేసి పొలం వెళ్ళిపోయాడు. 'బ్రతుకుజీవుడా' అనుకున్నాడు. అయితే ఏంలాభం—అదుగో అమ్మ లేస్తున్నది. మళ్లీ కొద్దిగా గుండెల్లో దడ. అయితే వణకలంత లేదు.— అహా! కాదు—ఎక్కువౌతున్నది దగ్గరకొస్తున్నది వస్తూనే 'దొంగవెధవా! ఇక్కడ పడుకున్నావా!' అంటూ చేత్తో తట్టి లేపుతున్నది. కొంపమునిగింది ఇంకేముంది—కనుక్కుంది—భా య మే—పైగా 'దొంగవెధవా' అని కూడా అంది. ఇంకేముంది చేసిన ప్రయత్నమంతా వృధా. అయినా ఇంత తొందరగా యెందుకు కనుక్కోవాలి. ఈ రాత్రే ఆ చీరెతో అంత మునుగుకుపోయే పనేమొచ్చింది. ఆడవాళ్లెప్పుడూ యింతే—కొత్తసుద్ద దొరికితే చాలు

చిరిగిందాకా విప్పరు. రెక్క పట్టుకు లేపుతూ 'పిచ్చి వెధవా పక్కా పాడూ లేకుండా అరుగుమీదనా? ఏం ఆ వెధవ భాగోతానికి వెళ్ళకపోతే? ఛీ! మీ నాన్న పొలమెళ్లారు. మంచంమీద పడుకుంటో' అని లేవదీస్తున్నది. అమ్మా! బతికేం, చూసుకోలా యింకా — అమ్మ చాలామంచిది. మొదట్నుంచీ యింతే. నిద్దరమత్తులో ఉన్నట్టుగా యేదో గొణుక్కుని వెళ్లి మంచంమీద పడుకున్నాడు. తల్లి పనిచేసుకోవటానికింట్లోకి వెళ్ళిపోయింది

సూర్యుడింకా పైకి సాగలేదన్న మాటే గాని బాగానే తెల్లవారింది. అయిదు నిమిషాలైంది మళ్లీ జేబులో చెయ్యిపెట్టి చూసుకున్నాడు. కాగితం తగులుతూనే ఉంది. మెల్లిగా లేచాడు. సరాసరి మూర్తి యింటికి వెళ్ళాడు. న్యాయమైతే మూర్తే వచ్చి తన్ను కేక వేయాలి. 'ఇంత పెందరాడే వచ్చావేంరోయ్?' అన్నాడు పుస్తకం మూసి లాంతరార్పుతూ. ఇప్పుడు తన కింత చిన్న ప్రశ్నకి సమాధానం చెప్పే అవకాశం లేదు. కట్టకి వెళ్దాం రమ్మన్నాడు. బయల్దేరి వెళ్లారు. మామూలు చోటుకి వెళ్ళగానే 'ఆగుదామా' అన్నాడు మూర్తి. 'కాదులే ఇంకా పైకి పోదాంరా' అన్నాడు. మొత్తానికి అరమైలుదూరం వెళ్లిన తర్వాత ఆగేరు. చుట్టుపక్కల పారజూచాడు. ఎవ్వడూ మనిషన్నవాడు తగల్లేదు. ఒకవేళ ఉన్నప్పటికీ తను చేయబోయే పని చూసే పరిస్థితిలో ఉన్నవాడు లేడు. జేబులో నోటు తీసి 'పది కొరతయ్యాయన్నావుగా! దీంతో కలిపి ఫీజు కట్టెయ్' అని మూర్తి చేతులో పెట్టేడు. 'ఎక్కడిదిరా ఇంత డబ్బు'ని ఆశ్చర్యంతో అడిగేడు మూర్తి. 'చెబుతాలే ఇవాళే ఫీజు కట్టెయ్' అన్నాడు. అతను జేబులో పెట్టుకున్నాడు. వద్దనలేదు. ఇప్పుడే కాదు ఎప్పుడూ అనలేదు. దాని కారణం వాళ్ల స్నేహం మొహమాటాల దశలో లేదు. అసలు ప్రారంభమే దాని తర్వాతనుంచీ. అయిదు రూపాయల నోటు మూర్తిచేతి కిచ్చింతర్వాత జగ్గయ్య హృదయం యెంత తేలికయిపోయిందో చెప్పలేము. శకుంతలని అత్తవారింటికి పంపిన తర్వాత కణ్వుడి హృదయస్థితినే కాళిదాసు సరిగా వర్ణించలేకపోయాడు. ఇప్పటి జగ్గయ్య హృదయాన్ని అసలే వర్ణించలేడు. స్కూలుకి పెందరాడే వెళ్లమన్నాడు. వెళ్ళగానే ఫీజు కట్టెయ్యమన్నాడు. ఊళ్ళోకి తిరిగి వెళ్ళేలోపుగా చెప్పిందే పదిసార్లు చెప్పేడు జగ్గయ్య. ఎవరింటికి వాళ్లు వెళ్లిపోయారు. న్యాయంగా అయితే మూర్తి యింటికి వెళ్లి కాసేపు కూర్చుని రావాలి. ఇవాళ వెళ్లదలచుకోలేదు. అలవి కాక బాధ తీరినా మరో బాధ పట్టుకుంది. 'మూర్తి ఎప్పుడు స్కూలుకి వెళ్తాడా' అని. ఎప్పుడో పొద్దుననంగా తెల్లవారింది. ఇంకా తొమ్మిది కాలేదు. కాలాన్ని తిడుతూ గొడ్లకి కుడితి పోసి మొహం కడుక్కుని పాలు తీసి పొలం వెళ్లి బెండకాయలు కోసుకొచ్చి స్నానంచేసి అన్నం తిని బయటకొచ్చేసరికి బుజంమీద సంచీ వేసుకుని ఒక చేత్తో టిఫిన్ పట్టుకుని మూర్తి బడికి వెళ్తున్నాడు. ఎంత ఆనందపడ్డాడో చెప్పలేం. తనే అతన్ని చదివిస్తున్నంతగా అనుకున్నాడు. మళ్ళీ నిమిషం కాలేదు. గుండెల్లో రాయి పడ్డట్టయింది. ఈ యేనాటి వాళ్ళవూరునుంచీ పోలేం. ఇప్పటికి నాలుగు నాటకాలాడేరు. చాలదూ? ఆశ — వెధవ ఆశ, వింతం ఉంషిట్లురా లోపలోపల వాళ్ళని తిట్టుకుంటూ యింటికివచ్చి గొడ్లని విప్పుకుని పొలం వెళ్ళిపోయాడు.

ఆరోజు గడిచిపోయింది. మర్నాడు సాయంత్రమైంది వాడుకకి ఉన్నవే రెండు చీరెలు. ఒకటి ఒంటికి, రెండోది చాకలింటికి. ప్రొద్దున వేసిన చీర చాకలి తేలేదు, గేదె తొక్కిందని. వారంరోజుల క్రితం ఇలాగే చేస్తే కొత్త చీర గడివిప్పి కట్టుకుంది. విడిచింది అప్పటికప్పుడు ఉదికి ఆరవేసి తెల్లవారగానే కట్టుకుని మళ్ళీ కొత్తచీర మడతపెట్టి పెట్లో పెట్టింది. ఆ రాత్రి కొంచెం జాగ్రత్తగా కూడా పడుకుంది. ఈపూట మళ్ళీ చీర రాలేదు. ఏంచేస్తుంది. పెట్టితీసింది—పోనీ విడిచిందే కట్టుకుందామా అంటే పసిపిల్లవాడు తడిపేడు. పైగా విడిచి నేలమీద పారేసి స్నానంచేసింది. ఎలా కట్టుకుంటుంది. ఒంటిమీద మొగుడి ఉత్తరీయం ఉంది సరే పెట్టెతీసింది. ఒక్కసారి గుండెలో టక్కుమంది. ఒక్కొక్కటే పిల్లల గుడ్డలన్నీ తీసి క్రిందపడేసి వెదికింది. గుండె కొట్టుకులాడింది. ఇల్లంతా గాలించింది. పిల్లలు కాళ్ళకడ్డంవస్తున్నారు. రెండోకొడుకు 'నాటకానికెళ్దామేఅమ్మా'అని గోలచేస్తున్నాడు. ఎడా పెడా బాదింది. ఎంత వెదికినా కనిపించలేదు. ఇదేమిటి యింత చిత్రంగా మాయమైపోయిందనుకుంది. తన చేత్తో మడతపెట్టి పెట్లో పైనే పెట్టింది. బాగా గుర్తు. మళ్లీ వెతికింది. వెతికినచోటే నాలుగైదుసార్లు వెతికింది. ఏంలాభం లేకపోయింది. ఏమనుకోవటానికీ పాలుపోలేదు. జగ్గయ్యవచ్చి 'ఇవుగోమ్మా పాలు' అన్నాడు. 'రోగమా పెట్లో పెట్టలేవూ! అందుకోవాలేం' అని నాలుగు ఝాడించింది. అమ్మకింత కోపం యెందుకువచ్చిందో తెలియలేదు. చెంబు పెట్లో పెట్టి బైటికి వెళ్లిపోయాడు. ఇంకా యేం చేస్తుంది విడిచిన చీరే మళ్లీ కట్టుకుంది. అయితే పట్టుకున్న బాధ కొత్తచీర సంగతి. రెండు నెలల నెయ్యి అమ్మి కొనుక్కున్నది. మతిపోయినట్టుంది ఒకపని చెయ్యబోయి మరోకపని చేస్తున్నది. ప్రాణాలు పగిలిపోతున్నయ్. మొగుడొచ్చాడు. విషయం తెలిస్తే తన్నే తిడతాడు తన తెలివి తక్కువకి; మెదలకుండా ఊరుకుంది.

భోజనాలయినయ్. రెండోవాడు సాయంత్రం నుంచీ చంపుతున్నాడు నాటకానికి కెళ్దామని. మొన్న కూడా యిలాగే వెళ్దామని గోలచేస్తే వెళ్దాంలే అని మాయమాటలు చెప్పి నిద్రబోయేటట్టు చేసింది. అందుకనే వాడివాళ జాగ్రత్తగా ఉన్నాడు. అసలు మంచంమీద కూర్చోవటమే లేదు ఎక్కడ నిద్రవస్తుందోనని. 'పోనీ తీసికెళ్ళవే' అన్నాడు మొగుడు. మధ్యాహ్నం పక్కింటి ఆవిడతో గూడా ఆ విషయమెచ్చి వెళ్దాలేండి అంది. అప్పట్నుంచే పట్టుకున్నాడు పిల్లవాడు. ఆడవాళ్ళకి పదిమంది ఆడవాళ్ళతో కలిసి కబుర్లు చెప్పుకోవట మంటే సరదా. కబుర్లు చెప్పుకోవటంలో మొగవాళ్ళకంటె ఆడవాళ్ళదే పైచేయి. అందుకనే ఊళ్ళో యేదైనా పేరంటం అంటూ జరిగితే, యీకొంపూటకి మొగవాళ్ళకి తిండి ఉండదు. పైగా యీపూట ఒక పెద్దవిషయాన్ని గురించి అమ్మలక్కలతో ప్రస్తావించవచ్చు. అది చీరసంగతి; మనసులో బాధ పదిమందితో చెప్పుకుంటే తగ్గుతుంది. చీర—దాని గట్టితనం—అంచు మెరుపూ—ఎలా, ఎక్కడ, ఎంతకి కొనబడింది—దాని మహాత్మ్యం మొదలైన విషయాలన్నీ చర్చించవచ్చు. కాబట్టి నిశ్చయంచేసుకుని 'వెళ్దాంలేం' అంది కొడుకుతో. ప్రక్కనే పడుకుని ఉన్నాడు జగ్గయ్య. గుండెలు దడదడ కొట్టుకున్నయ్ ఆమాట వినేసరికి. 'ఏనాటకం వెధవ నాటకం యేడ్చినట్టు వేస్తారు. అంతకంటె హాయిగా నిద్రపోవటం మంచిద'న్నాడు. 'ఎందుకుబాగుండదేం! బాగానే ఉంటుంది వెళ్దామే అమ్మా' అన్నాడు తమ్ముడు. 'నోరుమూసుకు పడుకోరా' అన్నాడు తమ్ముణ్ణి. 'మొన్న నువ్వెందుకు వెళ్ళావోయ్ వెధవయ్యా!' అన్నాడు తండ్రి. 'బాగుంటుందని వెళ్లేను. ఏడ్చినట్టుంది. ఒక్కదానికీ సరిగా గొంతులేదు. బండ గొంతులు. ఏమీ బాగుళ్ళేదు. నే నివాళ్ళ రాను' అన్నాడు ఎవరో మహా తన్ను రమ్మని బ్రతిమాలినట్టుగా. పక్కింటావిడ కేక వేసింది. 'పదరా' అంటూ బయల్దేరి వెళ్లేరు. జగ్గయ్యకి తల గిఱ్ఱున తిరుగుతున్నది. మంచంమీద ఊరికే అటూ ఇటూ దొర్లుతున్నాడు శాపం పుట్టినవాడల్లే.

దేవుడి గుడిముందు పెద్ద ఖాళీస్థలం. రెండు బొంగులు పాతి అడ్డంగా ఒక గుంజకట్టి రెండుప్రక్కలా రెండు 'పెట్రొమాక్స్' లైట్లు కట్టారు. కొద్దిగా వెనకాల ఒక తెర. దాని వెనకాలే గ్రీన్‌రూమ్. అక్కడే ఆర్కెస్ట్రా, అంటే పాత హార్మోనీ ఓటిమద్దెలా. తెర ఎత్తటం దింపటం ఉండదు. పని ఉన్నప్పుడు పాత్ర తెరముందుకు రావటం పనిచూసుకుని మళ్ళీ తెర వెనక్కి వెళ్ళిపోవటం. అంతా సిద్ధమయింది. 'రావాలి రావాలంటూ కేక లేస్తున్నారు జనం. నాటకం అంటే భాగోతం, ఆడించే ఆసామీ 'మొదలెట్టండోయ్' అనేసరికి 'చిత్తం సామీ' అంటూ రాజరాజనరేంద్రుడి వేషంలో ఉన్న ఏనాది సుబ్బాయి రంగంమీదకి వచ్చాడు. వాడేదో తన ఘోషంతా చెప్పుకుని వేటకి వెళ్తానంటూ వెళ్లిపోయాడు. వెంటనే రెండో కోర్టు. ఇప్పటి నాటకాలకి మల్లే రంగరంగానికీ మధ్య గంటల తరబడి ఆలస్యం ఉండదు. ఒక రంగమయిపోవట మాలస్యం. రెండో రంగంలో పాత్రలు సిద్ధంగా ఉంటారు. ప్రవేశించింది చిత్రాంగిగా నాయకురాలు ఏనాది 'ముక్కాలం'. తెల్లటి చీర కట్టుకుని. 'అమ్మయ్య' అనుకున్నాడు అందరికీ చివర నుంచునిఉన్న జగ్గయ్య. గబగబ ముందువాళ్ళందర్నీ తప్పించుకుని వెళ్ళి లైట్ల గడకర్రలకి కట్టిన తాళ్లు పట్టుకుని కూర్చున్నాడు. ప్రేక్షకులంతా ముందుకు తోసుకుంటూన్నారు. ఈల లేస్తున్నారు. ముందు కూర్చున్న రసికుల్లో ఒకడు మల్లెపూలు చల్లేడు నాయకురాలిమీద. సుబ్బాయికి—పొరపాటు—రాజరాజనరేంద్రుడికి కోపం వచ్చింది. చిత్రాంగి కొద్దిగా కోపం నటించింది. కాసేపు యిద్దరూ ఎగురులాడుతూ పాడి లోపలికి వెళ్లిపోయారు. మూడో రంగం. 'రాజా సారంగధరుడూ వడాలే పారావతములాడా ॥రాజా॥' అని పాడుకుంటూ ఇందాకటి రాజరాజే వచ్చాడు. అయితే చొక్కా మారింది.

సారంగధరుడు స్నేహితుల్తో పావురా లెగరవేస్తున్నాడు. ఏ మెగిరి చస్తయ్. దారాల్తో లక్షణంగా రెక్కలు కట్టేశారు. విసిరితే గుడ్డమూటలల్లే నేలమీద పడుతున్నాయ్. 'చంపేవురా నీ యమ్మ కడుపుకాలా' అని కేక పెట్టేడు చాకలి పీరాయి. అవి వాడివి. వాడిదగ్గర ఉన్నయ్ కాబట్టే ఆ నాటకం ఆడటం జరుగుతున్నది. అవి లేని పూళ్ళో ఆ నాటకం ఆడరు. కాసేపాడి సారంగధరుడు వెళ్ళిపోయాడు. జనం చప్పట్లు కొట్టేరు. అందరూ ఆపిన తర్వాత కూడా కాసేపు కొట్టేడు జగ్గయ్య. పాపం బలే సరదా. ఎంతో ఆనందంతో రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు.

నాలుగోరంగం. చిత్రాంగీ సారంగధరులది. అసలు నాటకానికి కాయువుపట్టు అది. జనంలో మళ్ళీ తొక్కిడి ప్రారంభమైంది యెవరికివారే ముందు కూర్చోవాలని. అందరితోపాటు జగ్గయ్య కూడా అరిచాడు 'తొందరగా రావాల'ని. ఇందాక మల్లెపూలు చల్లిన పెద్దమనిషికి మరీ ఆరాటంగా ఉంది. ఈ రసికుణ్ణి మనసులో పెట్టుకునే చిత్రాంగి ఆలస్యం చేస్తున్నది.

ఆతన్ని ఇంకొంచెం రెచ్చగొట్టాలి. అర్ధరూపాయన్నా దొరకదా! ఇందాకటికంటె యెక్కువ

అందంగా కనబడాలి. ఏం చెయ్యటం. బాగా ఆలోచించింది. మరి కొంత పౌడరు మొహానికి కొట్టుకుని పెట్టె తీసి మరో చీర కట్టుకుంది. వేషమంతా నాలుగైదుసార్లు సర్దుకుని అంజనేయస్వామి పట మొకటి పట్టుకుని 'మానసహారా! పారంగధర! కన్నులార నిను కాంచెడి భాగ్య మదెన్నడో' అని పాడుకుంటూ ఒయ్యారంగా కులుకుతూ షోకు షోగ్గా ప్రవేశిస్తున్నది. జనం గుమ్మయిపోతున్నారు. ఈలలతో గోల్లా చేస్తూ కూడా చెప్పుకుంటున్నయ్….. జగ్గయ్య గుండెలు పగిల్నయ్. చెమటలు పోసినయ్. నిత్తరపోయి చూస్తున్నాడు. నెత్తిన పిడుగు పడ్డట్టయింది. మొదట కట్టుకున్న చీర చూడగానే 'అమ్మయ్య' అనుకున్నాడు. మళ్ళీ ఇదేమిటి తెలివితక్కువ ముండ ఈ చీర కట్టుకుంది. దీని మొహం తగలబడా. దీని అవతారానికి తోడు కోర్టుకోర్టుకీ చీర మార్చాలా! మొన్న ఉషాపరిణయం నాటకమంతా ఒక్క చీరతోనే ఆడిందే. ఇనాళ్ళేం రోగం, మార్చి వచ్చింది!' అని లోలోపల నానా తిట్లూ తిడుతున్నాడు. కాని యేం లాభం. దాని గొడవలో అది ఉంది. 'చీర అమ్మేటప్పుడే యీ పూళ్ళో ఉండగా కట్టుకోవద్దని చెప్పకపోవటం పొరపాటనుకున్నాడు. అట్లా చెబితే యీ పూరివాడే ననుకుని యెవరితోనన్నా చెబుతుం దేమో నని లేదా అసలు కొనేకోన దేమో నని పొరుగూరివాణ్ణని చెప్పేడు. అదే కొంపముంచింది. పొరుగూరి చీరగదా అన్న ధైర్యంతోనే అదీ కట్టుకుంది. ఒకవేళ కనుక్కుంటే మటుకు అంత మునిగేదేమిటి దానికి. గౌరవంగా బ్రతకదల్చుకున్నవాడెవడూ కట్టింది విప్పించి కెళ్ళడుగా!

ఆడివాళ్ళల్లో యేదో కలవరం బయలుదేరింది. మరేం లేదు వాళ్లని పిల్లనీ తొక్కుకుంటూ జగ్గయ్య తల్లి హడావుడిగా పోతున్నది. రెండంగల్లో యింటికి చేరింది యిల్లాలు. 'ఎన్నేళ్లొస్తే యేం సిగ్గూ బిడియం లేకపోయినతర్వాత. కల్లో కూడా అనుకోలేదు ఇట్లా చేస్తాడని. ఛీ ఛీ! ఏమైనా నమ్మటానికి వీలుందా మనుషుల్ని? నలుగురుబిడ్డలతండ్రే! ఎంత్రకా ఖులుపట్టుకునే యీనాదిదాని పాలుబడతాడా? ఏగాని ముండకి పన్నెండు రూపాయలచీర కట్టబెడతాడా సిగ్గేమయినా ఉందా! ఎంతపని' అనుకుంటూ గబగబా యింటికిపోయి మొగుణ్ణి లేపింది. కళవళపడి లేచాడు. 'ఏమిటో'న్నాడు. 'ఇంకా యేమిటంటున్నారు యేమీ ఎఱుగనట్టు ఛీఛీ' అంటూ తన మంచంమీదకి వెళ్ళిపోయి కూర్చుంది అటుదిరిగి. 'ఏమిటే నువ్వనేది?' అని గట్టిగా అడిగేడు. 'ఇంకా యేమనాలి మన ప్రయోజకత్వానికి యెన్నేళ్ళొస్తేయేం.' 'ఇదేమిటి! అర్ధరాత్రి పూట యీ గొడవేమిటి ఉప్పెనలా' పాపం యేమీ అర్థంగాక 'అసలు సంగతేమిటే' అన్నాడు తీవ్రంగా. 'ఇంకేం సంగతి కావాలి నా బతుకిట్లా బండలైపోయిం తర్వాత? ఏగానీ ఖరీదు చెయ్యని యీనాదిదాని మాత్రం కాకపోయాను. నా కింతపని చేస్తున్నదికాక నా చీర పట్టుకెళ్ళి యియ్యాలా! ఆ చీర అది కట్టుకుంటేనే యెక్కువ బాగుంది కాబోలు.' కొద్దిగా ఊహగా అర్థమైంది అలవాటువల్ల 'నోర్ముయ్! నీ చీరేమిటి నేను యీనాద్దాని కియ్యటమేమిటి నీకేమన్నా పిచ్చెక్కిందా!' అని అరిచాడు. చీర పోవటం అలా ఉంచి అసలు బాధ అవమానం, ద్రోహం. ఏ దోషమైనా సహిస్తుందిగాని ఆడది పురుషుడిలో యీ దోషాన్ని సహించలేదు. పురుషులైనా అంతే అనుకోండి. కాని స్త్రీ విషయంలో యెక్కువ. 'నోరు మూసుకునే ఉన్నాను. అంతకంటే యేం చేస్తాను. నేనేమన్నా అడ్డమొచ్చానా మీ యిష్టమొచ్చినట్టు ప్రవర్తించుకోవచ్చు. నా చీర పట్టుకెళ్ళి యివ్వటం దేనికో అన్న యేడుపుదప్ప—' ఏడుపు పెద్దదైంది. కన్నీళ్ళు వస్తుస్థితిలో చాలా తేలికైనవే కాని అవి దాని ఆయుధం. తేలికైనకొద్దీ పురుషుడిమీద వాటి ప్రభావం యెక్కువౌతుంది. స్త్రీ బలహీనతే పురుషుడిమీద వజ్రాయుధం. ఎక్కిళ్లమూలాన ముక్కలు ముక్కలుగా తెగుతున్న యేడుపుని దగ్గరికిచేరాడు. 'నేనే మెఱుగుదునే నీ చీర! ఎనాద్దాని కివ్వటమేమిటే! ఎవరన్నా చెప్పేరా? నువ్వే అంటున్నావా? అసలు సంగతేమిటి?' అని మెల్లిగా అడిగేడు. 'ఎరక్కపోతే ఎగిరిపోయిందా పెట్టెలో చీర యెకాయెకి యీనాద్దాని దగ్గరికి! నా కళ్ళతో నేను చూస్తే చాలదూ ఎవరు చెప్పాలి? వెళ్ళి చూస్తే తెలుస్తుంది. అంతా అదే చీర. అంచూ అదే. నాది కాకపోతే పెట్టెలో పెట్టిన చీర యేమయిపోతుంది?'… ఇప్పుడు విశదంగా అర్థమైంది. పెళ్ళాం చీర పోయినట్టూ అది యీనాదది కట్టుకున్నట్టూ. ఎట్లా పోయింది?…ఒక్కటేమార్గం. పళ్లు పటపట కొరికాడు. నిల్చున్నవాడు నిల్చున్నట్టే బయల్దేరేడు. సరాసరి భాగోతందగ్గర కెళ్ళాడు. పదివిమిషా లూరుకున్నాడు. ఆ రంగం అయిపోయింది. 'జగ్గాయ్' అని పొలికేక వేశాడు. విన్నాడు; పిడుగు పడ్డట్టయింది. తెలిసినట్లుంది. ఏం చెయ్యటం? మెల్లిగా యెటన్నా పారిపోదామంటే లేస్తేనే చూస్తాడు. అందుకనే మెదలకుండా కూర్చున్నాడు. మళ్లీ పెద్దపులి కేక. లాభం లేదు. వదిలేటట్టు లేడు. 'ఇదుగో ఇక్కడే ఉన్నానండీ' అని అరిచాడు—అతను లేచి వెళ్లితే ఆ చోటులో కూర్చుందామని ఒక కుర్రాడు. 'రావేం రా….' అనేటప్పటికి పిల్లిలాగా లేచి అడుగులో

అడుగు వేసుకుంటూ మెల్లిగా జనాన్ని దాటి బయట పడ్డాడు. 'రా యింటికంటూ' కొద్దిదూరం పోయిన తర్వాత మెడ బట్టుకుని 'దరిద్రపు................' అని లాగి కొట్టేడు చెంపమీద. తల దిమ్మెక్కింది. కొట్టుకుంటూ కొట్టుకుంటూ వస్తున్నాడు. వెళ్ళొచ్చి తనకేం సమాధానం చెబుతాడో చూద్దామని వాకిట్లో నిలబడివుంది యిల్లాలు. ఛెడేలు ఛెడేల్ మని దెబ్బలు వినిపిస్తున్నయ్. ఎవర్ని కొట్టటం!...ఎవ రేమిటి కొడుకు నే ఎందుకూ...'అయ్యొయ్యొ కొట్టకండి కొట్టకండి' అంటూ కేక పెట్టింది. 'కొట్టాలా కొయ్యాలా అప్రదిష్టపు............'అంటూ మరి రెండు కొట్టి తీసుకొచ్చాడు. అలవాటు లేని దెబ్బలు భరించలేక 'అమ్మా!' అని కేక వేశాడు. 'అయ్యొయ్యొ చచ్చిపోతా డండీ' అంటూ పరిగెత్తి కెళ్లి పిల్లవాణ్ణి లాక్కుంది. 'నావనీ—వ స్త్రయేం ఇటువంటి దౌర్భాగ్యుడు' అని వదలకుండా నే లోపలికి తీసుకొచ్చాడు. 'నిజం చెప్పు! ఇచ్చావా లేదా చీర యీవాడ్దానికి....మాట్లాడవేం...! చెప్పు! నీ ప్రాణం తీస్తానీవాళ....నిన్నొదల్ను....చెప్పవేం ఇచ్చావా లేదా' అని మెడ వంచి రెండుగుద్దులు గుద్దేడు. 'అయ్యొయ్యొ అయ్యొయ్యొ! చచ్చిపోతా డండీ వాడే చెబుతాడు వదలండి' అని యివతలికి లాగుతున్నది 'నువ్వూర్కుకో! ఇవాళ్ళ పని జేశాడు రేపు మరోటి జేస్తాడు. ఇంతదూర మొచ్చావా తాష్టప్రిపు........చెప్పవేం. ఇచ్చావా లేదా' దెబ్బలు భరించలేకపోతున్నాడు "ఇచ్చాను."

ఆపర్ని జుట్టుపట్టుకుని వంగదీసి 'ఇంతదూర మొచ్చావా ఇంతదూర మొచ్చావా' అని గొడ్డును బాదినట్టు బాదుతున్నాడు. 'అయ్యొయ్యొ అయ్యొయ్యొ' అని యెంత అడ్డమొచ్చినా వినిపించుకోకుండా అలుపొచ్చిందాకా కొట్టేడు. ఇక కొట్టలేక 'చావు' అని ఒక్క తన్ను తన్నేడు. రెండుగజాల దూరంలో పడ్డాడు. 'అమ్మొ వాడిద్దీ!' అంటూ పరుగెత్తికెళ్లి లేవదీసి చెవులు మూసి కావిలించుకుంది. నిలబడలేక రొప్పుతున్నాడు. తీసుకొచ్చి అరుగుమీద కూర్చోబెట్టింది. 'ఎంత యిది లేకుటు కంత ఒళ్ళూ పై దెలియకుండా కొడతారా! పోతేపోయింది వెధవచీర! అంతూ పొంతూ ఉండఖర్లా ఆ కొట్టటానికి?'

'కొట్టాలా కొయ్యాలా అప్రతిష్టపు వెధవ నా కడుపు చెడబుట్టేడు."

ఇట్లా కొడతాడని తెలిస్తే చెప్పేదిగాదు. అసలు విషయమిదని యేమాత్రం తెలిసినా చెప్పేదే గాదు. 'తెలివితక్కువ చచ్చిందాన్ని ముందుగా నీన్నే అడిగేను కాను' అని తిట్టుకుంది 'ఇస్తే ఇచ్చాడు. ఏం ఇస్తే? ఎంతమంది చెయ్యటంలా ఇట్లాంటి పనులు. రేపో యెల్లుండో చావబోయే ముసలాళ్లే చేస్తున్నారు ఇట్లాంటి పనులు. చిన్నబిడ్డ వాడికేం తెలుసు. పొరపాటున తప్పుచేస్తే మెల్లిగా చెప్పుకోవాలి. అంతేగాని చావగొడతారా? అసలు బుద్ధి తక్కువైంది చెప్పటం'. అని యీ రకమైన ఆలోచన లెన్నో ఆ మాతృహృదయంలో పరుగెత్తినయ్. ఎక్కిళ్ళొస్తున్నయ్. మంచినీళ్ళు తాగించి తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టి దుప్పటి కప్పింది.

'దరిద్రుడు—వీడి జన్మ తగలెయ్య.' అని యింకా తెరలు తెరలుగా తిడుతూనే ఉన్నాడు.

'కడుపులో కాళ్లు కడుపులో ఉండగానే పుడుతున్నయ్ పోయేకాలపు బుద్ధులు. సరిగ్గా కళ్లు తెరవలేదు; వీడికి వోడు వీడు ముష్టయ్యేట్లి మండెకి పట్టుకెళ్ళి చీర ఇస్తాడా?'

'అబ్బ! పోనిద్దురూ! అయిపోయిందాని కొకే గోల.'

'ఏం పోనియ్యటం! సరిగ్గా బతికేనాడేనా వీడు."

'పోనిద్దురూ ఎట్లాగోట్లా బతుకుతాడు."

తల్లీ తండ్రీ ఇద్దరూ తనమీద అపవాదం వేశారు. జరిగిందొకటి వీళ్లనుకునేదొకటి. అయితే ఈ అపవాదమే మేలైంది. అసలు విషయం తెలిస్తే మూర్తికూడా ఇద్దాయి అపుతాడీ కేసులో. ఆ మొత్తం అదెంత మాత్రం జరగకూడదు. కూడదు. ఇదే బాగుంది. కేసు ఈరకంగా మారటానికి దారి చూపించినవాడు తండ్రే......దెబ్బలు తగిలిన చోట్లు మంటానికి ఒత్తుకున్నా ఇంకా నెప్పి పెడుతూనే ఉన్నయ్. అయితే కళ్లకి కనబడుతున్నాడు మూర్తి నవ్వుతూ మొక్కల్లో గెంతుతు డబ్బిస్తూ. తన పెదిమలమీదకూడా చిరునవ్వు. ఒక మూర్తిని ఇష్టమైనదానిని చూసినప్పుడు ఆ మూర్తి పొందే భావాలే ఈ చూసే వ్యక్తికీ కలుగుతయ్. అదే సానుభూతి. పాశ్చాత్యుల ప్రకారం 'సానుభూతి' అనేకంటే ప్రాచ్యుల ప్రకారం 'తాదాత్మ్యం' అంటం ఉచితం. అదే కళలోని పరమసిద్ధాంతం. అందుకనే నవ్వుతున్న మూర్తినిజూసి నవ్వుతున్నాడు జగ్గయ్య.

"చిన్నవాణ్ణి ఒక్కణ్ణే ఒదిలిపెట్టి వచ్చావా? వాణ్ణికూడా తీసుకురాకపోయా?"

"రానని పక్కింటావిడ దగ్గర కూర్చున్నాడు"

* * * *

"తెప్పించవుంటావా అది?"

"ఇంకేం తెప్పిస్తారు మెదలకుండా ఊరుకోండి"

తెప్పించదు. అదేగ మత్తు. తను ఇష్టమొచ్చినట్టు చావగొడతారు. లేనిపోని అనుమానా లెన్నో పడతారు. అంతే—పైవాళ్ళు పడటానికి ఒప్పుకోరు. వేలెత్తి చూపటానికి వీల్లేదు. అందుకనే గప్-చిప్!

పెన్నేటి పాట

శ్రీ విద్వాన్ విశ్వం

* * రాయలసీమ పెన్నేటిగట్టు పల్లెల బ్రతుకునీడ ఇందులో కనిపిస్తుంది. కాబట్టే అక్కడి పలుకుబడులూ, ఊరుపేరులూ ఇందులో కానవస్తాయి. ఇది కావ్యం; చరిత్రగానీ, కథగానీకాదు. ఏవ్యక్తీ ఏపల్లే ఇందులో ప్రత్యేకించి కనపడరు.

మొదటిసర్గ

కోలమపాలికల యాలాలమేటిపాటల । జుమ్మన్ని మోయు మించులసితారు,
తెనుగుపెద్దన్నల గొనబుపల్కుల గుబా । ళించిన జాజిమల్లెలగుడారు,
జిలుగుజరీబుటావలువ సింగారింపు । మెలకువలూర్పు నిగ్గులకొటారు,
తలకుమించిన సత్యముల లోతులనుజిల్చి । కొనివెళ్లు తెల్వియంచులకతారు,
కడిది మొనగాని మెడదచిక్కనకుపేరు । కటికతాలను కరగించి గజ్జకట్టి
చిందుద్రొక్కించుమాయల జిలుగుతేరు । కలదు రాయలసీమ పచ్చలబజారు.

అచట నొకనాడు పండె ముత్యాలచాలు । అట నొకప్పుడునిండె కావ్యాలజాలు
అచ్చట నొకప్డుకురిసె భాష్యాలజల్లు । విరిసె నొకనాడు వేయంచు విచ్చుకత్తి.

ఇది గతించినకథ వినిపింతునింక । నేటిరాయలసీమ కన్నీటిపాట;
కోటిగొంతుల కిన్నెరమ్రోటుకొనుచు । కోటిగుండెలకంజరి కొట్టుకొనుచు.

అదేపెన్న! అదేపెన్న! నిదానించినడు, విదారించునెదఱ వట్టి ఎడారితమ్ముడు!
ఎదీపెన్న? ఎదీపెన్న? ఎదీ పినాకినీ? ఇదేపెన్న, ఇదేపెన్న! ఇదే పినాకినీ!
ఎదీనీరు? ఎదీహోరు? ఎదీ ఏటిజాలు? ఇదేనీరు ఇదేహోరు ఇదే ఇసుకవాలు!
అదేపెన్న అదేపెన్న! నిదానించినడు! విదారించునెదఱ వట్టి ఎడారితమ్ముడు!

పారచేతబట్టుక వంగి చీరుదనుక, పట్టి చెమటలు కాలువగట్టుదనుక,
ఇసుకపాతర లోతులకేగుదనుక, నీకు కన్పించ దీయేటి నీటిచుక్క.

కుండపోతలవానలు గురియనేమి, పట్టుమని పదినాళ్లలో పారబోసి,
ఇసుకబొక్కసమున మిగులెల్లదాచి, పెన్నపడుకొను నీనేలదిన్నెమీద.

చిటపటవానలకే, ఒ
క్కట నోరుండెఱచి నురుగు గ్రక్కుకొనుచు, ను
త్కటమై దరులొరసి రటత్
కటు ప్రవాహముల నింగికై పరువెత్తున్.

జలకలుకల్మషమై క
ర్మకులై దరిజేరు జీవరాశుల మ్రింగఁగ,
హానమెంతని! ఇది చేయని
హఠాత్కఠోర క్రియావిహారముగలదా!

కాని యీ యేటినీటిలో కమ్మదనము । లూరుచుండును; దోసిట నొక్కమారు
పుక్కిలించినజాలు నీపుట్టువునకు । సార్థకత్వము నిష్కల్మషత్వమబ్బు.

గుండె జలదరింపజేయు । రండతనము దుల్చివేయు,
ఖండితవాదినిజేయును । దండితల్లిసువర్ణమ్మనది!
కండలేక ఎండిపోయి । బెండువారినా సరే!
తిండిలేక తుండులేక । పండువారినా సరే!
నిండుమనసు, నిజాయితీ । దండిచేయి, ధర్మదీక్ష
పండువయసుపట్టుదలా । పండించును గుండెలలో.
రండు రండు చేతులెత్తి । దండము తల్లీ! యని, కై
దండల దండలతో నీ । రెండ నిలచి కొలిచిపొండు.

ఇంతమంచి పెన్నతల్లి । ఎందు కెండిపోయెనో?
ఇంతమంది కన్నతల్లి । ఎందు కిట్లు మాఱెనో?
వంతలతో చింతలతో । కంతలువడి పోయెనో!
సంతుకోస మేడ్చి యేడ్చి । గొంతు కారిపోయెనో!

ఈ యేటి కాల్వలోతుల
పాయలుగా పాఱునీటి ప్రతిబొట్టున, నీ
చాయలరైతుల నెత్తుటి
చాయలు సమ్మిళితమై విచారముగొలుపున్.

ఈ యేటిదరుల దిన్నెల
పాయక దిరుగాడు నక్కబావలె యెపుడుఁ
వేయారు పీన్గులిచ్చట
నే యంత్యక్రియలబొందు నెప్పటికపుడే.

సురగరుడోరగ విద్యా
ధర కిన్నర సిద్ధసాధ్య దైవతతరుణీ
చరణారుణ పంకేరుహ
వరరేఖలు లేవు వట్టిపఱుదులె తిరుగున్.

నాగకన్యక లిచట కన్పడరుగాని । నాగుబాములు చరచరసాగు నిచట
గరుడ గంధర్వకామినుల్ కానబడరు । కాని బొంతగద్దలు గుంపుగట్టు నిచట

ఏలాలతాజాల డోలికలిటలేవు । తిప్పతీగెల తల తిక్కెగాని!
తరుణప్రవాళ లతాకుంజములు లేవు । రేణగంపల పొదరిండ్లెగాని!
లలి లవంగకుడుంగ లాలిత్యములు లేవు । తుమ్మతోపుల ముండ్లదొరువెగాని!
నారికేళాది వనాంతరస్థలిలేదు । చిట్టీతడొంకల చేలెగాని!
ఇట గులాబీలు పొడసూప, వెపుడు పచ్చ । తంగెడుల్ బోద గడ్డిగాదములె పెరుగు
సరస సుకుమార తృణసమాచ్ఛదము లేదు । పాడు పల్లేరుగాయల బీడెగాని.

శుకపికశారికారవరుచుల్ వినిపింపవు; గూబమూల్గు లో
క్కాకతతి గుండెవ్రీల్చును; దిగుల్ వడజేయును తీతువుల్; సము
త్సుకవృకజంబుకమ్ములు మతుల్ సెడగుయ్యిడు—వల్లకాడు పె
న్నకు నిరుగట్టులందు; పులినస్థలి పుఱ్ఱెలు పండు మెండుగన్.

బల్లులు, తొండలు, నెలుకలు,
పిల్లులు, కుక్కలును, చెవులపిల్లులు కొల్లల్
కొల్లలు తేళ్లుం జెఱ్ఱులు
ఇల్లూ వాకిలి యిదే ఫణీంద్రులకెల్లన్.

పుట్టలు గుట్టలు గుట్టలు
పట్టెడు పట్టెడు నిజమ్ము పాపరకాయల్
పుట్టెడు పుట్టెడు జులుకులు
కట్టా ఇదియేటి యేటిగట్టు తమ్ముడూ?

నిట్రాళ్లకు, చెట్రాళ్లకు
జేట్రాళ్లకు కొదువలేదు, బిసబిసనడువన్
కుట్రెల్లివచ్చు, సీతల
పెట్రేగునుసుమ్ము! ముందువెనుకల్ గనుమా!

ఆచింతచెట్టుకొమ్మే చిన్నిగాని యూపిరిదీసి వేసినయురికిప్రాపు,
ఆతుమ్మచెట్టుదిమ్మే సీతిగాని కాఱకుజేరవేసిన తాలుగాయ,

ఆయీతచెట్టుపట్టె యెంకి కడియాలనూడ్చినతీర్పులో నొక్కసాక్షి,
ఆబోదపోచరెమ్మె బుఱ్ఱ యెరుకలసాని చండాలూడ్చగలుగుజాణ,
ఆ యిసుకదిబ్బయే చలమన్న బండిబడక నమ్మించినట్టి మ్రుక్కడికసాయి,
అక్కటక్కట యిక్కడ అడుగుదీసి అడుగుబెట్టుటకే గుండె లవిసిపోవు.

విడుగుచుండె తిమిరమదే । తొడుగుచుండె నరుణకాంతి
తళబడ పనిలేదిక, అక్కడ నేదో కోడికూత.
వడివడిగా నడునడు కన్పడునేమో పల్లె యొకటి
విడుగుచుండె తిమిరమదే తొడుగుచుండె నరుణకాంతి.

అటునిటు కల్లకంప, తరుణా రుణదీప్తులు దూరనేర వి
చ్చుట, నడుమఱగ లట్టిది విశాలమహాధ్వము మూడుమూళ్లు, చి
క్కటి యిసుకఱ పదమ్ములు కకావికలై చను, నీడ్వలేక ఎం
తటి బిగిగిత్తలైన దగతల్లడిల్లుఱ మనమింక లెక్కయా?

ఈడొంకపెండ్లిండ్ల కేగువారల నెన్నితూరులు దొంగలు దోచుకొనిరో?
ఈడొంకనిండు బండ్లెన్నిమారులు బరువెక్కుట యిరుసు పుటుక్కుమనెనో?
ఈడొంక నెన్నిసార్లెందరు మొనగాండ్ల కాలుసేతుల ఎముకలు విరిగెనో?
ఈడొంక మంచినీళ్లెత్తుకవచ్చు కొంగ్రొత్త కోడండ్రెంత కుళ్లుకొనిరో?
ఇచట మునిమాపులం దెన్ని యెన్నిమోజుకతలలో రసపట్టులు కాటువడెనో?
ఇచట నెండప్రొద్దుల బసులెన్ని యెన్ని యింత విశ్రాంతికై తపియించినవియో!

ఇది విడిదియాలమందకు
నిదియే గొఱ్ఱెలకుతావు, నింక మేకలుఱ
గదుముకవత్తు రిచటికే
ఇది పులులకు రేవు, నీటియెద్దడియయినన్.

వంకయిదియె కొండవాగుతో నేర్పడె । వానవచ్చినపుడు వంకపాఱు;
దీనిలోన ప్రక్కగానున్నదే కాల్వ । బాటదరిని మంచినీటిచెలమ.

అదిగో పారలనెత్తి పట్టుకొని వేయార్మంది యీ కాల్వనే
పదిలంబుం బొనరింపవత్తు, రిది కుప్పల్గొట్టు కాలమ్ముదా
క దినమ్ముల్ బ్రతిరైతుసేయవలె, సర్కారూరకే పన్నువే
యుదురంతే, ఒకనాడు మానిన ఫలా లుత్తుత్తవై పోయెడిన్.

ఆగుంపులోన వచ్చుచు
రాగమ్మున యాలపాడు రంగన్నకిదే
యాగము, యోగము, భోగము
రోగమ్మునుగూడ నిదియె రోజులుగడవన్.

రెండవసర్గ

రంగనికిగలట్టి బ్రతుకుటాదరువు 'యర్రోనిచేను' పాలు, రొంపురొచ్చు;
ఉన్న దొక్కటెకర మూపిరిడీయును, కాల్వతోవ్వకమ్మె కండలూడ్చు.

ఒకనా డతనినాన్న ఊరిలో పెద్దసంసారి; నాలుగుకాండ్ల సాగుబడిని
సేయు పట్టాదారు; వేయూరు రైతుల కిస్తీలకస్తీల కేలుసాపి
ఆదుకొనుచు మంచి యనిపించుకొన్నాడు, పేదసాదల కింతపెట్టినాడు;
ఊరిదేవళమున కొకనెల కొకరోజు, పూజకిచ్చు పెద్ద పుణ్యవంతు
డనుచు, తంబళ్లసుబ్బమ్మ దినదినమ్ము నొప్పుకొనుచుండు; దాసరి ఓబిళేసు
గరుడగంబమ్ములో వెండికాసువేయు పరమభాగవతుండని పాడు నతని.

గుడిసెముందర సీడలోగూరుచుండి, అలతి యీతాకుచాపల నల్లుకొనుచు,
'దొంగ సుంకన్న' తిరణాలతోదులోన, పాటగట్టె నీయనపయి మేటియనుచు.

"సై సై నారపరెడ్డి నీపేరే బంగరుకడ్డిరా॥
పారజోస్తివి దాన్యమంతా ఊరడిస్తివి పేదవోళ్లను,
కోరమీసం మెలివెడితే సీరాముడు నీవేనయ్యా॥ సై॥
అంతపూరంబాటలోనా సింతలపల్లె సెరువుమీనా,
పంతమేసీబండిదోల్తే పటకలానన కలెకటేరూ॥ సై॥
పప్పూరు అసీవెత్తం పరపలో కోలన్నగాళ్లా
పాడతాంచే సంచిరూకలుపారేస్తివి బట్టమీదా॥ సై॥"

అది పల్లెపాట, నెమ్మదిలోనిమాట; మొదలుండునేకాని తుదలేనిబాట;
పదినోళ్ళలోపడి పదిరూపులెత్తి, కదలిపోయే కైతకమ్మనియూట.
బట్టలచ్చుమయ్య బండారుబసవయ్య, పంచరత్నములను బట్టిపెట్టి,
ఊరిసుంకులమ్మ తేరునా డీయన సన్నిధానమందు చదివినారు.

"శ్రీసుంకులాంబ నీకే
గాసియు లేకుండజూచి గ్రమ్మఱబ్రోచున్
భాసురకీర్తి పతాకా
ధూసరితా జాండకుండ దోర్బలశుండా?

"పాకారి ప్రభృతులతో
శోకారియటంచు పేరు సొగసుగ గను, నా
కాకాసురసంహారి, నిరా
కృత దుష్టారి ప్రోచురా నారప్పన్.

"ఇందుడవీవె యింద్రుడవు నీవెయటంచని మాదు డెందముల్
సందడిసేయుచుండె నరసన్నకుమారుడ! నారపాఖ్య! నిం
బొందిన మాపురీవిభవపూర్ణత నెంచగ, నాదిశేషుడున్
తొందరపోవు సత్తికుల దుగ్ధపయోధి సుధాకరా! వరా!

"ఇల్లాలు నీకు రామమ,
చెల్లెలు నాగన్న రెడ్డి సింహునకుర్, నీ
వల్లుడవు దుబ్బిరెడ్డికి,
ఫుల్లాంభోజాతనేత్ర! పూతచరిత్రా!

"ఎద్దులబండినెక్కి పయనించుచునుండగ ధూళి రేగి, ఆ
ప్రొద్దును ముంచివేయగనె పో సురవైరులు లేచివచ్చి రా
యెద్దులతో కలం గలుగు నింతటి మారుత మంతవీచిరా
దద్దయు ప్రొద్దుదోచ బిళితాశను లక్కట పారిపోవరే!"

ఈపంచరత్నముల విని,
కోపమ్మున మొగము ద్రిప్పుకొనె పురోహితుం,
డీపాటి చాల్ సెబాసనె,
పాపయ్య తనొక్క పెద్ద పండితుడనుచున్.

రూకలనంచిదీసి, పెదరుద్రయబిల్చి, పదాల్ పదాలుగా,
నాకవు లొక్కరొక్కరికి నప్పణవెట్టుమటంచు, రెడ్డిగా
రే కరమందునుంచి యొనరించిరిగౌరవ; మంతతోనె చా
మీకర భూషలిచ్చినటు మేనుఁబొంగి నుతించిరందఱున్.

ఇన్ని పొగడ్తలనా నరసన్న కొడుకు
పెద్దపేరు సంపాదించె
కొన్ని దినాలకు దస్త్రము
సన్నవడంజొచ్చె, కీర్తి సంపద బలిసెన్.

సర్కారుసిబ్బంది సరిజేయుటకు కొంత, సాలుజమాబంది పాలుకొంత,
పోరుగూరిమన్నీల సరఫరాకింత, ఆలేకార్ల లంచాలలోకి కొంత,
పేట పెద్దవకీలు పిళ్లైకు కొంత, కాంపౌండరు మునసామి పాలుకొంత,
కోడెరెడ్లకు కొంత, గుఱ్ఱాలకై కొంత, బగ్గీలకై కొంత, భటుబకింత,

పెద్ద మహాడీలు కట్టినపేర కొంత, పూటపడి అచ్చువలసినపాటు కొంత,
తన వివాహాలు నాల్గింటికిని మఱింత, కొంతకొంతయె ఖర్చు కొండంతయయ్యె.

ఎదిగిన కూతులిద్దఱకు నెన్మిదిరోజుల పెళ్లి సేతకే
వదిలెను వేలువేలు; నిరువాగులవచ్చిన పెండ్లిబండ్లలో
కదలెను ధాన్యలక్ష్మి; కడకాకియునుండిన నేతివంటకా
లదిగది పెద్దపెండ్లియనినారు జనా, లదిచాలు రెడ్డికిన్.

ఒకపెండ్లాము గతించె దూమున; మఱింకోభార్య కాల్జాఱి కొ
ట్టుకపోయెఁ బెదవంకలో; మఱొక బొట్టుం గట్టగా, నామె యిం
చుక సంసారముజేసి, కూతుంగని రెండోసారి కాన్పుఁ గమిం
చకపోయెఁ, సరికొత్త రామమయె వేకారంగ పుత్రుఁ గనెన్.

వాడీరంగడు; పుట్టినవాడు ముసలిముప్పునందు, వానితల్లియుఁ
దూడవయస్సుదెకద? మఱి నాడే మో వణకుచుండె నారప్పొకడే.

రొక్కము లేక, దర్పముతఱుంగక, నారపరెడ్డి రూకలుఁ
గుక్కను గొట్టరాలు ననుకూతలు విస్మరియించగాక, ఈ
చిక్కులనేమిదోచక, వశిత్వముచాలక, చుట్టుజేరి కు
మ్మక్కొనరించు నాశ్రితులమాటలకుఁ జెవిజాలవేసినన్.

మఱునాడే పొరుగూరికి
బిరానతన తలారివెళ్లి పెద్దిరెడ్డికిఁ
యరమంచికయ్య 'ఆయక'
మిఱికించిన పత్రమిచ్చి ఏదో తెచ్చెన్.

ఇక మొదలయ్యె రెడ్డి గడియించిననేలకు గత్తిరింపు, లో
క్కొక 'మహాసూలు'నఁ ఫలముకూడ నోకించుక 'కమ్మి' యయ్యె, నిం
చుకధరలుఁ బడెఁ, వఱపుసూపెను, వానలు బిగ్గబట్టె, నె
ట్లిక నవరించనేర్చు, ఋణమింతకు నింతకు మిద్దె లెక్కగన్.

చదలంటువాములు చదునయిపోయె, గాదెల కణజాల గబ్బిలముజేరె,
నాగలోకము దాకునట్టి పాతరలలో, ముగ్గినగింజలు తగ్గిపోయె,
కట్టగట్టుకనిప్పపెట్టె నిండుగనున్న పత్రాలదస్త్రాలు పారిపోయె,
ఏకుండలోజూచినా కానవచ్చు, బంగరునగానట్రట అక్కఱిలకేగె,
ఒక్కటేరోజు మూడురూప్యములమణుగు వేరుసెనగ నాలుగణాల వెలకు తగ్గె
ఒక్కరూకకే యిరువయియొక్కసేర్ల కొఱ్ఱలును జొన్నలును అమ్ముకొనగవలసె.

పెద్దిరెడ్డి ఒక్కొక్కటే పద్దువేసి, పత్తి నారప్ప చేలన్ని కత్తిరించె;
అంటుమిద్దెలు నాల్గు కృష్ణార్పణమ్మెకాగ, పసులుజీవా లెద్దు లాగగలవె?

ఊర చావిడిని చేరిరి బాకీదారులందఱును తమ రొక్కమునకు,
ఊరిపెద్ద లీమారు పూర్తిగా, 'తీరుమాన'మే తేలిచి చెప్పిరి.

తాడూ తలుగూ, కాడీ మేడీ, పారా పలుగూ, కాఱూ కంపా,
చెట్టూ చేనూ చేరి సమస్తము కట్టివేసినా కటకటయయ్యెను.

ఎఱ్ఱయేగానియే గాని యివ్వనసక, నల్లపూసలతో ఆస్తినెల్లజూపి,
కట్టె వడ్డీ మొదల్ కడ బొట్టువఱకు, పత్తి నారపరెడ్డి నిబద్ధిమనిషి!

ఏరుజెప్పిరో మఱి తెల్లవారునరికి, పత్తి నారపరెడ్డి దివాలయనుచు,
పసలపిల్లలుగూడ దివాలరెడ్డియనగ, ఊరెల్లగప్పున నందుకొనియె.

ఈమాట విన్నతోడనె
రామమ్మ భరించలేక రామాయనుచున్
ఆమూల చీరచెఱగు తనే
ముట్టించుకొని కన్యకే యయిపోయెన్.

నారపరెడ్డి నారప్పయ్యెను, ఊరుమోతుబరి ఉప్పరియయ్యెను,
దారిమోటులో పూరికొట్టమున, చేరెను తోడొక చిన్నరంగడే.

కుళ్లికుళ్లి యేడ్చి కుక్కిమంచమునుండి । లేవలేక చేయు చేవలేక,
చిన్నరంగడిచ్చు చిన్నిలోటానీళ్లు । త్రాగి ముసలిరెడ్డి సాగిపోయె.

తల్లిదండ్రిలేని, తనవారెవరు లేని చిన్నరంగనిగతి విన్నగూడ,
బంధుమిత్రకోటి పదరనైననులేదు, సాయపడుట కింక కాయమొకటె.

వాడే 'రాంగా' డయ్యెను
పాడా కనవులనుదీసి పసులగాసి, కూ
లోడా యనిపించుకొనెన్
లేడా నారప్పవీని లేమిడిచూడన్.

ఎన్ని బడబాగ్నులా చిన్ని యెడదరగులుచున్నవో? ఎన్ని కార్చిచ్చు లున్నయవియొ
ఎన్ని సంవర్త ఝంఝల కెదురునిలిచి, వాడి వత్తయిపోయెనో వాని బ్రదుకు.

ఒకరింటిగాటిలో నూరినగంజెల్ల నెత్తిపోయుట కెంత యేడ్చినాడో?
ఒకరింటిదొడ్డిలోనుండిన కసవెల్ల నూడ్చివేయుట కెంత ఉడికినాడో?

ఒకరింటి నట్టింట నున్న కొర్రలనెల్ల దంచుట కెంత శోకించినాడో!
ఒకరింట గంపలకున్న రాగులనెల్ల, విసరుట కెంత కంపించినాడో!

ఒకరియింటిలో పిల్లలనూచుటకు, మఱొక్కరింటిపక్కలు వేయ, నొక్కరింట
అఱవచాకిరీ చేయుటకొఱకు, నెంతయెంత దురపిల్లెనో వానియింతయెడద!

కటికకారము సంగటి గుటకవడక, ఎన్నిబిందెలనీళ్ల త్రావించినదియొ,
ఎండు రొట్టెముక్కల అఱిగింపుగాక, ఎన్ని మిరపగింజల నమిలించినదియొ!

ఇవియుం దొరకక, పుడిసెడు
గవినీళ్లం ద్రావి ముడుచుకపరుండిన, పా
డు విభావరులెన్నో!
లెక్క విలేవరియేది వల్లకాటి బ్రదుకునన్?

తొలికోడికూత కన్నులు నులుముకొనును,
పిలిపించగానె చెప్పులు తొడుగుకొనును.
గలగంట్రమోత చేతుల మ్రొక్కుకొనును,
వెలుగెక్కగానె పంటలు చూచుకొనును.
మలిసంజలోన కండలు తడుపుకొనును,
చలిపెట్టగానె ప్రక్కలు దాచుకొనును.
నెలయెక్కగానె గజ్జలు కట్టుకొనును,
కలకంఠమెత్త కోకిల లూడిపడును.
కలమెఱుంగడుగాని వలపుతుంపురుల,
నిలువెత్తుపోసి చిన్నెలు సూపగలడు.
బళిబళీ రంగన్న గళమె కావ్యమ్ము,
బళిబళీ రంగన్న కళయె కంఠమ్ము.

'కోలుకో'లని చేతికోల గొట్టినజాలు, జాలువారును భరతాలు వేలు;
'ఓ...'యంచు నోరయాల సాయించితేచాలు, జాఱు గాథాసప్తశతులశతులు;
'మచ్చుదిగనే' యను మరులుపాటేచాలు, పొదుగు నేపున - అష్టపదులపదులు;
'గరుడగమనా'యంచు గాత్రమెత్తినచాలు, పొంచిచూచును మూక పంచశతులు
వేలవేలపదాలసామేలవలయు? ఖంగుమనగల గుండె చిక్కనయెయున్న,
వేయికూకలమాణిక్య వీణయేల? నెదురుచాలదె పలికించు పదిలమున్న.

పుట్టుకవి గాయకుడు నటరాట్టునతడు; కట్టదెగగొట్టుకొని రస ముట్టిపడగ;
ఉట్టిపాటున కన్నీరు లురలిపొరల, చెట్టుపుట్టలకే గుండె పుట్టజేయు.
ఆరంగన్న కాలువకు వెళ్లుచు యాలపాడుచున్నాడు.

వానితియ్యనిగొంతుక లోనలోన, తీవసాగుచునున్న దుద్వేగరవము;
వానిచిక్కని గుండియ లోనలోన, పూవుపూయుచునున్న దుద్బుద్ధరసము.

వేకువ రేకులొక్కొక్కటి విచ్చుచునున్నవి; వేపకొమ్మల
గాకులగుంపు లొక్కొక్కటిగా తల ముక్కలకేగుచున్న, వా
కోకిల యొక్కటే గుబురుకొమ్మలరెమ్మల పీడలేక 'కూ
కూకుహూ' అంచు నొక్కొక్కట, గూయుచునున్నది తెల్లవారగన్

ఆ ప్రశాంత ప్రభాత సంయాత మందమంద మరుదంకురములు పై మరచి సాక్కి
కలతలన్నిటి మఱచి, రంగన్న కంఠమెత్తి పరిసర ప్రకృతి మంత్రించి లేపె.

ఆ క్షణమ్మున గానలయామృతమున లీనమైపోయి ప్రకృతికి మానవులకు,
నడుమనున్నట్టి యవనిక ముడిచివేసి, మధుర నిర్మలపరమ సమాధి నిలిచె.
జీవితమ్మున నిట్టి రసావబోధసిద్ధి, ఎన్నడోగాని వాసించబోదు,
వేయియుగములసాధన విధులవెల్ల, అట్టి త్రుటికోసమే తపమాచరించు.

అటుమీదట నందఱు,
మిక్కుటమగు సంతసము గుండె గూడుగట్ట, ని
ట్టటు కదలక నిలుచుండిరి,
తటాలుమని 'పిన్నపెద్ద' దరిసెనమయ్యెన్.

సరి ఫిమ్మట మామూలే!
చరచర పారలనుబట్టి సాలుమేఱ, కా
ల్వ రమారమి మైలున్నర
వఱకుం, ద్రవ్వకము రోజువారి రివాజే.

అంబటి ప్రొద్దుకాగనె రవంత విరామముగూడలేక, వా
రుం బరువెత్తి రింటికియిరొప్పుచు రోజుచు, సంగకమ్ము, లె
ల్లం బులకాపుజేసినటులన్ జెమటల్ చెమటింప, ప్రేవులన్
తంబుర మోత మ్రోయ, నిరత శ్రమదగ్ధ లుదాత్తజీవనుల్.

స శే ష ము

డబుల్ జీరో

శ్రీ కె. కేశవరావు

పాత్రలు

దేవుడు	నాగులు	విశ్వం	గణేశ్
అనంతం	జయ	లాలూ	కారు డ్రైవరు
ప్రకాశం	సీనయ్య	కపూర్	దేవప్రకాశం

* విలియం సారోయాన్ ఆధారంగా *

* * డేవీ విలాస్ హోటల్ ముందరి భాగం .... కుడివైపున ముందుగా ప్రొప్రయిటర్ కూర్చునే టేబిలు, కుర్చీ ఉంటాయ్..వరుసగా హాలులో బల్లలు, కుర్చీలు ఉంటాయ్. సర్వర్ అనంతం ఒక టేబిలుముందుకూర్చుని పత్రిక చదువుతూంటాడు. ఒక పేజీ తిప్పుతాడు...ముందున్న ప్రేక్షకులను చూస్తాడు. మళ్లీ చదువుతూవుంటాడు...ప్రేక్షకులు జ్ఞాపకంవచ్చి వాళ్లవైపు తదేకధ్యానంగా చూస్తాడు. పేపరు మడిచి లేచి ముందుకు వస్తాడు :

అనంతం: అమ్మలూ, ... బాబులూ...మీరు చూస్తున్నది డేవీ విలాస్...పట్టణంలోకల్లా పెద్ద హోటలు...టిఫిన్ బీరువాలు...కుర్చీలు...బల్లలు...కిటికీలు...తలుపులు...గుమ్మాలు..వెనకాల గదులు...వంటగది...వంటగదిలో వంటవాడు ... క్లీనర్లు ... కప్పులుతీసే అమ్మాయ్... హోటలుముందు రోడ్డుమీద కార్లు..చుట్టూ పట్టణం...ఎక్కడచూసినా ప్రపంచం...

మిమ్మల్ని చూడకముందు ... బల్లముందు కూర్చున్నా...మీరు చూశారుగా పేపరు చదువుతూండటం ... బ్రాకెట్ ఏమిటో చూశాను ... జీరో ఫోర్ ... నిన్నరాత్రి డబుల్ జీరో ఆడాను...పత్తాలేకుండా పోయింది...జీరో ఫోర్ వచ్చించి. అర్ధరూపాయి తేవరం ... పోతేపోయింది... ఇంకా ఏం చదివానా? ఆ...ఒకతను చచ్చిపోయాట్ట...బాగా వయసుమళ్ళినవాడే... డెబ్భై సంవత్సరాలుంటాయ్ ... పెద్ద వ్యాపారి...వెనకాల బోలెడు కుటుంబం ఉందిట...ఆయన్ను గురించి నే నెప్పుడూ విననేలేదు...

[హోటల్ ప్రొప్రయిటర్ దేవుడు, ఎడమవైపు ముందుభాగంనుంచి లోపలికి వస్తాడు]

ప్రపంచంలో ఏం జరుగుతూంటుందో బ్రతికుండి చూడలేనివాళ్ళను చూస్తే...మనం విచారపడతాం...పరిస్థితులు ఎలా మారుతాయ్...ఎన్నో మారుతూంటాయిగా ప్రపంచంలో...అదైనా కొత్తరకం...కొత్త పద్ధతిలో...తొందరగా...

దేవుడు: ఏమిట్రా...ఏం చేస్తున్నావ్...ఏం చేస్తున్నావో తెలిసే చేస్తున్నావా?

అనం: మా ప్రొప్రయిటర్...ఈ హోటలు ఈయనదే ... కొంచెం సేపు ... క్షమించండి... (ప్రొప్రయిటరుతో) ఏం చేద్దామన్నా చేయటానికి ఏం లేదు? ఎవ్వరూ రాలేదు... ఇంతలో యీ జనం కనుపించారు. ఊరికే పాగా కబుర్లు చెపుతున్నా...

దేవు: ఏ జనం?

అనం: అదుగో...అక్కడ...

దేవు: (ప్రేక్షకులను చూసి) ఆ...ఇక పో...నీ పని నువ్వు చూసుకో...(తిరిగి ప్రేక్షకుల వైపు తన కళ్ళను తానే నమ్మలేనట్లుగా చూస్తాడు) ఏం జరిగింది?

అనం: నాకూ తెలియదు. కాని వీళ్లంతా యిక్కడున్నారు. వాళ్లంతే మొగం మాడ్చుకుని కూర్చోవటం బాగుండదు. అదీకాక యిలాంటి పరిస్థితుల్లో వాళ్ళు మాట్లాడరు. అందుకని నేనే కబుర్లు చెపుతున్నా... ఎక్కడో ఒక మనిషి చనిపోయాట్ట...అదే చెపుతున్నా...ప్రపంచంలో ఏం జరుగుతూంటుందో, బ్రతికుండి చూడలేని వాళ్ళంటే నాకు ఎంతో విచారం అని అంటున్నా...

[దేవుడు గాబరాపడతాడు]

అరరే...కంగారుకేనికి? జనాన్ని మీరు యింతవరకు చూస్తూనే ఉన్నారుగా... వాళ్లూ మిమ్మల్ని చూస్తున్నారు. ఎవరూ మిమ్మల్ని చూడకుండా ఉంటే...మీపని మీరు చూసుకుంటూండండి...ఎవరైనా హోటలుకు వచ్చేదాకా యీ జనంతో మాట్లాడుతూంటూ...మనకేం తెలుసు? ఎవరో ఒకాయనవచ్చి పెద్దఆర్డరు యివ్వకూడదా ఏం" మీరేమన్నా మాట్లాడతారా? పరిచయం చేసుకోవటంగాని ... ఇంకా అలాంటి దేదైనా...

[ప్రొప్రయిటర్ దేవుడు నెమ్మదిగా ఏదో చెపుతాడు]

ఓ...అదా...ఎంతో బాగుంటుంది...

దేవుడు: మహాశయులారా...స్వాగతం ... సుస్వాగతం...దేవివిలాస్‌కు మీకందరికీ స్వాగతం..

[కంగారు పడతాడు]

అనం: అరే చెప్పండి...భయపడతారేం...

దేవు: మహాశయులారా...

అనం: అదీ...బిగ్గరగా...స్పష్టంగా... వినయంగా ...ఆ...దానికి కొంత మెరుగుతగిలించండి...

దేవు: (మృదువుగా) దేవివిలాస్‌కు...స్వాగతం...

అనం: వాళ్లంతా ఇక్కడే ఉన్నారు. వెళ్లటానికి వేరేచోటు ఏంలేదు...లేకపోతే యిక్కడ ఉండనే ఉండరు.

[ప్రొప్రయిటర్ దేవుడు మళ్లీ రహస్యంగా మాట్లాడుతాడు]

ఆ...ఇక చెప్పండి...(ప్రేక్షకులతో) ప్రొప్రయిటరుగారు మాట్లాడలేరు — అందుకని ఫీడేలు వాయిస్తారు...(దేవుడు లోపలికి వెడతాడు) ఆయన్నిగురించి మీకు కొంచెంగా పరిచయం చేస్తాను. మహాశయులారా... ఈ హోటలు ప్రొప్రయిటర్ దేవుడు గారికి అరవై రెండేళ్లు ఉంటాయ్...ఇద్దరు కొడుకులకు తండ్రి...ఒకడు లాయరు...రెండవాయన డాక్టర్...ఇద్దరికీ పెళ్లయింది... ఇద్దరూ తండ్రులే...కూతుళ్లు యిద్దరు... ఇద్దరికీ పెళ్ళయింది ... యిద్దరూ అమ్మలే...(ప్రొప్రయిటర్ దేవుడు తిరిగి వస్తాడు చేతిలో ఫీడేలుతో) ఆ...దేవుడుగారు యిక వాయిస్తారు...

దేవు: (నెమ్మదిగా) రైట్...అనంతం...

అనం: ఒకటి...రెండు...మూడు... అంటాను... వెంటనే మొదలు పెట్టెయ్యండి—రెడీ... ఒకటి...రెండు... మూడు... (దేవుడు ఫీడేలు సర్దుకుని మాట్లాడకుండా ఊరుకుంటాడు)

ఆల్ రైట్... మళ్లీ...ఒకటి...రెండు ... మూడు...

దేవు: చేయికదలటం లేదు...

అనం: కంగారు పడకండి ప్రొప్రయిటర్ సాబ్... మీకు ఫీడేలు వాయించాలని ఉందికదూ... ఆల్ రైట్... ముందు నే వాయించి చూపెడతాను... (ఫీడేలు వాయిస్తాడు) అదీ... అలాగ... ఏం లేదు... చాలా సులభం ...ఆ ఇప్పుడు సరేనా... రైట్... ఒకటి... రెండు ...మూడు...

[దేవుడు ఫీడేలు వాయించలేక పోతాడు. అనంతం సహాయం చేయటానికి నిరాకరిస్తాడు. ఏంచేయలేక దేవుడు నిస్సహాయంగా కుర్చీలో కూలబడతాడు. గొప్ప వీర కృత్యం చేశాడన్న మాట... అనంతం... పొగడ్తగా చప్పట్లు కొడతాడు...]

దేవు: థాంక్యూ...

[వంగి అభివాదం చేస్తాడు. అభినందనగా అనంతం యింకా చప్పట్లు కొడతాడు, వంగి అభివాదం చేస్తాడు. అభినందనగా అనంతం యింకా చప్పట్లు కొడతాడు. దేవుడు మళ్లీ వంగి అభివాదం చేస్తాడు... ఇంకా చప్పట్లు... మళ్ళీ అభివాదం... అనంతం చప్పట్లు కొట్టడం మానేస్తాడు]

అనం: ఆల్ రైట్... ప్రొప్రయిటర్ సాబ్... ఇక లెక్చర్ ప్రారంభిస్తాను...

[ప్రకాశం లోపలికి వస్తాడు]

ప్రకాశం: (అనంతంతో) ఒక గ్లాసు మంచినీళ్లు... హాట్ కాఫీ...

అనం: సరే... సార్...

ప్రకా: టిఫిన్ ఏముందోయ్? ఆల్ రైట్... (దేవుడుతో......ఇంతవరకు నోరు తెరచుకుని అతనివైపే చూస్తుంటాడు) ఇవ్వాళ ప్రొద్దున్న పేపరు చూశావా? (కూర్చుంటాడు. మళ్ళీ లేస్తాడు) ఏమిటి...యింత కంపరంగా ఉంది...(తాగటానికి ఏదయినా తీసుకురావోయ్...మంచి టీ... ఏడిసింది దాని మొగం...స్ప్రింగ్ కాఫీ... పేపరు చదివావా?

[ప్రకాశం కూర్చుంటాడు......అనంతం గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి యిస్తాడు... ఒక్క గుక్కలో తాగేస్తాడు...వలికి మీద పడతాయ్...చేత్తో తుడుచుకుంటాడు... అనంతం ఎదురుగా ఉన్న, ఆరోజు తయారు చేసిన ఫలహారాల బోర్డు చూపిస్తాడు]

ఆర్డరు యిదివరకే యిచ్చేశాను...

అనం: ఇచ్చేశారా సార్...

ప్రకా: ఆ...నీదగ్గర టైమ్ ఉందా? పదిన్నరా... రైటేనా...

అనం: పది ముప్పైఐదు...

ప్రకా: థాంక్స్...వాచీ అసలు పెట్టుకోను...అవసరమే లేదు......అదంటే నాకు విసుగు కూడా...టైము ఎంతయింది ఎప్పుడూ తెలుస్తూనే ఉంటుంది...అవసరానికంటె నాకు టైము ఎక్కువే ఉంటుంది...ఐనా నిమిషానికి కరెక్టుగా టైము తెలుసుకోవటానికి నేనెవర్ని? మీరేం అనుకోకుండా ఉంటే యీ పేపరు కాస్త చదివేస్తాను. వర్కర్స్ ...ప్రపంచంలో ఎంతో అదృష్టవంతులు ...టైమ్‌ని తమకోసం రెగ్యులేట్ చేయించుకున్నారు. హాయైన పద్ధతి బ్రదకటానికి ...అదొక్కటే పద్ధతి...చేయగల్గాలి గాని నేనూ సర్వర్ అయిపోతాను......నువ్వు యూనియన్ మెంబరువేనా? హాయిగా జీవితం గడుస్తోందిగా...చక్కటి వాతావరణం... (ఒక్కసారిగా గట్టిగా అరుపు) కాఫీ!...

అనం: మీముందే టేబిలుమీదుంది సార్...

ప్రకా: ఎవరు పెట్టారు? (అంతా ఒక్కసారిగా తాగేస్తాడు) ఏం కాఫీ యిది? రైట్... ఇంకోటి తీసుకురా.

అనం: సరే సార్? ఇంకా ఏమన్నా...

ప్రకా: ఆ...థాంక్స్ జ్ఞాపకం దేశావ్? (అనంతానికి ఒక అణా యిస్తాడు) డబుల్ సైక్ రింగ్ చేయి...(ఒక్కసారిగా ప్రేక్షకులను చూస్తాడు) ఎవళ్లు వీళ్లంతా?...

అనం: అంతా ఏలూరువాళ్లే......ఏ కొద్దిమందో పొరుగూరివాళ్లుంటారు...

ప్రకా: డబుల్ సైన్...ఇక్కడ వీళ్లంతా ఏం చేస్తున్నారు?

అనం: మనల్ని చూస్తున్నారు...

ప్రకా: జనమంతా వట్టి కంపు...అందుకనే తప్పించుకు తిరుగుతాను...ఆ...ఆ నంబరు దొరికిందా?...లేడిమో ఏం లేదూ?...

అనం: గ్రామఫోనుంది...

ప్రకా: వద్దులే...దాన్నేం కదపకు...

[ఇంతలో పాప్రయిటరు......ఒకామెను లోపలికి తీసుకు వస్తాడు...ఆమె చాలా అందంగా ఉంటుంది...ప్రకాశం లేచి నిలబడతాడు.]

నే యిచ్చిన ఆర్డరు కాన్సిల్

[ఆమె కూర్చుంటుంది]

వారికి ఏం కావాలో కనుక్కో...

జయ: థాంక్యూ...ఏం అక్కరలేదు...

ప్రకా: ఇవ్వాళటి ప్రొద్దున్న పేపరు చూశారా...

జయ: ఆ...చూశాను...

ప్రకా: (అనంతంతో) ఈ అమ్మాయి జల్సా రకమేనా? ఇక్కడ పనిచేస్తోందా?

అనం: క్షమించాలి...ఏమన్నారు?

ప్రకా: ఇంత తొందరగా కొత్తవాళ్ళతో కలిసి తిరిగేవాళ్ళని, నే నెక్కడా చూడలేదు. బాగానే ఉంది...నిజానికి అన్ని విషయాలలోనూ, బిజినెస్ లైక్‌గా, ఉండేవాళ్లంటే నాకు చాలా యిష్టం.

అనం: (కాఫీ తీసుకువస్తూ) అవును సార్...

ప్రకా: నేనే ఒక ఎడుమ్యూర్‌ని ... ఇప్పటికీ అలాగే ఉన్నాను...ఇక అలాగే ఉంటాను కూడా..ఏ విషయానికైనా మొదలు అంటే ఏమిటో నాకు తెలియదు...నేర్చుకోను కూడా (కాఫీ చప్పరిస్తాడు) అందరినీ ఎగతాళి చేస్తాను, (జయతో) మీరు ఏలూరులోనే ఉంటూంటారా? (అనంతం బల్లమీద ఒక గ్లాసు పెట్టి, ఖాళీగ్లాసు తీసుకు పోతాడు) డబుల్ సైన్...

అనం: ఎవరున్నారని అడగమంటారు?

ప్రకా: ఏం అడగనక్కరలా? ప్రకాశం పిలుస్తున్నాడని...ఫోను కింద పెట్టెయ్యవద్దని చెప్పు.

అనం: ప్రకాశమా...అలాగే సార్...

[అనంతం వెళ్ళిపోతాడు...ప్రకాశం తిరిగి పేపరు చదువుతూంటాడు. ఒక అరవైఏళ్ళ పెద్దమనిషి...చక్కటి యువకుడినో, లోపలికి వస్తాడు...సీనయ్య...విశ్వం...]

ప్రకా: గుడ్ యీవినింగ్...

విశ్వం: నీతోనా మాట్లాడుతూంది?

సీనయ్య: కాదనుకుంటా...

విశ్వం: మనం ఎవరికంటా పడకూడదంటే, అలాగే నన్నావ్.

సీనయ్య: ఇక్కడికి ఎవ్వరూ రారు...పైగా ఫలహారాలు యిక్కడ బాగుంటాయ్.

ప్రకా: మార్కెట్ విశేషాలేమిటి?

సీనయ్య: (విసుగ్గా) క్షమించాలి ... నన్నే నా అడుగుతూంది...

ప్రకా: ఆ అబ్బాయిని, కాకపోతే...ఆత నెవరో నాకు తెలియనే తెలియదు.

సీనయ్య: (కోపంగా) నే నెవరో మీకు తెలుసుననే అనుకుంటున్నారా?

ప్రకా: (మెమ్మదిగా) ప్రపంచంలో యుద్ధం జరుగుతోంది. పది సంవత్సరాలలోగా నువ్వు చచ్చిపోతావ్ ... కూర్చో ... ఏం చేస్తున్నావ్...ఆ పనే చేస్తూండు..(తిరిగివచ్చిన అనంతంతో)—ఆ నంబరు దొరికిందా?

అనం: ఎవరూ జవాబివ్వటం లేదు సార్...

విశ్వం: (సీనయ్యతో) సరేగాని... ఈ హోటలు పేరేమిటి? (అకస్మాత్తుగా ప్రేక్షకులను చూస్తాడు...ఒక్కసారిగా ఆశ్చర్యపోయి నోరు తెరుస్తాడు) అరరే...పద...ఇక్కడి నుంచి తొందరగా పోదాం...

ప్రకా: కూర్చుని కాఫీ త్రాగవోయ్...

సీనయ్య: (ప్రేక్షకులను చూసి...దేవుడితో) నేనూ చూడనే లేదు...

దేవు: క్షమించాలి సార్...ఇదివరలో ఎప్పుడూ యిలా జరగలేదు.

సీనయ్య: (విశ్వంతో) వెళ్ళిపోదామంటావా?

విశ్వం: ఇప్పుడు వెళ్లినా ప్రయోజనం ఏముంది?

ప్రకా: ఇవ్వాళటి ప్రొద్దున్న పేపరు చూశారా?

సీనయ్య: (దేవుడుతో) నేను కాఫీహోటల్లో అలా ఎప్పుడూ అరవను?

దేవు: (ప్రకాశంతో) క్షమించండి సార్...మేమంతా కుర్రరకం...కష్టాలలో ఉన్నాం..

ప్రకా: ఎవరు కుర్రరకం...కష్టాలు...ఎవరికి?

సీనయ్య: ఆ పెద్దమనిషి నీతో అలా అరుస్తూ మాట్లాడటం ఏం బాగుండలా...

ప్రకా: ఎవరు?

దేవు: ఆయన...ఆ కుర్రవాడితో వచ్చినాయన...

ప్రకా: ఓహో...అదా...ఆల్ రైట్...కుర్రకారు...కష్టాలు? నాకు కూడా కొంచెంగా పిచ్చి ఉందనుకుంటున్నావా?

దేవు: ఉహు...నే నేం అనుకోటం లేదు...

ప్రకా: ఊ...నిజం చెప్పాలంటే నాకు ఉంది...నీకూ ఉంది...ఆయనకీ ఉంది. కొంతమందికి విచక్షణా జ్ఞానం ఉంటుంది...కొంతమందికి ఉండదు. కొందరికి కొంచెంగా ఉంటుంది. మరికొంతమందికి ఎక్కువగా ఉంటుంది. నాకు చాలా ఎక్కువగానే ఉంది...అదే డబ్బుయితేనా నేను కోటీశ్వరుణ్ని అయిపోయేవాడిని...(సీనయ్యతో) మార్కెట్ విశేషా లేమిటి?

సీనయ్య: (కోపంగా...చిరాకుతో) ఏం విశేషాలు?

విశ్వం: ఆయనకు జవాబివ్వకు...త్రాగినట్లున్నాడు.

ప్రకా: త్రాగానా? ఈ టేబిలు దగ్గర ఉన్న వాళ్లంతా కలిసి త్రాగేటంత త్రాగేస్తాను...బినా తట్టుకోగలను.. నేరంచేయనివాడికి ఉరిశిక్ష వేస్తే వాడు ఎంత తెలివిగా ఉంటాడో అంతకంటె ఎక్కువ తెలివిగా ఉండగలను...(దేవుడుతో) ఎందుకోయ్ యీ కాఫీ హోటలు పెట్టావ్? ...ఈ మనుష్యులేం మంచివాళ్లుకారు. వాళ్లని మేపటం శక్తి దండగ...

అనం: మంచినీళ్ళుసార్...

ప్రకా: చల్లటి వేనా?

అనం: అవునుసార్...

ప్రకా: సరే...అనంబరు మళ్లీ ప్రయత్నంచేయి...చేయగల్గాలిగాని నేనూ ఒక సర్వర్ ను అయిపోదును (జయకు దగ్గరిగావెళ్లి) చూస్తున్నారుగా...వీళ్లంతా ఆలోచించకుండా చేసిన పనే తిరిగి చేస్తాంటూరు. ఎప్పుడూ సరైన రీతో ఆపని చేయనేచేయరు. అసలు దానిని గురించి. తెలుకోలేరు కూడాను...ఏం చేస్తున్నారు? ఒంటరిగాకూర్చుని తింటున్నారా? (ఒక్కసారిగా అరుస్తూ) ఎవరైనా ఫోనుమీద ఒక రికార్డువేయండి.

జయ: కొంచెంసేపు విశ్రాంతికి ఒంటరిగా ఉందామనుకున్నా...

ప్రకా: (మ్యూజిక్ వినిపిస్తూంటుంది...పాశ్చాత్య సంగీతం... జయ లేచి నిలబడుతుంది...పాశ్చాత్యపద్ధతిలో డాన్సచేసేట్లుగా ఆమె నడుము పట్టుకుంటాడు)...మీకేం అభ్యంతరం లేదనుకుంటూ...కొంచెం సేపు విశ్రాంతికి ఒంటరిగా కాకుండా ఉందామనుకున్నా. పెద్దమనిషిని ఒక్కణ్ణికూడా యింతవరకూ చూడలేదు...క్షణంవరకు న్యాయంగా పెద్దమనిషి తరహాలో ఉండే వ్యక్తుల్ని కొంతమందిని చూశాను...ఒక్క క్షణం సేపేవాళ్లు పెద్దమనుష్యులు...నా మటుకు నేను పెద్దమనిషి కాను...ఇంకా అలాగేఉన్నా...పెద్దమనిషి తరహాలో ఉండాలనుకున్నా దానివల్ల కలిగే ప్రయోజనం ఏముంది? అందుకనే అలా ఉండను...చవకరకపు పెద్దమనిషి తరహా ఆ న్యాయం అంతా...కాతాలలో......న్యాయంగా దరిద్రంలో జీవించే కార్మికులలో ఉంటుంది...కార్మికులంతా అసలు బ్రదకాల్సింది అన్యాయంగానే...కాని నేననే పెద్దమనిషి తరహా...లోతుగా... విశాలంగా... సున్నితంగా ఉంటుంది. మాట్లాడదామన్నా ఎవ్వరూ లేరు...ఒక్కడినే ఒంటరిగా ఉన్నట్లుంటుంది.

జయ: మీరు మాట్లాడేది తెలుస్తున్నట్లే ఉంది.

ప్రకా: (కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉంటాడు... నెమ్మదిగా) నాతో డాన్సుచేశారు... థాంక్స్... (వాళ్లు అసలు డాన్సుచేయనే లేదు...ఆమెను కూర్చోబెడతాడు) మీరేం మాట్లాడకుండా ఎలా ఉండగలరు?

జయ: మాట్లాడటానికి ఏముందని ?

ప్రకా: (ఆశ్చర్యపోయి... నెమ్మదిగా) ఓహ్... (కుర్చీమీద కూర్చోబోయి క్రింద కూర్చుంటాడు...జేవుడు సాయంచేద్దామని పరుగెత్తుకువస్తాడు.) నా కాఫీ... ఎక్కడ? (పేపరుచూస్తూ నేలమీదనే కూర్చుంటాడు. అనంతం వస్తాడు) ఆ నంబరు దొరికిందా?

అనం: దొరికిందిసార్...

ప్రకా: ఆమెతో బండీచేసుకుని వెంటనే యిక్కడకు వచ్చెయ్యమన్నానని చెప్పు...

అనం: అలాగే...సార్... (ప్రేక్షకుల వైపు తిరిగి) నేను చెప్పలా?

[స్టేజిమీద లైట్లన్నీ ఆరిపోతాయి...సర్వర్ అనంతం సైడువింగ్‌లోనుంచి బయటికి వస్తాడు...అతను కనబడేటట్లుగా స్పాట్ లైట్ మీద పడుతూంటుంది)

అనం: క్షమించాలి...తిరిగి హోటలులోకి వెళ్లేలోగా...రెండునిమిషాలపాటు యిక్కడుందామని బయటకువచ్చాను ... మా హోటలుకు యిందాక ఆయనవచ్చేముందు మీతో మనవిచేశాను. "బ్రతికుండి ప్రపంచంలో ఏం జరుగుతుందో చూడలేని వాళ్లంటే విచారపడతాం"అని చెప్పాను... కాని చాలామంది బ్రతికుండీకూడా ఏం జరుగుతోందో చూడలేరు...అసలు తమకు ఏం జరుగుతుందో కూడా తెలుసుకోలేరు. వాళ్లలో బాగా చదువుకున్నవాళ్లు కూడా ఉంటారు.

బహుశా మీలో మీరు అనుకుంటూంటారు '...ఏమిటి ఈ సొదఅంతా' అని...నేను చెప్పేది ఏమిటంటే... నిన్నటి రోజున కాకుండా, ఇవ్వాళ మీరంతా యిక్కడికి వచ్చారు...చాలాసంతోషంగాఉందినాకు. ఎందు కంటారా? నిన్న జరిగినదాన్ని గురించి "ఏమిటి యీ సొదంతా" అని మీ రడగలేరు కనుక...మీరు వచ్చే ముందు కొంతమంది వచ్చారు: కాఫీ త్రాగారు... డబ్బు లిచ్చారు...వెళ్లారు. ఒకాయన ఒకావిడతో వచ్చాడు......కులాసాగా కబుర్లు చెప్పుకున్నారు...వెళ్లారు...ఇంకా చాలా మంది వచ్చారు...వెళ్ళారు...

అసలు యివ్వాళంతా మీతో కబుర్లు చెప్పి, మీకు కాలక్షేపం కలగచేద్దామనుకున్నా... కాని ఆయన వచ్చాడు హోటలుకి...... హోటలు లోపలికి వెళ్ళానా...నాకు ఒక క్షణం కూడా తీరిక ఉండదు. వాళ్లకి వీళ్లకి సప్లయి చెయటంతోనే సరిపోతుంది...అందుకనే యిప్పుడు యిలా బయటికి వచ్చాను... నేనా... నేను సర్వర్‌ని...కాఫీ హోటలు సర్వర్‌ని...ఆశ్చర్యపోతున్నారే...ఏమిటి! తెలుగు యింతగా పెద్ద పెద్ద మాటలలో... చక్కగా భావాన్ని వ్యక్తీకరిస్తూ మాట్లాడుతున్నానా...అది నాకు అలవాటే...పెద్ద బాలశిక్ష చదివాను...మీరు చదివారా... బహుశా చదివుండరు......ఒక్కసారిగా యింగ్లీషు చదివేశారనుకుంటా......తెలుగు వాణ్ణి...తెలుగు వచ్చు...పెద్దబాలశిక్ష చదివాను...తెలుగు మాగజైన్స్ అన్నీ చదివాను...తెలుగు రచయితలందరి రచనలూ చివరినుంచి మొదటిదాకా చదివాను... రేడియో వింటూంటా...రేడియోలో బ్రాడ్‌కాస్ట్ అయ్యే నాటకాలు వింటూంటా... మండోదరి...శూర్పణఖ సమర్తలాంటివి... ఇలాంటివి ఎన్నో ప్రపంచంలో జరుగుతూంటాయ్......ఈ కాఫీ హోటలులో యివ్వాళ జరుగుతున్నది చూస్తున్నారుగా ...ఇలా జరిగేవి బ్రతికుండి చూడలేని వాళ్ళంటే నాకు విచారం అని ఎందుకన్నానో యిప్పుడు మీకు అర్థం అయింది అనుకుంటా...

మీరంతా వచ్చారు...నాకు సంతోషంగా ఉంది. రావటమే కాదు...నేను చెప్పింది కాస్త విన్నారు కూడాను...అందుకని...

[ప్రకాశంకేక వినపడుతుంది... "ఏయ్... సర్వర్ ...ఎక్కడ తగులడ్డావ్!"]

అనం: ఇక పోతాను...మళ్లీ తొందరగానే వస్తాను లెండి...

[స్టేజిమీద లైట్లు వెలుగుతాయ్]

అనం: ఎందుకు సార్!

ప్రకా: ఇదిగో...ఈ పేపరు ఎప్పుడైనా చదువు... ఎవరో ఒకాయన దీనిని నాకు పార్కులో యిచ్చాడు.

అనం: అలాగే సార్...ఖాళీ దొరకగానే ముందు యిదే చదివేస్తాను.

ప్రకా: మూడు సంవత్సరాలనుంచీ యీ పేపరు నాదగ్గరనే ఉంది......ఒక ముసిలాడు యిచ్చాడు పార్కులో...సుమారు డెబ్భై సంవత్సరా లుంటాయి...వణుకుతూ..వంగి నడుస్తాడు...మొత్తం యిలాంటివి డజను పేపర్లు డజనుమందికి యిచ్చాడు...ఎవ్వరూ చదివినలేదు...అనటానికి దమ్ములు లేకపో యాయి. (కొంచెంసేపు ఆగుతాడు)... నువ్వు టిఫిన్ కాఫీ తీసుకున్నావా? సరేలే ...కూర్చో నే తీసుకువస్తా...అలేం పనికి రాదు...నువ్వేం మాట్లాడకు...నాకు యీ ఛాన్స్ చెడగొట్టకు...

అనం: క్షమించాలి సార్... నేను అలా చేయలేను.

ప్రకా: ఎందుకు చెయ్యలేవ్?

అనం: అది రూల్సుకు వ్యతిరేకం...

ప్రకా: (కోపంగా) రూల్స్?... (కొంచెంసేపు ఆగుతాడు...నిలబడి) ఇదిగో చెపుతున్నా.. రూల్స్ లేవు...అసలు లేనేలేవు.,.మర్యాద లేదు... మంచి... లేదు...నిజం...లేదు... కనుక రూల్స్...లేనేలేవు...అన్యాయం... నేరం...ఈ గడబిడలతో......నిండిపోయి సాగుతున్న చరిత్రలో...రూల్స్ ఏమిటి?... ఒక్కటైనా పాటించినట్లుకనపడుతోందా? (కొంచెంసేపు నిశ్శబ్దం) ఎక్కడా లేదు? (తన కోటు విప్పి) అందుకనే ఆ అవకతవక రూల్సు యీ మహత్తర క్షణంలో అడ్డం రాకుండా చేద్దాం...పాత సిద్ధాంతాలు, ఆచారాలు పాటించి నా నిర్ణయాన్ని మార్చు కోను ... ఇదిగో నాకోటు ... నీ డ్రస్ నా కిచ్చెయ్...

[అనంతానికి తనకోటు యిచ్చేస్తాడు. అనంతం తన డ్రస్ అంటే టోపీ "5" ప్రకా శానికి యిస్తాడు. దేవుడుతో...]

అతను టిఫిన్ కాఫీ తీసుకుంటాడు. నేను సర్వ్ చేస్తాను.

దేవు: బాబూ...

అనం: అవును...సార్ ...

ప్రకా: అనేంపనికిరాదు. జరిగి తీరాలిసిందే. భగ వంతుడికి నాథాంక్స్ ... ఇది ఇంకా ఇండియా గా నేఉంది...నాకుస్వాతంత్ర్యం కూడా వచ్చింది. కూర్చో...

[అనంతం కూర్చుంటాడు; ప్రకాశం ఫలహా రాల బోర్డు చూపిస్తాడు].

ఏం తీసుకునిరమ్మంటారుసార్?

(నాగన్న క్లీనరు వస్తాడు)

దేవు: అనంతం నువ్వేం ఆర్డరు యివ్వకు...యూని యన్ రూల్సును వ్యతిరేకించినట్లవుతుంది. పదినిమిషాలలో మనల్ని పట్టుకు పోతారు. మనక్లీనరు ఎవరిచుట్టమో తెలుసుగా...

ప్రకా: ఎవరు?

దేవు: జోగులు...కాఫీహోటలు సర్వర్స అండ్ వర్కర్స యూనియన్ ఆర్గనైజర్...

ప్రకా: నీదగ్గర కత్తులున్నాయా?

దేవు: లేవుసార్.

ప్రకా: పిస్టల్స...

దేవు: లేవు.

ప్రకా: కూరగాయలుకోసే చాకులు.

దేవు: లేవు.

ప్రకా: ఐతే యిద్దరం కట్టెపుల్లలతో యుద్ధం చేస్తాంలే...

(అనంతంతో) ఆర్డర్ యివ్వండిసార్...

అనం: (దేవుడుతో) నాగన్న బహుశా మాడడు లే...

నాగ: చూడనూ?...ఇప్పుడేకబురుపంపించేస్తా...

దేవు: నాగన్నా...ఒరేయ్‌బాబూ...ఆపనిమాత్రం చెయ్యకురా...నిజంగా ఆయనేం సర్వ్ చేయటం లేదురా...సరిగా చూడు...కనపడటంలా...ఆయన డెమొక్రాటిక్...సామ్యవాది...అయినా మనకెందుకురా బాధ... ఆయనేం వృత్తికి సర్వర్ కాదుగా...

నాగ: సర్వర్ టోపీ పెట్టుకున్నాడు ... బల్లల ముందు సర్వ్ చేస్తున్నాడు.

ప్రకా: (గర్వంగా) ఆ ... చేస్తున్నా ... (అనంతంతో) ఆర్డర్ యివ్వండిసార్...

అనం: ఆల్ రైట్...దానిముందామోసిరి ... పెసరట్ ఒకటి బాగా రోస్ట్ చేయించు...

ప్రకా: పెసరట్...రోస్ట్...

అనం: ఆ...ఉల్లిపాయలుకూడా వేసి...

ప్రకా: చాలాబాగుంటుందిసార్.

అనం: (గట్టిగాఅరుస్తూ)మంచినీళ్లు...?(జయతో) క్షమించండి...

జయ: ఫరవాలేదులెండి...

అనం: ఉల్లిపాయ పెసరట్...

ప్రకా: పెసరట్ ... కాఫీకూడా తీసుకు రమ్మంటారాసార్...

అనం: (మంచినీళ్లు కొద్దికొద్దిగా త్రాగుతూ) ఇలాంటిపనిలో యిటువంటిచోట్ల రకరకాలయిన గమ్మత్తుమనుష్యులు కలుస్తాంటారు.

ప్రకా: అవునుసార్.

అనం: (సీనయ్యతో) ధాన్యం అంతా ఎగుమతి చేశారా?

సీన: (దేవుడుతో) మీహోటల్ సర్వర్ కాదూ...

దేవు: అవును...భగవంతుడా ... ఈ గొడవనుంచి నేను చేతులు కడుక్కొని కూర్చుంటాను.

అనం: (విశ్వంతో) మన చదు వెలా వుంది?

విశ్వం: చదువూ లేదు గిదువూ లేదు...నీ గొడవ ఏదో ఏడుద్దూ.

నాగ: జోగులు గారికి కబురు పంపించేశాను... వచ్చేస్తున్నారు...వెంట ఆరుగురు వర్కర్సును కూడా తీసుకువస్తున్నారు.

దేవు: జోగులు...గీగులూ...వర్కర్సూ...గిర్కర్సూ. అందర్నీ తగలబెడను.

[కుర్చీలో కూర్చుని బల్లమీద చెప్పుడిగా దరువు వేస్తూంటాడు. ప్రకాశం అనంతానికి కావలసిన మంచినీళ్ళు అవీ తెచ్చియిస్తుంటాడు. దేవుడు దరువు వేయటం మానివేయగానే, హాగత్తగా ప్రకాశం చప్పట్లు కొడతాడు.]

ప్రకా: వంటగదిలో హిందూస్థానీ భాయీలు అల్లరి చేస్తున్నార్ సార్...

అనం: మన హోదిరుల్ని వెంటనే అల్లరి కట్టిపెట్టమని చెప్పు...నిన్నుకూడా వచ్చి అల్లరి చేయమంటే చేయనను ... సాధ్యమైతే యిద్దరినోళ్ళు మూసి వేయ్...

ప్రకా: అలాగే సార్...పెసరట్ బాగుందా సార్.

అనం: ఎప్పుడూ ప్రశ్నలు అడక్కు...నీకు సర్వర్ గా ఉండాలని ఉందా, లేకపోతే ఒక మ్యానపెన్నుగా తయారవాలని ఉందా...

ప్రకా: సర్వర్‌గానే ఉండాలనుంది సార్... ఇంకో ఉద్దేశ్యం ఏం లేదు...క్షమించండి..

అనం: ఎప్పుడూ క్షమార్పణ అడగొద్దు...ఎవ్వరినీ కూడా అడక్కు...ఎక్కువ అవకాశం ఉన్నవాళ్లకు, తక్కువవాళ్ళచేత క్షమించబడటం కంటె, అవమానం ఇంకొకటిలేదు... వినయంగా తయారవుతూనుగదా అని గొప్పవాడివి కూడా అవాలనుందా? లేకపోతే యీ మార్పు ఏమన్నా విసుగెత్తిందా?

ప్రకా: విసుగా...ఏం లేదుసార్.

అనం: ఐతే సరే...నాకు కాఫీ పట్టుకురా.

ప్రకా: అలాగే సార్...

[ప్రకాశం లోపలికి వెడతాడు...అనంతం తనకు యిచ్చిన పేపరు తీసి చదువుతూంటాడు.]

అనం: (జయతో) దీనిలో సంగతులేమిటో, మీరేమన్నా ఊహించగలరా?

జయ: ఏదో కొంచంగా...

ప్రకా: నేను కొంచెం గాకూడా ఊహించలేను... అందుకనే, పేజీలు తిరగవేస్తూ చదువుతాను. (సీనయ్యతో) విన్నారా? (విశ్వంతో) మీరు కూడా...

విశ్వం: వీడు సర్వర్..నాతో మాట్లాడటానికి ఎన్ని గుండెలుండాలి...

సీన: (కోపంతో గట్టిగా) ఏయ్ శేవుడూ...

[లాలూ హిందూస్థానీ కుర్రవాళ్ళల్లో ఒకడు వస్తాడు; చేతిలో సగం కోసిన వంకాయ, చాకు ఉంటాయ్.]

దేవు: (నెమ్మదిగా) సీనయ్యగారూ...

సీన: నీ సర్వర్‌ని యీ నాటకం, ఎగతాళీ వెంటనే మానెయ్యమను. (లేచి నిలబడి ఉపన్యాస ధోరణిలో) ఈవిధంగా సాంఘిక మర్యాదను అగౌరవపరచటం...

లాలూ: (సీనయ్యదగ్గరకు వెళ్ళి) ఇక తగ్గండి...

సీన: క్షమించాలి...

లాలూ: ఇక కూర్చో...ఉత్తర హిందూస్థానం గురించి నీకేం తెలుసు?

సీన: అంత బాగా తెలియదు.

లాలూ: (నిటారుగా నిలబడి) ఆ దేశం స్థితిగతులు... ఎగుమతులు, దిగుమతులు, పరిసు(ఛ)భత, విద్యాలయాలు...ఉచిత వైద్యశాలలు ...వ్యవసాయం, గనులు, పరిశ్రమలు, ఏమన్నా తెలుసా...

సీన: ఉహు...ఏం తెలియదు...

లాలూ: మహనీయ రాజకీయ నాయకుని ఎప్పుడైనా చూశావా?

సీన: లేదు...

లాలూ: ఆ ప్రజల యిబ్బందులు ఏమిటో తెలుసా?

సీన: ఇతరులలాంటివే వారి బాధలు కూడా అని అనుకుంటున్నా...

లాలూ: తగ్గు... తెలియదులే...నీకేం తెలియదు...

దేవు: లాలూ...ఏమిటి యీ వాగుడంతా?

లాలూ: దేవుడుగారూ...నా స్థితి తక్కువదే అనుకోండి...దానినిగురించి నేనేం బాధపడటం లేదు. నా జీతం నాకు సరిపోతుంది...తృప్తిగానే ఉంది. పనిచేసే గంటలు కూడా సరిగానే ఉన్నాయ్...పైగా కావలసినంత విశ్రాంతి...అదీ కాకుండా మా దేశస్థుడు కపూర్ కూడా నాతోనే ఉన్నాడు. వాడితో కలిసి పనిచెయ్యటం, మీహోటలు పేరుప్రతిష్టలు కాపాడటం కూడా నాకు ఎంతో సంతోషంగానే ఉంటుంది. కాని యీ దేశంలో మావాళ్లని గురించి, నిజం దాచేసి, మార్చేసి, అబద్ధాలుగా చెప్పటం.. యిదంతా...దీన్ని ఎదుర్కొనకుండా ఊరుకోను...

[కపూర్ వస్తాడు]

దేవు: సరేలే యీ చాకు దేనికి? దాన్ని అవతల పడేయ్...

లాలూ: ఇదా...ఇది కూరలు తరగడానికి...బజ్జీలలోకి వంకాయలు కోస్తున్నా ... (సీనయ్యతో) తులసీ రామాయణం చదివారా?

కపూర్: (హిందీలో) లాలూ...క్యాకర్ రహే హో...అందర్ ఆవో నా...

లాలూ: (హిందీలో) యే ఆద్‌మీ హమ్ మే గాలియా దేరహా హై..(సీనయ్యతో) క్షమించాలి... ఒక్క నిమిషం...(హిందీలో కపూర్‌తో) వో బహుత్ భోలా హై ... లేకిన్ బడా రయాస్...

కపూ: (హిందీలో) ఉస్ కేపాస్ వో లడ్ కా కోన్?

లాలూ: ఏక్ బుడ్ఢా ... కహీం పకడ్ కే లాయా హోగా...

కపూ: దేఖ్ నే కేలియే ఖూబ్ సూరత్ హై... హైనా...

లాలూ: ఠైక్ రహా హై...ఖడే రహేతో మాలూమ్ హోగా...

కపూ: ఠీక్ బోలా...సచ్ హై...బహుత్ అచ్ఛా మాలూమ్ హోతా హై...

లాలూ: నహీ...మోటా నౌజవాన్ హోగా...

కపూ: కహా నహీ సక్‌తే—ఖడే రహేతో బతా సక్‌తే...

లాలూ: (విశ్వంతో) క్షమించాలి...కొంచెం ఇలా బల్ల ముందుకు వస్తారూ...(విశ్వం వస్తాడు) ఆ...చాలు...(కళ్లల్లో ఆనందాన్ని వ్యక్త పరుస్తూ హిందీలో) తుమ్ సచ్ కహో...ఏక్ బార్ మర్ నేకే పహలే, ఉస్‌కే సాథ్ లడ్ నేకలియే మన్ హోతా హై...

కపూ: ముఝే భీ...

లాలూ: (నాటకం ఫక్కీలో సీనయ్యతో) ఈ తెలుగు దేశంలో హిందూస్థానీ వాడి పరిస్థితులు...(కపూర్‌తో కోపంగా హిందీలో, ఇసే మై సంభాల్‌తా హూం...(సీనయ్యతో) మా దేశంలో మేం బడిలోకి వెడతాం...చదువుకుంటాం...హిందీ సినిమాలు చూస్తాం...

విశ్వం: ఇక కూర్చోవచ్చా...

కపూ: బ్యాంకుల్లో ఉద్యోగాలు చేస్తాం...

లాలూ: కపూర్...ఒక మాట (విశ్వంతో) ఇక కూర్చోండి...తప్పు మీదేం కాదు...అసలు మా పోట్లాట మిమ్మల్ని గురించి కూడా కాదు. (సీనయ్యతో) మా దేశంలో క్లబ్బులున్నాయ్...ఎన్నో సంఘాలున్నాయ్...జాతీయ వేశంతో మునిగి తేలేవి కూడా ఉన్నాయ్...

కపూ: మావాళ్లు గొప్ప గొప్ప పదవులకు కూడా దరఖాసు చేశారు.

లాలూ: కపూర్...కొంచెం ఆగు...

కపూ: మావాళ్ళు సినిమాలలో కూడా యాక్టు చేస్తున్నారు.

లాలూ: (హిందీలో) కపూర్ ... అసలీ బాత్ సే అలగ్ మత్ జావ్...(తెలుగులో) మావాళ్లు తెలుగువారితో స్నేహాన్ని ఎక్కువగా గౌరవిస్తారు...

కపూ: మా దేశం గవాయ్ సంగీతానికి ప్రసిద్ధి.

లాలూ: సంగీతం మాట వదిలేద్దూ...

కపూ: పని కష్టమైందే ... జీతాలు తక్కువ... గవాయ్ సంగీతం...

అనం: కపూర్...నువ్వు కూర్చో...ఇద్దరూ లేత సొరకాయలు తెగ కోసేస్తున్నారే...

కపూ: (కూర్చుంటూ) లాలూకి అంతగా ప్రాక్టీసు లేదు...

లాలూ: ఒక మాట...

అనం: ఉష్...ఇక మాట్లాడకండి...

లాలూ: (అనంతంతో) ఉత్తర హిందూస్థానపు పరిస్థితులు ఎట్లా ఉన్నాయో...నీ వేమైనా స్టడీ చేశావా?

అనం: సరేలే లాలూ...ఇక కూర్చుందూ (లాలూ కూర్చుంటాడు)

లాలూ: (సీనయ్యతో) ఇక ముందు ఎప్పుడన్నా, మీరు ఏ విషయాన్ని గురించైనా మాట్లాడదలచుకుంటే పూర్తిగా తెలుసుకుని మరీ మాట్లాడండి...ఇక చెప్పు...అనంతం...

అనం: అంతా వినండి (చదువుతూ) మానవుడు, పునర్జన్మ ఎత్తితే నేగాని, దేవుడి రాజ్యాన్ని చూడలేడు.

లాలూ: (సీనయ్యతో) మా దేశంలో మావాళ్ళు...

అనం: కొంచెం సేపు ఊరుకో లాలూ... (చదువుతూ) ఈ భూమిమీద న్యాయమైన మనిషి ఒక్కడు కూడా లేడు...

(లాలూ లేచి సీనయ్య కూర్చున్న టేబిలు దగ్గరకు వెడతాడు)

లాలూ: (విశ్వంతో)...తమకు ఏదైనా పని చేసి పెట్టనా...(వంగి అభివాదం చేస్తాడు)

సీన: క్షమించాలి...

లాలూ: (తలమాత్రమే కొంచెంగా పైకి ఎత్తుతాడు. మిగతా శరీరం వంగి ఉంటుంది) ఈయనతో మాట్లాడుతున్నా...మీతో కాదు (విశ్వంతో) ఏదన్నా పనిఉందా! చెప్పండి...

విశ్వం: క్షమించాలి...నాకు చాలా అలసటగా ఉంది... విశ్రాంతిగా ఉందా మనుకుంటున్నా...

[లాలూ తొందరగా, నిటారుగా నిలబడతాడు]

లాలా: (సీనయ్యకు వంగి అభివాదం చేస్తూ) ఏమన్నా మీకు సాయం చేయవచ్చునా?

[సీనయ్య కోపంతో ఒక్కసారిగా లేచి నిలబడతాడు.]

కపూర్: (జయతో)...మా దేశంలోనే...

[ప్రకాశం నాలుగువైపులా కలయచూస్తాడు. అనంతం యిచ్చిన టోపీ తీసివేస్తాడు.)

ప్రకా: నా కోటు ఇలా తే...

అనం: తీసుకోండి సార్.

ప్రకా: (కోటు తొడుక్కుంటాడు. అనంతం టోపీ పెట్టుకుంటాడు) ఒక్క విషయం మాత్రం నిజం...ప్రపంచంలోని పిచ్చితనంగాని, లేక అర్థంగాని, దానికి చెందిన అందం ఐనా, అపహాస్యం ఐనా, దానిలో నివసించే, నివసించబోయే ప్రజలందరికీ వర్తిస్తుంది.

నాగ: (లోపలికివస్తూ) ...జోగులుగారు వస్తున్నారు.

జోగు: ఇక ఆగండి...రూల్సుకు వ్యతిరేకం...యూనియన్...

ప్రకా: కంగారు పడకోయ్...ఇదేం యూనియన్ కాదులే...కొంచెం కాఫీతాగు... (లోపలికి సర్వర్ వైపుచూసి) ఈయనకు ఒక కాఫీ చేసుకురా...

గణే: అలాగే...సార్...

ప్రకా: (చుట్టూచూసి) ఈ ప్రపంచం...మనకు తెలిసిన యీ ప్రపంచం...అంతా గందరగోళంగా ఉంది. కనుకనే మనకు నిజంగా ప్రత్యక్షంగా కనపడేదంతా కూడా అయోమయంగా తయారయింది. అసలు యీ ప్రపంచమే నివసించటానికి తగిన ప్రదేశం కాదు. దీనిలో ఖూనీలు, వేదాంత జాడ్యాలు, దగా, మోసం, అన్యాయం, ఎందుకూ పనికిరాని సందులు గొందులు, కృశించిపోతున్న పట్టణాలు, రోగిష్టి ప్రభుత్వాలు...మానవుడి స్వాతంత్ర్య ఆత్మతో ప్రతిరోజూ యివి ఘర్షణ పడుతూనే వుంటాయ్...కాని వీటన్నిటినుంచి మానవుడికి రక్షణ తనలోనే దొరుకుతుంది. ఈ ప్రపంచం ఎప్పుడూ అటువంటి స్వాతంత్ర్యేచ్ఛకు సరితూగలేదు. కాని యీ మానవుడి శరీరంకూడా నివసించటానికి తగినదిగా కాకుండా పోయింది. దీనికికూడా, దాని పునాది, స్థితి, భద్రత, దేవునితోగల సంబంధం, దానిఅందం శక్తి, యవ్వనం, రక్తం, ఎముకలు, చివర, నివసించటానికి తగినట్లుగా సహాయపడే వస్తువులన్నీ కూడా మాయమైపోయాయ్. కనుకనే యీ ప్రపంచంలాగా, మానవుడి శరీరంకూడా వాసయోగ్యం కాకుండా పోయింది. జీవితం మంటలలో మాడిపోతూంది ...తుఫానులో చిక్కుకుంది. సముద్రంలో కలిసిపోయింది. కీటకాలు దాన్ని కుట్టివేస్తున్నాయ్...సూక్ష్మక్రిములు తినేస్తున్నాయ్...బాంబులు బ్రద్దలు చేస్తున్నాయ్. యంత్రాలు పిచ్చిదానినిగా, చేసి బరువైన చక్రాలతో నలిపివేస్తున్నాయ్; ప్రతిరోజూ జరిగే విషయాలన్నీ దానిని కంగారు పెట్టేస్తున్నాయ్...(చుట్టూ చూస్తూ కొంచెం సేపు ఊరుకుంటాడు)

తరువాత...అది మీకు ఎంత అందంగా కనిపించినా, మీరు ఒకరినొకరు ఖూనీచేసుకోవాలని లేకపోయినట్లయితే, ఎవరిచోటులో వాళ్లు కూర్చోండి...నాకుమాత్రం ఒక కాఫీ..

[అందరూ కూర్చోవటం చూస్తాడు. తనూ కూర్చుని పేపరు తీస్తాడు]

ప్రపంచానికి యిదే ఆఖరిరోజనుకుంటూ... కనుక సాధ్యమైనంతవరకు అందరం ఆనందంగా ఉందాం...

[వీధిలోనుంచి గోల వినపడుతుంది. పేపరు క్రింద పెట్టి ప్రకాశం వీధి గుమ్మంవైపు చూస్తాడు]

జయ: ఏమిటి యింతగోలగా ఉంది?

విశ్వం: నాకూ తెలుసుకోవాలనే ఉంది...

దేవు: ఆ...సైనాలో ఏదో జరుగుతుంటుంది ... అంతే...

[కొరుక్రైవరు కంగారుగా లోపలికివస్తాడు]

బయ: ఏం జరిగింది...

ప్రకా: ఎవర్ని ఖూనీ చేశారు...

డ్రైవ: ఖూనీ లేదు...ఏం లేదు...ఇప్పుడే కారులో ఒకావిణ్ణి హాస్పిటల్‌లో చేర్చి వచ్చాను... ప్రసవం కాబోతూంది. బజారులో కనిపించింది...ఇంటికి తీసుకువెళ్ళటానికికూడా టైం లేకపోయింది.

[అంతా కంగారుగా మాట్లాడుకుంటూంటారు.."ఎంతపనిజరిగింది...ఆవిడఎవరో... బజారుకు ఎందుకని వచ్చిందో". స్టేజి మీద లైట్లు ఆరిపోతాయ్ ... అనంతం ముందుకు వస్తాడు ... స్పాట్ లైట్‌లో కనపడూతూంటాడు]

అనం: నాకు తెలిసినంతవరకు ఒక జీవిని సృష్టించటానికి పట్టేసమయం తొమ్మిది వేల సంవత్సరాలకు సమీపంలో ఉందికాని తొమ్మిది నెలలకుమాత్రం కాదు. దీనికిపట్టే టైము, పడవలసిన శ్రమను, సృష్టించబడ్డ జీవితో పోల్చి చూస్తే, యీ వ్యవహారం అంతగా ప్రయోజనకరంగా, లాభసాటిగా ఉన్నట్లు కనబడదు.

ఈ సమస్యమీద మాట్లాడటం కొద్దినిమిషాల పాటుపట్టినా, ఒక క్రొత్తజీవి యీప్రపంచంలోకి వచ్చాడు కనుక తొమ్మిది వేల సంవత్సరాలు పరిపూర్ణతను చెందాయ్ ... పుట్టిన పాపాయ్ కులాసాగానే ఉన్నాడు. తల్లీ బాగానే ఉంది. తొమ్మిది పౌనులకంటె కొంచెంగా ఎక్కువగానే ఉంటాడు తూకంలో ... మా ప్రొప్రయిటర్ దేవుడు గారి కొడుకు డాక్టరుగా పనిచేస్తున్నది ఆ హాస్పిటల్‌లోనే...ఆయన యీ కేసులో చాలా నేర్పుగా ట్రీట్ చేశారు. అందుకని కృతజ్ఞతా చిహ్నంగా ఆ పాపాయి పేరు కూడా 'దేవ' అని పెట్టారు.

హాస్పిటల్‌లోనా...మా ప్రొప్రయిటర్ గారి కొడుకు డాక్టరు కనుక సరిపోయింది... లేకపోతే ఎంత సీరియస్ కేసయినా డబ్బు పడందే దానిమొగం చూడనేచూడరు.

తొమ్మిది వేల సంవత్సరాలు ... ఒక నూతన ప్రాణం...పుట్టినప్పుడు ఎవరో తెలియనే తెలియదు...ముందు ఎలా తయారవుతాడో ఎవ్వరికీ తెలియదు. సృష్టించబడ్డ వస్తువులన్నింటిలోకి, వీడు మంచి తెలివితేటలు గలవాడు. కాని వయసువచ్చినకొద్దీ అతనిలో జరిగేమార్పులు, మందంగా, ఎక్కువ భాగం విసుగ్గా ఉంటాయ్ ... ఇప్పుడే పుట్టిన పాపాయి భవిష్యత్తువిషయమై ఎన్నో ఆలోచిస్తాం...కాని నిజానికి వాడు ఒక గొప్పవాడుగా తయారవడు. వాడితండ్రి... సుమారు ఇరవైఏడేళ్ల వయస్సులో ఎన్నో విధాల మంచివాడు ... ఎన్నో మంచిగుణాలున్నాయ్...మొత్తానికి సాధుస్వభావం, పెద్ద గొంతుక, తెలివితేటలు, కోపం, విచక్షణా జ్ఞానం, శౌర్యం మొదలైన లక్షణాలు కలవాడే ... ఈ క్రొత్తగా పుట్టిన పాపాయ్ జీవప్రకాశం శ్వాసిసున్నాడు... మనతోనే ఉంటాడు ... ఇక్కడ ఎందుకంటారా...పోనీ ఉండనిద్దాం ... కులాసాగా కాలక్షేపం అవుతుంది—పెద్ద మనుష్యుల పొరుగూ ఉంటుంది వాడికి...

కళను, సంగీతాన్ని వంటను, పద్ధతులను, ఇంకా ఎన్నో విషయాలను, విమర్శించేవాళ్లున్నారే, వాళ్ళుకూడా మగవాళ్లు, ఆడవాళ్లే...కాని ఏళ్ళ విషయమైనా ఎందుకు జరుగుతోంది ... ఎలా జరుగుతోంది ... ఇలా జరగటంలో అర్థం ఏమిటి అని తెలుసుకోవాలనుకునే వాళ్లే...నామటుకు నేను అన్నివిషయాలలోనూ విమర్శకుణ్ణే...చిన్న పురుగునుంచి... పెద్ద కావ్యంవరకు విమర్శిస్తా ... అలాగే మీలో ప్రతిఒక్కరూకూడా విమర్శకులే. ఆ...ఇప్పుడు యిదంతా ఏమిటా..ఎందుకా? అని ఆశ్చర్యపోతున్నారు కదూ...ఈ విషయంలో మిమ్మల్నేం నిందించను. ఈ ప్రపంచంలో, అర్థం ఏమాత్రం కొంచెంగా కూడా కనపడకపోయేసరికి...కల్పిత వస్తువులు, నీటిమావులు మొదలైన భ్రమింపచేసే

విషయాలలో అర్థంకోసం వెదుకుతూం టారు...మంచిదయినా, చెడుదయినా... ఇదికూడా ఆ రకానికి చెందినదే...ఇక్కడ జరుగుతున్నదంతా మీరు సీరియస్‌గా తీసుకుంటున్నారా? ఇదంతా మీకు అర్థం అవుతోందని నేను అనుకుంటాను కనుకనా... మర్యాదగా జవాబివ్వాలంటే... మిగతావి ఏవీకూడా మీకు అర్థం కానట్లే, యిది కూడా అర్థం కాదంటాను. ఎక్కువా లేదు. తక్కువా లేదు. మీరుకాని, నేనుకాని ఒక గంటక్రితం మనం కలుసుకున్నట్లుగా, యిప్పుడు లేము. ఒక గంట తర్వాత యిప్పటికంటె కొంచెంగా మారిఉంటాం. ఇక్కడ నేను ఒక సర్వర్‌గా కనిపిస్తున్నాను...మీరంతా మీ పేరు, మీ గడచిన చరిత్ర, ఆస్థిపాస్థులు మొదలైనవాటిని రూపొందిస్తున్నటుగా కనపడుతున్నారు. దేవప్రకాశం వచ్చినట్లుగానే, మనమంతా కూడా ఒకప్పుడు యీ ప్రపంచంలోకి వచ్చాం. మనలో ఎవరికివారు, వ్యక్తిగతంగా, మాయాజీవితంలో, అది యిచ్చే ఆఘాతాలు తిన్నవాళ్లమే...బ్రతికున్నంత కాలం యీ మాయలో మనం అంతర్లీనమై పోవలసిందే...చచ్చిపోతే యిక చెప్పవలసిందే లేదు. ఈలోగా దీన్ని మనం ఎంత వరకు సుఖప్రదం చేసుకోగలమో, అంత వరకు చేసుకుందాం. ఈ హోటలుకు బయట ప్రపంచంవంటిది కనిపిస్తుంది. దానిలోపల మన నిజస్వరూపం, మనలాంటివాళ్లం అనుపడుతూంటాం...ఇదంతా భ్రమ...దీనిలో లోతుపాతుల్ని మనకు యింకా సమయం ఉండగానూ, మీలో ఏవీ చావులు రాక మునుపే తెలుసుకుందాం...

[కారు డ్రైవరు, గణేశం తప్ప, ఆ స్థలం అంతా ఖాళీగా ఉంటుంది. మెల్లిదిగా, మాట్లాడుకుంటూంటారు...]

డ్రైవ: నీకు తెలుసుకోవాలనుందా...ఎందుకు?

గణే: నీ టాక్సీలో ఆమె ఎందుకు ఎక్కింది?

డ్రైవ: నా టాక్సీలో హాస్పిటల్‌కు తీసుకువెళ్లాను ...అందుకని?

గణే: ఎందుకు తీసుకువెళ్లావ్?

డ్రైవ: ఆమె ప్రసవించబోతోంది...అందుకని... ప్రసవించటం ఎందుకో?

గణే: ఎందుకు?

డ్రైవ: ప్రపంచంలో పిల్లలు పుట్టాలిగా...

గణే: ఎందుకు?

డ్రైవ: టాక్సీలు, నడవటంకోసం...

గణే: ఎందుకు?

డ్రైవ: టాక్సీవాళ్లు బ్రదకటానికి...

[కొంచెంసేపు నిశ్శబ్దం]

గణే: ఆ...

డ్రైవ: షేక్ హాండ్ ఇయ్...

గణే: ఎందుకు?

డ్రైవ: ఎందుకా...నువ్వు పెద్దమనిషివి కనుక...

[షేక్ హాండ్ చేస్తారు]

ఎందుకనో తెలుసుకుంటావా?

గణే: ఎందుకు?

డ్రైవ: టాక్సీవాళ్లు బ్రదకాలని నీకు ఉంది కనుక.. అందుకని...ఎందుకంటావా?

గణే: ఎందుకు?

డ్రైవ: కాఫీ హోటలువాళ్లు బ్రతకాలని నాకు ఉంది కనుక...

గణే: అదా...ఐతే షేక్‌హాండ్ పారెయ్.

[షేక్ హాండ్ చేస్తారు]

అదీగాక నువ్వు పెద్దమనిషివి కూడా... ఎందుకనా?

డ్రైవ: ఎందుకు?

గణే: కొందరివాదిరిగా నువ్వు ప్రశ్నలు వేయవు కనుక...

డ్రైవ: ఏం ప్రశ్నలు?

గణే: అస్తమానం యిలాంటి చోటుకువస్తూ ప్రజలు అడిగే ప్రశ్నల్లాంటివి. ఇది ఎందుకు... అదెందుకు...ఇదిలా ఉంటేం...అది అలా ఉండేం...

డ్రైవ: మళ్లీ ఇంకో షేక్ హాండ్ పారెయ్...ఎందుకనా ?

గణే: ఎందుకు ?

డ్రైవ: నువ్వు తెలివైనవాడివి కనుక. అదంటే ఏమిటో తెలుసుకోవాలనుందా...

గణే: ఆ...దానిఅర్థం ఏమిటి ?

[కారుడ్రైవరు చుట్టూచూస్తాడు. ఏదో పెద్దరహస్యం చెప్పబోతున్న వాడి మాదిరిగా ...ప్రేక్షకులను చూస్తాడు... కూర్చున్న బల్లమీద నుంచి లేస్తాడు.]

డ్రైవ: ఒకక్షణం ఆగు.

గణే: ఏం ?

డ్రైవ: ఎవరో వింటున్నారు? పొంచివింటున్నారు.

గణే: ఎవరు?

డ్రైవ: (ప్రేక్షకులను చూపించి) వాళ్ళు...

గణే: ఆ...అలాగా...

డ్రైవ: పొరపాటుగా ఏమన్నా అన్నానా... తర్వాత విచారపడాల్సివసుంది.

గణే: తెలివితేటలంటే ఏమిటి?

డ్రైవ: ఏంలేదు...అసలు ఆ విషయంమాటే మరిచిపో...నాకు యీ డ్రైవరు లైసెన్సు పోవాలనుందా ఏం? నాకొక డ్రింక్ ఇయ్యి.

[ఒక యువకుడు లోపలికి వస్తాడు]

యువ: నాకుకూడా ఒకటి...

గణే: డ్రాఫ్టా...

యువ: ఏదైనా ఫరవాలేదు...

[గణేశం యిద్దరికీ చెరి ఒక గ్లాసులో యిచ్చి, తనకుకూడా ఒకటి ముందుపెట్టుకుంటాడు]

మీ ఆరోగ్యం కోసం...

డ్రైవ:
గణే: నీ ఆరోగ్యానికికూడా...(తాగుతారు)

యువ: రేపటి పేపరు యింకా చూడలా!...

గణే: లేదే...

డ్రైవ: ఇక పనిలోకి పోతాను.

యువ: ఇప్పటికే చాలా ఆలశ్యం అయిపోయింది...

డ్రైవ: అంటే...నీ ఉద్దేశ్యం...

యువ: రేపటి పేపరు చూశావా ?

డ్రైవ: లేదు...ఏం ?

యువ: రేపటి పేపరుచూసుంటే నీకే తెలిసేది.

డ్రైవ: ఏంతెలిసేది?

యువ: పనికి వెళ్లటానికి చాలా ఆలస్యం అయిపోయిందని...

డ్రైవ: ఎందుకని ?

యువ: ఎందుకనా...రేపటి పేపరులోని వార్తలనుబట్టి...

డ్రైవ: ఏం వార్తలు ?

యువ: వార్తలా...ఒకవెయ్యి తొమ్మిదివందల ఏభై అయిదు సంవత్సరాలనుంచీకూడా, ఈ ప్రపంచంలో చనిపోయినవాళ్లే ఉంటున్నారు... బ్రతికున్న వాళ్ళు కాదు.

డ్రైవ: అంటే మనం చనిపోయినవాళ్లమేనా?

యువ: రేపటి పేపరును ఆధారంగా తీసుకుంటే

డ్రైవ: నీ ఉద్దేశ్యంలో నువ్వు, నేను, గణేశం అంతా చనిపోయామన్నమాట.

యువ: రేపటి పేపరులో వార్త అదే అని నా నమ్మకం.

డ్రైవ: ఆ పిల్లవాణ్ణి కన్నతల్లీ... ఆపిల్లవాడు... ప్రపంచంలో అంతా...ఒకవెయ్యి తొమ్మిది వందల ఏభై అయిదు సంవత్సరాల ముందు నుంచీ, యీ ప్రపంచంలో ఉన్న వాళ్ళు, అందరూ చనిపోయారన్నమాటేనా...

యువ: రేపటి పేపరు అలాగే చెపుతుంది.

డ్రైవ: ప్రొద్దున్న పేపరా..సాయంకాలం పేపరా..

యువ: అర్ధరాత్రి వేళ ప్రెస్ నుంచి బయటికివచ్చిన పేపరు.

డ్రైవ: (గణేశంతో) గణేశం...బజారులోకిపోయి యిప్పుడే వెలువడిన పేపరు ఏదన్నా ఒకటి తీసుకురా...

యువ: ఇప్పుడే బయటికి వచ్చిన పేపర్లంటూ ఏం లేవు ?

డ్రైవ: (గణేశంతో) బజారుకు పోయి ఎవరినన్నా అడుగు?

యువ: బజారు లేదు...బజార్లో జనం లేరు.

డ్రైవ: అంటే నీ ఉద్దేశ్యం?

యువ: ఇవ్వాళ అర్ధరాత్రి యీ భ్రమంతా ఏర్ప డింది.

డ్రైవ: ఏం భ్రమ?

యువ: నా స్తబికలియొక్క భ్రమ. సర్వవసావంగా, అర్ధరాత్రినుంచి, చనిపోయినవాళ్లు నిజంగా చనిపోయారు... నిజం కాని వేవో, నిజానికి నిజం కాకుండాపోయాయ్... ఎక్కడా ఏం లేదు?

డ్రైవ: సరిగానే చెపుతున్నావా?

యువ: రేపటి పేపరులో అలాగే ఉంది... అదిసరిగానే ఉన్నట్లుంది.

డ్రైవ: ఐతే, గణేశం, నాకోక డ్రింక్... ఇయ్యి...

గణే: అలాంటప్పుడు నేనూ ఒకటి తాగితే మంచి దనుకుంటా... మీకో...

యువ: నాకు కూడా...

డ్రైవ: (చుట్టూ కలయమూసి, ఏం తెలుసు? ఇదంతా ఆశ్చర్యంగా ఉంది. ఇక్కడంతా ఏదో మాయగా ఉన్నట్లు ఉందని అనుకుంటునే ఉన్నా. ఇప్పటికి తెలిసింది. చాలా ఆనందంగా ఉంది. నేను యిక పనిలోకి వెళ్లి నక్కరలేదుగా... అంతేనా? మనపని అయిపోయిందన్నమాటే... ఏమంటావ్? (యువకుడు అవునన్నట్లుగా తల ఆడిస్తాడు) ఐతే హాయ్... గణేశం ఇంకో డ్రింక్...

గణే: (మూడు గ్లాసుల్లో డ్రింకులు తీసుకువస్తూ) ఐతే... యిది గొప్పవిషయమన్నమాటే...

డ్రైవ: (యువకుడితో) ఆ జనం మాటేమిటి? (ప్రేక్షకులను చూపిస్తాడు)

యువ: జనంమాట... అంటే...

డ్రైవ: బ్రతికున్నా రంటావా? చచ్చిపోయారంటావా?

యువ: అధికారరీత్యా... చచ్చిపోయారు... మనం ఉన్నంతసేపు వాళ్ళూ ఉంటారు.

డ్రైవ: అదెంతసేపు పడుతుంది?

యువ: ఎంతోసేపు పట్టదు.

డ్రైవ: ఐతే యింకో డ్రింక్... ఎంతోసేపు యిక బ్రతకంగా. షేప్... ప్రపంచం అంటూ యిక లేదు... నీకు పూర్తి నమ్మకం ఉందా? మరి నా జేబులో యీ డబ్బు మాటేమిటి? నలభై రూపాయల ఆరణాల ఎనిమిది పైసలు...

యువ: దాని విలువ ఏం లేదు... ఎవరికన్నా దానం చేసెయ్.

డ్రైవ: ఇంకెంత టైం ఉంటుంది? గంట...? పది నిమిషాలు పదిహేను... ఐదు... అరనిముషం ... ఎంత?

యువ: అదేం కాదు... టైం అంటూ ఉంటే... శాశ్వతం...

డ్రైవ: ఆగు ఆగు... ఇందులో ఏదో ఉంది. శాశ్వతమూ అంటే మనం చనిపోవటానికి ముందు ఇంకెంత టైం ఉంటుందంటావ్?

యువ: ఈ లోకంలో ఉన్నంతాను ... ఇప్పటికు మనం చచ్చిపోయే ఉన్నాం.

డ్రైవ: గణేశం... ఏమయితే అయింది కాని... వీధిలోకి వెళ్ళి ఒకసారి చూసిరా...

గణే: (వెడుతూ) అలాగే...

డ్రైవ: డ్రింక్స్ అంటే బాగా యిష్టంలా ఉందే...

యువ: ఓ... బాగాను...

డ్రైవ: కడుపు నిండిందా... ఇప్పట్లో...

యువ: ఆ... నిండింది... కాని ఏం ఫరవాలేదు...

డ్రైవ: ఫరవాలేదూ... అంతా చచ్చారు... ప్రపంచమే లేదు... బాగానే ఉంది (గట్టిగా) గణేశం... ఎలా వుంది?

గణే: (తిరిగివస్తూ) ఆయన చెప్పింది నిజమే?

డ్రైవ: నిజమేనా... అంటే...

గణే: అక్కడ వీధీలేదు... ఏంలేదు...

డ్రైవ: అక్కడ ఏవీధిఉండేదో నీకు తెలుసుగా...

గణే: మెయిన్‌బజారు ఉండేది.

డ్రైవ: ఇప్పు డేముంది?

గణే: నిజంగా ఏమీలేదు...

డ్రైవ: బయట నా టాక్సీ లేదూ...

గణే: వీధీలేదు... టాక్సీ లేదు... ఏమీలేదు...

డ్రైవ: ఐతే ఇంకో డ్రింక్ తే ... (యువకుడితో)

ఇంకేం భ్రమలు...ఆగొడవలు ఏమీ లేవుగా..

యువ: ఏమీ లేవు...

డ్రైవ: ఇంకా మరేం జరగదుగా...?

యువ: జరిగినపనులే మళ్లీ జరుగుతూంటాయ్. అవే ఎప్పుడూ ఆఖరు అంటూ లేకుండా జరుగుతాయ్ ఇక అది దాటితే ఏమీ లేదు...

గణే: ఎందుకని?

డ్రైవ: ఎందుకనా? ఎందుకేమిటి గణేశం?

గణే: అంతా ఆఖ రెందుకయిపోయింది? మెయిన్ బజారేమయింది?

డ్రైవ: గణేశానికి తెలియచెప్పండి...

యువ: ఈభ్రమ అర్ధరాత్రి ఏర్పడింది...ప్రమాదం వల్ల అలా జరిగుంటుంది.

డ్రైవ: (గణేశంతో) ఏం తెలిసిందా? (ఒక్కసారిగా) ... వాటాక్నీ!...మీకంతా మతి చెడింది...అంతే...

యువ: అంతా ఆఖరయిపోయింది...జిగురుపదార్థం అయిపోయింది.

గణే: ఏంజిగురు?

డ్రైవ: ఆ...ఏంజిగురు?

యువ: ఈ భ్రమను కలుగచేసిన జిగురుపదార్థం...

డ్రైవ: ఐతేసరే ... నాకింకో డ్రింక్ ఇయ్యి ... నువ్వు చెప్పింది రైట్ అవవచ్చు ... తప్పూకావచ్చు...నే ననుకునేదల్లా...నీకు మతి చెడిందనే ... నేను బ్రతికున్నా, చచ్చినా, నాకు కావలసిందల్లా డ్రింక్ ... అది ప్రారంభం అయినా, ఆఖరయినా... నాకుమాత్రం కావలసింది డ్రింక్ ... భ్రమైనా నిజమైనా ... మరేమైనా ... శుభ్రంగా త్రాగటమే కావాలి...

గణే: సరిగా నామాటలే ... (త్రాగుతూంటాడు) నాభావాలే...(యువకుడితో) నీది ఉత్తర హిందూస్థానమేనా?

యువ: కాదు...ఇక్కడివాడినే...

గణే: నా పేరు గణేశం ... (చేయి అందిస్తూ) మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

డ్రైవ: నా పేరు గంగులు ... (కరస్పర్శ చేస్తారు) నాకుకూడా మిమ్మల్ని కలుసుకున్నందుకు ఆనందంగా ఉంది.

యువ: సంతోషం...

డ్రైవ: మీ పేరు?

యువ: 'దేవ'

డ్రైవ: 'దేవ' ... హాస్పిటల్ లో పుట్టిన పాపాయికి పెట్టిన పేరు యిదేకదూ...

గణే: అదే...సరిగా అదే పేరు...దేవ...దేవ... చివర ఏమిటి? ప్ర...

యువ: ప్రకాశం ..

గణే: ఆ...ప్రకాశం...నీకెలా తెలిసింది?

యువ: సామాన్యంగా ఎవరి పేరు వాళ్లకి తెలుసుంది.

డ్రైవ: నువ్వు దేవప్రకాశానివా?...నువ్వు...

యువ: ఆ...నేనే...

డ్రైవ: బలేబాగుంది ... దేవప్రకాశం గంట క్రితమేగా హాస్పిటల్ లో పుట్టింది.

యువ: ఈ భ్రమ ఏర్పడిన క్షణంలోనే నేను పుట్టాను...అది చెడిపోయేంతసేపు ఆతర్వాత కూడా యిక్కడనే ఉన్నా...

[వీధిలోనుంచి ప్రకాశం కంఠస్వరం.తలుపు ఎక్కడుంది? తియ్యండి...నన్ను లోపలికి రానీయండి...ఇంతకుముందు యిక్కడే నే ఉన్నా...]

[లోపలికి చొచ్చుకు వస్తాడు]

ప్రకా: కొంచెంసేపు ఈ ప్రదేశాన్ని పోగొట్టుకున్నాననే అనుకున్నా...నాకో డ్రింక్ తే బాబూ...

డ్రైవ: ఎవరీయన?

యువ: నేను...నా తండ్రి...నా కొడుకు...నువ్వు ...మనలో ప్రతివాడూను...

ప్రకా: (సంతోషాన్ని కనబరుస్తూ) ఇలాంటి సమయంలో ఎక్కడినుంచి ఊడిపడ్డానా అని ఆశ్చర్యపోతున్నారా? ఐతే నన్ను చెప్పనియ్యండి...నన్ను ఎన్నో విషయాలు అపు చేసి ఉంచాయ్...దేవుడి దయవల్ల ఏదో

విధంగా యిక్కడికి రాగల్గాను. నాతో ఐదారు రోగాల్ని కూడా వెంటపెట్టుకు వచ్చా...కాని మంచి కబుర్లు కూడా తెచ్చాను. ఇంకో డ్రింక్ ఇయ్యి...

డ్రైవ: వాటినే మీరు మంచివి అంటే...ఆ కబుర్లు మేమూ విన్నాం...ఒక విధమైన భ్రమ ఏర్పడింది...అదేగా? ప్రతివాళ్లూ చచ్చిపోయారు...ఏదో అయిపోయారు! అంతేనా?

ప్రకా: కంగారుపడకు బాబూ...కంగారు పడకు. (దేవప్రకాశంతో) నువ్వెవరు?

యువ: నా పేరు దేవప్రకాశం...

ప్రకా: మరి అలా చెప్పవేం...నేనూ అదే అనుకున్నా...నేను నీ నాన్ననే...బాగుంది...నువ్వు ఏమీ అనుకోకపోతే క్షమార్పణ కోరుకుంటాను...ఆమెలో ఒక రకపు నిస్సహాయత్వం ఉంది...దానికి లోబడకుండా ఉండలేం...ఆమె మాట్లాడితే నాకెంతో సంతోషంగా ఉండేది...ఎప్పుడూ మాటల్ని తప్పుగా పలికేది. అలా మాట్లాడటం...ఆ కాలిమీది ఆ గుర్తులు నాకు ఎంతో బాగా యిష్టంగా ఉండేవి...బహుశా నీకు అర్థం అవుతూన్నదనుకుంటా...నేను మాట్లాడేది మీ అమ్మను గురించే...కాని ఆ కాలిగుర్తులు గతంలోకి బాగా చొచ్చుకుపోయి, పర్యవసానాన్ని భవిష్యత్తులో ముందుకు నెట్టేసి...సక్రమం కాని, అక్రమం కానీ...ఏదైనా యీ నిజాన్ని పరిపాలించేది వేరే పద్ధతిని చూపెట్టలేదు... తెలుస్తోందిగా.. పర్యవసానంగా నువ్వు...దేవప్రకాశానివి యిక్కడున్నావ్...నా తొందరపాటుకు, ఆమె కాలిమచ్చలకు ప్రత్యక్ష నిదర్శనం...ఇక్కడికి రావటం నీకు సంతోషంగా ఉందనుకుంటా...రేపు కాక తర్వాత రోజుకు...

డ్రైవ: రేపు కాక తర్వాతరోజు...ఇదేమిటి?

[అంతా డ్రింక్స్ తాగుతూంటారు]

గణే: మరి రేపటి పేపరు మాటేమిటి?

ప్రకా: దానిలోని వార్తలా...ప్రొద్దున్న పేపరయినా, సాయంకాలపుదైనా మొదటి నుంచీ ఉన్న వార్తలే దానిలో ఉన్నాయ్..

గణే: భ్రమ...లేకపోతే అదేదో కలిగిందన్నారు.. ఐదు నిమిషాల క్రితం వీధిలోకి వెళ్లిచూశా... ఎక్కడా ఏం లేదు! మరి అదేమిటంటావ్!

ప్రకా: దృష్టికి సంబంధించిన మార్పు...అభివృద్ధి... అదృష్టవశాత్తూ అది కొంచెం సేపే ఉంది...

డ్రైవ: అంటే...

ప్రకా: మరేం లేదు...ఒక్క క్షణం సేపు.... అద్భుతమైన కారణంవల్ల....మన కళ్లు సంబంధం లేని విషయాలపట్ల గ్రుడ్డివైపోయాయ్.... మిగిలిన వన్నింటినీ చూడగల్గాయ్,...మళ్లీ మెయిన్ బజారు....బజారుగానే ఉండిపోయింది.

డ్రైవ: ఐతే మళ్లీ మనం బ్రతికామన్న మాట.

ప్రకా: అలా అనుకున్నా తప్పులేదు....

డ్రైవ: నా టాక్సీ బయటనే ఉందా?

ప్రకా: ఎవ్వరూ ఎత్తుకుపోవటంగాని...అద్దెకివ్వటం గాని జరగకుండా ఉంటే...

డ్రైవ: వచ్చినంత పనయింది...

గణే: అంతా మళ్లీ మామూలుగానే ఉంటుందా?

ప్రకా: మామూలుగానా? క్షణక్షణానికి నాశనం అయిపోతోంది. కాని అదే నన్ను ఆకర్షిస్తోంది ఆమె కాలిమీది మచ్చలలాగా ... ఒకవిధంగా మీకూ అలాగే ఉంటుంది.

డ్రైవ: మనం ఎక్కడ మొదలుపెట్టామో తిరిగి అక్కడకే చేరుకున్నాం...

ప్రకా: నిజంగా...నిరాశ...ఆశ— యీ రెండూ యీ ప్రపంచానికి ఆయువుపట్టయిన సహజత్వం...నిర్మాణాలకోసం...సంబంధించని విషయాలన్నింటినీ కూడకట్టాయ్ ... నీ టాక్సీని యిక్కడికి తీసుకురావటానికి... యీ డ్రింక్‌కు యీ రంగుకోసం...దేవప్రకాశం అని నిన్ను ఏర్పచటానికి కావలసిన మచ్చల్ని కూడదీసుకురావటానికి యీ శక్తి ఎంతో కావలసివచ్చింది...

డ్రైవ: ఐతే యిక నా పనికి పోవచ్చునుకుంటా...

[మెల్లిగా సంగీతం వినిపిస్తుంది. అందరూ కదులుతూంటారు]

యువ: మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. (వెళ్లటానికి తయారవుతాడు)

డ్రైవ: నిన్ను టాక్సీలో దిగబెట్టనా...

యువ: ఎంతో దూరం లేదు...నడుస్తా... ఏవా తొందరేం లేదు...లోకంలో ఉన్నంత టైమూ ఉంది.

డ్రైవ: నేను తీసుకువెడతాగా... ఎక్కడికెళ్లాలి?

యువ: వద్దు...క్షమించండి... కొంచెం అటూ యిటూ తిరిగివస్తాను...(వెళ్లిపోతాడు)

డ్రైవ: ఎక్కడికి వెడతావంటావ్?

ప్రకా: వాళ్లమ్మ దగ్గరికి... తన దగ్గరికి ..ఏకు పోనులు అంతకంటె కొంచెం ఎక్కువగా.. శ్వాసించే దానిలోకి అనవరతంలో గంట స్వర దాకా...

డ్రైవ: గణేశం వెళ్లివస్తా...(నిశ్శబ్దం) లవు ఫోర్ సిక్స్ ఆడదామా?

గణే: ట్రాకెలా?

డ్రైవ: ఆ...ఏమి ఆడెదాం...

గణే: ఇందాక నే ఒకాయన చెప్పాడు...డబుల్ జీరో...తప్పకుండా వస్తుందిట...

డ్రైవ: డబుల్ జీరో......ఎలా వస్తుందో అర్థం కాకుండా ఉంది... అజా... పావలా ... అర్ధ... ఆడతాను ...రానీ ..పోనీ మరేం ఫరవాలేదు...ఎంత హాయిగా ఉంటుందని ...వస్తా...

గణే: మంచిది... నేనూ వెడతా...

[ప్రకాశం వింటూ ఒక్కడే నిలబడి ఉంటాడు. గణేశం చాక్కా మూగ్బుకుని వెళ్ళిపోతాడు...జయ...జోసులు వెళ్ళిపోతారు ..లాలూ, కపూర్ బాక్‌లు తీసుకుని వెడతారు... దేవుసు అనంతం వెళ్లిపోతారు.. నాగన్న లోపలికి వస్తాడు...ప్రకాశం ఒక క్షణం సేపు అతనివైపు చూసి అతని చేయి పుచ్చుకుంటాడు...ఇద్దరూ వెళ్లిపోతారు]

యక్షగానకవులు

శ్రీ నిడుదవోలు వేంకటరావు

* గతసంచిక తరువాయి *

5. పార్థసారథి విజయము

ఆలూరి కుప్పన కవి

ఆంధ్రభాగవత దశమస్కంధము ననుసరించి కుప్పన కవిచే రచితమైన యీ యక్షగానము, తెనుగున వెలసిన యక్షగానములలోకెల్ల పెద్ద యక్షగానమని చెప్పనొప్పును. దీని ప్రతిని శ్రీనివాసరావుగారు క్రీ. శ. 1840 సంవత్సరమున వ్రాయించినారు. గ్రంథకర్తయగు ఆలూరి కుప్పనకవి ఆంధ్ర కాళిదాసు అను పేర యీతఁడే కవిచరిత్ర మూలమున పరిచితుడు. శంకర విజయము అను నీతని కృత్యంతరములో "పరగ రామాయణ భాగవతంబులు యక్షగానము చేసి తద్భుతముగ" అని కృతిపతి చెప్పినట్లుగా పేర్కొన్న భాగవత యక్షగాన మిదియే. శంకర విజయములో చెప్పిన యీతని కృతులు, పంచనదీస్థలపురాణము పరమ భాగవత చరిత్ర, ఇందుమతీ పరిణయము నేఁడు లభ్యములు కావు.

కుప్పనకవి వేంకటగిరి పౌత్రుఁడు. వేంకటేశ్వర వరసమాంబల పుత్రుఁడు. ఆనంద రంగరాట్ఛంద కృతికర్తయు, ప్రసిద్ధుఁడును నగు కస్తూరిరంగ కవి శిష్యుఁడు. ఈతఁ డాంధ్ర కాళిదాస బిరుదమును తంజావూరి మహారాష్ట్ర ప్రభువగు తుళజేంద్రునిచే బడసినట్లుగా శంకర విజయమున[1] నిట్లు చెప్పియున్నాఁడు.

క. ఘనుఁడగు తుళజేంద్రుఁడు దయ
తనరఁగ నీ యాంధ్రకాళిదాసాభిధ మ
న్ననఁగా నొసంగెనట నీ
యనుపమ సాహిత్యమున కహో! ఎనగలదే."

కుప్పన కవికి బిరుద మొసంగిన తులజాజీ మొదటి తులజాజీ. ఈతఁడు క్రీ. శ. 1729 నుండి 1735 వఱకును తంజావూరు పరిపాలించెను. కావున కవియు క్రీ. శ. 1740 ప్రాంతమువాఁడు. కస్తూరి రంగకవియు నా కాలమువాఁడే.

పార్థసారథి విజయము చెన్నపురిలో తిరువల్లిక్కేణి పార్థసారథికి కృతిగా వెలసినది. నృసింహస్వామి భక్తుఁడు కుప్పనకవి. శంకర విజయమును చెన్నపురియందుండు నియోగుల ప్రార్థనమున నా గ్రంథము రచియించినట్లుగా నందు చెప్పియున్నాఁడు.

సీ. శ్రీ పార్వతీశ లక్ష్మీశ సేవానను
పార్జిత మహనీయ భాగ్యయుతులు
ఘటనా ఘటన సముత్కట మనీషాతి చ
మత్క్రియాధోరణీ మంజుమతులు
నతులిత సామదానాద్యుపాయైక వి
చక్షణాక్షీణ శాశ్వత చరితులు
హితపురోహిత నిజాశ్రితబాంధవావనా
మానవిస్ఫురితాన్నదానరతులు

గీ. కలిత యజనాది మహితషట్కర్మనిరతు
లగణిత జగన్నుతాద్భుత సుగుణతతులు
పారలౌకిక వైదికాచారభృతులు
చతుర చెన్నపురీ చరత్సచివతతులు.

క. నను శ్రీ నృసింహపాదా
ర్చన జనిత లసత్కవిత్వ చాతుర్యసుధా
ఘన్యని నాంధ్ర కాళిదా సా
ఖ్యని బిల్వఁగ బంచిపల్కిరున్నత కరుణన్.

---

1. శంకరవిజయము 'అముద్రితము' అని తంజావూరి కేటలాగునందు వ్రాయబడినది. అందు దీని పేరు 'ఆచార్యవిజయము' అని యున్నది. చూడుఁడు పుట 15. కాని యిది క్రీ. శ. 1868 లో నేలటూరి సుబ్రహ్మణ్యముగారి విద్యావిలాస ముద్రాక్షరశాలలో ముద్రితమైనది.

ఆ వెనుక పైని చెప్పిన కృతులను వివరించి... ఆచార్యుని విజయంబు...నొనరించి మా కందఱకు నత్యానందంబు నొడగూర్పుమని యాశీర్వచన రూపంబుగా నిర్దేశించి పలికి యనేకరీతుల సత్కరించిన.

సీ. కార్యఖడ్గ కవిత్వకరణిక చాతురి
యిలఁబరికింప మీ యిండ్లబిరుదు
సలలిత యజనాది షట్కర్మనిరతులు
ఖ్యాతిరంజిల్లు మీ జాతిబిరుదు
ధైర్యదాతృత్వోచితజ్ఞతాదిగుణైక
సరణి మీ సాంగత్య సహజబిరుదు
అనుగతంబగు పాలనానూన చాతుర్య
మమరు మీ భవ్యగోత్రముల బిరుద

గీ. మట్టి వీరలు నాపట్ల నతుల కృపను
గురు విజయమిట్లు తెలిగింపఁగోరుకొనుట
గలిగె నిలమీద యోగంబు నిలువరముగ
పారెసు నియోగమెంతని సన్నుతింతు

చెన్నపురి వాస్తవ్యుఁడగు చోళపురము వెంకటాచల భూపతి కిది కృతి—యక్షగానమెంత పెద్దదియో రచన యంతసలక్షమైనది.

6. పారిజాత ప్రబంధము

నరకూరి నారాయణ కవి

ఈ యక్షగానమును రచించిన నారాయణ కవి తన్నుగూర్చి ప్రారంభమున నిట్లు చెప్పుకొని యున్నాడు:

"గీ. సరస నరకూరు ముత్తధీవరుని కాళ
మాంబ తనయుండ విశ్వకర్మాన్వయుండ
నమితయశుఁడను నారాయణాఖ్య కవిని
నే రచించు కథాక్రమం బెట్టిదనిన—"

దీనినిబట్టి నారాయణకవి విశ్వకర్మకులజుఁడనియు కాళమాంబా ముత్తనల కుమారుడనియు స్పష్టమగుచున్నది.

గ్రంథాంతమున నీతని కాలనిర్ణయమున కుపయుక్తమగు వంశమును తెలిపియున్నాడు.

అని యిట్టులీ కథ సాద్యంతముగను
జనమేజయునకు వైశంపాయనుండు
వినిపించెనయ్య కో విద జనాధార
ఘనవెలుగోటి బంగరు యాచనృపతి
తనయ కుమారేచ ధరణీతలేంద్ర
వినవయ్య యిది జగద్వినుత ప్రభావ
మిది పుణ్యచారిత్రము......
ధరణిలో నా చంద్రతారార్కముగను.

ఇందు పేర్కొనబడిన వెలుగోటి కుమారయాచేంద్రుడు బంగారు యాచ నృపాలుని పుత్రుడు—వెలుగోటివారి వంశచరిత్రము ననుసరించి, బంగారు యాచమనాయని వెనుక నాతని కొమారుడగు కుమార యాచమనాయడు క్రీ. శ. 1777 లో సింహాసనము నకువచ్చి క్రీ. శ. 1805 వరకు పాలించెను (పుట 127) కాబట్టి నారాయణ కవియు నా కాలము వాడని నిశ్చితమేగదా—వెలుగోటివారి వంశచరిత్రలో కూడ నీ పారిజాత గ్రంథ ప్రస్తావనకలదు.

"నరుకూరి నారాయణప్ప అనుకవి పారిజాతాపహరణము అను యక్షగానము వీరి కంకితముగా (కుమార యాచమనాయనివారికి) రచియించెను" (పుట 127)

దీనినిబట్టి నారాయణకవి క్రీ. శ. 1770—80 ప్రాంతమువాడని స్థిరముగా నిర్ణయింపనగుచున్నది.

7. శకుంతల నాటకము

వర్ఝుల నరసింహకవి

ఇది యొక యక్షగాన నాటకము. దీనిని రచించిన కవి వర్ఝుల నరసింహ కవి. ఈతడీ గ్రంథమును నంద్యాల నారాయణ దేవరాజు ప్రోత్సాహమున రచియించినట్లు గ్రంథారంభమున నిట్లు చెప్పినాడు:

"శ్రీమంతుఁ డఖిల లక్ష్మీప్రసన్నుండు
భూమి సోమాన్వయాంబుధి సుధాధాముఁ
డరిశైలపవిదారుఁ డసహాయబలుఁడు
వరుసతో నంద్యాల వంశవిస్తారుఁ
డమల సదాచారుఁ డాత్రేయ గోత్రుఁ
డమరేంద్ర విభవైభవాస్పీతుఁ డనగ
రమణ నారాయణ రాజ శేఖరుడు
విమల యశోరూప విజిత తారకుడు
ఆ మహీపాలున కనుఁగు తనూజుఁ
డైమించు రాఘవావని నాయకుండు
... ...

నతని కగ్రసుతుండు నయగుణయుతుఁడు
... ...
అ నృపవర్యున కనుజన్ముఁ డనుచు
రమణ నారాయణ రాజదేవేంద్రుఁ
డొప్పు నా నృపతివర్యుఁ డొకనాఁడు."

వస్తుల నరసింహ సుకవివర యని రావించి, అంబర తాంబూల జాంబూనదాది వస్తువులచే సత్కరించి, యీ విధముగా చెప్పెను:

పరికింప నన్నయ భట్టారకుండు
విరచించె దుష్యంతవిభు చరిత్రంబు
నా కథ యక్షగానంబుగా మిగుల
శ్రీకరంబుగఁ గీర్తి చెలువొందఁజేయుము—

కథా కల్పనము యక్షగానములకుఁ దగినట్లే భామవేషకథవలె నున్నది.

క. పచ్చల బాకు కరంబున
మచ్చుటగ హుమాయిపిట్ట ముంజేతిపయిన్
మచ్చికలర మంత్రులతో
వచ్చును దుష్యంత నృపతి వైభవమలరన్.

గీ. ఎవరయా మీర లేదేశ మేలు దొరలు
ఇపుడు మీ కిటు వచ్చుట యెందుకో యకు
తల్లిదండ్రులు ఎవ్వరు ధరణినాథ
తెలియజెప్పుము మీ నామధేయ మేమొ.

దుష్యంత వచనము :
ప్రేమ మీ రడుగ నాదు పేరేమనెదవు
ఏమిరా ప్రియభృత్య యెఱుఁగవా నన్ను

భటుని వచనము : రాజేంద్రా!
మీరలిటుఁజేరినది మొదలేదినిశ
సఖులందఱుఁ జాలఁగా సంతసించి
యెదురు చూచెద రయ్య యింకేల తడవు
తెరవెడలి రమ్ము యిచటికిఁ దీవ్రముగను

రాజు : అలాగే వచ్చెదమురా భృత్యా!

నరువు : వెడలివచ్చెనూ
వేడ్క మీ అ దుష్యంతనృపతి వెడలివచ్చెనూ.

ఈ ప్రతి విళంబినామ సంవత్సర భాద్రపద బహుళ ౧౦ నాటికి సమాప్తముగా శ్రీ మన్మహామండలేశ్వర నంద్యాల నారాయణదేవ మహారాజులుంగారు స్వహస్తముగా వ్రాసినది.

ఆంధ్ర సాహిత్య పరిషత్ పుస్తక భాండాగారము సంఖ్య 695. [ద్వితీయభాగము పుట. ౧౦౧. ౧౦౨.]

ఈ యక్షగాన ప్రోత్సాహకుఁడగు నంద్యాల నారాయణ దేవరాజు క్రీ. శ. 1777 లో నున్నట్లు దక్షిణ హిందూదేశ శాసనములు 1 వ సంపుటము 650 పుటలో నొక శాసనమున్నది. కావున యీ యక్షగాన మానాటిది కాదగును - గ్రంథప్రోత్సాహకుడే ప్రతి విలేఖరి.

8. ప్రభావతీ ప్రద్యుమ్నము
గోపాలుని సింగయ

ఇది పింగళి సూరనార్యుని ప్రభావతీ ప్రద్యుమ్నమునకు గోపాలుని సింగయ యను కవి రచించిన యక్షగాన పరివర్తనము. అహోబలేశ్వరునికి కృతి. కవియే గ్రంథారంభమున నిట్లు చెప్పియున్నాడు.

శా॥ శ్రీకాంతా లసద్వృక్చకోరములకున్
చెల్వంపు వెన్నెలమనే
రాకాశీత మరీచిరోచి కతనన్
రంజిల్లగాఁ జేయుచున్
లోకాలోక పరీత విశ్వము కృపా
లోకాజ్ఞచే నేలు సు
శ్లోకుండైన అహోబలేశుఁడు
రమాలోలుండు నన్నేలుతన్.

ద్వి. అని యిష్టదైవంబు నభినుతి చేసి
మునువాణి హృత్పీఠమున నిల్పి మ్రొక్కి
... ...
కరమొప్ప నున్న పింగళిసూర సుకవి
వరుడు చెప్పిన ప్రభావతి ప్రద్యుమ్న
మను ప్రబంధము మోద మావహిల్లగను
నను నేలినట్టి శ్రీ నరసింహదేవు
నకు నంకితంబుగా నా నేర్పుఫణితి
సుకవులెల్లరు మెచ్చ సొంపులు హెచ్చ
వినుజనంబులకెల్ల వేడుకమించ
ఘనరీతులను యక్షగానంబుగాగ
వర చిత్రశృంగారవర్ణన మీఱ
విరచింతు నంతయు విస్ఫుటంబుగను.

గోపాలుని సింగయ భాస్కరమంత్రిపౌత్రుడు. వీరనమంత్రి రాంబముల పుత్రుడు. ఈతడీవలకే కిరాతార్జునీయ మను కృతిమూలమున కవిచరిత్ర కెక్కియున్నాడు. ప్రస్తుత యక్షగాన కృతి ప్రశస్త రచన గలది. "ఈ కవి నూరు సంవత్సరముల క్రిందటివాడు" అని క్రీ. శ. 1908 లో వీరేశలింగము పంతులవారు కవులచరిత్ర 3 వ భాగము 247 పుటలో వ్రాసియున్నారు. ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున గల కిరాతార్జునీయ తాళపత్ర ప్రతినిబట్టి యీతని కాలము క్రీ. శ. 1800 ప్రాంతమని నిశ్చయముగ చెప్పవచ్చును. ఈ యక్షగాన మాకాలమునాటిది. డి 459 తాళపత్ర ప్రతిలో. యువ సంవత్సర భాద్రపద శు 5 కొటూరి వెంకటప్ప కుమారుడు ముద్దు వెంటప్పకు గోపాలుని సింగన చెప్పిన కిరాతార్జునీయము, ఆ సింగన్న కుమారుడు అచంద్రార్క స్థాయిగా వ్రాసియిచ్చెను. ఈ యువ క్రీ. శ. 1815 సంవత్సరము గావున సింగయ క్రీ. శ. 1800 ప్రాంతమువాడు.

9. చంద్రతారా విలాసము

ఎల్లయసుకవి

చంద్రతారావిలాస మనుపేర తారాశశాంక విజయకథను యక్షగానరూపమున రచియించిన ఎల్లయకవి సేలముజిల్లాయందలి సేలము చేరువనున్న యుద్దండమల్లి సముద్ర గ్రామనివాసి; తన యక్షగానమున ప్రారంభములో తన్నుగూర్చి యిట్లు చెప్పుకొన్నాడు:

సీ. శ్రీరహింపించిన చేరదేశంబులో
   చెలువొందు వెలయును సేలపురము
దాని చేరువను నుద్దండమల్ల సముద్ర
   మను గ్రామమున నుండు సాంద్రవిప్రుఁ
డాత్రేయ గోత్రజుం డమల తేజస్కుఁడౌ
   రామభక్తుండైన రామభద్రుఁ
డాతని తనయులు ననఘులు నిద్దఱు
   నంద్రగజుఁడు మల్లినార్యుఁడనఁగ
గీ. వతని తనయుండు విశ్వనాథాఖ్యదనయ
   ......కులసతి వెంకటాంబ
గర్భకలశాబ్ధి చంద్రుండు కవివరేణ్యు
   లకును శిష్యుఁడు యెల్లయ సుకవిహితుఁడు.

ఈతడాత్రేయ గోత్రుడు - రామభద్రుఁడీతని తాత - వెంకటాంబ మల్లనార్య లీతని తలిదండ్రులు - కళ్యాణరాముని కృపచే 'చంద్రతారావిలాసము' అను యక్షగాన కృతి రచియించినాడు.

ఈతడు నూటేబదేండ్లక్రిందట క్రీ. శ. 1840 ప్రాంతములో జీవించియున్నట్లు క్రిందివిషయమువలన స్పష్టము కాగలదు.

క్రీ. శ. 1846 లో కోలా శేషాచలకవి యను నాతడు 'నీలగిరి యాత్ర' అను ప్రశస్తవచన ప్రబంధము రచియించియున్నాడు - ఆ గ్రంథములో 21 పుటలో నీ యెల్లయ ప్రసక్తి గలదు.

"కావేరి యావలి తీరంబున నుండు సత్రం బచ్చటి కొక్కింత తక్కువగ ముక్కాలు కోసెడు దవ్వుననున్న యారోసను నూరఁ గాపురంబున్న యెల్లయ్య యను విప్రునిచే నిర్మింపబడినది. అందు రెండు గుళ్లు నన్నియుంగళ్లు దక్క మఱియొక యిక్కయే నిలియుఁ గానను. బాటసారుల శకటంబులు నన్నికటంబున నిశంకటంబుగ విడియుటం జేసి చెరుగు గదురదయ్యె...... ఈరోడనునది కోటయుం పేటయుం గలయది... కావేరి యావలితీరంబున సత్రంబు గట్టించిన యెల్లయ్యయను జన్నిగట్టిచో నున్నవాఁడు. సేలంబునం బెల్లుప్పు ప్రత్తిలోనగు సరకుల వ్యాపారంబు సేయు ఫిషరను (*Mr. Fisher*) దొర కతండు నొక్క యేజంటును కార్యకర్త గావున నక్కోటలో నుండు నా దొర పెల్లుప్పు గిడ్డంగి కీతని యధికారమునకు లోనైయుండు. అయ్యుర్వీగీర్వాణుండు సంగీత సాహిత్య విద్యాప్రవీణుండు గావున తారాశశాంక ప్రభృతి కతిపయనాటకప్రబంధంబులు శృంగారాది రసానుబంధనములుగా రచియించియున్నవాఁడు."

ఇందు పేర్కొనిన ఎల్లయ మన యెల్లయకవి యనుట నిర్వివాదము గదా. ఎల్లయకవి కావేరీతీరమున పెద్ద సత్రమును గట్టించినాడనియు నక్కడనే నీలగిరి రాజకీయ యాత్రకు పోవువారు విడిదిచేయుచుండురనియు వ్రాసినదానినిబట్టి యది ప్రయాణీకుల కెంత యుపయోగకరముగ నుండెనో తెలియగలదు.' అతడు పెల్లుప్పు గిడ్డంగి కధికారియనికూడ తెలియుచున్నది.

శేషాచలకవి నీలగిరి యాత్రను నిప్పటికి సరిగా నూటేండ్ల క్రిందట యనగా 18[illegible]4 లో రచియించియున్నాడు. ఈ గ్రంథమందలి విషయములు తే 12.5-1846 నుండి 13-1-1847 వఱకు జరిగినవి యగుటచేత యెల్లయకవి క్రీ. శ. 1840 ప్రాంతము వాడని తెలుపబడినది.

ముప్ఫయి రూపాయలు

వి. గోపాలకృష్ణ

ఒకనాటి సాయంత్రం కాలేజీలో చదువుతున్న రామమూర్తి కొడుకు వెంకటరావు, పెద్దరెడ్డి దుకాణంలో ప్రవేశించి, ఎవరూ అంతకుపూర్వం వినని కొత్తరకం పెన్ను కావాలని అడిగినప్పుడు, పెద్దరెడ్డి తడుముకోకుండా ఆ వస్తువు తెచ్చి అతనిముందు పెట్టాడు. యాభైవేల జనాభావున్న ఆవూరిలో పెద్దరెడ్డి దుకాణం అన్నిటికన్నా పెద్దది. అక్కడ దొరకని వస్తువు ఆ జిల్లా హెడ్ క్వార్టర్సులో కూడ దొరకదు. ఆ వూరిలో కొత్తగా పెట్టిన పంచదారమిల్లు, ఆ మిలు వుద్యోగస్థులకు కట్టిన పసుపుపచ్చ బంగళాలు తప్పించితే, మిగతా వూరంతా అతుకతుకగావున్న ఎర్రమట్టి రోడ్లతో, ఎత్తరుగుల యిళ్ళతో, మధ్య నుంచి మొక్కలు మొలచి బీటలువారిన గోడలతో, పురాతన దేవాలయంతో, నిత్యం ధ్వనించే సాలీల మగ్గాలతో పాత వాసన కొడుతూవుంటుంది. అటువంటి వూరిలో, పెద్దరెడ్డి దుకాణం వుంది.

పాతికయేళ్ళక్రితం పెద్దరెడ్డి తండ్రి, వృద్ధాప్యంలో వెనుకవీధిలో కిరాణాకొట్టుతో కాలక్షేపం చేస్తూ వుండేవాడు. అప్పటికి పెద్దరెడ్డి హైస్కూలు చదువు పూర్తిచేశాడు. ఎవరైనా తన భావినిగురించి అడిగితే కాలేజీలో చదువుతాననేవాడు. తండ్రితో కూడ అదేపలికాడు. కాని పెద్దరెడ్డితండ్రి ఒప్పుకోలేదు; డబ్బు చాలదని వంక పెట్టాడు. ఒకరోజు రాత్రి:

"శ్రీనివాసరావుగారికి యేమంత ఎక్కువ డబ్బువుందని, వాళ్ళ అబ్బాయిని చదివిస్తున్నారేమిటి" అని ఎత్తుకున్నాడు పెద్దరెడ్డి ఎలాగయినా తండ్రిని ఒప్పిద్దామని.

"వాళ్ళసంగతి వేరు. అదిగాకపోయినా వాళ్ళకు మనకన్న ఎక్కువ డబ్బువుంది, ఎంత లేకపోయినా" అన్నాడు పెద్దరెడ్డితండ్రి.

"ఆ, ఎక్కువుంది! ఎవరికి తెలియదులే! నెలకు ముప్పయిరూపాయలువుంటే చాలు అంటున్నానుగా" అన్నాడు పెద్దరెడ్డి.

"ఆ ముప్ఫయి మాత్రం ఎక్కడతేవాలి?" అందుకుంది పెద్దరెడ్డితల్లి.

"అదిగాదమ్మా! ఈ చదువు చదివితే ఎవరికైనా నెలకు అరవైరూపాయిలు కావాలి. మనకయితే ముప్ఫైరూపాయిలతో తేలిపోతోంది కదా! అలాంటప్పుడు మానెయ్యటం ఎందుకు? పోనీ అంతగా స్కాలర్‌షిప్పు రాకపోతే తప్పకుండా మానేస్తానంటున్నాను గదా! అదీగాక సుబ్బారాయుడుగారు తప్పకుండా స్కాలర్‌షిప్ యిప్పిస్తానని చెప్పారు."

"ఆ ముప్ఫయిరూపాయిలు అయితే మాత్రం ఎక్కడ తీసుకురాను. ఇదిగో చూడు, మనకున్న ఆస్తి అంతా కలసి ఈ కిరాణాకొట్టు. దానిమీద నెలకు పాతికరూపాయిలు వస్తే మహా గొప్పఅన్నమాట. నువ్వేదో యింకో వూరుపోయి, కాలేజీలో చదువుతానంటావు. పోనీ ముప్పయి రూపాయలే అనుకో, కాని అవిమాత్రం ఎలా తేవాలి?" అన్నాడు పెద్దరెడ్డి తండ్రి. పెద్దరెడ్డి ఆశ్చర్యపడ్డాడు కాని, తండ్రివైపు అనుమానంగా చూశాడు. వాళ్ళు చెప్పేదాంట్లో యేదో అబద్ధ ముందనిపించింది.

పెద్దరెడ్డికి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. అతను యిన్నాళ్ళు ఉవ్విళ్ళూరిన బ్రతుకు, అతనికి కాకుండా పోయింది. ఇంకొకసారి తండ్రిని కదిలించాలనుకున్నాడు. కాని సంఘర్షణ తీవ్రం కాకపూర్వమే పెద్దరెడ్డి తండ్రి అకస్మాత్తుగా మరణించాడు. పెద్దరెడ్డికి మంకుపట్టు పట్టాల్సిన అవసరం లేకపోయింది. మరుసటి రోజునుంచి పెద్దరెడ్డి ప్రొద్దున్నే కిరాణాకొట్టు తెరిచేవాడు. మధ్యాహ్నం ఒక గంట తప్పించితే

సాయంత్రం యేడు గంటలవరకు కొట్టుమీదే వుండేవాడు.

కాని యిప్పుడు పెద్దరెడ్డి కొట్టు మెయిన్ రోడ్డులో వుంది. అది కిరాణాకొట్టు కాదు; పెద్ద జనరల్ షాప్ అయింది. పెద్దరెడ్డికి పూర్వం జరిగినవన్నీ కలలకన్నా మసకగా కనిపిస్తాయి. ఏమయితేనేం, పెద్దరెడ్డి వూరికి పెద్ద. అతని మాటమీద చాల విషయాలు జరుగుతాయి; అతని సహాయంతో చాల పుణ్యకార్యాలు నెరవేరుతాయి. హైస్కూలు భవన నిర్మాణం, అతని సహాయం లేకపోతే యెంత ప్రయత్నించినా జరిగివుండేది కాదు. ఆసుపత్రి కడదామని వూరిలో వాళ్లంతా యెంత ప్రయత్నించినా, అతని చేయూత లేక ఆగిపోలేదా?

పెద్దరెడ్డి సుఖాలను విడిచి లక్ష్మీకటాక్షం కోసం చేసిన తపస్సులో ఆనందాన్ని తప్పించితే అన్నీ సాధించాడు; ప్రేమ తప్పించితే అన్నీ అలవర్చుకొన్నాడు.

పెద్దరెడ్డి కొట్టు పెరగటం ఆగిపోలేదు. కాలంతోపాటు అతని కొట్టు పెరుగుతూనే వుంది. దానికి తోడు, వూరిలో కొత్తగా పెట్టిన గాజు ఫ్యాక్టరీవల్ల కొట్టు పెరగటానికి కొత్త అవకాశాలు కలిగాయి. కొట్టు కొత్త గదులు ఆక్రమించింది; రెండో అంతస్తు ప్రవేశించింది. కాని యింకా పెరగటానికి గదులు కావాలి.

* * * *

విశాలమయిన "యస్. పెద్దరెడ్డి అండు కంపెనీ" అన్న బోర్డు ప్రక్కన, సగం చెరిగిన అక్షరాలతో "కె. రామమూర్తి, కాఫీ పొడుం అమ్మబడును" అని అరడుగు బల్ల వుంది. "కె. రామమూర్తి" అన్న బోర్డును కప్పివేసేటంతవరకు తన బోర్డును పొడిగించాలని పెద్దరెడ్డికి చాలాకాలంనుంచి ఆశ వుంది. కాని యింతవరకు తప్పనిసరి కాని కోరిక, ఈనాడు అయింది.

ఒకరోజు వుదయం రామమూర్తి తన కాఫీ పొడుంకొట్టు తెరవబోతూవుండగా, పెద్దరెడ్డి తన కొట్టులోనుంచి "యేమండోయ్! పంతులుగారూ! రండి! రండి! చిన్న వ్యవహారం యేర్పడింది." అని పొలికేక పెట్టాడు. రామమూర్తిది బ్రాహ్మణ కులం కాకపోయినా అందరూ అతనిని పంతులుగారూ అని పిలుస్తారు. సౌమ్యతనుబట్టి పిలుస్తారో, మాటతీరును బట్టి పిలుస్తారో లేక గొప్పదాన్నిబట్టి పిలుస్తారో కాని, అందరూ అతనిని పంతులుగారని అంటారు. రామమూర్తికి ఆ కాఫీ పొడుంకొట్టు తప్పించితే ఆస్తిలేదు. దానిమీద వచ్చే ఆదాయం అతని కాస్త పొట్టకు, కొడుకు చదువుకు సరిపోతుంది. రామమూర్తి భార్య చాల కాలంక్రితం పోయింది. యింకో వూరిలో కాలేజీలో చదువుతున్న ఒక్క కొడుకు తప్పించితే, అతనికి పిల్లలు లేరు. వెంకటరావు స్కాలర్‌షిప్పు మీద చదువుకున్నాడు కాబట్టి, రామమూర్తికి అతని మూలంగా అట్టే ఖర్చు లేదు. ఇక హాస్టలులో సగం ఖర్చులు కాలేజీవాళ్లే భరిస్తారు. మిగతా సగం ఖర్చులు అతను యేదోవిధంగా యింతవరకు సర్దుతూనే వున్నాడు.

కొడుకు ప్రక్కవూరిలో వున్నాడు కాబట్టి, తన చిన్న పొట్టకిగానే వండుకుంటాడు. వీలైనంత తక్కువగా మాట్లాడటం అతనికి అలవాటు. అతనికి ఈ ప్రపంచంలో తన కాఫీపొడుం కొట్టు తప్పించి మిగతావేమీ తెలియవు; తెలుసుకోవాలనే ఆసక్తి లేదు.

"యేం పంతులుగారూ! హడావుడిగా కొట్టు తీస్తున్నారు. ఇంతకీ మీతో చిన్న వ్యాపారం విషయం మాట్లాడాలి" అన్నాడు పెద్దరెడ్డి, తన కేక విని రామమూర్తి రాగానే.

"సెలవివ్వండి" అన్నాడు రామమూర్తి.

"ఆ యేం లేదు...మీకు యిక్కడ చూస్తే కాఫీ పొడివ్యాపారం పెద్దలాభం తెస్తున్నట్టులేదు. అది గాక పోయినా మీకొట్టు యిక్కడ వుంటే యేంటో, మరోవీధిలో వున్నా అంతే.—కాఫీ పొడుం వ్యాపారం కదా! అందుకని మీ భాగం అమ్మటానికి వీలుంటుందేమో చూడండి. నాకు సుఖం; మీకు లాభం" అని యేమంటాడోనని రామమూర్తి వైపు చూశాడు, పెద్దరెడ్డి.

రామమూర్తి కాసేపు ఆలోచించి, "అబ్బే, వీలుండదండీ, అన్నాడు. ఆ కొట్టు అమ్మటం అన్న ఆలోచన అతనికి కలలో కూడ తట్టలేదు. అతని జానెడు పొట్ట నింపుకోవటానికి ఏకైక సాధనం ఆ కాఫీపొడి వ్యాపారం. అతనికొట్టు వున్న చోట్లో తప్ప, మిగతా

చోట్లలో యింటికోకకొట్టు వెలిసింది. ఇక్కడ కొట్టు అమ్మితే అతను వ్యాపారం మానుకోవాల్సివుంటుంది. ఈ సంగతి పెద్దరెడ్డికి తెలియనిది కాదు.

రామమూర్తి చెప్పిన సమాధానం విని, ఆలోచించి చెప్పండి, తొందరేమీ లేదు" అన్నాడు పెద్దరెడ్డి. కాని యిటువంటి సమాధానం వచ్చినందుకు కొంచం ఆశ్చర్యపడ్డాడు.

కాసేపు నిలుచుని "సెలవు తీసుకుంటాను" అన్నాడు. రామూర్తి.

"వెళ్లిరండి"

*   *   *   *

వారం రోజులు పోయాక మళ్ళీ కదిలిస్తే లాభం వుంటుందేమోనని ప్రయత్నించాడు, పెద్దరెడ్డి. రామమూర్తి వీధివెంట వెళ్తూంటే, పెద్దరెడ్డి "యేం పంతులు గారు! యేం చేశాడు?"

"యేం చెయ్యటాని కేముంటుందండీ!"

"అదిగానెయ్యా! మళ్ళీ మొదటికొచ్చావేం. ఆ కొట్టు సంగతి యేంచేశావని నే నడిగేది?"

"వీలుండటంలేదండి."

"వీలు లేదంటావు, మొత్తంమీద."

"అచ్చే కుదరదండీ."

"కుదుర్చుకుంటే అదే కుదురుతుంది; డబ్బు విషయం వెనకాడను లే."

"డబ్బు విషయం కాదండీ; నే నిక్కడ కొట్టు అమ్మితే యింకోచోట పెట్టటానికి వీలుండదు. యిక్కడ తప్ప ప్రతి వీధిలోనూ కాఫీ హోటుంకొట్టు వుంది కాదండీ!" అన్నాడు రామూర్తి. ఆ విషయం పెద్దరెడ్డికి తెలియనిది కాదు. అయినా యింకా బేరం చేస్తూనే వున్నాడు.

"అందుకనే గద డబ్బు కొంచెం యెక్కువయినా కొంటానన్నది....యేమయినా నీకు వ్యాపారంలో సులువు తెలియదోయ్, పంతులూ" పెద్దరెడ్డి సంబోధనార్థకం 'అండి' దగ్గరనుంచి 'అయ్యా'కు, అక్కడినుంచి 'ఓయ్'కి మార్చాడు. ఇంకొంచెం సంభాషణ జరిగివుంటే 'ఏరా' వరకు వెళ్లివుండేది. తనకు యెదురుతిరిగిన వాళ్ళు అలా లోకువవుతారు, అతనికి.

రామమూర్తి అలా తిరస్కరించటం పెద్దరెడ్డికి చాల కష్టంగా తోచింది. రామమూర్తి తిరస్కరించకుండా బేరానికి దిగివుంటే, అయిదు వేలు యివ్వవలసిన చోట యిరవై వేలు యిచ్చేవాడు. పెద్దరెడ్డి పూర్తిగా పాషాణం కాదు. పెద్దరెడ్డివంటి వ్యక్తులు తమకు యెదురుతిరగనంత వరకు యెంతైనా సహాయం చేస్తారు. పెద్దరెడ్డి దయామయుడుగా, ఉదారవంతుడుగా ఆ వూరిలో అందరికి తెలుసు. ఆ వూరికి హైస్కూలుభవనం కట్టించినపుడు అతన్నెవరు కొనియాడకుండా వున్నారు? వూరికి ఒక గ్రంథాలయం అంటూవుండటం అతనివల్ల కాదా? దగ్గరకు వెళ్లి చెయ్యిచాపితే ఎంతమందికి అతను ధనసహాయం చెయ్యలేదు! యెంతమంది అతనివల్ల విద్యాదానం పొందలేదు?—కాని మిగతా వారంతా అతని నీడ క్రింద బ్రతకాలి; అతను అన్నది కాదనరాదు. అప్పుడే అతను దయగా వుండగలడు. కాని తోటి మానవులమీద దయగాదు చూపవలసినది; చూపవలసినది ప్రేమ, సమభావం. దయ నోరులేని జంతువుల మీద, చూపెట్టాల్సినభావం. కాని చాలమంది ధర్మాత్ములు దయగా వుండగలరుగాని, ప్రేమతో, సమభావంతో వుండలేరు. ఆటువంటి వ్యక్తులలో పెద్దరెడ్డి ఒకడు.

రెండురోజుల తరువాత పెద్దరెడ్డి విసుగ్గా గోడ్డుపై పుదూస్తున్నాడు. అతనికి యేమి చెయ్యాలో తోచటంలేదు. యింతలో వెంకటనారాయణ హడావుడిగా పరిగెత్తుకుంటూ వచ్చాడు. మోకాళ్లపైకి మడచిన పంచతో, చాలీచాలని నల్లకోటులో అతని ఆకారం నవ్వొస్తున్నట్లుంటుంది. అతను నడుస్తూవుంటే పరిగెత్తుకున్నట్లుంటుంది. అతను మాట్లాడితే, యెవరూ అవగాహన చేసికోలేనంత తొందరగా మాట్లాడతాడు. అతను ఆ వూరిలో వుద్యోగంగాని, వ్యాపారంగాని చెయ్యటంలేదు. కాని యెప్పుడూ పని కొత్తికి మీదేవున్నట్లు వుంటాడు. ఊరిలో యెంతమంది పనులు యితను చేసి పెడుతున్నాడో, యేమో!

కొట్టులోకి పూర్తిగా ప్రవేశించకుండానే "యేమిటోయ్ పెద్దరెడ్డి! విసుగ్గావున్నావు"అన్నాడు.

"రావోయ్, రా! చిరకాలదర్శనం" పెద్దరెడ్డి అందుకున్నాడు.

"పనుల వొత్తిడి! లేకపోతే గంట కొకసారి కనిపించకపోదునా—అవును గాని, నీకు రామ్మూర్తికి యేదో మనస్పర్థలున్నాయట, సంగతేమిటి?" పెద్దరెడ్డికి కావలసిన విషయం, అనుకున్నాడు వెంకటనారాయణ.

"అసాధ్యుడవోయ్! ఆకలిస్తే పేగులు లెక్కపెడతావుగదా!—యెలా తెలిసిందేమిటి?"

"తెలుస్తుందోయ్—అసలు సంగతేమిటో చెప్పు" అన్నాడు వెంకటనారాయణ.

"యేమీ లేదు. మన కొట్టు కొంచెం పెంచుదాం గదా అని, అతని కొట్టు అమ్ముతాడేమోనని అడిగాను. వాడికున్నది అణాన్నర వ్యాపారం—నెగవ కాఫీ పొడుం! రెండు రెట్లు ఖరీదువరకు యిద్దామని మనస్సులో వుందికాని, అసలు వీల్లేదంటే యేంచేస్తాం. బేరానికి దిగితే బాగుండేది. ఏదీ కాకుండా వీల్లేదంటాడాయె! వ్యాపారం అంటే అతనికి తెలియదోయ్" అన్నాడు పెద్దరెడ్డి.

"ఆ—వ్యాపారం అంటే తెలియక కాదులే. అంతా తల బిరుసుతనం. వాడికొచ్చే లాభాలు, యింకోచోట యేడిస్తే తగ్గుతయి కాబోసు! నాకూ తెలుసు ఈ కాఫీపొడి వ్యాపారం—"యింతకీ కొట్టు ఖరీదుకడగటానికి యెన్ని గుండెలుండాలి అంటున్నాడట" అన్నాడు వెంకటనారాయణ, చివరకు రహస్యం మాట్లాడినట్లు కంఠం మారుస్తూ.

"అంతవరకూ వచ్చిందీ!" అనుకున్నాడు పెద్దరెడ్డి. వెంకటనారాయణ చెప్పింది నిజమూ అబద్ధమూ అని ఆలోచించే అవసరం పెద్దరెడ్డికి లేదు. అదిగాక, వెంకటనారాయణ పాతచరిత్ర పెద్దరెడ్డికి తెలియనిది కాదు. అతను యెన్ని కుటుంబాలకు నిప్పు పెట్టాడో, యెంతమందిని కోర్టులవరకూ లాగాడో—యివన్నీ పెద్దరెడ్డికి తెలుసు. వెంకట నారాయణ చేసిన అపచారాలను భరించలేక ప్రక్క వీధిలో రౌడీలు అతన్ని తన్నటం, వెంకయ్య నలుగురిలోనూ అతని మొహంమీద వుమ్మివెయ్యటం, మునిసిపల్ ఎలక్షన్లలో అతను డబ్బుకోసం చేసిన పనులు—యివన్నీ పెద్దరెడ్డి కళ్లయెదుటే జరిగాయి; పెద్దరెడ్డికి బాగా తెలుసుకూడా. నిత్యఖర్చులకు వెంకటనారాయణ ఆర్జించే విధానం కూడా పెద్దరెడ్డికి తెలుసు. కాని అటువంటి సమయంలో యెదుటివాడు చెపుతున్నది నిజమా, అబద్ధమా అనికాని, న్యాయమా, అన్యాయమా అని కాని, ఆలోచించరు—యెదుటివాడు తన పక్షమా లేక తన విరోధిపక్షమా అని మాత్రం ఆలోచిస్తారు. పెద్దరెడ్డికి యిప్పుడు కావలసింది 'తన పక్షం' మనుషులు, తనకు ఊం కొట్టే వ్యక్తులు కాని, న్యాయావలంబకులు, సత్యహరిశ్చంద్రులు కాదు. తీవ్ర విద్వేషాలు, అసూయలు పెంచుకున్నాక, యే మూలనుంచో పూర్తిగా చావని అంతరాత్మ, మనం భావించేదానిలో హెచ్చుభాగం అబద్ధమని ఘోషించినా, మనం చేసే పనులలో చాలవరకు అన్యాయమని మొగపెట్టుకున్నా, మనం చేసే స్నేహాలు నీచమయినవని సూచించినా, అటువంటివి భావించటం, ఆదరించటం మానము. చేస్తున్నంతసేపు విరోధిపట్ల అలా ప్రవర్తించటం తప్పులేదనిపిస్తుంది. ఎంత నిజాయితీగల వ్యక్తికయినా, తన విరోధి యింటికి దొంగతనం చెయ్యటం నేరంగా కనిపించదు; తన విరోధిని చంపటం ధర్మంగా కనిపిస్తుంది. విద్వేషాలలోపడి కార్యసాధనకు దిగినప్పుడు, నిలబడి మనలోని దురభిమానాలను, పక్షపాతాలను నిశ్చయించుకోగలమా? కొత్తమనుష్యుల్లా ప్రవర్తిస్తాం; చెయ్యరాని పనులు చేస్తాం.

"సరేలే" అనుకున్నాడు వెంకటనారాయణ "మా వియ్యంకుడిగారి వూరిలో కూడ యిలాటిదే జరిగింది. నా మాటవిని, నే చెప్పినట్లు చెయ్యి. వాడి రోగం మూడు నిముషాలలో కుదురుతుంది."

"యేమిటది?" ఆతృతతో అడిగాడు పెద్దరెడ్డి.

"చాలా సులభం. నువ్వుకూడా కాఫీపొడుం అమ్మటం మొదలుపెట్టు. నలుగురూ తెలిసినవాడివి. కాస్త ప్రయత్నించావంటే, నలుగురిని యిటు తిప్పవచ్చు. మొదటి నెల కాస్త చవకగా అమ్మావంటే అందరూ నీ కాఫీపొడికి యెగబడతారు. తరువాత రామ్మూర్తి సరుకు ఎలికలుకూడా తినవు. తరువాత కొట్టు అతిచవకగా కొనొచ్చు, అప్పుడు—హుం—మరి పిలవు—కాస్త దయగా చూస్తావుండు, నాలాటి బీదవాణ్ణి—"

* * * *

ఈ సంభాషణ జరిగిన నెల రోజులలోపుగా, పెద్దరెడ్డి అంకుకంపనీనుంచి మద్రాసులో ప్రసిద్ధమైన కాఫీ వ్యాపారస్తులకు వుత్తరాలు వెళ్ళటం, అక్కడ నుంచి పెద్దరెడ్డి అంకుకంపెనీకి జవాబులు రావటం,

తరువాత ఒక ఏజంటు కొన్ని డబ్బాలతో కాఫీ పొడుం పట్టుకుని, పెద్దరెడ్డి అండుకంపెనీ, జనరల్ షాప్‌లోకి రావటంజరిగింది. తరువాత శ్రేష్టమయిన కాఫీపొడుం అతి చవకగా ఎక్కడ లభ్యమవుతుందో, పెద్దరెడ్డి దుకాణంలో అమ్ముతున్న కాఫీపొడియొక్క విశిష్టత యేమిటో, వివరిస్తూ సైనుబోర్డులు వేసి కరపత్రాలు పంచిపెట్టించాడు. నలుగురుకుర్రాళ్ళకు టోపీలు తొడిగించి "ఏంకాఫీ కావాలి?" — "రెడ్డికాఫీ కావాలి!" "యే కొట్టులో దొరుకుతుంది?"—"పెద్ద రెడ్డిగారికొట్లో!" "ఖరీదెంత?"—"అతిచవుక!"అని కేకలు వేయిస్తూ వూరంతా తిప్పించాడు.

* * * *

రెండు నెలలుకూడ కాకపూర్వమే రామమూర్తి ఖాతాదారులలో చాలమంది పెద్దరెడ్డి కొట్టుకు వెళ్ళి కాఫీపొడుం తెచ్చుకుంటున్నారు. రామమూర్తి యిప్పుడు సరిగ్గా వ్యాపారం చెయ్యలేకపోతున్నాడు. ప్రతి రోజూ కొట్టు తియ్యటంలేదు. తీసినప్పుడయినా రోజంతా వుండటంలేదు. అప్పుడప్పుడు కొట్టు అమ్ముదామని వుందనే భావం స్ఫురించేటట్లు మాట్లాడుతున్నాడు.

* * * *

ఒకరోజు పెద్దరెడ్డి కొట్టులో, వెంకటనారాయణ పెద్దరెడ్డి మాట్లాడుకుంటున్నారు:

"అమ్మేట్టున్నాడట!" అన్నాడు పెద్ద రెడ్డితో, వెంకటనారాయణ.

"యెవరు చెప్పారు? వాడే అంటున్నాడేమిటి చివరకు, యింత బ్రతుకూ బ్రతికి?"అన్నాడు పెద్దరెడ్డి తృప్తిగా నవ్వుతూ.

"మాటల సందడిలో అన్నట్టుంది. అయినా ఈ రాత్రి ఒకసారి కదిలించి చూద్దాం" అన్నాడు వెంకటనారాయణ.

"ఈ రాత్రా?"

"అవును. యింటికి వెళ్దాం. అక్కడయితే సావధానంగా మాట్లాడవచ్చు."

"ఈసారి చాల చవుకగా బేరం చెయ్యాలి. మొత్తం అలోగిలితో కలిసి యేడెనిమిది వేలూ ఖరీదు వుండొచ్చు. ఒక వెయ్యి రూపాయిలు కాఫీ పొడుం మీద వచ్చిన నష్టం. అందుకని అయిదారువేలకు బేరం చెయ్యొచ్చు."

"అయితే కాఫీ పొడుంమీద వెయ్యివరకు నష్టపోయాడన్నమాట" అన్నాడు వెంకటనారాయణ వ్యంగ్యం ధ్వనించేటట్లు. నిజం చెప్పాలంటే, కాఫీ పొడుంమీద అయిన ఖర్చు, పెద్దరెడ్డి అప్పుడే రాబట్టాడు.

"అంతకన్నా దాటివుంటుంది" అన్నాడు పెద్ద రెడ్డి, వెంకటనారాయణకు లోకువ అయినందుకు విచారపడుతూ.

"మొత్తం నాలుగు వేలకు బేరం చేద్దాం. మిగులు వెయ్యి నాకుంటుందిలే" అన్నాడు వెంకటనారాయణ, యేమీ ఆవేశం లేకుండా.

రాత్రి యెనిమిది గంటలకు అన్నం తిని బయలుదేరారు, వెంకటనారాయణ, పెద్దరెడ్డి, రామమూర్తి యింటికి. తలుపు తట్టబోయేసరికి లోపలనుంచి సన్నగా మాటలు వినిపిస్తున్నాయి. రామమూర్తి, అతని కొడుకు వెంకట్రావు మాట్లాడుతున్నారు.

"మధ్యలో ఆపెయ్యాల్సిందేనా?"—వెంకటరావు.

"మరేం చేస్తాం!"—రామమూర్తి.

"నెలకు ముప్పయి రూపాయిలయితే చాలు నాన్నా! మిగతాదంతా వాళ్ళే పెట్టుకుంటున్నారుగా?"

"ఆ ముప్పయి మాత్రం యెక్కడ తీసుకురాను. పదిహేనురోజులయింది ఒక పౌను కాఫీపొడుం అమ్మి!"

'ముప్పయి రూపాయిలు!' అని లేకేగదా తన చదువు మానుకున్నది. పెద్దరెడ్డికి పాతికేళ్ళక్రితం సంఘటన జ్ఞాపకంవచ్చి, 'ఛెళ్' మని కొరడాతో కొట్టినట్లయింది! వెంకటనారాయణ పిలుస్తున్నా వినిపించుకోకుండా పరిగెత్తుకుంటూ యింటికి వచ్చేశాడు.

* * * *

మరుసటిరోజు రామమూర్తి కాఫీ పొడుంకొట్టు తెరవగానే ఒక కవరులో వెయ్యిరూపాయిలు, ఈ క్రింది వుత్తరం వుంది.

"నీకు అపకారం తలపెట్టినందుకు ప్రాయశ్చిత్తంగా వెయ్యిరూపాయిలు యిస్తున్నాను. యిది నీ కొడుకు చదువుకోసం వినియోగిస్తే నా పాపం పరిహారమయినట్లు భావిస్తాను."

క్రింద సంతకంలేదు. ఎవరు వ్రాశారో రామమూర్తికి అర్థంకాలేదు. యెవరో కాని తలుపు కంతలోనుంచి వేశారు!

వారంరోజులలో పెద్దరెడ్డి కొట్టులో 'శ్రేష్టమయిన కాఫీ పొడుం' అమ్మటం మానేశారు. పెద్దరెడ్డిని యెవరైనా కాఫీపొడుంగురించి అడిగితే ప్రక్కనున్న రామమూర్తి కొట్టులో మంచి కాఫీపొడి దొరుకుతుందని చెప్పుతాడు. తనకు వెయ్యిరూపాయిలెవరుపంపించారో, అప్పుడు అవగాహన అయింది రామమూర్తికి!

కళోపాసన

శ్రీ పారనంది జగన్నాథస్వామి

మనుజుని వ్యాపారాలలోకెల్ల అత్యధికాశ్చర్యాన్ని కలుగజేసే వృత్తి కళోపాసన. జీవనోపయోగాన్ని పురస్కరించుకునే వృత్తి సులభంగా సమన్వయము కాగలదు. ఆహారము నివాసము మొదలైన ప్రాథమిక ప్రయోజనాలుగాని, శరీరసౌఖ్యము కొరకు జాగ్రత్తపెట్టె దుస్తులుగాని, సాధారణ వ్యాపారాలను సాధించే పనిముట్లు ఆయుధాలు పరికరాలుగాని సులభముగా అర్థము కాగలవు. వీటికొరకు తన పరిసరాలను స్వాధీనముచేసుకొనే తెలివితేటలు, నేర్పు, బుద్ధివిశేషము మనుజునికి క్రమంగా వృద్ధికి వచ్చినవి. ఇదంతా ఒకవిధంగా జంతువులలోను, పక్షులలోనుకూడా కనిపిస్తుంది.

కాని మనుజుడు కేవలము ఉపయోగంతోనే సంతుష్టిజెంది విరమించలేడు. కేవలప్రాథమికావస్థలో ఉండే మనుజుని వ్యాపారాలలో కూడా అలంకరించడము, ముస్తాబుచేయడము వ్యక్తమవుతూ ఉంటుంది. వాడే కుండలకు, ఉపయోగించే ఆయుధాలకు, వేసుకునే దుస్తులకు నగిషీలు, బొమ్మలు, చిత్రాలు వేసేవారు. ఈ చిత్రాలవలన ఆకలిగాని దప్పికగాని లైంగికభావముగాని సంతుష్టిపొందవు. శరీరముమీద బొమ్మలు పొడుచుకోవడము, ఆభరణాలుగా ఏవేవో ధరించడము, తుదకు ముక్కుకి చెవులకు కళ్ళడిప్పలకు కన్నాలు పొడుచుకోవడము అలంకారములు జరుగుతూవచ్చేయి. విశేషము ఏమిటి అనగా ఈ కార్యాలకు కొంత శ్రమ, ఓర్పు, కొంత నొప్పి ఆయాసము కలుగుతూఉండేవి కూడా. ఆ తరువాత ఏదో మన సృష్టి సందర్శించవచ్చు. ఇదంతా కళ అనే నామధేయంక్రింద ఆవిర్భవింపబడిన వ్యాపారము.

కాబట్టే ఈ కళావ్యాపారాలు పరిశోధనలవలన ప్రాచీన మనుజుని మనస్సు, హృదయము, ఆత్మ ఎట్లు ప్రవర్తిస్తూ ఉండేవో ఊహింప సాధ్యమైనది. ఇట్టి వ్యాపారము ఏ ఒక్క దేశములోనో ఉండెననిగాని ఏ ఒక కాలవ్యవధిలోనే జరిగెననిగాని చెప్ప సాధ్యపడదు. నిదర్శనములు లభించినంతవరకూ నిశ్చయింపగలిగినది ఒక్కటే: మానవుడు మానవస్థితికి వచ్చిననాటి నుండీ ఈ వ్యాపారాలలో నిమగ్నుడై ఆనందించేవాడు. మానవచరిత్ర నిర్మాణములో ఈ కళావ్యాపార పరిశోధన చాలా ప్రాముఖ్యాన్ని వహిస్తున్నది. వారివారి శరీరాలు భౌతిక నిర్మాణాలు శిథిలమైపోయినా, ఈ ఆత్మవిన్యాసాలు నిలిచి ఉండిపోయినవి.

ఇప్పటికి తెలిసినంతవరకు ప్రప్రథమ చిత్రము సుమారు పండ్రెండు వేల సంవత్సరాల క్రితము ఒక గుహానివాసి తన గుహాకప్పుపై చిత్రించిన జింకబొమ్మ; పరుగెత్తుతున్న జింకయొక్క బొమ్మ. ఆధునిక కళాపరిశోధకుల విమర్శనప్రకారము ఈ జంతువుయొక్క పలాయనము వ్యక్తపరుస్తున్న అవయవావస్థలు ఫొటోగ్రాఫులో వ్యక్తమయే వాటి తథ్యానికి తీసిపోలేదు. ఈ జింకబొమ్మవంటివి ఇంకా చాల జంతువుల బొమ్మలు ఉన్నవి ఆ గుహలలో. ఆ బొమ్మలు రంగులతో చిత్రింపబడినవి. ఆ రంగుల గాఢత, తయారు, రసాయన శాస్త్రజ్ఞానముతో విర్రవీగే ఆధునిక చిత్రకారుని కూడా భ్రమింపజేస్తున్నవి. వీటి నైపుణ్యము ఆనాటి "అనాగరికుని"కి సాధ్యమా, ఈ చిత్రాలు మోసము కాదా అనే సందేహాలు కొన్నాళ్ళవరకు విమర్శకులను ఆకులపరచెను గాని మరికొన్ని అట్టివి కనబడగానే, వాటి యథార్థము స్థిరపడింది. మోసము కాదని తేలింది. రంగుల చిత్రాలే కాకుండా, మట్టితో చేసిన బొమ్మలు, విగ్రహాలు ఎముకలపై ఉల్లేఖనాలు మొదలైన కళావిశేషాలు కనిపించినవి.

వీటి పరీక్షవలన ఈ చిత్రకారులకు పూర్వము ఎప్పుడో ఈ విద్యకు ఆరంభము ఉండియుండవలెనని పరిష్కరింపబడినది. అకస్మాత్తుగా ఈ చిత్రకారులు వరప్రసాదలబ్ధులు కాలేదని శాస్త్రాభిప్రాయము. ఈ చిత్రకారులకు గల దృష్టి తీక్ష్ణత, ధారణా సూక్ష్మత, హస్తలాఘవం ఆశ్చర్యకరములు. వారు ఉపయోగించిన పనిముట్లు ఊహ్యములు.

వీరి కాలము ప్రాచీన శిలాయుగము. వీరి వృత్తి వేట. అందుచేతనే వారు చిత్రించినవన్నీ జంతువులు. వారి జీవనమంతా జంతువులపై ఆధారపడినది. ఆహారము, దుస్తులు, దీపములు జంతువులనుండి రావలసినవే. వారి వీరత్వము జంతువులమీదనే. వారి చెలిమి, వైరము, వారి సహకారము అన్యోన్యము జంతువులను పురస్కరించుకొన్నవే. జంతువులే వారి దేవుళ్ళు. వారి ఆహ్లాదములు, వారి ఆటలు, వారి పండుగలు, వారి జీవనము పూర్తిగా జంతుసంబంధమైనవే. వారి భయములు, వారి భక్తి, వారిని మించిన శక్తులు, వారిని చంపినా బ్రతికించినా అన్నీ ఆ జంతువులే. అందుచేతనే వారి కళ పూర్తిగా జంతుసంబంధమైనది అయింది.

క్రమంగా ఇతర వస్తువులపై వారి దృష్టి ప్రసరించగా, వారి కళావిషయములు మారినవి. తోటి మానవుడు విషయము కాగా మానవ చర్యలు కళా దృష్టిలోనికి వచ్చినవి. భౌతిక ప్రపంచము విస్తరించినది. ప్రకృతిలోని పుష్పములు, వృక్షములు, పక్షులు పండ్లు, నక్షత్రములు సూర్య చంద్రులు, ఆరాధనావస్తువులైనవి. అలాగే బాహ్య ప్రపంచమునుండి అంతరప్రపంచమునకు, ఇంద్రియ గోచరవస్తువులనుండి, ఊహాకల్పిత సంకేతములు కళా కర్షకములు అయినవి.

ఇహలోక సంపద, మాయాతంత్రము, ఇహలోకాతీతము. పరస్పరము మిళితమై మానవవ్యాపారాన్ని ఉద్వేగిస్తూ ఉన్న యుగాలలో కళారీతులన్నీ ఆ ప్రయోజనాలనే వ్యక్తపరుస్తూ ఉండేవి. సౌందర్యము సత్యము సౌఖ్యము మొదలైన భావాలు పురుషార్థాలుగా ప్రవర్తించగానే కళావిధానాలుకూడా మారినవి. ఈ సూత్రము అన్ని దేశాలలోని అన్ని కాలాలలోని కళావీథులకు వర్తిస్తుంది.

ప్రాచీన కాలమందలి ఈజిప్టులోనికళ చాలా వరకు మరణము, అనంతర స్థితి, అనే వస్తువును ఆశ్రయించినది. ప్రసిద్ధికివచ్చిన పిరమిడ్లు అట్టివేగదా. అట్టిదే పెద్ద స్ఫింక్సుఅనే విగ్రహం. అరవైఅడుగులు ఎత్తు 200 అడుగులు పొడుగు. పెద్దదేవాలయాలు ఎక్కువ పరిమితి గలవి; ఒక్కొక్కటి 70 అడుగులు ఎత్తుగల 134 స్తంభాలుగల మందిరిహాలు. వీటి పరిమాణము ఆశ్చర్య జనకము. ఈ పెద్ద ప్రమాణాలు స్థైర్యమును గాంభీర్యాన్ని సూచిస్తవి. విగ్రహాలను చెక్కే కళలోనే కాదు ఈజిప్టు వారి ఖ్యాతి, రంగుల చిత్రాలలోను చక్కని ఆభరణాల కూర్పులోను ప్రసిద్ధిని సంపాదించారు. ఊర్ మెసపొటోమియా లోయలలో (ఈమధ్య దొరికిన విగ్రహాలు చిత్రాలు ఈ ప్రాచీన—ఈజిప్టు కళావిధానాలను పోలియున్నవి. ఈజిప్టు కళాచరిత్ర 5000 సంవత్సరాల పూర్వపు కథ. సుమారు 3000 సంవత్సరాల తరువాత ఈ కళాచిత్రాలు నడిచినవి. వీటి విషయాలను పోలిన కళావిధానము పూర్వపు అస్సీరియా దేశములోను విరాజిల్లినది. వీటి అన్నిటిలోను మాత్రప్రాయముగా అత్తినది మరణ విషయకమైన వస్తువు. రాజుల సమాధులు ప్రాముఖ్యాన్ని వహించినవి. అందువలన యుద్ధాలు సేనాధిపతులు, వీరులు ఎక్కువగా రూపితముకావడము తటస్థించింది.

ప్రాచీన కళాచరిత్రలో ఎక్కువఖ్యాతికి వచ్చినది గ్రీకుకళ. ఈకళావిధానాలలో ముఖ్యంగా గమనించవలసినది సాధారణప్రజల నిత్యజీవితవ్యవహారాలు కళా వస్తువుగా ప్రసిద్ధికి రావడము. ఆటలు, విలాసాలు, కులాసాలు చిత్రింపబడినవి. యువకులు స్త్రీ పురుషులు, వెండిబంగారం ఆభరణాలు చిత్రాలలో అమర్చబడినవి. కేవల సౌందర్యము ఆరాధకవస్తువు అయింది. కంటికి ఇంపునిచ్చే చిన్న చిన్న వస్తువులు, గృహోపకరణాలు ఉపయోగానికి వచ్చినవి. సంసారసౌఖ్యము, జీవనానందము ముఖ్యము కాగా బలముగల పురుషుడు, సౌందర్యముగల స్త్రీ, వారి ఉల్లాసాలు, వారి భూషణాలు విరివిగా చిత్రింపబడినవి. జంతువుల పోట్లాటలు, వీరుల గరిడీలు, వ్యక్తుల పోటీలు, గెలుపు బిగు—ఇట్టివి కళావస్తువులు అయినవి. దేవుళ్ళు, దేవాలయాలు ప్రజల నిత్యజీవనంతో సంబంధము గలవిగా మారినవి. శత్రువులలో

యుద్ధాలు, ఇతర దేశాధిపతుల మంత్రుల రాకలు అక్కడక్కడ వర్ణింపబడినవి.

శరీరమునకు ఎక్కువ గౌరవమును చూపిన గ్రీకులు ఆ గౌరవాన్ని వారి కళలో ప్రదర్శించారు. నగ్న శరీరాన్ని విరివిగాను ఆకర్షణీయంగాను చిత్రించారు. మాంసకండల పటిమను, అంగముల విన్యాసాలను బాగా ప్రదర్శించారు. ఇందుకు వారి దేవుళ్ళ విగ్రహాలు చక్కని నిదర్శనాలు. ముఖ్యంగా అపాలో అనే విగ్రహాన్ని చూచి ఆనందించవచ్చు. చక్రాన్ని విసిరే విగ్రహం కడు రమ్యమైనది. ఆ దేశపు కళను వివరించేటప్పుడు ఫీడియసు అనే శిల్పిని స్మరించి తీరవలెను. ఇప్పటికి 2500 సంవత్సరాలైంది అతని విగ్రహాలు లోకంలోకి వచ్చి. వాటిని మించిన చెక్కడము రాలేదని చెప్పినా అతిశయోక్తి అనిపించుకోదు. పార్థినాను అనే దేవాలయంయొక్క శిథిలాలే మనకు ఇప్పుడు లభించేవి. వారి సౌందర్య దేవతా విగ్రహాన్ని చూచి తీరవలసిందే. అనేకమంది శిల్పులు ఆ దేవతను చలవరాతిలో చెక్కినారు. అందరికీ ఆరాధ్యమే గదా!

రోమనుల కళాచరిత్రను ప్రత్యేకంగా ఈ చిన్న వ్యాసంలో వివరించదలచుకోలేదు. ఒక విధంగా గ్రీకు కళే కొంచెము భిన్న రీతులలో విస్తరించింది. గ్రీకులు రోమనులు కొలిచిన దేవుళ్లు, నమ్మిన మతము, అనుభవించిన జీవనము, అన్వేషించిన భౌతిక సంపద, కామించిన సౌఖ్యము, ఈ పురుషార్థాలు క్రైస్తవ మతప్రచారములో చాలావరకు మారినవి. ఈ రెండు నాగరికతలు ఫలముగా పరిణమించిన కళావిధానమునకు ఒక విశిష్టత గలదు.

ఈ రీతులలో పేర్కొనవలసినది గ్రంథాలలోని చిత్రాలు. గ్రంథాలు వ్రాతమూలకమైనవేగదా. వాటిలో రంగులతో వ్రాసిన చిత్రాలు ఆ గ్రంథభాగానికి వ్యాఖ్య. ఈ రీతి నవీనయుగములో ఎంతో ప్రాముఖ్యానికి వచ్చినదిగదా. దీనికి ఆరంభము సుమారు పండ్రెండు శతాబ్దాలక్రిందట. ఈ గ్రంథాలు సాధారణముగా ఆధ్యాత్మిక విషయకములు. క్రీస్తు, వాని అనుచరులు ఆనాటి లోకాన్ని బాగా ఆకర్షించారు. వీరి చిత్రాలు వారి మతసంబంధమైన ఉదంతాలను పురస్కరించుకొన్నవి. ఇవి గ్రంథాలలోనే కాదు; ఆ మత దేవాలయాలలో విగ్రహాల రూపంగా ప్రతిఫలించినవి.

ఇట్లు సుమారు ఏడుశతాబ్దాలు నడవగా ప్రపంచ చరిత్రలో జరిగిన మహమ్మదీయ విప్లవము కళాచరిత్రలో కూడా ప్రభవించి నూతనావిర్భావాన్ని తెచ్చిపెట్టింది. మతములో ఎట్లా క్రైస్తవ మతముతో పోటీ వచ్చిందో, అదే విధముగా అన్ని విషయాలలో వైరుధ్యము సంభవించింది. ఆ సంఘర్షణ కళనుకూడా చుట్టబెట్టింది. విగ్రహారాధనాన్ని తిరస్కరించిన మహమ్మదీయ ప్రబోధము విగ్రహతక్షణ విద్యను నిరసించింది. కేవల భూషణాలంకారాలమీద చాతుర్యాన్ని వినియోగించవలసి వచ్చింది ఈ కళారాధకులకు. చిత్రవిచిత్రమైన జిలిబిలి అల్లికలలోను కూర్పులలోను నైపుణ్యాన్ని వారు ఉపయోగించారు. రేఖా కల్పనలో ప్రత్యేక విశిష్టతను విశదపరచారు. ఈ ప్రజ ప్రత్యేక నివాసములలో ఉండడముకంటె ఊరూరు తిరిగెడు స్వభావము ఎక్కువగా గలవారు కావడము చేత, వారి తీరిక కాలంలో చేసిన పనులు ఒకచోట స్థిరంగా ఉంచవలసినవి కాకుండెను. వారి కళాచాతుర్యము, అల్లికలలోను, చిన్న చిన్న చిత్రాలలోను, రంగుల గమనికలలోను వ్యక్తమయేది.

కాని క్రమంగా రాష్ట్రాక్రమణ, రాజ్యపరిపాలన అవసరం కాగా స్థిరత కుదిరి, కళలో కూడా స్థైర్యాన్ని నిరూపించే పెద్దపెద్ద గోరీలు, కోటలు, హర్మ్యాలు కట్టబడినవి. కాని వీటిలో అలవడియున్న జిలిబిలి చిత్రాలను వదిలివేయలేదు. తేనెటీగల పట్టుల వంటి చెక్కడములు, చిత్రములు, జిలిబిలీలు పెద్ద కట్టడాలలో పొందుపరచబడినవి. గీతలలో కూర్చదగిన ఆకారాలు చదరము, పంచకోణము, ఈ మొదలైన రేఖాగణితాకారాలు బాగా చిత్రాలలో ఇముడ్చబడినవి. మహమ్మదీయ కళాకారులు ఏ దేశంలో ఉన్నప్పుడు ఆ స్థానిక కళాచాతుర్యాన్ని నిరసించక తమ చిత్రాలలో ఉపయోగించుకొన్నందున, మిశ్రమ నైపుణ్యము ఆదరణలోనికి వచ్చింది.

ఇందువలన సంప్రదాయముకంటె ఎక్కువ విలువకు వచ్చింది వ్యక్తిత్వము. బుద్ధిమంతులు, నిపుణులు తమ దీక్షాశక్తిని నూతన సృష్టికార్యాలకు ఉపయోగించేవారు. అట్టి వారు గిజటో, ఏంజలికో, లిప్పి,

బాట్టిసెల్లి మొదలైన ఇటలీలోని ఫ్లారెంసైను చిత్ర కళాకారులు. విగ్రహాలకు వస్తుతత్వము కల్పించడముకంటె భావప్రకటనము అధిక వ్యాప్తిలోనికి వచ్చింది. ప్రకృతిని స్వభావాన్ని, వాస్తవమును అనుకరించడము మాత్రమైనది. పాశ్చాత్య నాగరికతలో ఈ యుగంలో మతప్రచారము ప్రబలంగా ఉన్నందున క్రైస్తవమత గాథలు చిత్రాలలోని వస్తువులు అయినవి. ఆధ్యాత్మిక గాంభీర్యము, సౌశీల్యశాంతము, ముఖ వర్చస్సులోను, ముఖ్యముగా నేత్రములలోను ధరించిన వేషములో వ్యక్తమవుతూ ఉండేవి. ఈ కళలను పోషించేవారు వీటిని దేవాలయాలలో నిర్మిస్తూ ఉండేవారు. అందువలన కొంతవరకు సంప్రదాయ శృంఖలాలు తప్పేవి కావు.

క్రమంగా మతప్రచారానికీన్నీ సౌందర్యారాధనకున్నూ ఉండే సంబంధము తప్పిపోవడము ఆరంభమైంది. విగ్రహములలో శరీరసౌందర్యాన్ని ప్రకటించడము ప్రారంభమైంది. స్త్రీ పురుషుల నరాల కూర్పులను, గమన విలాసాలను, రూపుల చిత్రాలను, శరీరగతులను, చిత్రించి ప్రేక్షకులను ఆనందింపచేయడము కళావిధానంగా మారింది. కళాపోషకులు మతసంస్థాధిపతులు గాక సౌందర్యప్రియులు, జీవితోన్నత్యాభిమానులు సామాన్యలోకము కావడము సంభవిస్తూ ఉండేది. వసంతాగమనము మదనావిర్భావము సామాన్యభావముల ప్రకాశము, ఈ మొదలైన చక్కని చిత్రములుగా నిరూపించడము ఆచరణలోనికి రావడము ప్రారంభమైంది. వేట, ఆట, విందు, పాట వస్తువులు అయినవి. పుస్తకాలలోను, కిటికీలు గాజుపటాల మీదను, ఆయుధాలు గుస్తులమీదను రకరకాల రంగుల చిత్రాలు సాధారణ కళారీతి అయింది. అంతరభావాలను, మనోవృత్తులను, మానవనీతులను సమన్వయించే చిత్రాలు బయలుదేరినవి.

చిత్రకళలో సంభవించిన పెద్దమార్పు రంగుల తయారు రీతిలో. మొట్టమొదటిసారి రంగులను నూనెలతో కలపడము ప్రారంభమైనది. ఇది ఇకనడచిన రంగుచిత్రాల కన్నిటికీ మూలము. త్వరలో ఆరిపోయేది, ఎక్కువకాలము నిలిచేది కనిపెట్టడానికి అనేక ప్రయత్నాలు చేసి అవిసె నూనెను తుదకు నిర్ణయించారు. ఈ సందర్భంలో జాన్‌వాన్ అయిక్ పేరును స్మరించకతప్పదు. అతడు చిత్రించినవి ఇప్పటికీగూడా ఆకర్షణీయాలుగా ఉన్నవని కళారాధకుల అభిప్రాయం. పాశ్చాత్య చిత్రకళాచరిత్రలో లియొనార్డో డావిన్సీ, మైఖేలు ఏంజిలో, రాఫేలు అనే పేర్లు చిరస్మరణీయాలు. వీరి చరిత్రాంశాలు అద్భుతంగా ఉంటవి. వాటితో ఈ వ్యాసాన్ని నింపసాధ్యము కాదు. పాశ్చాత్యదేశాలలోని ఆధునిక కళాచరిత్ర అంతా వీరి మార్గానుయాయులతో నిండినది అని చెప్ప సాధ్యము. చిత్రాలు ఏ చిత్రములసంపుటములోనైనా గంటలకొలదీ చూస్తూ ఆనందించగలము. వాటి మూలాలను ఆయా స్థలాలలో చూడగలిగే వారి ఆనందమునకు మేర ఉండదు.

ప్రసిద్ధికివచ్చిన అనేకులు కళాసౌందర్యాన్ని మూర్తీభవింపజేసినవారు ఉన్నారు. చిత్రగతులను అనుసరించి వ్యక్తిత్వదీక్షశక్తిని ఉపయోగించి శాశ్వత కీర్తిని సంపాదించినవారు ఉన్నారు. కాని కళా చరిత్రలో ప్రత్యేక ప్రత్యేక సంప్రదాయాలను నిర్మించినవారుకారు. వారి క్రొత్తరీతులను వివరించడానికి ఒక ఉద్గ్రంథానికి పూనుకోవాలి. ఈ ప్రవాహంలో ఆగవలసిన తీర్థాలలో ఒకటి వెన్నిసునగరం; ఆ నగరాన్ని అలంకరించినవారిలో ప్రముఖుడు టీషియన్. ఇక్కడికి వెళ్లనగాని ముక్తిపొందదు ఏ కళారాధకుడు అనే ప్రతీతి వాస్తవమైనదే.

ఇట్లు సుమారు అయిదువందల సంవత్సరాలు గడిపివేస్తే నవీన యుగానికి చేరుకోగలము. పాశ్చాత్యఖండములోని ప్రతీదేశముకూడా కళారాధన చేసింది. ప్రతీదానిలోను ప్రసిద్ధపురుషులు వన్నెకుతెచ్చిన చిత్రాలు చెక్కడాలు, నిర్మాణాలు, విగ్రహాలు, రంగులు ఉన్నవి. ఇటలీ తరువాతివే ఈ దేశాలు. వాటిలో ముఖ్యమైనవి జర్మనీ, ఫ్లాండర్సు, స్పైను, హాలండు ఫ్రాంసు, ఇంగ్లండు.

పద్దెనిమిదో శతాబ్దము వచ్చినదాకా ఇంగ్లండులో కళ ఏమీ ప్రాముఖ్యానికి రాలేదు. కొందరు కళాకారులు ఉండినా వారి చిత్రాలలో ఎన్నుకోవలసిన గొప్ప ఏమీ ఉండలేదు. ఇటలీ, ఫ్రాంసు దేశాలలోని అగ్రగణ్యులను అనుసరించినవి, ముఖ్యస్థానానికి చెందినవి బయలుదేరుతూ ఉండినవి. హోగర్తుతో ఇంగ్లండులో నూతనయుగం ప్రారంభమైనది అని చెప్పవచ్చును. ఒక కథానికను చిత్రాలద్వారా వ్యక్తపరచడము అనే రీతిని ఇతడు ప్రాముఖ్యానికి

తెచ్చాడు. వివాహ—ఉదంతాన్ని చిత్రంగా అలాగు వర్ణించాడు. ఆరుసీనులలో దానిని పూర్తిజేశాడు. కంటికి కనబడు ప్రదేశాన్ని అవగా ప్రకృతిలో నున్న ఒక ఆకర్షణీయస్థలాన్ని చిత్రించడము ఒక క్రొత్తరీతిని ఈకాలంలో విజృంభించింది. ఇంగ్లండులోని ప్రకృతి చిత్రాలు బయలుపడడము జరిగింది ఇందుమూలాన్న. ఒక నాటక నటీమణిని చిత్రించి ప్రఖ్యాతి గడించిన జోషువా రైనాల్డ్సు ఈ గణంలోనివాడు. సంతకు పోయే సామానుబండీ అనే చిత్రాన్ని వ్రాసిన కళాకారుడు ఒకడు; ఇది గ్రామీణుల జీవితంలోని ఒక ఘట్టం. సౌందర్యానికి ప్రసిద్ధికివచ్చిన యువతుల చిత్రాలను ధనికుల బొమ్మలను వ్రాసి చాలామంది ఈ పద్దెనిమిదవశతాబ్దంలో పేరుగడించారు, ధనమునుకూడా సంపాదించారు. అట్లు ప్రభువుల ధనికుల పోషణవలన అనేకులు యూరోపునుండి ఆకర్షింపబడ్డారు. ఇంగ్లండులో బొమ్మల కళ చాలా ప్రసిద్ధికి వచ్చింది. రంగులలో చాలా నైపుణ్యము చూపబడింది.

ఇంగ్లండులోను యూరోపులోనుకూడా నూతన కల్పనలు కళా స్వాతంత్ర్యము ప్రాదుర్భవించడం ఆరంభమై కళ అనేక రీతులను విజృంభించేది. ప్రసిద్ధ కళా గురువులను అనుకరించడమూ, అతి ప్రాచీనులైన గ్రీకు కళాకారులను అనుసరించడమూ, కేవల నూతనత్వమునకు ఉద్యమించడమూ అనే రీతులన్నిటికి ఉదాహరణాలు కనబడేతవి. ఒక క్రొత్తరీతి వక్కిరింత చిత్రాలతో తనకు ఇష్టములేనివారిని చిత్రించి పేరు సంపాదించినవాడు గోయా అనే ఫ్రెంచి కళాకారుడు. అతని ప్రసిద్ధికివచ్చిన చిత్రము మాత్రము ఆ రీతిదికాదు. ఒక సుందరిని చిత్రించి ఆమెలో ప్రతిభ మనోహరత్వమును దివ్యముగా వెల్లడిచేశాడు. ప్రకృతి దృశ్యాలను కనులకుకట్టునట్లు చిత్రించడం ప్రసిద్ధికి వచ్చింది. ఈ రీతి కళలో పేరుకు వచ్చినవాడు టర్నరు అనే ఆంగ్లేయుడు. ఈ చిత్రాలకు రంగులను నీటిలో కలిపి ఉపయోగించడము ఆచరణలోనికి వచ్చింది. ప్రకృతిని అనుసరించడములో వెలుతురు నీడ అనే రెండింటిని కలపడము ఆవశ్యకముకాగా ఇది నైపుణ్యమే కాకుండా భౌతికశాస్త్రము కూడా అయింది. ఇందుకు ఉపచరించేటట్లు రంగులను సిద్ధము చేసుకోవలసివచ్చింది. ఈ పరిస్థితిలో రంగుల విజ్ఞానము వృద్ధికి రావలసివచ్చింది కూడా. ప్రకృతిలో మెరుస్తున్న రంగుల మహిమ చిత్రాలలో కనబరచవలసి వచ్చింది. సూర్యోదయము, సూర్యాస్తమయము, సూర్యకాంతి చంద్రకాంతి— ఇవన్నీ వివిధమార్గాల చిత్రవస్తువులు అయినవి. అలాగే వర్షము, మంచు, మొదలైన ప్రకృతి విశేషాలు ఆకర్షించినవి కళాకారులను. ఈ కళ ఇంగ్లండులో బాగా ప్రసిద్ధికి రావడమువల్ల ఆంగ్ల కళాకారులు కొందరు యూరోపులో ముఖ్యంగా ఫ్రాంసుకువెళ్లి ఖ్యాతిని ధనాన్ని బాగా సంపాదించగలిగారు.

19 వ శతాబ్దములో ఇంగ్లండు పేరు కళా చరిత్రలో మ్రోగగలిగింది. ఇందుకు ముఖ్యకారణము రోజెటివంటి కవులు చిత్రకారులుగా వన్నెకు రావడము. కళావిమర్శకులు రస్కినువంటివారు కళా పవిత్రతను ఉద్ధరించారు. కాని విక్టోరియా రాజ్యానికి రాగానే రాజ్యతంత్రములో ప్రవేశించిన ప్రజాస్వామ్య ధోరణి పారవశ్యతముతోపాటు కళాంధనలో కూడా విజృంభించింది. నిత్యజీవితములోని వస్తువులు, సామాన్య ప్రజాచిత్రములు ప్రాముఖ్యానికి వచ్చాయి. పూర్వము కూడా ఇట్టి ధోరణి అక్కడక్కడ కనబడ్డా, ఇప్పుడు వ్యక్తమైనట్లు ప్రత్యేక విశిష్టతకు ఆ ధోరణి రాలేదు. చిత్రములలోని ఘనతా విశేషాలు సామాన్యులకు కూడా అవగాహన కావలెను అనే మాత్ర మొకటి విమర్శన దృష్టికి వచ్చింది. రైలుస్టేషను, గుఱ్ఱపు పందెము, నూతన దంపతులు, బడికి పోయే కుర్రవాడు—ఇట్టివి ప్రదర్శింపబడగానే, సామాన్యప్రజలో ఒక క్రొత్త చైతన్యము ఉద్రేకించింది. ఈ సామాన్యభావాలను వ్యక్తపరచడంలో అనేకులు ప్రావీణ్యము చూపారు. ఈ సందర్భంలో జంతువులు ముఖ్యంగా ఇంటిలో పెరిగే కుక్కలు, కోళ్లు మొదలైనవి చిత్రింపబడినవి. కథలను వివరించే చిత్రాలు ఒక క్రొత్తపద్ధతిఅయింది. అలాగని గాంభీర్యానికి సూక్ష్మతకు లోపం ఏమాత్రం రాలేదు. అందుచేతనే ఆధ్యాత్మిక దృష్టితోను నీతిపరంగాను చిత్రకల్పనలు ప్రదర్శింపబడడము, ఆరాధింపబడడము లేకపోలేదు. ఇట్లు ఊహాప్రపంచంలోనికి చిత్రకళ ప్రవేశించగానే, కవిత్వం కళ ఒకే శ్రేణికి చెందినట్లు అంగీకృతమై కవులకు గల ప్రాధాన్యము కళాకారులకు కూడా సిద్ధించింది. కవిత్వంలో వచ్చిన మార్పులు కళలోను, కళలో వచ్చిన నూతన రీతులు కవిత్వంలోను

ప్రవేశించినవి. ఒకవైపునుండి ప్రకృతిశాస్త్ర విజృంభణ, ఒకవైపునుండి స్వాతంత్ర్యవాంఛ మనుష్యుల ఆత్మలను ఆవేశించిన కాలము ఇది. ఈ ఆవేశము కళారాధనలో కూడా ప్రతిబింబించింది. ప్రకృతి శాస్త్రముల విజ్ఞానాన్ని కళలో ఆవశ్యకమైన విషయాలలో చిత్రకారులు ఉపయోగించక తీరనందున విధానములో అనేకములైన భిన్న రీతులు సృజింపబడినవి. ఈ మార్పులలో చాలా ముఖ్యమైనది రంగులను కలపడము, రంగులను వాడడము, రంగుల తీక్ష్ణతను సంపాదించడానికి వెలుతురును ఉపయోగించడము; ఇవన్నీ భౌతిక శాస్త్రములోని కాంతి సంబంధ పరిశోధనల ఫలితము. అందుచేత కళ చాతుర్యమే కాకుండా శాస్త్రము కూడా అయిపోయినది. కళను అభ్యసించే వారు వారి ధీశక్తిపైనే ఆధారపడడమే కాకుండా, శాస్త్రజ్ఞానాన్ని సంపాదించవలసివచ్చింది.

భౌతికశాస్త్ర పరిశోధనలద్వారా కళాకారుని పనిముట్లు కూడా మారినవి; ఎక్కువ పనికీ, సూక్ష్మతలోను, అరగడములోను చాలా మార్పులు వచ్చినవి. రంగుల చిత్రాలు వ్రాసేవాని కుంచెలు చాలా అభివృద్ధికి వచ్చినవి. అంతకంటె ఎక్కువగా మారి అభివృద్ధికి వచ్చిన పనిముట్లు చెక్కడము కళావిషయములో. లోహముల శాస్త్రము బాగా వృద్ధికి వచ్చినందువల్ల సుత్తి సేనాం మొదలైనవాటి పటిమ ఆకారము బాగా వృద్ధికి వచ్చినవి. అలాగే ఉపయోగించే రాయిలో కూడా, పాతిపోసే వస్తువులలో కూడా చాలా పరిశోధన జరిగింది. పనిముట్లు సున్నితత్వమువలన చెక్కడములో సూక్ష్మత సాధ్యమై శిలావిగ్రహాలలో కూడా ఎక్కువ భావప్రకటన వీలైంది.

అంతేకాకుండా ప్రపంచము అంతా చక్కగా అందుబడిలోనికి రావడమువలన, ఇతర దేశాల రీతులను ఆరాధించిన కళాకారులు క్రొత్త పోకడలను కల్పించగలిగారు. చీనా జపాను దేశములలో నిలిచియున్న ప్రాచీన సంప్రదాయాలను గమనించిన విస్లర్ వంటివారు క్రొత్త రకాలను సృజించ ప్రారంభించారు. సౌందర్యముచేతను ప్రతిభావిలాసాలచేతను ఆకర్షించే వ్యక్తులను పటాలలో చిత్రించి ప్రకృతిని భావనను మేళవింపుచేశారు. చిత్రాలను చూసి కవనాలు చెప్పడం, కవనం చదివి చిత్రించడం సుప్రసిద్ధమై, కవిత్వ చిత్ర కళలు రెండూ లలిత కళలుగా మైత్రి పొందినవి.

చిత్రకళలో వచ్చిన మార్పులకు ఒక ముఖ్యకారణము ఫొటోగ్రఫీ. వాస్తవికత్వము ఆదర్శంగా ఉండిన సంప్రదాయానికి పెద్ద అఘాతము తగిలింది ఈఫొటోగ్రఫీవల్ల. ఎంత నిపుణంగా ప్రకృతిని అనుకరించినా చిత్రకారుడు ఫొటోగ్రాఫులోని వాస్తవికత్వాన్ని గెలవలేడు. కాబట్టి చిత్రకారులు వాస్తవికత్వ సంప్రదాయాన్ని విడిచి భావనాసంప్రదాయాన్ని స్వీకరించారు. నాగరికతపై ఆధునిక యుగంలో కలిగిన జుగుప్స చిత్రకళపై కూడా కలిగింది. పట్టణాలలోని జీవితం మోసము అన్న ప్రచారంతో గ్రామాలవైపు ఎట్లా దృష్టి మారిందో రాజకీయ ప్రచారకులలోను, కవులలోను, తత్వవేత్తలలోను, అలాగే చిత్రకారులలో కూడా ఒక విధమైన అట్టి మార్పే వచ్చింది. నగ్నవిగ్రహాలు, చిన్నపిల్లలు, గ్రామీణులు, ప్రాచీన పద్ధతులలో జీవిస్తూ దూర ద్వీపాలలోను అడవులలోను ఉన్న అనాగరికులు కళావస్తువులైనారు. ప్రపంచ యుద్ధాలు, ప్రతీ దేశములోను ప్రజల హృదయాలను కంపింపచేసున్న ఆర్థిక రాజకీయ నైతిక విప్లవాలు, ప్రపంచమంతా వ్యాపించియున్న అశాంతి, విజ్ఞానములో ప్రసక్తమైన తత్వాలు, సారస్వతంలోవలె, కళలో కూడా, (జీవితమంతలోనూ అని చెప్పడము ఎక్కువ తథ్యమనిపిసుంది) విప్లవతుల్య పరివర్తనాలను తెచ్చిపెట్టినది.

ఒక ముఖ్యమైన పరివర్తనం కళాప్రయోజన చర్చ. కళ కళకొరకే అనే సంప్రదాయంపోయి, కళకు విశిష్ట ప్రయోజనం ఉండాలనే మతము ప్రబలమైంది. కళాకార్యాలద్వారా విద్య గరపాలి; సాంఘిక సేవ నడపాలి; మానవజీవితాన్ని ఉన్నత స్థాయికి తేగలగాలి; ఆరోగ్యము, ఆర్థికసంపద, క్షేమము, వీటిని పెంపొందించాలి. ఈ భావ—ఆశయాలను మానవ స్మృతిలో బాగా నాటుకొనేటట్లు చేయగలిగే సాధనాలలోకెల్ల ప్రబలమైనది కళాకార్యము అని సర్వాంగీకృతము. ప్రచార కార్యాలకు ఈ సూత్రతథ్యాన్ని బాగా ఉపయోగిస్తున్నారు అన్ని సంస్థలవారున్నూ. ఈ కార్యాన్ని బాగా సాధించారు యుద్ధపుదినాలలో ప్రజలను యుద్ధమునకు పురిగొల్పడానికి; ఒక ప్రత్యేక సంప్రదాయము బయలుదేరింది ఈ ప్రయోజనాన్ని చక్కగా నెరవేర్చడానికి. ఈ మతమును, ఈ ప్రయోజనాన్ని

ఖండించే విచక్షణాలు కొందరు ఉన్నారు. తథ్యము నుంచి దూరంగా తీసుకొనిపోయి ప్రేక్షకుని మభ్య పరచడము వీటి ఫలితము; ఆ ఫలమునకు చిత్రములు బలమైన సాధనములు; ఇది మోసము మానవాభివృద్ధికి: అని వారి విమర్శన. ఈ ఖండన తీవ్రముగా ఉన్నట్లు కానవచ్చినా యుద్ధమును ప్రవృత్తిగా భావించే శాంతివాదులకు ఈ చిత్రములు ప్రజలను యుద్ధావేగముతో ముంచివేయడము మానవత్వ పరిణామమునకు అవి మోస సాధనాలుగా బోధించుటలో పొరపాటు లేదుగదా!

యుద్ధాలు చల్లారి, ప్రపంచమంతా యుద్ధఘోషలను మాపుచేయ ప్రయత్నిస్తున్న ఈ కాలంలో స్మరించవలసిన సంప్రదాయం ప్రపంచైక్యత. కళాకారులద్వారా ఈ ఘన—ఆశయాన్ని స్థిరపరుప ప్రయత్నించేవారు పరిణతిని సంపాదిస్తున్నారు. సారస్వతాదులలో విభిన్నత భావానికి అవకాశము ఏమైనా ఉండవచ్చునుగాని ఏ భేద చిహ్నానికి అవకాశము లేని మానవ హృదయాన్ని చిత్రాలద్వారా వ్యక్తపరుప సాధ్యమని ఇట్టివారి సిద్ధాంతము. అందుచేతనే వివిధదేశాలలోని కళారాధకులు పరస్పరము గురుశిష్య భావముతో భిన్న సంప్రదాయాలను పరిగ్రహిస్తూ విభిన్నత్వములో ఐక్యతను సాధిస్తున్నారు.

ఇరవై వేల సంవత్సరాలక్రిందట గుహలలో ప్రారంభమైన కళ క్రమంగా ప్రపంచమంతా వ్యాపించి భిన్నరీతుల వివిధమార్గాల అభ్యున్నతికి వచ్చి ప్రజాజీవితములో ముఖ్యస్థానాన్ని వహిస్తూ విరాజిల్లుచున్నది. పూర్వము ఏ ప్రభువులో ధనికులో అధిపతులో పోషకులైఉండే సందర్భంలో ఇప్పుడు ప్రజాసామాన్యము ఆస్థానమును ఆక్రమించి, కళారాధకునికి స్వాతంత్ర్యాన్ని రుచి ప్రతిభను కల్పించింది. ఈ పరివర్తనానికి పెద్ద సహకారి సినీమాసంస్థ. భవిష్యత్తులో కళ మానవజీవితాన్ని ఎట్లు పరిణమింప జేస్తూ పరిణమిస్తూఉంటుందో ఇప్పుడు ఊహించడము శక్యముకాదు.

ప్రాచీనకాలములో కళాకారులకు వారి చిత్రముల పనులద్వారా ఎంతో ధన సంపాదన సమకూరేదో తెలుసుకొనుటకు తగిన వృత్తాంతము లభించకున్నది. దేశప్రభువులు, సామంతరాజులు, మఠాధిపతులు, ధనికులు కళలను పోషించేవారు. తమకు గిట్టని కళాకారులను హింసించిన ఉదాహరణాలు కూడా ఉన్నవి. తెలిసిన భోగట్టాను బట్టి కళాకారులు సాధారణముగా ఐహిక భోగాలకు అలవాటు పడినవారు కారు. అని ఊహించగలము. సంపదను అనుభవించినవారు చాలా కొంచెముమంది. ఒకొక్క చిత్రానికి సుమారు వెయ్యిరూపాయిల చొప్పున ఇచ్చిన ప్రభువులు కలరు; టిషియనును దేశప్రభువు అట్లు సంతోష పెట్టెను. ఒక కళాకారునికి వాని ఆర్థిక దైన్యాన్ని గ్రహించి ఆ పట్టణపు మ్యునిసిపల్ అధికారులు పింఛను ఇచ్చారు. రైనాల్డ్సు అనే ఆంగ్ల కళాకారుడు 80 పౌనులకు అమ్మినచిత్రాలు ఆ శతాబ్దం మారగానే వెయ్యిపౌనులు ఖరీదు చేసినవట. కాని తన కళాచాతుర్యము వలన అతడు ఎనభైవేల పౌనులు సంపాదించగలిగినవాడట. ఒకొక్క రంగుల బొమ్మకి 750 పౌనులు ఇచ్చేవారట. టర్నరు అను ఆంగ్లచిత్రకారుడు 140,000 పౌనుల ఆస్తిని చిత్రములద్వారా సంపాదించగలిగినవాడట. 19 వ శతాబ్దంలో అమాత్రం పేరుగలిగిన చిత్రకారుడు ధనాభావంతో దారిద్ర్యం అనుభవించ నక్కరలేకపోయింది. చిత్రాలకు విలువ వచ్చినరోజులు అవి. ఒక చిత్రమును దాని కర్త 20 పౌనులకు అమ్మెను; ఆ కొన్నవాడు 17400 పౌనులకు దానిని తిరిగి వేలంలో అమ్మినాడు.

తన జీవితకాలంలో రెండు పెన్నీలకు (సుమారు రెండుఅణాలకు) అమ్ముడులేని మెర్యానుని పటం (19 వ శతాబ్దం) వెయ్యిపౌనుల ఖరీదు చేసెందట అతని అనంతరము కొన్నాళ్లకు.

ఈ కాలము ప్రజాస్వామ్యము అభివృద్ధికి వస్తూ కళారాధన ఏ కొద్దిమంది చేతులలోనో ఇమిడియుండి పోనందున, కళాకారుడు తన ఆరాధనకు పోషకులుగా ఏ ధనికులపైనో ఆధారపడి యుండనక్కర లేకపోతున్నది. అందుచేత ధనసంభవమునకు ముఖ్యము ఆకర్షణ యోగ్యత అయిఉన్నది.

ఈ చరిత్ర కథలో మనదేశాన్ని, మనకు సన్నిహితంగా ఉన్న ఇతర ప్రాచ్యదేశాలను స్మరించలేదు. పాశ్చాత్యదేశాలలోని జీవితము అన్యోన్యసంబంధాలు కలది; ఏ ఒకదేశానికి విచ్ఛిన్న ప్రత్యేకత చెప్పరాదు. పాశ్చాత్యదేశాలకు ప్రాచ్యదేశాలకు అట్టి సంబంధము లేదు. కాబట్టి సంగ్రహంగా ఈ దేశాల కళాచరిత్రను పొందుపరచి ఈ వ్యాసాన్ని చాలిస్తాను.

మనదేశానికి పాశ్చాత్యదేశాలతో సంబంధము ఏమీ లేదని చెప్పలేము. అలగ్జాండరు సామ్రాజ్యములో కొంత, అలాగే పదమూడో శతాబ్దంలో దేశము చూడ వచ్చిన వారిద్వారా కొంతపరిచయము కలిగింది; కాని అటివి పెద్దకార్యాన్ని దేనినీ సాధించలేదు. పద్దెనిమిదో శతాబ్దంలో మనదేశములనుండి సామగ్రిని పాశ్చాత్యదేశాలకు తీసుకొనివెళ్లడం ఆరంభమైనది. వాటిలో ముఖ్యమైనవి తివాసీలు; నల్లచేవలో చేసిన కర్రసామాను, లక్కసామానున్నూ. పాశ్చాత్యదేశ చిత్రకారులు తమ పనులలోనికి ఈ ప్రాచ్యరీతులను చేర్చ నారంభించారు. ఈ సంచారాన్ని బాగా నడిపినవారు వర్తకులు. కనకొంత ఎక్కువకాగా కళా నైపుణ్యము చెడిపోయింది.

ప్రాచ్యదేశాలలో చీనా కళారాధనకు ప్రాముఖ్యము చెప్పాలి. కళ, సాంఘికజీవితము, ఆధ్యాత్మిక తత్వము చీనాలో బాగా మిళితమైనట్టు ఎక్కడా కాలేదని చెప్పవచ్చును. వారు తయారుచేసిన ప్రతీ దానిలోను చిత్రపటాలలోగాని, చెక్కిన విగ్రహాలలోగాని, లోహపు పోతపనులలోగాని, చిన్నచిన్న ఆభరణాలలోగాని, అన్నిటిలోను ఒకవిధమైన సంజ్ఞా ప్రతిబింబము ఉంటుంది. వారు ప్రపంచముయొక్క తత్వాన్ని ఎట్లు ఊహించారో, దాని మూర్తములకు ఉదాహరణ సంజ్ఞలా ఇవి అన్నట్లుఉంటవి ఈ కళా కార్యాలు. ఒకవైపు పరలోకము, ఒకవైపు ఇహలోకము, ఈ రెండింటి సంబంధము వ్యక్తపరుప ప్రయత్నిస్తూ ఉంటాడు చిత్రకారుడు. క్రీస్తుపూర్వము 28 వ శతాబ్దమునుండీ ఈ కళారీతిని చీనా చరిత్రకారులు నిరూపిస్తారు. బౌద్ధమతముతో పాటు హిందూదేశపు కళారీతులుకూడా చీనా దేశాన్ని ప్రవేశించినవి. బౌద్ధమత ప్రభావము కళా విధానముపై కనిపిస్తుంది. తూర్పునుండి సూర్యకిరణాలు కిటికీలోనుండి ప్రవేశిస్తున్నప్పుడు ఎదురుగా కూర్చొని, ధ్యానంలో ప్రకృతిలో ఉండే శాంతిని తన ఆత్మలోనికి ప్రవేశింపనిస్తూ, చిత్రించదలచినదే ఆవేశం కొరకు నిరీక్షిస్తూ ఉండడము కళారాధకుల ఆచారము. వీధులలోను ఇండ్లలోను ఉండే నిత్య దినచర్యనుండి కొంచెము వదిలించుకొని, కొండలలోను, సెలయేళ్లలోను సుఖమును గ్రహించగలిగినవాడే చక్కని ప్రకృతిచిత్రాన్ని వ్రాయగలడని ఒక తత్వవేత్త ఉపదేశించాడు. తనజన్మస్థానంనుంచి, కొండలోయలలో పరుగుతూ ఘోషతో ప్రవహించి నిశ్శబ్దంగా మహాసముద్రములో కలిసిన నదీచిత్రం ఒకటి, బహు ప్రశస్తినిపొందినది, అట్టి విధానానికి ఉదాహరణగా చేస్తారు విమర్శకులు. ప్రశాంతం వారి కళా ప్రాతిపదిక సూత్రం. ఇది ముఖ్యంగా వారు నిర్మించిన బోధిసత్వుల విగ్రహాలలో కనుపించింది.

జపానులో వర్ధిల్లిన కళలో ఆధ్యాత్మికత్వం తక్కువై, నిత్యజీవితం ఎక్కువైంది. లక్కమన్ను బొమ్మలలో ఎక్కువ ప్రాశస్త్యాన్ని సంపాదించారు వారు. కర్ర పలకలలో బొమ్మలను చెక్కి దానిని కాగితము, ఆకు, బట్టలపై ముద్దరవేసే పద్ధతి బాగా వర్ధిల్లింది. ఈ పద్ధతి వలన చిత్రాల ఖరీదు తగ్గి సామాన్యుల అందుబడిలోనికి చిత్రపు వస్తువులు వచ్చినవి. ఈవిధంగా కళారాధన ప్రజాసామాన్యంలోనికి వేళ్లు తన్నింది. ఈ పద్ధతి పాశ్చాత్య దేశాలలోనికి ముఖ్యంగా ఫ్రాన్సులోనికి, ఇక్కడినుండే వెళ్ళిందని నిశ్చయించగలము.

మనదేశములోని ప్రాచీన కళాకార్యాలు ఎండకు వానకు నిలవలేక నశించిపోయినవి. దొరికినవాటినిబట్టి పూర్వము ఎట్లు ఉండెనో సుబోధముగా సగర్వముగా ఊహించగలము. బౌద్ధమత వ్యాప్తితో కళ విస్తరించింది. కర్రలోను రాయిలోను బుద్ధవిగ్రహాలను, ఆర్య దేవతలను చెక్కడము బాగా విజృంభించింది. దేవాలయాలు నిర్మించడములోను గర్భగుడి కట్టడములోను ఎక్కువ నిపుణతను చూపించేరు. అశోకుని స్తంభాలు వాటిపై అక్షరాలు చెక్కడము ఈ ఉత్సాహమునకు చెందినవి. వీటికంటె ఎక్కువ ప్రసిద్ధికి వచ్చినవి గుహాలు, స్తూపాలున్నూ. వీటి చుట్టూకట్టిన ద్వారాలు, చిన్నచిన్న రాతిబొమ్మలున్నూ బౌద్ధ పురాణగాథలను వివరిస్తూ ఉండెను. ఈ రాతి కట్టడాలలో పురాతన గ్రీకుదేశపు చెక్కడపు శిల్పము సహకారి అయినది అని విమర్శకుల అభిప్రాయము. ఈ నిపుణత అలగ్జాండరు రాకవల్లను, అతని సామ్రాజ్యము స్థాపించడమువల్లను సంక్రమించింది అని అభిప్రాయము. ప్రాచీన హిందూదేశ కళాకారులు కర్ర చెక్కడపు పనులలో సంపాదించిన చాతుర్యాన్ని రాతి చెక్కడాలలో ఉపయోగించారు. కర్రకంటె రాయి ఎక్కువ శాశ్వతముని గ్రీకుల సహవాసమువలన గ్రహించియుండిరి. ఈ స్థూపాలలో గొప్పది సాంచీ

అమరావతి స్థలాలలో ఉన్నవి. బుద్ధవిగ్రహ నిర్మాణాలు చాలా ఆకర్షణీయంగా ఉంటవి. ఇవి వ్యక్తపరచే భావాలు భగవద్గీతలో వర్ణించిన యోగి లక్షణాలు:

యోగీ యుంజీత సతత మాత్మానం రహసి స్థితః।
ఏకాకీ యత చిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః॥
శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః।
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజిన కుశోత్తరం॥
తత్రైకాగ్రం మనఃకృత్వా యత చిత్తేంద్రియ క్రియః
ఉపవిశ్యాసనే యుంజ్యా ద్యోగమాత్మవిశుద్ధయే॥
సమం కాయ శిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః।
సంప్రేక్ష్యనాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్॥

* * * *

యథాదీపో నివాతస్థో నేంగతే సోపమాస్మృతా।
యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః॥

భగవద్గీత VI.—(10—20)

[రహస్యస్థలమందు ఏకాకిగా నివసించుచుంటూ; కోరిక గాని, ఆస్తిని గాని ఉంచుకోకుండా, మిక్కిలి ఎత్తుగా కాకుండా మిక్కిలి క్రిందుగా కాకుండా ఉండే స్థిరాసనముపై కూర్చొని; మనో వృత్తులను, ఇంద్రియాలను స్వాధీనంలో ఉంచుకొని; శరీరము, శిరస్సు, కంఠస్థలమును అఖండమైన సమత్వములో ఉంచి; ఇటూ అటూ దిక్కులు చూడక ధ్యానిస్తూ ఉండువాడు అగాధమైన శాంతిని పొందగలడు. ఇంద్రియాలకు అతీతమై కేవలము ఆత్మకే గ్రాహ్యమైన అమితానందము ఎవనికి సాధ్యమో అతడు వాయురహితస్థలములో చలించని దీపమువలె ఉండగలడు.]

* * * *

ఈ వర్ణనకు అనుగుణమైన మూర్తులను నిర్మించారు కళాకారులు. మొదట మూర్తులు, తరువాత వర్ణనా? లేక మొదట వర్ణన తరువాత మూర్తులా? అన్న కోటి ప్రశ్నకు తగిన సమాధానము అంత సాధ్యము కాదు నిష్కర్షగా చెప్పటకు. కాని ఎలాగైనా కళాకారుల ప్రతిభ మాత్రము స్పష్టము. కళాకారులకు ఆధ్యాత్మిక తత్వజ్ఞులకుగల అన్యోన్యము కూడా నిర్వివాదము * గుప్త సామ్రాజ్య కాలానికి (క్రీ. శ. 320-530) చెందిన అజంతా చిత్రాలలో ఈ మూర్తి చిత్రాలు ప్రసిద్ధికి వచ్చినవి. అనిరుద్ధపురంలోని విగ్రహము చిత్రానికే కాకుండా కేవల—ఔన్నత్యానికి అనన్యము. ఇట్టి నిశ్చలత్వమును ప్రకటించే కళ బౌద్ధమతముతో అదృశ్యమైనది మనదేశములో.

అలాగని చెక్కడపు శిల్పము తగ్గిపోలేదు. బ్రాహ్మణ మతమునకు చెందిన ఆర్యదేవతల విగ్రహాలు అనేకములు ప్రచారములోనికి వచ్చినవి. బ్రహ్మ విష్ణు శివమూర్తిత్రయము ఆ శిల్పానికి ప్రాతిపదిక. ఈ మూర్తుల విగ్రహాలద్వారా బ్రాహ్మణమతము ఆర్యావర్తములో అఖండవ్యాప్తి పొందినది. మతాభిమానము ఒకవైపు కళాప్రావీణ్యము ఒకవైపు ఈ దేవాలయాల స్థైర్యానికి కారణాలై ఈనాటికి కూడా బాగా విజృంభించి ఉన్నది. ఈ మతము, ఈ ఆచరణ ఈ రెండు భావాల కలయికను సమన్వయించుకోలేని పాశ్చాత్య విమర్శకులు ఈ విగ్రహాలను వెక్కిరించారు. సగం మనుష్యశరీరము సగం పశుశరీరముగల సాంకేతికభావాలను యావత్ సృష్టి దృష్ట్యా సమన్వయిస్తేనే గాని ఈ చిత్రాలు సమంజసములుగా కావరావు.

ఆంగ్లేయప్రభుత్వముతోపాటు పాశ్చాత్యతత్వారాధన దేశంలో వ్యాపించగా, ప్రాచీన కళారీతులు మొగల్ ప్రభుత్వము నాటినుండి సన్నగిల్లుతూవచ్చిన శేషాలు పూర్తిగా అధోగతిని పడినవి. రానురాను దేశాభిమానము అతిశయిల్లి ప్రాచీనతకు గౌరవముకలిగి క్రొత్తదార్లు దేశంలో అన్నిచోట్ల వెల్లడిఅవుతూ ఉన్నవి. అవనీంద్రనాథ్ ఠాకూరువంటి ప్రముఖులు హిందూ సంప్రదాయాలను పునరుద్ధరించగా, ఇప్పుడు కళాచరిత్రలో నూతనయుగము ప్రారంభమైనది.

---

* ఈ సందర్భంలో భగవద్గీత కాలాన్ని చర్చించడానికిగల ఈ అవకాశాన్ని స్మరించవచ్చును. బుద్ధమూర్తులు ఇట్టివి క్రీ. శ. మొదటి శతాబ్దమునాటివని పండిత మతము.

చిన్నలు: పెద్దలు

శ్రీ నాగభూషణ్

* * ఓ హైస్కూలులో ఓ మాస్టారు గది. విశాలమైన గదిలో ఎదురుగా కనిపించే కిటికీలోనుంచి వెనుకవైపు తోట, ఆటస్థలం కనిపిస్తాయ్. కిటికీకి ప్రక్కనే బయటినుంచి ప్రవేశానికి ఓ ద్వారం వుంది. మరో ప్రక్కన వెయిటింగ్ రూమ్‌కు పోయేటందుకు ద్వారం. గదిలో పుస్తకాల షెల్ఫు, కొన్ని పటాలు, ఓ టేబిలు, మూడు కుర్చీలు; టేబిలుమీద చిందరవందరగా కాగితాలు—

మాస్టరు, పాత విద్యార్థి బయటి నుంచి ప్రవేశిస్తారు:

మాస్టరు : నీకీ గది జ్ఞాపకం వుందా?

పాత విద్యార్థి : (ఉత్సాహంతో) జ్ఞాపకమా?— అంతా నిన్న చూసినట్లుగా వుంది! (షెల్ఫు చూపుతూ) ఆ పుస్తకాలు—(వాటిని పరీక్షిస్తూ) వీటి పేర్లు కూడా నేను మరచిపోలేదు. (గోడవైపు తిరిగి) ఆ ఫొటోలు— ఆ పాత గడియారం...

మాస్టరు : గడియారం ఇప్పుడు సరిగా పనిచెయ్యడం లేదు.

పాత : (తన మామూలు ధోరణిలో) ఆ కిటికీలో నుంచి కనుపించే ప్రకృతి దృశ్యాలు! (చూస్తూ) ఒకే వరుసలోవున్న ఆ కొబ్బరి చెట్లు—ఓ! ఇవన్నీ చూస్తూ యిలా నిలబడితే అన్నమూ, నీళ్లూ అక్కరలేదు.

మా : (తనూ అటే వచ్చి చూపిస్తూ) టెన్నిస్ కోరు వేయించాం.

పాత : అలాగా!... (మళ్ళీ గదిలో పచార్లు చేస్తూ) ఈ గదిలో ఇట్లా వుండటం ఎంత హాయిగా వుంది? ఎంత ప్రశాంతత?—సాధారణంగా ఏ బడిలోనూ కనిపించనిది!... కాని ఆ హాస్టలు చూడండి; ఇప్పటికీ అలాగే వుంది. ఆ వచ్చిపోతున్న గోడలు, సున్నం చెరిగిపోయి లోపలనుంచి వెక్కిరిస్తున్నట్లు కనిపిస్తున్న రాళ్లు—చూస్తే, పెరుగుతున్న పిల్లలకు నాగరికమైన నివాసాలదృష్టి ఏర్పడటం అసాధ్యంలా కనిపిస్తున్నది...... (గదిలో ఒక మూల చూస్తూ) మీ యమధర్మరాజుగారు ఏమండీ?

మా : ప్రస్తుతం ఆ మూల వుండటంలేదు.. దానితో కోపాలు, పోట్లాటలు ఎక్కువైనై.

పాత : అవును ..విన్నాను.

మా : అది యిప్పుడు సాధారణంగా బయటకు రావడంలేదు—ఎప్పుడో పెద్ద శిక్షలకు తప్ప—వచ్చినప్పుడుమాత్రం వుపయోగించడం లేదన్న కోపాన్నంతా అప్పుడే వెళ్లగక్కుతుంది. (అంటూ షెల్ఫుపైనవున్న పేము బెత్తాన్ని తీస్తాడు.)

పాత : ఏదీ! ఒక్కసారి చూడనివ్వండి. (తీసుకొని) అరె! ఇదికూడా మారలేదే!

మా : పొరపాటు పడ్డావ్! నువ్వు వెళ్లినతర్వాత ఇది 'అయినోదో, ఆరోదో.'

పాత: దానికికూడా పతనం వుందన్నమాట!

మా: 'ప్రతివస్తువూ పతనం కాకతప్పదు' అన్న సూత్రానికి బెత్తంకూడా తలవంచవలసిందే!

పాత : ఇదీ అచ్చంగా పాతదానిమాదిరిగానే వుంది. (అటూ యిటూ విసిరి) అదే పొత! దీన్ని చూస్తుంటే ఆరోజులన్నీ నిన్న జరిగినట్లుగా వున్నయ్.

మా : నీకు ఒక్క అనుభవమైనా జ్ఞాపకంవుందా?

పాత : కొన్ని వందలు! ఆరోజుల్లో ఎంత అల్లరి చేసేవాణ్ణి! నా ప్రవర్తన ఎంత అపసవ్యంగా, అసహ్యకరంగా వుండేది!...మీకు ఎంత కష్టాన్ని కలిగించాను! ... మీరు నన్ను గురించి ఏమనుకొనేవాళ్ళో?

మా : చాలా మంచివాడి ననుకొనేవాణ్ణి.

పాత : ఇప్పుడు!—పోనీ మిగిలినవాళ్లు ? హెడ్ మాస్టరుగారు?

మా : హెడ్‌మాస్టరుగారు వుద్యోగం వదులుకున్నారు, తెలుసా?

పాత : రిటైర్ అయ్యారటగా?

మా : వాళ్లు ఎక్‌స్టెన్‌షన్ ఇస్తామన్నారు. కాని క్రిందటేడు ఆయన కళ్ళు ఆపరేట్ చేశారు. అప్పటినుంచీ ఆయనకు కులాసా లేదు.

పాత: పాపం, అలాగా! ఇక్కడే వుంటున్నారా?

మా : ఆఁ! అట్లావున్నా ఇప్పటికీ యింకా స్కూలుకు వస్తూనేవుంటారు. స్కూలు వ్యవహారాల్లో ఆయన కింకా శ్రోత్యం వుంది ... రోజూ ఈపాటికి వచ్చేవారే, ఇవాళా రావాలి.

పాత : చాలామంచివారు—వేదాంతికూడా కదూ? మాకు, పాఠం మధ్యలో ఆపేసి, గంటల తరబడి బైబిలునుగురించీ, భగవద్గీతనుగురించి వుపన్యాసం యిచ్చేవారు.

మా : ఇంకా యిప్పటికీ అంత దృఢంగానూ ఉన్నారు... నేనప్పుడే ముసలివాణ్ణయిపోతున్నాను.

పాత : మీరా? అప్పుడేనా?... హెడ్‌మాస్టారికీ వృద్ధాప్యంవచ్చినకొద్దీ హుషారు హెచ్చింది ... ప్రతిమనిషినీ ఎంత చక్కగా అర్థం చేసుకొనేవారు! మేము వేసంకాలం సెలవులకు ఇళ్లకు వెళ్లిపోయేముందు ప్రతి వాళ్లనూపిలిచి పరామర్శించి పంపేవారు... నేనూ వెళ్లాను. 'మాడురాజా! నువ్వీ సంవత్సరం వృథాగా కాలం వెళ్ళబుచ్చినందుకు జీవితాంతం విచారిస్తావ్!' అన్నారు.

మా : ఆమాట అక్షరాలా నిజమయిందా?

పాత : నేను దాని విషయం చాలా రోజులు మరచిపోయాను...కాని చాలాకాలం తర్వాత, నేను నా మనసులోని భావాలను బయటకు వెళ్లబుచ్చాలన్న కాంక్ష వచ్చినప్పుడు— నాకు తెలిసింది నా అసమర్థతకు కారణం.

మా : ఏమిటది?

పాత : నాకు భావాలు వున్నవి కాని భాష లేదు. ఆ రోజుల్లో తెలుగు క్లాసులకు వేటికీ రాని లోటు నా కిప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది. దానికోసం నిజంగా నేను జీవితాంతం విచారించవలసి వచ్చింది.

మా : గతించిన జీవితాలను గురించి—అందులోనూ విద్యార్థి జీవితాన్ని గురించి—విచారించని వాళ్లు వుండరు. ప్రతివాళ్లూ వినోదంగా తప్పటడుగు వేసినవాళ్లే! నేను చదుకొనే నాటి రోజులు తీసుకో—

పాత : కాని ఆ రోజులే గొప్పవి! ఆ జీవితం ఎన్ని మధురస్మృతులనిస్తుంది? పోట్లాటలు, ఇంతిలో మళ్లా స్నేహం! బాధపెట్టే స్మృతుల్లో కూడా ఆనందం లేకపోలేదని నా వుద్దేశ్యం. ఉదాహరణకి ఈ శత్రం చూడండి...

మా : (చిరునవ్వుతో) దానినుంచి నువ్వు తప్పించుకోలేవు సుమా!

పాత : తప్పించుకోవాలని నాకు కూడా లేదు.. దాన్ని...చూస్తుంటే, అన్ని బాధలకూ తార్కాణంగా మిగిలివున్న చిహ్నంలా వుంది...కాని అది చాలామందికి కష్టాన్ని కూడా కలిగించింది—

మా : నాకు కావలసిందీ అదే!

పాత : అంటే, బాధహృదయానికి కాదు. శరీరానికి మాత్రమే!...ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్లకు కట్టినట్లుగా వుంది.—భయం భయంగా నేను

తలుపు తట్టడం ... "లోపలకురా !" ... భరించలేని నిశ్శబ్దం. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ నా భయపడే గొంతుక ...... "నన్ను పిలిపించారా మాస్టారూ?"... "ఎందుకు పిలిపించానో నీకు తెలియదూ?" ...మళ్లీ నిశ్శబ్దం. "క్రిందటిసారి నీకేం చెప్పానో జ్ఞాపకం వుందా?" "..." ..."ఇంతకంటె బాగుపడటం నీకు యిష్టం లేదా?"..."నాకేం తెలుసునండీ?" అనే వాణ్ణి నేను—

మా : (నవ్వుతూ) అవునవును...అంతే!

పాత : "సరే! నువ్వు చేసిన తప్పుకు శిక్ష యేమిటో నీకు తెలుసుకదూ? నీకు చాలాసార్లు చెప్పి చూశాను...మాటలతో నీకు బుద్ధి రాదని తేలిపోయింది. నీకు శిక్ష నాలుగు దెబ్బలు. మరోసారికూడా ఇటువంటి పనే చేశావో ఆరు — ఊ...ఆ కుర్చీమీదుగా వంగు—" ఈ కుర్చీనే! అవునా?

[అవునని తల వూపుతాడు మాస్టరు]

నేను ఇలా వంగేవాణ్ణి (అలా చేస్తాడు) మళ్లీ నిశ్శబ్దం...భరించలేని దీర్ఘమైన నిశ్శబ్దం. అప్పుడు—

మా : పోనిద్దూ. అప్పటి సంగతి యిప్పు డెందుకు? దాన్ని అక్కడే వదిలేద్దాం.

పాత : అబ్బే! ఇది క్లైమాక్సు సీనండీ! ఎలా వదిలిపెడతాం? ఆతరువాత, అంతా అయిపోయిన తర్వాత, నాకోసం ఆతృతతో ఉత్సాహంతో వేచివున్న అశేషమైన ప్రజానీకం ...నన్ను ఎలా సత్కరించారో కావాలి వాళ్ళకు. అప్పుడు చెప్పకపోతే మర్నాడు స్నానం చేసేటప్పుడయినా ఆ సత్కారం తాలూకు మిగిలిన చిహ్నాలకోసం వీపు వెదుకుతారు...(మళ్లీ ప్రపంచంలోకి వచ్చి) ఇన్ని జరిగినా, ఆ జ్ఞాపకాలే ఆనందమయంగా వుంటయ్.

[మాస్టరు చేతి గడియారం చూసుకుంటారు.]

పాత : మిమ్మల్ని విసిగించడం లేదుకదా?

మా : అబ్బే!—కాని నువ్వు కొంచెంసేపు పక్క రూములోకి పోవాలి...శిక్ష తీసుకోవలసిన ఓ కుర్రాడు ఇప్పుడు వస్తాడు.

పాత : ఏం చేశా డతను?

మా : నువ్వు చేసిన తప్పులే!

పాత : మిగిలిన మాస్టర్లు రిపోర్టు ఇచ్చారా?

మా : ఈ టరమ్‌లో ఇది ఐదోది! పట్టి కోతి— నన్ను ఇంతగా విసిగించిన కుర్రా డింతవరకు లేడు.

పాత : అతన్నేం చేస్తా రిప్పుడు?

మా : నువ్వు ఎప్పుడూ కావలసిన విషయాలకన్నా ఎక్కువ తెలుసుకుందామని అనుకుంటా వెందుకు? విజిటర్స్ రూమ్‌లోకి వెళ్లి క్షణం కూర్చో...దోవ జ్ఞాపకం వుందా?

[విజిటర్స్ రూమ్ తలుపు తీయడానికి వెడతాడు.]

పాత : (చప్పున) వద్దండి...నన్నిక్కడ దాక్కోనివ్వండి.

మా : (ఆశ్చర్యంతో) దాక్కుంటావా?

పాత : అవును...ఈ ఒక్క ప్రార్థన—

మా : కాని అది బావుంటుందా?

పాత : నే నిక్కడ వున్నానని అతనికి తెలియదుగా!...ఏమంటారు?

మా : (అయిష్టంగా, గడియారం చూసుకుంటూ) సరే!

పాత : థాంక్స్...మీ మేలు ఎన్నడూ మరువలేను. (ప్రక్కనే తలుపు ప్రక్కనవున్న కర్టెన్ వెనుక దాక్కుంటాడు.)

[తలుపు చప్పుడు.]

మా : లోపలకురా!

[బయటినుంచి ఓ కుర్రాడు వస్తాడు. వయస్సు పదమూడు, పద్నాలుగేళ్లు.]

విద్యార్థి: నన్ను పిలిపించారా మాస్టారూ?

మా : ఎందుకు పిలిపించానో నీకు తెలియదూ?

[అర్థంకాని తోలుబొమ్మ మొహం పెడతాడు కుర్రాడు.]

రాం! కైలాసరావుగారి దగ్గరనుంచి నాకు మరో రిపోర్టు వచ్చింది. నీకు క్రిందటిసారి ఏం చెప్పానో జ్ఞాపకంవుందా?

[జవాబు చెప్పడు.]

జ్ఞాపకం వుందా?

విద్యా : (రహస్యంగా మాట్లాడుతున్నట్లు) వుందండి.

మా : ఇంతకంటె బాగుపడడం నీకేం యిష్టంలేదా?

విద్యా : నాకేం తెలుసునండీ?

మా : సరే! నువ్వు చేసినతప్పుకు శిక్ష యేమిటో తెలుసు కదూ? నీకు చాలాసార్లు చెప్పి చూశాను...నీకు మాటలతో బుద్ధిరాదని తేలిపోయింది. నీకు శిక్ష— (పాత విద్యార్థి దాక్కున్నవైపు చూస్తూ) నాలుగుదెబ్బలు. మరోసారి యిటువంటి పని చేశావో, ఆరు— ఆ కుర్చీమీదుగా వంగు—

[కొట్టడానికి బెత్తం తీసుకుంటాడు.— కుర్రవాడు తన కెంతో అనుభవం వున్నట్లుగా కుర్చీమీదకు వంగుతాడు. పాత విద్యార్థి తెరచాటునుంచి తొంగిచూసి, మాస్టరు బెత్తం ఎత్తిన సమయానికి 'మాస్టరూ!' అని వారిస్తూ వాళ్ళ మధ్యకు వచ్చి నిలబడతాడు.)

పాత : చాలా అదృష్టవంతుడివోయ్!......నేనే నువ్వైతే ఎంత బావుణ్ణు? (మాస్టారు కోపంతో అతనివైపు తిరుగుతాడు.) పొరపాటు మాస్టరూ! నేను బయటకు రాకుండా వుండలేకపోయాను...నీ పేరేమిటి? రామం? ...రామ్! నువ్వు ఎంత అదృష్టవంతుడివో నీకు తెలియదు...నా మాటలు నమ్ము. నేను ఇవన్నీ అనుభవించినవాడినే! నేను ఈ స్కూలు పాత విద్యార్థిని. ఇక్కడ ఏడు సంవత్సరాలు చదివాను...నువ్వున్న పరిస్థితుల్లో నేను కొన్ని వందలసార్లు వున్నాను ...ఆ కుర్చీమీదుగానే వంగి, భూదేవిని నే నెన్నిసార్లు ప్రార్థించానో, నన్ను కూడా తనలో చేర్చుకోమని!...ఆ రోజులు! ఎంత హాయిగా గడిచేవి? ముసలితనాన్నుంచి పసితనానికి రావడంకోసం తన ఆత్మను అమ్ముకున్న వేదాంతిలా నేనుకూడా ఒకసారి చిన్నవాడినై, ఇక్కడకు వచ్చి, పిల్లలలో కలిసి ఆటలాడుతూ, హాస్టలులో వుడికీ, వుడకని తిండితింటూ, అర్థంలేని పుస్తకాలు చదువుతూ, అల్లరిచేస్తూ; ఇలా కుర్చీమీదకు వంగి దెబ్బలుతింటూ,—ప్రతి రోజూ—అట్లానే వుంటే ఎంత ఆనందం? ...కాని నాకు ఆ అదృష్టంలేదు...ఆ రోజులు మళ్లీరావు. ఆ జీవితాన్ని నే నిక అనుభవించలేను ... అందువల్లనే ... నువ్వు అదృష్టవంతుడివి ...చాలా—

[ఇక మాట్లాడలేక కుర్చీలో కూర్చుంటాడు. కుర్రవాడు ఆశ్చర్యంతో చూస్తూవుంటాడు. మాస్టారు చాలా గంభీరంగా వుంటారు.]

మా : నువ్వు వెళ్లొచ్చు, రాం—

విద్యా : (సంతోషంతో) అలాగే సార్!

[త్వరగా వెళ్లిపోతాడు. కొంచెంసేపు నిశ్శబ్దం.]

పాత : (తల ఎత్తి) క్షమించండి మాస్టారూ! నేను మాట్లాడకుండా వుండలేకపోయ్యాను. నేను చేసింది తప్పే!...కాని నా ఆవేశాన్ని ఆపుకోలేకపోయాను... నేను చేసింది క్షమించరాని నేరం.

మా : (ఎంతో నిగ్రహంతో) నిన్ను నేను తేలిగ్గా క్షమించగలను...ఇంకా నువ్వు చిన్నవాడివి.

పాత : (ఆశ్చర్యంతో) చిన్నవాడినా?

మా : అవును ..చాలా చిన్నవాడివి.

పాత : మీరు నిజంగా అంటున్నారా? (అవునని తలూపుతాడు మాస్టరు) నేనుచేసినతప్పుకు చిన్నవాణ్ణన్న సాకుతో క్షమాపణ కోరలేను ...నేను చిన్నవాణ్ణై తెలియక కాదు బయటకు వచ్చింది...మీకు చెప్పానుగా, ఆవేశం నన్నలా దాచివుంచలేకపోయింది.

మా : అవునవును...చెప్పావ్!

పాత : మీ రర్థంచేసుకోలేరా నన్ను? మీరు—! మీరు ఉపాధ్యాయులు ... నావంటివాళ్లను

అనేకులను చూసివుంటారు ... ఇక్కడ మరో క్షణంవుంటే నాకు పిచ్చి ఎక్కేటట్లుగావుంది... కాని ఆరోజుల్ని, ఆ ఆనందాన్ని ఎట్లా మరచిపోవడం?

మా : ఉపాధ్యాయులసంగతి బాగానే చెప్పావ్! కాని నువ్విట్లా మాటిమాటికీ "ఆ ఆనందం, ఆ సంతోషం, ఆరోజులు" అంటూవుంటే నేను వినలేను.

పాత : వినలేకపోవచ్చు. కాని అది నిజం!

[మాస్టరు నవ్వుతాడు]

పాత : నవ్వుతున్నారా? బహుశః మీ స్కూలు జీవితం మీకు ఉత్సాహంగా వుండివుండదు.

మా : చాలా బావుండేది.

పాత : మరి? ...ఓ! జేన్నిగురించి చెడుగా వూహించకూడదంటారు మీరు! — మీ వయస్సువచ్చేవరకు నేనుకూడా అంతే!... కాని మీరు అప్పుడెంత సంతోషంగా వున్నారో ఇప్పుడూ అంత సంతోషంగా వున్నానని చెప్పగలరా?

మా : అంటే, నువ్వు ఇదివరకు వున్నంతహాయిగా ఇప్పుడు లేవా?

పాత : లేను...లేను...మీకు తెలిసివుంటే—?

మా : ఊఁ! తెలిసివుంటే?

పాత : ప్రతిమనిషీ ఏవో విషయాలు వూహించుకొని బాధపడతాడు. నేనూ అటువంటి వాణ్ణే! ప్రతిమనిషికీ ఆశలూ, ఆశయాలు ఏవో వుంటయ్...నాకూ అంతే!—నేను మిగిలినవాళ్ళకంటె బలహీనుణ్ణి కావచ్చు; అంతమాత్రాన ప్రపంచం నన్ను పూర్తిగా వెలివెయ్యవలసిందేనా?

[మాస్టరు సిగరెట్ ముట్టిస్తాడు]

ప్రతి విద్యార్థీ స్కూలు వదిలే ముందు ఎంతో హాయిగా, భవిష్యత్తుమీద ఆశతో వుంటాడు. అమాయకత్వంతో జీవితం మొదలు పెడతాడు. ప్రపంచమంతా ఆనంద నిలయంలా కనిపిస్తుంది మొదట... కాని త్వరలోనే తెలుసుకుంటాడు. అది కేవలం 'భ్రమ' అని—తాను ఎందుకూ పనికిరాని వాడని, సంఘానికి వేస్టుపేపరునని!—బ్రతకటం దేనికన్న ప్రశ్న బయలుదేరుతుంది. జీవితంలో వున్న ఆశలూ, ఆశయాలూ అన్నీ అంతరిస్తయ్! అదీ ప్రపంచం నాకు చేసి పెట్టిన సహాయం!...నాలో మానవత్వాన్ని మంట గలిపింది. ఆశయాలను అణగ ద్రొక్కింది...ఇదీ ప్రపంచం నాకు చేసిన సహాయం!...ఈ ప్రపంచమంటే నాకు అసహ్యం! పరమ అసహ్యం!! నాకు మనుషులన్నా, మనుతలన్నా ద్వేషం రగులుతోంది—

మా : అందని మానిపళ్లు పులసేమో?

పాత : నిజం మాస్టారూ! నాకు శాంతి కావాలి... అంతటా గాలించాను...ఎక్కడా దొరక లేదు. కొద్దికాలం క్రితమే జరిగిన అనుభవాల జ్ఞాపకాలు ప్రాణాలను తినివేస్తూంటే, నాకు చివరకు కనిపించింది ఒకే దోవ— ఎప్పుడో జరిగిన విషయాలను స్మృతికి తెచ్చుకొని, మనస్సును శాంతిపరచు కోవడం—

మా : నిజం, నిజం.

పాత : నాకు జీవితంమీద విరక్తిపుట్టింది. యాత్రలు చేస్తే శాంతి దొరుకుతుందనుకున్నాను. అది దొరక్కపోగా, ఇంకా మనోవ్యథ ఎక్కువైంది. ప్రపంచాన్ని చూసినకొద్దీ బ్రతుకుదామన్న ఆశ అంతరించింది. నేను బ్రతికితే ఒకే ఒక్క వ్యక్తికోసం.—

మా : (అర్థమైనట్లుగా) ఓ!

పాత : చివరకు ... తప్పక ... ఆ ఆశా వదులుకున్నాను. అట్లా వదులుకోవలసి వచ్చింది. [భావాలతో వ్యక్తీకరించలేక మూగబాధ పడతాడు.]

మా : అప్పుడు నీకు వెనుకటి స్కూలు జ్ఞాపకం వచ్చిందన్నమాట!

పాత : అవును...అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది—స్మృతి తప్పినవాడికి సంజీవిలా—ఈ గది, ఆ తోట, ఆ పుస్తకాలు, అన్నీ—మళ్ళీ నాకు కొంచెం వూరట కలిగించినయ్.

కాని ఏం లాభం? అవే నన్ను బాధపెడుతున్నయ్. ఆ అడ్డంకులు ఎరుగని పిల్లలు! నేను కూడా వాళ్లలో ఒకణ్ణైపోతే—

[చేతుల్లో ముఖం దాచుకుంటాడు.—మాష్టరు కొంచెం అసహనంతో బుజాలు కుదిస్తాడు.]

పాత : ఏ మనిషికైనా ఇంత బాధ వుంటుందని నేను కలలో కూడా అనుకోలేదు...జీవితంలో ప్రవేశించడం అంటే సంతోషానికి నిచ్చెన వేశా ననుకున్నాను. (వ్యంగ్యంగా నవ్వుతూ) నేను ఇవన్నీ చెప్పి మిమ్మల్ని బాధ పెడుతున్నానా? ... కాని హృదయంలో బాధలు మరొకరికి చెప్పుకుంటే, ప్రాణం తేలిక పడుతుంది ... నేను కలలు కన్నాను, కవిత్వం వ్రాశాను, ఆమెను గురించి—ఆమె అందం, తెలివితేటలు—అదంతా ఓ కల! నేను మళ్ళీ ఆమెను చూడలేను. ఆమె జీవితంలోనుంచి నేను నిష్క్రమించాలి...ఆమెను కాస్తున్న కత్తుల పహారాలోనుంచి నిస్సహాయంగా నావైపు చూచినప్పుడు నా అసహాయత, అసమర్థత తెలిసివచ్చినయ్ ... జీవించడం వృథా అనిపించింది ... నే నెంత బాధ పడ్డానో, పడుతున్నానో ప్రపంచానికి తెలియదు.

[కుర్చీలో కూర్చుంటాడు...రెండు క్షణాల సేపు నిశ్శబ్దం. ప్రతి క్షణానికీ మాష్టరు ముఖ కవళికలు మారుతూ వుంటయ్ ... చివరకు పెద్దగా నవ్వుతాడు...పాత విద్యార్థి కిదేమీ అర్థం కాదు.]

మా : (బాధ అణుచుకుంటూ) అర్థంలేనిమాటలు చాలా చెప్పావ్!...నువ్వెంత బాధపడుతున్నావో ప్రపంచానికి తెలియదా? కొన్ని లక్షలమందికి తెలుసు..అందాకా ఎందుకు? నాకు తెలుసు!

[పాత విద్యార్థి ఆశ్చర్యంగా చూస్తాడు.]

ఇప్పుడు నేను చెప్పవలసినవి కూడా రెండు మాటలు వున్నయ్.

పాత : ఏమిటవి?

మా : నువు చాలా అదృష్టవంతుడివి...చాలా—

పాత : నేనా? అంటే?

మా : అర్థం కాలేదా? ఇందాక మరో పరిస్థితిలో నువ్వు రామానికి చెప్పిన హితవే! పరిస్థితులు మారినయ్, మనుషులు మారారు. అంతే!

పాత : దానికీ, దీనికీ సంబంధం యేమిటో నాకేమీ అర్థం కావడంలేదు.

మా : సంబంధం లేకపోవచ్చు. కాని నువ్వు రామాన్ని చూసి అసూయపడడానికి అవకాశం లేదు. నిన్ను చూసి నేను అసూయ పడడానికి నాకు అన్నీ అవకాశాలే!

పాత : (మాట్లాడలేకపోతాడు) మీరా! మీరు!—

మా : ఏం? అర్థంకాలేదా?...కాని, నీ వయసులో వున్నప్పుడు నేనూ నీకంటె తెలివిగలవాణ్ణి కాదు...నిన్ను యింతకంటె బాధ చెయ్యటంకూడా అనవసరమే!...ఇందాక వేదాంతిని గురించి మాట్లాడావ్! ఆ వేదాంతి నీమాదిరిగా స్కూలు పిల్లవాడిలా అవుదామని కాదు తన ఆత్మను దానం చేసింది. నామాదిరిగా యువకుడుగా మారాలని చేశాడు. చదువుకొనే రోజులు అర్థం లేనివి. ఒకరినొకరు అర్థంచేసుకోలేని ఆ రోజుల్లో సుఖమేమిటి? జరిగిపోయిన ప్రతిదీ మనకు బావుంటుంది కాబట్టి ప్రతివాళ్లూ పొగుడుతున్నారు...నిజానికి కోరవలసింది యువ్వనం...

పాత : కాని ఈ వయసులో నేను పడుతున్న బాధలు చూస్తే, ఈ విధంగా జీవితాన్ని మరోక్షణం గడపలేననిపిస్తున్నది.

మా : రామం అంతే! అతను పడుతున్న బాధలని నువ్వు సంతోషమైన అనుభవాలక్రింద మార్చావ్! నీ బాధల్ని నేనూ అంతే! నేనూ ఆ బాధలన్నీ పడ్డాను...బాణంలా వంగిన ప్రేయసి కనుబొమ్మలమీద నేనూ పద్యాలు వ్రాశాను. గాలిలో మేడలుకట్టాను...అవి బుడగలా క్షణంలో హరించిపోవడం చూశాను. ఆత్మ హత్యా ప్రయత్నం నిరంతరం నన్ను వేధించింది. మళ్ళీ ఎక్కడో

వెలుగు; బ్రతకాలని ఆశ! మళ్ళీ నిస్పృహా, నిరాశ! అలా ఆశా నిరాశల మధ్య అల్లీ బిల్లీ తిరిగాను. చివరకు మిగిలేది ఆనందాన్నిచ్చే గతించిన, బాధాకరమైన స్మృతులు!

పాత : (లేస్తూ) నిజం! బాధల్లో మాత్రం ఆనందం లేదా?

మా : కాని ఆరోజులే నా జీవితంలో నిజంగా హాయిగా వున్నవి.

పాత : నిజం?

మా: చూడడానికి అబద్ధంలానే వుంటుంది. కాని నామాటల్ని అప్పుడే నమ్మలేవు. నేనూ నీ వయసులో అంతే!

పాత : నిజంగా మీరు సుఖంగా లేరా?

మా : నిజం చెప్పాలంటే అంతే మరి—

పాత : ఇంత శాంతియుతమైన, పవిత్రమైన వుద్యోగంలో కూడా సుఖం లేదా?

మా : ఈ వుద్యోగం ముళ్ల మీదవున్న పక్కలాంటిది.

పాత : మీ జీవితంలో ఏదో ఘోరమైన విషాద సంఘటన జరిగి వుండకపోతే—

మా : ప్రతి జీవితానికీ సాధారణంగా తప్పని సంఘటనకంటె నా జీవితంలో మరో విషాద సంఘటన లేదు.

పాత : అంటే?

మా : అప్పటికే వ్రాయబడ్డ జీవితాన్ని ఎన్ని కన్నీళ్ళతోనైనా మార్చలేను.

పాత : అది నా సంగతి!

మా : నీ ఒక్కడి సంగతే కాదు; ప్రపంచం సంగతి! నిజంగా నిన్ను చూసి నేను అసూయ పడుతున్నాను. నీకున్న స్వేచ్ఛ, వూహించలేని భవిష్యత్తుకోసం నీకున్న అవకాశాలు—ఇవంటే నాకు అసూయ! నేను జీవితంలో స్థిరపడిపోయాను. స్థిరపడిపోయిన మనిషి మారలేడు...సగం జీవితం నిద్రలో నిదనిస్తే, మిగిలిన సగం గడియారంలా ప్రతినిత్యమూ ఏదో ఒక పని చెయ్యడంలో గడిచిపోయింది. నెలల తరబడి, సంవత్సరాల పర్యంతం ఇదే పని! పాడిందే మళ్లీ పాడడం! పాత పుస్తకాలు, పాత పాఠాలు, ఇదే రకం పిల్లలు, ఇదేమాదిరి దైనందిన కృత్యాలు—ఇలాంటి యంత్రంలాటి మనసుకు విశ్రాంతి ఎలా దొరుకుతుంది?...ఇది ఒక్క స్కూలు మాష్టరు ఉద్యోగానికే కాదు. ప్రతి మనిషీ ఇంతే! నువ్విప్పుడే చెప్పావ్, ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నానని—కాని ఆ పనిని చెయ్యకపోవడానికి నీ కిప్పుడు లక్ష కారణాలు కనిపిస్తయ్.. ముఖ్యమైనది ఏమిటో తెలుసా? ఆత్మహత్య చేసుకోవడం చాలా కష్టమైనపని, మనకు దాన్ని చేసుకునే శక్తి లేదు.

[కొంచెం సేపు నిశ్శబ్దం.]

ఇప్పుడు తెలిసిందా, నీవు ఒక్కడివే కష్ట పడలేదని! నువ్వు బాధపడుతున్నప్పుడు, ఎదటివాడికన్న తక్కువ బాధనే పడుతున్నానని సంతోషించు....అంతే!

పాత : నేనెప్పుడూ అనుకోలేదు....మీరుకూడా—

[వైర్రి వేటు ద్వారం చప్పుడవుతుంది. మరు క్షణంలో రిటైరైన హెడ్‌మాస్టరుగారు వస్తారు....నవ్వితే ముడతలుపడే ముఖం; వయసు యాభైఐదు, అరవైల మధ్య.]

మా : ఓ! హెడ్‌మాస్టరుగారా!

హెడ్ : నేను లోపలకు రావచ్చా?....వచ్చినతర్వాత ఆ ప్రశ్న అనవసరమే ననుకో!....(పాత విద్యార్థిని చూస్తూ) ఎక్కడో చూసినట్టుగా వుంది!

పాత : (మాష్టరుతో) నా పేరు చెప్పకండి....నా మొహం ఆయనకు చూపలేను.

హెడ్ : (నవ్వుతూ) అ...రాజారావుకదూ!

పాత : (తల వంచి) అవును....ఎన్నడూ తెలుగు పాఠాలు చదవని "మొద్దురాజా"—

మా : ఇప్పుడు పద్యాలు రాస్తున్నాడు.

హెడ్ : (ఎక్కువ పరిచయంవుంది. అందువలన ఏక వచన ప్రయోగమే!) నీకూ కొన్నింటిని రుచి చూపిస్తున్నాడా యేమిటి?

మా : అతనికి తెలియకుండానే రుచిచూపిస్తున్నాడు.

హెడ్ : అక్కడే వచ్చింది చిక్కు.

మా : అందుకే నేనతన్ని చూసి అసూయపడటం.

హెడ్ : అసూయ?

మా : అవును. వాకు తెలియకుండానే చాలా విషయాలు అతనితో చెప్పాను.

హెడ్ : ఏ విషయాలు?

మా : నా బాధలు, కష్టాలు...

హెడ్ : కష్టాలా? ఎన్నాళ్లనుంచీ నీకీ కష్టాలు?

మా : మీకు చెప్పాలి... చెబుతాను... మీరొక్కరే సానుభూతి చూపగలరు... నేను 'రాజా'కి చెబుతున్నా నిప్పుడే, పెద్దతనం రావడమంటే ఏమిటో!

హెడ్ : నువ్వా?... పెద్దతనం రావడమంటే ఏమిటో నువ్వు చెబుతున్నావా? (నవ్వుతాడు)

మా : మీరు నవ్వగలరు ... నవ్వడం మీకు అలవాటైపోయింది... మీకు వేదాంతం సులభంగా పట్టుబడ్డది. వేదాంతి అయినవాళ్లు ముసలివాళ్లు కావడం చాలా తేలిక.

హెడ్ : ఆ వేదాంతాన్ని అట్లా వుండనీ. కాని, నువ్విప్పుడే ముసలివాడివయ్యావని నీ వుద్దేశ్యమా?

మా : అలాగే అనిపిస్తోంది.

హెడ్ : (నవ్వుతూ) బావుంది... అయితే, నీ సంగతే నీకు తెలియదన్నమాట! (మాస్టరు ఆశ్చర్యంగా చూస్తాడు) నిన్నుగురించి నేను చెప్పనా?

మా : (ఆశ్చర్యంతో) మీరా?... చెప్పండి.

హెడ్ : నువ్వెవరివో నీకు తెలియచెప్పాలి. పెద్దవాణ్ణి—మంచైనా, చెడైనా నామాట విను... నువు చాలా అదృష్టవంతుడివి.

మా : నేనా?... నేను!

(పాతవిద్యార్థి ఆశ్చర్యంతో చూస్తూవుంటాడు)

హెడ్ : జీవితంలో సంతృప్తి అనేది వుంటే, నీకు తెలివితేటలు వుండి, అవి నిన్ను అంధుణ్ణి చెయ్యకుండా వుంటే, నీకు, మనిషి జీవితంలో కోరుకొనే అత్యుత్తమమైన శాంతియుతమైన జీవితం లభించింది. ఇటువంటి వాతావరణంలో వుండడం అంటే—అదేమీ తక్కువ అదృష్టం కాదు.

మా : నేనూ జీవితంలో నిరాశనూ, దుఃఖాలనూ అనుభవించిన వాణ్ణే!

హెడ్ : (ఎగతాళిగా) అలాగా?... ఇంతకూ నువ్వనేదేమిటి? నీ జీవితంలో సుఖం లేదని— బావుంది... చూడు... ఓ మనిషిని తీసుకో! అతను జీవితంలో తనుకోరుకున్న అమ్మాయినే పెళ్లిచేసుకున్నాడు. ప్రతినిముషమూ, ఎంతో ఆనందంతో పసిపిల్లలతో ఆడుకుంటూ, వాళ్ళమనస్సులకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని; వినోదాన్ని విజ్ఞానాన్ని కలిగిస్తూ—ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడుపుతున్నాడు... అంతకన్న ఆ మనిషి కేంకావాలి?

పాత : అవును... ఇంకేం కావాలి?

హెడ్ : ఏం కావాలో అతనికే తెలుస్తుంది.... కాని కొన్నాళ్లు ఆగాలి.... ఎన్నాళ్ళో తెలుసా? నా వయసు వచ్చేవరకు! అతని వుద్యోగం పోయిన తర్వాత, జీవితంలో 'నా' అనే వాళ్లందరూ తనను విడిపోయిన తర్వాత; తన అలవాట్లే తనకు భారమై బ్రతకడానికి ఆధారం లేనప్పుడు—అప్పుడు తెలుస్తుంది. అప్పుడూ, నీకు జీవితంమీద విరక్తిపుట్టడం, నీ బాధలన్నీ ఏకరువు పెట్టడం—! అప్పుడు తన గతించిన జీవితంవైపుకు చూపు మళ్లించుకొని, జరిగిపోయిన విషయాలలో మనసును సంతృప్తి పరుచుకుంటూ, ఆ ఆనందం మళ్ళీ రాదని, తనకు జీవితంలో సౌఖ్యం లేదని అప్పుడనాలి—(ఇంతా గంభీరంగా చెప్పి మళ్లీ నవ్వుతాడు.)

మా : నాకు చాలా ఆశ్చర్యంగా వుంది.

హెడ్ : అవునవును—ఇక ఇంతటితో ఈ అంశాన్ని ముగిస్తే బావుంటుందేమో!

పాత : లేదండీ! ఇది ఏకాంకిక.... మరో అంకాన్ని ప్రారంభించడానికి వీలులేదు .... నాకు

జవాబు చెప్పండి....మీరు నాకన్న ఎక్కువ బాధలు అనుభవించారా?

మా : నాకన్న—?

[హెడ్‌మాస్టరు నవ్వుతాడు]

పాత : నాకు తెలిసింది...మనం అందరం చెప్పింది నిజమే!...మన జీవితం ఆనందమయంగానూ వుంది; దుఃఖపూరితంగానూ వుంది. దుఃఖం మనలో మనకి, ఆనందం యితరుల మనస్సులకి — నాకిప్పు డర్థమైంది ... జీవితం ఓ పెద్ద హేళన కావ్యం ... ఆ హేళనచేస్తున్నది నన్ను...మనల్ని...మానవులందరినీ! ఈ నాటకంలో మనం నటిస్తున్నాం— కాదు — నటింప చేయబడుతున్నాం. ఈ నాటకానికి పేరేమిటి ? ... 'ఆనందం ఎక్కడ?' ప్రతివాడూ ప్రక్కవాడు ఆనందంగా వున్నా డనుకోవడం, వాడిమీద అసూయపడడం. కాని, అవ్యక్తి జీవితంలోనూ అగ్నిపర్వతా లున్నాయనీ అతని అన్వేషణ ఆనందంకోసమేనని యితనికేం తెలుసు ? ... 'ఆనందం ఎక్కడ?' ... ఎక్కడా లేదు...ఎ....క్క....డా! ఏ వయసులోనూ లేదు....మాయ! ఇంద్రజాలం! ఖరీదు లేనితమాషా!....

[హెడ్‌మాస్టరు నవ్వుతాడు]

ఈ విషాదాంత నాటకంలో ఎవరైనా నవ్వ గలుగుతున్నారంటే, వాళ్లు నటకులు కారు. కేవలం ప్రేక్షకులుమాత్రమే! జీవితంలో వంచింపబడినవాళ్లుకాదు .... వంచన జరుగుతూ వుండగా దూరంనుంచి చూచినవాళ్లు మాత్రమే!

[మాటలురావు....క్షణం నిశ్శబ్దం]

హెడ్ : (చిరునవ్వుతో) అయిపోయిందా?

పాత : (కావాలనే) ఆఁ!

[పిల్లు మాట్లాడుతుండగా కిటికీలోనుంచి ఫుట్‌బాల్ వడిగా లోపలకు వస్తుంది.]

మా : (కోపంతో) ఎవరీపని చేసింది?...పిల్లలకు లక్షసార్లు చెప్పాను...(కిటికీదగ్గరకుపోయి) ఎవరీ ఫుట్‌బాలును లోపలకు తన్నింది?

విద్యా : (లోపలినుంచే) పొరపాటున...

మా : నువ్వా! రాం! కొత్త కనుమరుగైందో లేదో అప్పుడే అల్లరి మొదలుపెట్టావ్? ఈ గది దగ్గర గోలచెయ్యొద్దని ఎన్నిసార్లు చెప్పాను? ...మీకు మాటల్తో చెబితే లాభంలేదు... రాం! లోపలికి రా....ఇప్పుడే! ...(హెడ్ మాస్టరుగారి దగ్గరకువస్తూ) విధవ! వీడిని మీరైతే ఏం చేస్తారు?

హెడ్ : ఇతన్ని గురించేనా నా కిదివరకు చెప్పింది?

మా : అవునండీ .... నా ప్రాణాలు కొరికేస్తున్నాడు. మీరు చూడండి, ఏం చెయ్య గలరో!

[విద్యార్థి భయంగా లోపలకు వస్తాడు.]

ఏం, రామం! ఈసారి ఏం చెయ్యదల్చుకున్నావ్ ? (మాట్లాడడు) మా మాటలు పాటించే నన్నమాట! ఇక్కడ ఆడొద్దని చెప్పాను, జ్ఞాపకం వుందా ?

విద్యా : మరచిపోయానండీ!...

మా : ఓ! నీ మరుపుకు ఏదో ఒకమందు ఆలోచించాలి. (హెడ్‌మాస్టరుగారితో) మీ వుద్దేశ్యం ఏమిటండీ?

హెడ్ : అట్లా ఎందుకు మరిచిపోయావ్ రాం?

విద్యా : (భయంగా) నేను కొంచెం సంతోషంగా వున్నానండీ...

మా : దెబ్బలు తప్పాయన్న సంతోషమా?

విద్యా : (సిగ్గుతో) అవునండీ...

మా : విన్నారా?

హెడ్ : రాజాకూడా విన్నాను.

మా : అంటే?

హెడ్ : అంటే అతను సంతోషించడానికి చెప్పిన కారణం మరెవ్వరూ బహుశః చెప్పరు. అది అతని ప్రత్యేకత.

పాత : ఆ ప్రత్యేకతే అసలు కారణాన్ని రుజువు చేస్తున్నది కూడా!

మా : అతని దొక్కడిదేనా ప్రత్యేకత?

పాత : కాదు....అతను అతని క్లాసుకంతకూ ప్రతినిధి. ప్రతి కుర్రవాడూ అటువంటివాడే!

నా కది బాగా అనుభవం!....విద్యార్థి దశ మనిషి జీవితంలో ఆనందకరమైన దశల్లో ఒకటనుకున్నాను... కాని అదే — అదొక్కటే — సంతోషదాయకమైంది....మీరు విన్నారుగా అతని ఆనందం! నాలుగు దెబ్బలు తినడం తప్పితే అతని కానందం. బాధ్యతలు లేని జీవితంలో ఏ చిన్న బాధ తప్పినా ఆనందమే! (అందర్నీ చూచి) ఓ! నేను మీకు అడ్డం వచ్చినట్లున్నాను.

మా : ఫరవాలేదు....ఇది చాలా ఆశ్చర్యకరమైన ఆనందం. దీన్ని గురించి మీకేమైనా తెలుసా మాస్టారూ?

హెడ్ : ఆనందకరమైన విషయాలను తప్పకుండా ప్రోత్సహించాలి .... అటువంటివే మానసిక వికాసానికి దోహదాలు.

మా : సరే! నీకు మరోసారి సంతోషాన్ని కలగ చేస్తున్నాను .... ఈసారి నువ్వు హెడ్ మాస్టరుగారికి కృతజ్ఞత చెప్పుకోవాలి .... కాని ఈసారి సంతోషాన్ని కొంచెం హద్దుల్లో వుంచుకో!

విద్యా : (సంతోషంతో) అట్లాగే మాస్టారూ!

మా : ఆ బంతి పట్టుకుపో—

[హెడ్‌మాస్టరుగారు దాన్ని యివ్వబోతూ వుండగా, ఆయనలో ఆలోచన తిరుగుతుంది.]

హెడ్ : నువ్వు చదువుకునే రోజుల్లో ఫుట్‌బాల్ బాగా ఆడేవాడివి కదూ, రాజా!

పాత : ఫరవాలేదు....మా దేశాన్ని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్‌కు వెళ్లాను.

హెడ్ : అవునవును...అయితే, నేను పాతవిద్యార్థుల టీమ్‌కు, స్కూలుటీమ్‌కు ఎగ్జిబిషన్‌మాచ్ ఏర్పాటు చేద్దామనుకుంటున్నాను. రేపు శనివారం....నువ్వుకూడా ఆడరాదా?

పాత : తప్పకుండా ఆడతాను. కాని, నేను మానేసి చాలా రోజులైంది.

హెడ్ : ఫరవాలేదు...శనివారం యింకా మూడు రోజులుంది...ఈలోగా ప్రాక్టీస్ చెయ్యి.

పాత : అవును....

హెడ్ : (చిరునవ్వుతో) ఆవేశమా?

పాత : అవును...గతించిన జ్ఞాపకాలు. చిన్నతనం మిగిల్చిన మధురస్మృతులు...మళ్ళీ అప్పటి మాదిరిగా ఆడడం ఆనందంకాక మరేమిటి?

మా : ఓహో! మరొకరు ఆనందంగా వున్నారా? బావుంది....ఫుట్‌బాల్ ఆడడంలో ఆనందం వుందా మాస్టారూ?...నిజమే! అడ్డంకులు లేని ఆటస్థలంలో ఆడుకోవడం ఆనందమే!

[ఓ క్షణం నిశ్శబ్దం]

విద్యా : బంతి యిస్తారా అండీ?

హెడ్ : ఓ! బంతా! (ఇస్తాడు.)

విద్యా : (వెడుతూ తిరిగివచ్చి) మరచిపోయాను మాస్టారూ! రామమోహనరావు...ఇందాక చెప్పమన్నాడండి...అతనికి గవర్నమెంటు ప్రైజు వచ్చిందండి...

మా : (ఆనందంతో) నిజంగా? వాడు రాలేదేం?

విద్యా : వాళ్ళ నాన్నగారికి టెలిగ్రాం యిచ్చివస్తానన్నాడండి...

మా : మొదట్లో తప్పుతా డనుకొన్నేవాణ్ణి....వాడికే మొదటి బహుమానం వచ్చింది.

హెడ్ : వాళ్లందరూ అంతే!

మా : పనికివచ్చే కుర్రాడని దగ్గర కూర్చోబెట్టుకొని చెప్పాను...నిజంగా నాకు చెప్పలేనంత ఆనందంగా వుంది.... నేను చెప్పాను చూడండి, వాడు కొద్దిరోజుల్లో గొప్ప స్కాలర్ అయిపోతాడు. [హెడ్‌మాస్టరుగారు ఏదో చెప్పబోతారు.] మీరు చెప్పేది నాకు తెలుసు మాస్టారూ! నా కిప్పుడు స్వర్గంలో వున్నంత ఆనందంగా వుంది. (విద్యార్థితో) రామ్‌మోహనరావు రాగానే నేను రమ్మన్నానని చెప్పు....(విద్యార్థి వెళ్లిపోతాడు.) మీరు నిజం చెప్పారు మాస్టారూ! మీ రెప్పుడూ నిజమే చెబుతారు....మేము నిజంగా అదృష్టవంతులం .... మాకు బాధలు వున్నయ్, నిజమే! కాని, అవి మీరు అనుభవించినవాటిలో ఎన్నోవంతు? మేము వాటినుంచి తప్పించుకోవచ్చు; మరచిపోవచ్చు....కాని మీకా అవకాశం లేదు.

హెడ్ : నేను చెప్పానా ఆమాట?

మా : చెప్పలేదా?

పాత : చెప్పి నన్ను గాడిదను చేశారు.

మా : నన్నూ అంతే! మీ వయసు వచ్చేసరికి మేం ఎంతగా మారిపోతామో—

హెడ్ : వగైరా....వగైరా....అంతేనా?

పాత : ఆమాటలు చెప్పి, భూమి బద్దలయేటట్లు నవ్వారు.

హెడ్ : నేనాపనిచేశానని వినడం నాకు చాలా సంతోషంగా వుంది.

మా : నిజంగానా?

హెడ్ : నిజంగానే, నిజంగానే నిఖిలలోకం హసిస్తుందా? మానవాళికి నిజంగానే మంచికాలం రహిస్తుందా? .... పాతకాలంనాటి ప్రశ్న!

పాత : మాకు ఆ ప్రశ్నకే సమాధానం చెప్పండి. మీరు నిజంగా అన్ని బాధలు అనుభవిస్తూనే సుఖంగా వున్నారా? మీ బాధల్ని, భారాన్ని ఎన్నడైనా మరచిపోగలరా?

హెడ్ : నేను.... నేను....(మళ్లీ నవ్వుతాడు)

పాత : నవ్వకండి, నవ్వకండి .... మీరు నిజంగా మరచిపోలేరు.

హెడ్ : మరచిపోలేనా? ఓ! .... మరచిపోలేనన్న మాట! బావుంది....మీరిద్దరూ ఎంత తమాషా అయిన మనుషులో మీకే తెలియదు....

(మళ్ళీ నవ్వుతాడు.)

మా : (కొంచెం అసహనంతో) మీ సంతోషం కొంచెం ఎక్కువమోతాదులో వున్నట్టుంది.

హెడ్ : అదేకదా కావలసింది.

మా : అంటే—

హెడ్ : ఈ 'అంటే'లతో నన్ను విసిగిస్తున్నారు.... చూడండి.....నే నెప్పుడైనా ఆనందరహితంగా కనుపించానా? సానుభూతి లోకే వినంగా ప్రవర్తించానా? అందులోనూ మీ సానుభూతి?

మా : (నమ్మలేక) ప్రవర్తించలేదా?

హెడ్ : ఓ! మీరు నన్ను బ్రతకనిచ్చేటట్లుగా లేరు. మీరు పొందే ఆనందానికి నేను అసూయపడ్డానని మీరు అనుకొనేటట్లుగా నేను ప్రవర్తించాలని మీ వుద్దేశ్యం—మిమ్మల్ని గురించి మీకే ఏ కోశానా తెలియదు. (కుర్చీలో కూర్చుంటాడు.) నిజానికి నేను బాధపడడానికి నాకు బాధలేమీ లేవు...ముసలితనంలో ఆనందానికి రెండు విషయాలుంటే చాలు. మంచి మనసు, మంచి జ్ఞాపకశక్తి....ఆ రెండూ నాకున్నాయనే నా వుద్దేశ్యం. అదీకాక చుట్టూరావున్న ఆనందాన్ని ఆస్వాదించే శక్తి వుంది....ఇవి వుంటే ముసలితనం తప్పక భరించతగ్గదే! ....అందమైన జీవిత నాటకం.. దానిమీదపోయిరికూర్చి వ్యాఖ్య — బడి రోజులకన్న, యౌవ్వనప్రారంభంలో తప్పటడుగులకన్న ఆవేశకరమైన ఆనందకరమైన జీవితనాటకాన్ని గురించి వ్యాఖ్య! ఇటువంటి నాటకం—ఎన్ని పాత్రలు నిష్క్రమించినా, ఎన్ని కొత్తపాత్రలు ప్రవేశించినా, యథాప్రకారం నడిచే నాటకం—దాని ముగింపు — అసలు ముగింపంటూ వుంటే—ఎప్పటికైనా సుఖాంతమే! నేను దాన్ని అనుభవిస్తున్నాను; ఆనందిస్తున్నాను....

[కొంచెంసేపు నిశ్శబ్దం.]

మా : మిమ్మల్ని చూసి నే నసూయపడుతున్నాను, మాస్టారూ!

పాత : నేనుకూడా!

హెడ్ : బావుంది....చాలా బావుంది....ఈ నాటకం —ఓ! ఏకాంకిక అన్నావు కదూ!— అవును....చాలా బావుంది మొదటి బహుమతి ఇవ్వాలికదూ, దీనికి !....నాటకం అయిపోయింది, ఇక వెళ్లి ఆడుకోండి—

పాత : పొద్దుపోయింది....సెలవు తీసుకుంటాం—.
[ముందు హెడ్‌మాస్టరుగారికి, తరువాత ప్రేక్షకులకు నమస్కరిస్తూ వుండగా.... తెర]

లోకోత్తరానందము

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

మనస్సులో అనుభూతమగు ఆస్వాదనము రసనా వ్యాపారము. విభావ వ్యభిచారిభావములు శుద్ధ తత్త్వరూపజ్ఞాన స్వభావములు. ఇచట అనుభావములే గ్రహించబడుచున్నవి. విభావానుభావ వ్యభిచారిభావములు చక్కగా సంయోగించబడినవి కాగా హృదయసంవాదవశమున తన్మయీభావము కలుగగలదు. ఈ తన్మయీభావమున ప్రమాతృభిన్నములుగా విభావాదులు గ్రహించబడుచున్నవి. ఈ సాధారణీభావవశమున మానసేంద్రియాంతర విఘ్నసంభావనాశూన్యమైన నిర్విఘ్నప్రతిపత్తి కలుగును. ఈ ఆస్వాదనమున అలౌకికానందము కల్గుచున్నది. సుఖదుఃఖాది విచిత్రవాసనానువేధోపనతమై హృద్యతాతిశయమగు, సంవిచ్చర్వణాత్మకముగా రసాస్వాదము కలదు.

ఇట్టి ఆస్వాదనమునకు యోగ్యమైనవి శృంగారాది రసములు. వీటిని నాట్యరసములందురు. నాట్యసముదాయరూపత్వమువలన నాట్యరసము లగుచున్నవని చెప్పవచ్చును. రససముదాయమే నాట్యమగుటచేతనూ నాట్యరసములని పలుకవచ్చును. నాట్యమందే రసములు కలవని, నాట్యాయమానమగునదే రసముని, చెప్పవలసి వచ్చుచున్నది.

కావ్యార్థవిషయమున ప్రత్యక్షకల్పము సంవేదనోదయమున రసోదయము కల్గుచున్నదని తౌతభట్టు పలికినాడు. నాట్యప్రయోగత్వమును పొందని కావ్యమున రసాస్వాదన అసంభవమని, ప్రాజ్ఞోక్తితో చక్కగా అర్పింపబడినభావములు ప్రత్యక్షప్రతీతిలోవలె స్ఫుటములైననే ఆస్వాదనము కలదనికూడ చెప్పియున్నాడు. కొందరు సమీక్షకులు కావ్యమునగూడ గుణాలంకార సౌందర్యాతిశయకృతిమగు రసచర్వణ కలదని పలికినారు.

కావ్యము ప్రధానముగా దశరూపకాత్మకము. దశరూపకమున ఉచితములైన భాషావృత్తి కాకు నేపథ్యాదులద్వారా రసత్వమాపూర్యమాణ మగుచున్నది. ఏవంవిధకలాపము కావ్యమున కన్పించకపోవుటచే "సందర్భేషు దశరూపకం శ్రేయః" అని సమీక్షకులనినారు. దశరూపకార్థమే నాట్యమగుటవలన "నాట్యస్యైవాతనూః" అని భరతుడు చెప్పుచున్నాడు. నాట్యమున హృదయసంవాద తారతమ్యాపేక్షావశమున శ్రోతృప్రతిపత్తి స్ఫురణము స్ఫుటాస్ఫుటత్వరూపములతో నతివిచిత్రమగుచున్నది. ఈ నాట్యాస్వాదమున స్వాభావిక నిర్మల ముకుర హృదయులగు సహృదయులు మాత్రమే సంసారోచిత క్రోధమోహాభిలాష పరవశ మనస్కులు కాజాలరు. ఇట్టి సహృదయులకు దశరూపకాకర్ణన సమయమున సాధారణ రసనాత్మకచర్వణ గ్రాహ్యమగు రససందయము నాట్యలక్షణస్ఫుటమై ప్రతీతియోగ్యమగుచున్నది. ఇట్లు సహృదయులు కానివారలకు ప్రత్యక్షోచిత తథావిధ చర్వణాలాభమునకై నటాది ప్రక్రియ, స్వగత క్రోధశోకాది సంకట హృదయగ్రంథి భంజనార్థము గీతాది ప్రక్రియ చెప్పబడినవి. కాగా శృంగారాది రసములు లోకమున లేవని, నాట్యముననే గలవని, కావ్యమునగా నాట్యమే యని సిద్ధమగుచున్నది.

కావ్యములలో ప్రధానమైనది దశరూపకమనబడు నాట్యమగుటచే రసములు నటనిష్ఠములు కావని స్పష్టము. దేశకాల ప్రమాతృభేదములచే ననియంత్రితమైనది రసము. ఈ రసాస్వాదన కుపకరించువాడు నటుడు. మధుపానమున గిన్నె ఎట్లుపకరించునో అట్లే నటుడని భావము. అందుచే నాట్యనిష్ఠములైనవి రసములని చెప్పవలెను.

ఏవం విధమగు నాస్వాదనము ఆనందమయము, ఆనందఘన సంవేదనము ఆస్వాదింపబడుచుండుటచే

నిచట దుఃఖాశంక కలుగరాదు. రతిశోకాది వాసనా వ్యాపారముచే రసమునకు విశిష్టత వచ్చుచున్నది; ఈ వాసనావ్యాపారము సముద్బోధన చేయుట కభినయాది వ్యాపారము కలదు అని విస్మరింపరాదు. కాగా అలౌకికము లేక లోకోత్తరము నానందము రసప్రతీతిలో గలదని చెప్పవలెను.

ఈ ఆనందముయొక్క స్వభావ మేమి? ఇది దుఃఖాసంభిన్నమైనదా? ఇది కేవల మనిర్వచనీయము సంవేదనమా? అని మొదలుగాగల ప్రశ్నలను విచారించినచో రసాస్వాదమునగల ఆనంద మెట్టిదో తెలిసికొనగలము.

2

రసప్రతీతి జాగ్రదనుభూతులలో నొకటి. ప్రతి జాగ్రదనుభూతిలోను సంవేదనములు (*Feelings*), అనుభావములు (*Sensations*) మాత్రమే కన్పించుచున్నవని "వుంట్" (*Wundt*) అను శాస్త్రజ్ఞు డనినాడు. రూపాపహిత భావములు (*Images*) కూడ గలవని "టిచెనర్" (*Titchener*) పలికినాడు. రూపవిన్యాస (*Gestalt*) వాదులగు మనస్తత్త్వ శాస్త్రజ్ఞులు రూపగుణములు మాత్రమే కలవనినారు. రూపరహితములగు భావములు కలవనిన శాస్త్రజ్ఞులు ఈ యనుభూతిలో అతీంద్రియ గ్రాహ్యములగు జ్ఞానములున్నవనినారు. ఈ వాదములన్నియు సంవేదనములమీద, అనుభావములమీద ఆధారపడియున్నవి. సంవేదనములు, అనుభావములు అనుభూతిలో గలవని మన కనుమాన ప్రమాణముద్వారా అవగతమగుచున్నదని మన న్యాయదార్శనికులు, "వర్ట్‌హైమర్" (*Wertheimer*), "కోహ్లెర్" (*Koehler*), "కోఫ్కా" (*Koffka*) లు సిద్ధాంతించియున్నారు. అనగా సంవేదనములు, అనుభావములు అనబడునవి అనుభూతియొక్క ధర్మములని తాత్పర్యము.

సంవేదనములు, అనుభావములు, సంచారిభావములు, రూపాన్వితభావములు, భావములు మొదలగు వాటితోను, బాహ్యవిషయ సామగ్రితోను కలసియున్న అనుభూతి అతిశ్లిష్టమైనది. ఈ శ్లిష్టత్వము వలన అనుభూతియొక్క నిజస్వరూపమునుగాని, నిజస్వభావమునుగాని తెలిసికొనుట కష్టమగుచున్నది— కాని అనధిగతార్థమును అవగాహన చేసికొనుటకు

ప్రతి అనుభూతిలోను యాత్మను కన్పించుటచే గతించిన అనుభూతులవలన కలుగు సంస్కారములన్నియు అద్యతనానుభూతిలో నంతర్లీనములుగా గలవని చెప్పవీలున్నది. ఈ విషయమును మాత్రమే గ్రహించి వివిధానుభూతుల సంకలనమే మనస్సు లేక ఆత్మ అని కొందరు మనస్తత్త్వశాస్త్రజ్ఞులనినారు. కాని ఉపహితమైన ఆత్మప్రవృత్తి పరమైనప్పుడు మనస్సు మొదలుగాగల రూపములతో భాసించుచున్నదని మరువరాదు

దీని సమర్థించవలెనను సంవేదన ముపకరణమగుటచే ప్రతి యనుభూతియందును సంవేదనము కలదని అంగీకరించక తప్పదు. ఇట్లు అతి ప్రధానమైన సంవేదనము సంవిదాత్మకమగుటచే సంవిత్, చైతన్యము, ఆత్మయనునవి పర్యాయపదములుగా వేదాంతులచే గ్రహించబడినవి. ఈ సంవేదనముద్వారా వస్తువులు ప్రతీయమానము లగుచున్నవి. అనుభావాదులద్వారా మనకీ ప్రతీతికలదని తెలియవచ్చుచున్నది. అనుభావములు సంచారిభావముల స్వభావములను వ్యక్తము చేయునవని చెప్పియున్నాము.

వస్తుప్రత్యక్షమున నుద్దీపితమగు సంచారిభావము విశదీకృతమైన సంవేదనమని "మార్స్టన్" (*Marston*) చెప్పియున్నాడు. ఈ యుద్దీపనమున స్థాయిభావము ప్రబుద్ధమగుచుండగా సాత్త్వికాద్యనుభావములు బయలుదేరుచున్నవి. సాత్త్వికభావముల వలన సంచారిభావ ముత్పన్నమగుచున్నదని "లాంగె" (*Lange*) అనుభావములవలన సంచారిభావము వచ్చుచున్నదని "జేమ్స్" (*James*) చెప్పినారని ఈ వాదము లప్రామాణికములని వెనుక నిశ్చయించితిమి. అనుభావములకు కారణభూతమగు సంచారిభావమును కార్యముగా గ్రహించుటయే ఈ వాదములలో గల వైపరీత్యము. వివిధసంచారిభావములలో తుల్యానుభావములు కన్పించుచున్నవని మరువరాదు. అనగా సంచారిభావమునననుసరించిగాని, అనుభావమునననుసరించిగాని అనుభూతియొక్క స్వభావమును నిర్ణయింపరాదు. వస్తువులు, వస్తువులద్వారా మనకు కలుగుభావములు అనువాటిని గమనించి అనుభూతియొక్క స్వభావమును నిశ్చయింపవలెను. పూర్వానుభూతులసంస్కారమువలన, వస్తుప్రతీతివలన మనలో నుచితసంచారిభావ ముద్దీపింపబడుచున్న దని విస్మరించరాదు.

కావుననే స్థాయిభావముల ననుసరించి సాత్త్విక భావము లుత్పన్నములగుచున్నవని భరతుడు చెప్పినాడు. పరిపుష్టముగా మనఃచే అనుభవింపబడవలసినది స్థాయిభావము. ఈ యనుభూతికి విభావానుభావ వ్యభిచారి భావములు కావలెను. అనుభావములు వ్యభిచారి భావాధీనములు. వ్యభిచారి భావము విభావమువలన ప్రతీయమానమగు జ్ఞానము నాశ్రయించుకొని వచ్చునది. అనుభూయమానమగు ప్రధానభావము ననుసరించి అనుభావాదు లర్థవంతము లగుచున్నవి. అర్థరహితము లైన అనుభావములు లేవు. అర్థమనగా భావము లేక జ్ఞానము. ఈ జ్ఞానము ననుస్యూతముగా గలిగి తద్ద్వారా ఉజ్జీవితములైనవి అనుభావములు.

3

ప్రమాతృప్రమేయముల కెవిధమైన అనన్యత్వము సిద్ధించునో తథావిధమగు సంబంధముచే నియంత్రితమైనది అనుభూతి. కావ్యానుభూతిలోని విషయము బాహ్యజగత్తున వస్తురూపముగాను, మానసమున భావముగాను కలదు. ఇది సంవేదనముద్వారా అనుభూయమానమగుచున్నది. సంవేదనము భావరహితమై కన్పించజాలదు. ప్రతి చిత్తవృత్తియందును కన్పించు సంవేదనము సుఖదుఃఖ రూపములలో వ్యక్తమగుచున్నది. విషయసంవలనము ననుసరించి సంవేదనము సర్వదా సంచలితమైన ట్లనుభూయమానమగును. కాగా ప్రవృత్తితో సన్నిహిత సంబంధముగల సంవేదనము భావాత్మకమగుచున్నది. ఇట్టి సంవేదనము శుద్ధ భౌతికస్థితిగాక భావముచే నుజ్జీవితమై ప్రతీయమానమగునని నిశ్చయింపవలెను. ఏదేని ఒక విషయముతో సంబంధము కలిగినపుడు అనుభూయమానమగు సంవేదనమున నా విషయము భయంకరమని, విస్మయకరమని, సుందరమని మొదలుగాగల ప్రతీతులు కలవు. కావుననే సంచారి భావోద్దీపనము, అనుభావములు, ప్రవృత్తి అనువానిని సంయోజించునది సంవేదన మనబడుచున్నది. ప్రతి జాగ్రదవస్థలోనుగల సంవేదనము ప్రమేయముద్వారా ప్రతీయమగుచు, ప్రమేయమున నుపహితమైన భావములతో సంవలితమై కన్పించును. భావమునకు సంవేదనమునకు ననన్యత్వ సంబంధము కలదని, భావము లేనిచో సంవేదనము లేదని స్పష్టము.

సంబంధరహితమై శుద్ధమైన సంవేదనము ప్రతీతిలో గోచరించదు. అభివ్యక్తమగుటయే సంవేదన స్వభావము. అభివ్యక్తమగుట కిది భావములద్వారా అర్థవంతము కావలెను. ప్రమేయనిష్ఠమైన భావము ప్రతీయమానమై ప్రమేయసూచకమగుచున్నది. సంవేదనకు స్వరూపము, అర్థము, అభివ్యక్తి, వస్తుతంత్రత్వము అను లక్షణము లీ భావమువలన వచ్చునవి. ఇట్టి సంవేదనమున ప్రమాతృ ప్రమేయములు సన్నిహిత సంబంధమును కలిగియున్నవి. కావున సంవేదనలో రూపవిన్యాసములు, జ్ఞానములనబడు భావములు కలవని చెప్పవలెను.

సంవేదనమును విమర్శించి విశ్లేషించగా అనేక అంశములు రాగలవు. కాని ఈ అంశములుకూడ సంవేదన సంవేద్యములే యగుటచే సంవేదనమున వేరుచేయబడజాలని సంవిత్ కలదని చెప్పకతప్పదు. ఈ సంవిత్‌ను ఆత్మయని, చైతన్యమని యనుచున్నాము. ఒకని సంవేదనము మరియొకనికి లేకపోవుటచే సంవేదనభేదము ననుసరించి వ్యక్తిభేదములు కల్గుచున్నవని "వార్డ్" (*Ward*) చెప్పినాడు. కాని ప్రతి యనుభూతిలోను అంతర్యామిగా ఉన్న సంవేదనము వస్తుతఃభావరహితమై యున్నను అనుభూతిలోని విషయములలో సంబంధమును పొంది అభావాన్వితమై అరవంతమగుచున్నదని మరువరాదు. ఈ భావము వస్తుతంత్రమైనపుడు సంవేదన భేదము వ్యక్తిభేద నియామకము కాజాలదు.

4

సంవేదనముద్వారా భావరహితమగు సుఖ ప్రతీతి కలుగజాలదని నిశ్చయించితిమి. ఇక సాత్త్వికాద్యను భావములను గమనింతము.

ప్రత్యక్ష ప్రతీతికి సంబంధించినవి అనుభావములు. ఒక వస్తువుద్వారాగాని, భావమువలనగాని ఇవి బయలుదేరుచున్నవి. ఒక్క విషయ మొక్కొక్క అనుభావమునకు హేతువు కాగలదు. కాని వివిధ విషయములు కలిసి ఈ అనుభావములకు విలక్షణమైన ప్రతీతిని తీసికొని రాగలవు. శబ్దము, రూపము, లయ, ఛందస్సు అనునవి ప్రత్యేక ప్రత్యేకముగా భిన్నభిన్నానుభావముల నుత్పన్నము చేయగలవు. కాని ఇవన్నియు కలసి పద్యరూపమున భాసించగా విశిష్టస్వభావము గల విశిష్టానుభావము

వచ్చుచున్నది. ఈ వైశిష్ట్యముద్వారా అనుభావ మర్థవంతమగుచున్నది. అనగా నీయనుభావముల ద్వారా జ్ఞాన మభివ్యక్తమగును. కాగా జ్ఞానరహిత మగు అనుభావము అనుభూయమానము కాజాలదని స్పష్టము. ఒక లయద్వారా మరియొకలయకు సమగ్రత్వము వచ్చుచున్నదని, ఒకస్వర మితరస్వరములతో సమన్వయమగుచున్నదని, వర్ణవిన్యాసమున నొకవర్ణము యోగ్యమైనదని, మనము పలుకునపుడు వీటిలో జ్ఞానాకారమైన నియమము లేక నియతి కలదని చెప్పబడుచున్నది. 'ఈ రెండురాగములను కలిపిన గీతము బాగుండదు' అని అనినప్పుడు సంగీత శాస్త్రనియమముల కిది విరుద్ధమని భావము. ప్రతి విషయము నియమబద్ధమని, నియమనగా జ్ఞానాకారమని, తద్ద్వారా అనుభావములు జ్ఞానరహితములు కాజాలవని స్పష్టము. భౌతికవికారముగా కన్పించుచున్న అనుభావము జ్ఞానజనితము, జ్ఞానసంవలితము అని భావము. భావాన్వితమై అభివ్యక్తమగుచున్నది అనుభావము. అభివ్యక్తమగు భావమునుండి అనుభావమును వేరుచేయలేము. కావున రసప్రతీతి గల కవికి ప్రతిభావ్యుత్పత్తు లవసరమని, కావ్యము సజ్ఞాలంకారసంయుతమని చెప్పబడిన వాక్యములు జ్ఞానపరముగా వ్యాఖ్యానించబడుచున్నవి.

5

వస్తువులచేతను, వస్తునిష్ఠభావములచేతను, నియంత్రితములైనవి సంవేదనములు, అనుభావములు అని నిశ్చయించితిమి. ప్రమాతృప్రమేయములకు సిద్ధమగు అనన్యత్వముద్వారా జనియించు అనుభావములు, సంవేదనములు, జ్ఞానమున పర్యవసితములై నిజ స్వభావమును పొందగలుగుచున్నవి. సుఖదుఃఖములుగా అభివ్యక్తమగుసంవేదనము జ్ఞానమున పర్యవసితమైనపుడు సుఖదుఃఖరూపములను కోల్పోవుచున్నది. సంవిత్సంవేదనమున జ్ఞానమే ప్రధానముగా ప్రతీయమానమగుచున్నది.

కావ్యప్రతీతిలో నుత్పన్నములగు అనుభావములు సంవేదనముగా పరిణమించుచున్నవి. అనగా ఉద్దీపితమైన సంచారి భావములవలన జనియించు అనుభావములు సంవేదనాత్మకములుగా ప్రతీయమానమగుచున్నవని భావము. ఈ సంవేదనము భావాత్మకమగుటచే కావ్యప్రతీతియందు ప్రధానముగా జ్ఞానావగతియే కలదని చెప్పవలెను. సంవేదనరూపమున ప్రతీతమగు జ్ఞానము పూర్తిగా అభివ్యక్తము గాక వ్యంజితమగుచున్నది. ఏవంవిధమగు ప్రతీతిలో కావ్యమందలి పాత్రలు, కథ, భావములు, శబ్దములు, లయాన్వితమగు ఛందములు మొదలైనవన్నియు కలవని మరువరాదు. కాని వీటి అన్నిటికంటె విశిష్టమైన ఈ ప్రతీతిలో కేవల మనుభావములు కాని, కేవలము సంవేదన కాని లేదు. జ్ఞానప్రధానమగు కావ్యానుభూతిని లోకోత్తరాహ్లాద జనకమని చెప్పుట ప్రామాదికమేమో అని ఆశంక కలుగుట సహజము. ఈ అలౌకికానందమునకు సుఖరూపమును చెప్పవలెనా? లేక జ్ఞానాకారమును చెప్పవలెనా?

6

ఈ ప్రశ్నలకు సమాధానము చెప్పవలెననిన కొన్ని సాహిత్య చార్వాకవాదములను పరిశీలించవలెను.

శృంగారమును రససార్వభౌమముగా గ్రహించు ఆలంకారికులు, రతిస్థాయిభావమే వివిధ స్థాయ్యాది భావములకు కారణమని చెప్పు "ఫ్రాయిడ్" (*Freud*) మొదలగు మనస్తత్వశాస్త్రజ్ఞులు, సాహితీ చార్వాకవాదులలో నగ్రగణ్యులు. ప్రపంచమునగల సాహిత్యము లన్నింటిలోను శృంగారమే కన్పించుచున్నది. కొందరు యోగులు భక్తిశృంగార మను శృంగార భేదమును కూడ గ్రహించినారు. శృంగారము సర్వరసములకు హేతుభూతమగుటచేతను, శృంగారమున సుఖప్రతీతి కలదు గనుకను రసచర్వణయందు ఆనందమే కలదని వీరి వాదము.

"శృఙ్గారీ చేత్కవిః కావ్యే
జాతం రసమయం జగత్
సఏవవీత రాగశ్చే
న్నీరసం సర్వమేవతత్"

అని ఆనందవర్ధనుడు సహితము పలికినాడు. ఈ శ్లోకమే అగ్నిపురాణమునకూడ కలదు. కవి శృంగార రసపూర్ణుడైనచో కావ్యమున రసమయ జగత్తు ఉత్పన్నము కాగలదని, కవి శృంగారరహితుడైన కావ్యము నీరసమగునని ఈ శ్లోకములోని తాత్పర్యము. శృంగారమే సర్వరసములకు ఉత్పత్తి హేతువని, రసమనగా శృంగారమే యని, చెప్పిన భోజుని

వాదములో నీ భావము పరాంకోటికి తీసికొని పోబడుచున్నది.

అహంకారాభిమాన శబ్దములచే నిర్దేశింపబడు రసముయొక్క ప్రధానస్వరూపము ఆత్మరతిగా పరిణమించుచున్నది. ప్రధానమగు అహంకారము వివిధ విషయములయందు అభిమానమను రూపమున అభివ్యక్తమగుచున్నది. ఏకైకమగు రసము భిన్నభిన్న భావములుగా భాసించుచున్నది. ఈ భావములు పరిపుష్టములు కాగా రసములు సిద్ధించుచున్నవి. ఈ రసములు ప్రేమరసమున పర్యవసితము లగుచున్నవి. కావున

"రసో౽భిమానో౽హఙ్కారః
శృఙ్గార ఇతిగీయతే
యో౽ర్థస్తస్యాన్వయాత్కావ్యం
కమనీయత్వ మశ్నుతే
విశిష్టా దృష్టజన్మాయం
జన్మి నామంత రాత్మసు
ఆత్మ సమ్యగ్గుణో ద్భూతే రే
కో హేతుః ప్రకాశతే"

అని సరస్వతీ కంఠాభరణమున,

"రసంత్విహా ప్రేమాణమే వామనంతి, సర్వేషామపిహి రత్యాది ప్రకర్షాణాం రతిప్రియో, రణప్రియో, ౽మర్షప్రియః, పరిహాసప్రియః ఇతి ప్రేమ్ణైవ పర్యవసానాత్"

అని శృంగార ప్రకాశమున భోజుడు పలికినాడు. రసము అభిమానమని, అహంకారమని, శృంగారమని పిలువబడుచున్నది. రసాన్వితమైన కావ్యము కమనీయమగును. శృంగార హాస్యాది రసములు ప్రేమరసమున పర్యవసితములగుచున్నవి గనుకనే రతిప్రియుడని, రణప్రియుడని హాస్యప్రియుడని, అమర్షప్రియుడని మొదలుగాగల ప్రయోగములు వచ్చుచున్నవి. ఇంతటితో తృప్తిచెందక "ఆత్మయొక్క అహంకారవిశేషము మానసికముగా రస్యమానమగుటచే రసమని పిలువబడుచున్నది. ఇది కలవాడు రసికుడు, లేనివాడు నీరసుడు" అనికూడ భోజుడనినపుడు "ఫ్రాయిడ్" (*Freud*) వాదమే కన్పించుచున్నది

ప్రమేయముతో అనన్యత్వముగాని తాదాత్మ్యముగాని కలిగినపు డుత్పన్నమగు చిత్తవృత్తిని రతి యందురు. ఆత్మీయమై సుఖమయమగు ఈ చిత్తవృత్తియందు తన్మయీభవనము కలదు. తన్మయత్వము రసప్రతీతిలో కన్పించుటచేతను, శృంగారమునే కవులనేకులు వివరించియుండుటచేతను, ఈ సాహితీచార్వాకులు శృంగారజనితమగు సుఖమునకు తుల్యమగు నానందము నొసగుటయే కావ్యప్రయోజనముగా చెప్పుచున్నారు. ఆత్మజీవితరక్షణ, స్వవంశవృద్ధి అనువానికి రెండు స్థాయిభావము లన్నిటికి నాధారభూతములని మానవ జీవిత పరిణామముల నన్వేషించు శాస్త్రజ్ఞులు (*Anthropologists*, మనస్తత్వశాస్త్రజ్ఞులు (*Psychologists*) చెప్పుచుండగా ఈ చార్వాకులు రతిస్థాయిభావమే మిగిలినవాటి కాశ్రయ మనుచున్నారు.

రతిస్థాయిభావము ప్రవృత్తమైనపుడు సుఖము లేక ఆనందము కలుగును. కాని ఈ ప్రవృత్తి ఒక్కొక్కప్పుడు సాంఘిక జీవనమున కతి దుష్టముగా కన్పించుటచే అణచివేయబడి, జాగ్రదవస్థలో విస్మరింపబడుచున్నది. కాని ప్రాణప్రదమైన రతి స్థాయిభావము పైకి ఉబుకుట కనేకవిధముల యత్నించుచున్నది. ఈ యత్నమున సాంఘికజీవన మంగీకరింపగల రూపములలోనికి పరిణమించుట కన్పించుచున్నది. ఈ రూపాంతర పరిణామముల (*Sublimation*) లో సాహిత్యము ప్రధానమైనది. అణచివేయబడిన భావాదులు స్వప్నతుల్యమగు భావనావ్యాపారముద్వారా రూపాంతరములనుపొంది అభివ్యక్తము లగుచున్నవి. ఈ అణచివేయబడిన భావాదులు రత్యాత్మకము లగుటచే కావ్యమున రత్యాత్మకమగు ప్రీతియే కలదని "ఫ్రాయిడ్" (*Freud*), అతని అనుయాయులు చెప్పుచున్నారు.

ఈ రతినే ప్రకృష్టముగా చెప్పుచు, దుఃఖానుభూతియందు సహితము సుఖమే కలదని "మనో౽నుకూలేన దుఃఖాదిషు సుఖాభిమానః రసః," అని శృంగార ప్రకాశమున భోజుడనినాడు. సర్వభావములు కామమునుండి నిష్పన్నము లగుచున్నవని భరతుడు, రత్యాదిభావములు శృంగార వ్యక్తిహేతువులని భోజుడు పలికినాడు. "ఫ్రాయిడ్" (*Freud*) చెప్పు ఆత్మరతి, ప్రమేయరతి యనునవి భోజుని వాదమున క్రమముగా అహంకారమని, అభిమానమని పిలువబడుచున్నవి. రసములన్నియు ఆత్మకామనిష్పన్నములు. ఈ ఆత్మకామమును "లిబిడో" (*Libido*) అని

"ఫ్రాయిడ్" చెప్పినాడు. కావున సుఖదుఃఖావస్థా రూపములగు రసములు కావ్యనిష్ఠములుగాక శరీరులై చేతనులైన మానవులయందే కలవని స్పష్టము. శృంగార ప్రకాశమున మొట్టమొదటి శ్లోకముననే పురుషనిష్ఠమైనది రసమని చెప్పబడినది:

"ఆత్మస్థితం గుణవిశేష మహం కృతస్య
శృంగార మాహురిహ జీవితమాత్మయోనేః
తస్యాత్మశక్తి రసనీయతయా రసత్వం
యుక్తస్య యేన రసికోఽయ మితి ప్రవాదః."

సాహిత్యమున శుద్ధ చార్వాకవాదమిది. దీనిని చాలమంది విమర్శకులు ప్రపంచించి యున్నారు. అణచివేయబడిన అధర్మసిద్ధములగు రతివాంఛలను భావనా వ్యాపారవశమున అనుభవించుటయే కావ్యప్రయోజనమున గలదని "బోదా" (*Baudouin*) అనినాడు. రతిసంబంధములగు భావముల ననుభవించుటయే రసప్రతీతియందు గలదని చెప్పినపుడు కవి సామాజికులలో తుల్యముగ భావములే అణచివేయబడినట్లు కన్పడుచున్నవని సిద్ధమగుచున్నది. అణచివేయబడిన భావములు పైకి ఉబుకునపుడు స్వప్నమునకు ఉన్మాదస్థితికి మధ్యగా కవిమానసము గలదని "ఒటో రాన్క్" (*Otto Rank*) చెప్పుచున్నాడు. కాగా అసంతృప్తములగు రతివాంఛలే కావ్యనిష్పాదక హేతువులగుచున్నవి. ఈ అసంతృప్తి శైశవావస్థలోని శృంగార జీవితమున బయలుదేరినదని, కాలక్రమమున సాంఘిక జీవనానుసారి యగు రూపముతో నిది వ్యక్తమగుచున్నదని, తద్ద్వారా మానవజీవిత సౌఖ్యమున కుపకరించని భావములు నిరస్తములగుచున్నవని చెప్పుచున్నారు.

ఒకేఒకసూత్రమును పట్టుకొని అన్యసూత్రములు లేనేలేవని చెప్పు వాదములలో నీవాద మొకటి. రతి యనునది మానవవృత్తులలో నొక ప్రవృత్తియే యని మరువరాదు. మానవునియం దనేక భావములు కలవు. ఇవన్నియు సమన్వితములైనపుడే మానవ స్వభావ మభివ్యక్తమగుచున్నది. హృదయసంవాద వశమున బయలుదేరు భావనావ్యాపారము విభిన్న విషయముల కనన్యసాధారణమగు పరిణామమును తీసికొనివచ్చుచూ తన్నిష్ఠసౌందర్యావగాహనకు దోహదమగుచున్నది. రసప్రతీతియందు నిష్పన్నమైన కావ్యమే మన ప్రమేయము. కాని ఆ కావ్య మెట్లు నిష్పన్నమైనదో మన కనవసరము. పైగా రతిస్థాయిభావమే కావ్యనిష్పాదకమని చెప్పుటకు తగినంత ఆధారము కన్పించదు. రత్యాదిభావములు రసప్రతీతిలో గల అంగములేకాని, రసమునకు హేతువులు కావని చెప్పియున్నాము. నిర్విఘ్న స్వసంవేదనాత్మకవిశ్రాంతిలక్షణమైనది రసము. ఈ రసము ప్రతీయమానమగునపుడు రతిహాసశోకాదులు కన్పించవచ్చునుగాని, వీటికంటె విలక్షణమైనది రసమని మరువరాదు. కాగా శృంగారమే రసమని, రతిప్రతీతియే రసప్రతీతియని ఎంచుట చాల ప్రామాదికమైన విషయము.

కావ్యవిషయమునకు ఆత్మకామమునకు సంబంధమేమైనకలదా ? మహాగ్రంథమగు మహాభారతమున అనురాగరూపమగు శృంగారము నిరస్తమగుచున్నది. అభిజ్ఞాన శాకుంతలాది గ్రంథములలో ఆధ్యాత్మికముగా శృంగారము ప్రతీయమానమగుచున్నది. అణచబడిన రతివాంఛయే కావ్యముగా వచ్చుచున్నదనినచో ప్రతికావ్యము ఒక ఆత్మకథ కావలసియున్నది. కవియొక్క ఆత్మకథనుగోరి మనము కావ్యమును సమీపించుటలేదు. కవియొక్క ఆత్మకథను మన కథగా మనము చేసికొనలేకపోవుటచే రసప్రతీతియే కన్పించరాదు. మహాకవులు ఇంత స్వార్థపరులుగా మాత్రము కన్పించుటలేదు. సాంఘిక, వైజ్ఞానిక జీవితమున లలితకళలకున్న ప్రాధాన్యమును గమనించితిమేని ఈ చార్వాకవాదము దుస్సాధ్యమని తేలగలదు. పైగా స్వార్థకామనయే కావ్యమగునపుడు కావ్యానుభూతికి బాహ్యజగ మనవసరమని చెప్పవలసివచ్చును.

రసప్రవృత్తియందు చిత్తము ప్రవృత్తమై యుండుటలేదు. బాహ్యమునగల ఉద్దిష్టప్రమేయమును పొందగోరి ప్రమాత ప్రవృత్తిపరుడగుచున్నాడు. రసప్రతీతిలో ఆనందమున్నదంటిమేని, ఈ ఆనందము ప్రమాతృప్రమేయ సంబంధముచే నియంత్రితమైనదని చెప్పవలెను. అనగా ఈ యానందము భావజనితము, భావముచే నుజ్జీవితమునని తెలియవలెను.

ఆనందము ననుభవించునపుడు ఇంద్రియము లన్నియు వ్యాపృతములగుచున్నవి. కాని కావ్యప్రతీతియందు చక్షుఃశ్రోత్రేంద్రియములే వ్యాపృతము లగుటకలదు. అనగా నిచట విశిష్టమైన ఆనందము కలదని, ఈ వైశిష్ట్యము భావమనబడు జ్ఞానముద్వారా వచ్చుచున్నదని చెప్పక తప్పదు.

7

రసప్రతీతిని నిర్విఘ్న స్వసంవేదనాత్మక విశ్రాంతి లక్షణముగా నిర్వచించితిమి. మానవజీవితమున కన్నిటను భౌతికశక్తుల సంఘర్షణ క్రమేణ ఉపశమించగలుగు గనుక, ఇట్టి ఉపశమనస్థితియే రసప్రతీతిలో అనుభూతమగుచున్నదని రెండవ సాహిత్య చార్వాకవాదము. కాని రసప్రతీతిలో కేవల మింద్రియ గ్రాహ్యత్వముగాని, కేవలము మానవికానుభూతిగాని లేదని వివరించియున్నాము. ప్రమేయ జనితమగు ఉద్దీపనద్వారా మనస్సు ప్రవృత్తమగుచున్నది. ఈ యుద్దీపనలో శక్తిద్వయ సంఘర్షణ కలుగు. శక్తిద్వయము సమన్వితమై తత్త్వాభివ్యంజకమగును. కాని ప్రతిశక్తియు సమగ్రతత్త్వమని మనస్సుచే గ్రహింపబడుటచే నిస్సంఘర్షణ నిర్వృతమగుచున్నది ఈ శక్తిద్వయము బాహ్యసామగ్రిసముత్పన్నమగుటచే కావ్యమున సాంఘిక నైతిక్య ముపహితమగుచున్నది. అందుచే "విశ్వశ్రేయః కావ్యం" అనినారు. ఈ శ్రేయస్సు భౌతికశక్తుల సామగ్రియించినది గాక, నైత్తికనిష్ఠమని రసదర్శనమును నిర్వచించుచు సవరించితిమి. భౌతికశక్తులీ నిత్యత్వమందు సమన్వితములైన అంగములే గాని అంగిగా ప్రతీయమానములు కాజాలవు. అనగా ఆత్మయందు పర్యవసితములగుచున్నట్లే భౌతికశక్తులు రసప్రతీతియందు కలవు. ఈ రసప్రతీతిలో గలుగు ఆనందము భౌతికశక్తి జనితము గాక, ఆత్మస్వభావనిష్ఠమైనదని సిద్ధమగుచున్నది.

8

సౌందర్యమని మనము వ్యవహరించు దలనరహితమగు సుఖము లలితకళలలో చక్షుశ్శ్రవణేంద్రియముల వలన కలుగునదని మూడవ చార్వాక వాదము. సౌందర్యము నిజమైన సుఖమని "మార్షల్" (*Marshall*) అనినాడు. ఈ సుఖము స్వార్థముగా అనుభూతమగుటచే, అనుభావ సంచారిభావములవలనను, ఇచ్ఛామననములవలనను కలుగుచున్న పురుష వ్యాపారతంత్రమగు గుణమును సౌందర్యమనవలెను. స్వార్థానుభూతిలో కన్పించు విశిష్టగుణము సౌందర్యమగును. ఇట్టి గుణమునకు పరిపోవు స్థాయిభావమును కూడ అంగీకరింపక తప్పదు. స్వార్థనిష్ఠమగు సౌందర్యమనబడు గుణమును పరస్థముగా ఆరోపించుచున్నామని "శాంటాయన" (*Santayana*) చెప్పినాడు. సౌందర్య ప్రవృత్తియందు ఇచ్ఛ, బుద్ధి, అనుభావములు ఉద్దీపితములై సుఖప్రతీతి నిచ్చుచున్నవని "గుయో" (*Guyaw*) వాదము. ఈ ప్రతీతిలో శ్రమరహితముగా నరములన్నియు ఉద్దీపింపబడుటచే సుఖానుభూతి కలుగుచున్నదని "గ్రాంట్ ఎల్లెన్" (*Grant Allen*) ఈ వాదమునే స్పష్టీకరించుచున్నాడు. రసప్రతీతిలో ఎక్కువ నరములు, ఎక్కువ కండరములు సంచలితములగుటచే రసదర్శన మిగిలిన అనుభూతులకంటె విశేషమైన సుఖము నిచ్చుచున్నదట!

వ్యవహారవేత్తృత్వము శివేతరక్షతి యనునవి లలితకళలలో కన్పించుటచే నివి సుఖమయములగుచున్నవని నాల్గవచార్వాక వాదము. మనల నాకర్షించు కావ్యజగము తద్గతప్రవృత్తులను మనవిగానొనర్చుచు సుఖము నొసగుచున్నది. విభిన్నవాంఛలను సమన్వయపరచి సంతృప్తినొసగజాలిన కావ్యజగమే ఆనందము నీయగలుగు. మనలోనున్న భిన్నములగు కోరికలు సమన్వితములు కాగా సుఖానుభూతి కలుగుచున్నది. భయశోకము లనబడు స్థాయిభావములు మనలోనుండి బహిర్గతములైనపుడే ఈ సమన్వయము కుదురగలుగు.

కాని వ్యక్తిభేదమువలన, ఇచ్ఛాభేదమువలన విభిన్నములగు సుఖము లేర్పడుచున్నవని మొదట గుర్తింపవలెను. ఇట్టిచో నైనను అంగీకార్యమగుచో నొకేయొక కావ్యము భిన్నవ్యక్తులకు భిన్నసుఖముల నర్పింపవలసి యున్నది. ఒకసుఖము మరియొక సుఖముకంటె భిన్నమైనదంటిమేని ఈ భేదము సుఖముభివ్యక్తముచేయు అర్థములేక భావముపై ఆధారపడి యున్నదని చెప్పవలెను. అనగా అర్థరహితమగు సుఖముండజాలదు. అర్థములేక భావములేక జ్ఞానము అనువ్యాప్తముగానుండుటచే సుఖమునకు సుఖత్వము సిద్ధమగుచున్నదని నిశ్చయింపవలెను.

కావ్యానుశీలనమున మన కనుభూతి కలుగుటచేత కావ్యము గొప్పది యగుటలేదు. మన యనుభూతికి ఉపకరింపగల్గుటచేతనే కావ్యమునకు గొప్పదనము వచ్చుచున్నది. అనగా రసము మన మనోగతమైనది కాదని, కావ్యమున ఉపహితమైనదని, ఈ ఉపహితత్వము ప్రమాతృప్రమేయముల అనన్యత్వనిష్ఠమని, ఈ అనన్యత్వమువలననే సామాజికులకుగూడ రసప్రతీతి కలుగుచున్నదని చెప్పవలెను. ఈ రసము విభావానుభావ వ్యభిచారిభావములద్వారా వచ్చుచున్నను, రసచర్వణయందు అనుభావాదులు జ్ఞానానుప్రాణితములై అర్థవంతమగుచున్నవి. భౌతికత్వలక్షణరహితములై భాసించుచున్నవి. ఇట్లు రసప్రతీతిలో నంతర్లీనమైన కావ్యమున కలుగు అపరోక్షానుభూతియందు జ్ఞానమే అనుభూయమానమగుచున్నదని, అనుభావాదులు తదనువ్యాప్తములుగా భాసించుచున్నవని స్పష్టము.

కాని "రిచర్డ్సు" (*Richards*) విపరీత మార్గము నవలంబించి పురుషార్థములు మనోనిష్ఠములని, కావ్యముద్వారా అనుభూయమానమగు పురుషార్థమున సంవేదనము, ఇచ్ఛ అనునవి అనేకవిధముల సంతృప్తి నందుచున్నవని చెప్పుచున్నాడు. ఒక మనోవృత్తిని సంతృప్తిపరచుచు, తత్తుల్యమనోవృత్తికిగాని, తదధిక మనోవృత్తికిగాని అసంతృప్తి నొసగజాలనిదే పురుషార్థమని ఇతనివాదము. ఒక మనోవృత్తి ఉద్దిష్టార్థము పొందకపోవుటవలన ఇతర మనోవృత్తులు పర్యాకులీభూతములై దుఃఖమును తీసికొనిరాగలవు. ఇట్టి పర్యాకులత్వము కలుగచేయని అనుభూతిలో సుఖముకలదని, ఈ సుఖము కావ్యమున ఉద్దీపక విషయములవలన పైకి ఉబుకుచున్నదని తాత్పర్యము. దేశకాలాద్యుపాధులతో కూడిన మానవుని వ్యక్తిత్వమెచట పూర్తిగా అనుభూతము కాగలదో అచటనే పురుషార్థము కలదని, ఇట్టి అనుభూతి కావ్యముద్వారా మనలో కలుగుచున్నదని నిశ్చయింపవలెను.

ఇచ్ఛా సంవేదనముల సమన్వయమే కావ్యానుభూతిలో కలదని చెప్పుచు, సంవేదనము సుఖదుఃఖములను రూపములలో అభివ్యక్తమగుచున్నదని విస్మరించి, కావ్యాస్వాదనావసరమున సుఖమునకు ప్రసక్తిలేదని "రిచర్డ్సు" చెప్పుచున్నాడు. ఉద్దిష్టార్థప్రాప్తితో నొక కోరిక శమించును. ఇతరకోరికలతోను, ఇతర సంవేదనములతోను సన్నిహిత సంబంధముగల కోరిక సంతృప్తమైనను వీటిలో నేదో ఒక మార్పును తీసికొని రాకతప్పదు. పైగా ఇచ్ఛా సంవేదనముల సమన్వయమునగాక, ప్రమాతృ ప్రమేయముల అనన్యత్వనిష్ఠమై కావ్యప్రయోజనము కలదని మరువరాదు. ఈ అనన్యత్వము జ్ఞానాకారమున ప్రతీయమానమగుచున్నది. ఇంతేగాక దేశకాల ప్రమాత్రాదులచే నియంత్రితమైన అనుభూతియే రసచర్వణ యగుటచే ఉపహిత వ్యక్తిత్వమున కిచట ప్రసక్తిలేదని గుర్తింపవలెను.

కావ్యానుభూతిలో ఇచ్ఛలకు, సంవేదనములకు అన్యోన్య సంబంధము చక్కగా కుదురుచున్నదని "రిచర్డ్సు" చెప్పుచున్నాడు. ఉద్దిష్ట విషయముతో ననన్యత్వము కుదిరినచో మన జీవితము సమగ్రమని, మన కాత్మ విశ్రాంతి రాదని మనమెంచునపుడే ఇచ్ఛాశక్తి సముద్దీపితమగుట కలదు. రసప్రతీతిలో ఆత్మవిశ్రాంతి వచ్చుచున్నది. అనగా ఆత్మవిశ్రాంతి యున్నపుడు ఇచ్ఛాశక్తి ఇచ్ఛారూపమున నుండజాలదు. ఇచ్ఛాశక్తిని స్పందింపకుండా చేయుటకు లయ, ఛందో, గీతాదులు కావ్యమున ప్రయుక్తము లగుచున్నవి. కాగా కావ్యాస్వాదనమున ఇచ్ఛలు, సంవేదనములు సమన్వితము లగుచున్నవనుట అనుభవ విరుద్ధము.

రసప్రతీతికి సుఖమునకు అవినాభావ సంబంధము లేదని గుర్తింపకపోవుటయే ఈ నాలుగు చార్వాకవాదములలోని ప్రబలదోషము. రసచర్వణలో అనుగతమైనట్లు కన్పించు సుఖము రసముచే జన్యమైనదికాదు, రసహేతువుకాని కాదు. పైగా కరుణ భయానకాద్భుత రసముల నాస్వాదించునపుడు దుఃఖాసంభిన్నమైన సుఖమనుభూతమగుట లేదని విస్మరించరాదు. రసప్రతీతిలో కేవలము సుఖమే అనుభూతమగుచున్నదనుచో నీ మూడింటిని రసములుగా పరిగణింప వీలుపడదు.

స్వార్థముగా, అతీంద్రియముగా, అనుభవింపబడు సుఖము ప్రమేయమువలన కలుగుచున్నది. సుఖము కల్గినంతమాత్రమున ప్రమేయమునకు కావ్యత్వము రాదు. ప్రమేయ స్వభావాధీనమైన సుఖము, ప్రమేయము నభివ్యక్తము చేయు భావముచే నియంత్రితమగునది. రసప్రతీతిలో నీ భావమే కన్పించుచున్నది. పైగా హృదయసంవాదము లేనిది రసచర్వణ లేదు. ఈ హృదయసంవాదమువలన కలుగు సుఖము హృదయసంవాదాభిన్నమగు రసచర్వణయే అని వ్యవహరించుట దోషము. ఒక్కొక్కపుడు ప్రమాతృ ప్రమేయముల అనన్యత్వము నవగాహన చేసికొనుటవలన గూడ సుఖము కలుగుచున్నది. మరియొకప్పుడు కావ్యనిష్ఠమైన పురుషార్థము నవగాహనము చేసికొనుటవలన గూడ సుఖముం గలదు. వీటి అన్నింటిలోను సుఖహేతువుగా జ్ఞానము లేక భావము కన్పించుటచే జ్ఞానాసంభిన్నమగు సుఖమే రసచర్వణలో గలదని యనరాదు.

మానసిక సంతృప్తివలన సుఖము, అసంతృప్తివలన దుఃఖము కలుగుచున్నవి. సంతృప్తి గాని అసంతృప్తి గాని అనేక కారణాలవలన బయలుదేరవచ్చును. పైగా భిన్నములగు సుఖములు గలవు. ఇవన్నియు సుఖత్వమను సామాన్యధర్మము గలవైన రసచర్వణలోని సుఖమునకు, తద్విలక్షణానుభూతులలోని సుఖములకు గల సంబంధము నిర్వచింపబడవలెను. ఇవి సమానములైన కావ్యానుభూతిలో వైశిష్ట్య ముండజాలదు. ఇవి భిన్నములైన రసచర్వణలో లౌకిక సుఖము లేదనవలెను.

సశేషము

కెరటాలు

శ్రీ కె. రామిరెడ్డి

సాయంకాలం—సముద్రతీరం.

హోరుగాలి ఉవ్వెత్తున వీస్తోంది. ఉత్తుంగ తరంగాలు పెనుకొండలుగా గట్టుమీద దాడి తీస్తున్నాయి. అవి సవాలక్షవేలు సవాళ్లు చేసినాగాని బెదరకుండా ఎదిరిస్తూంది తీరభూమి. హతాశతో నిర్వీర్యాలై వెనుదిరిగి పోతూన్న కెరటాల మూలంగా శత్రువును భేదించే మర్మమేదో తెలిసికొన్నట్లుగా మరీ ఉధృతంగా మీద దూకుతున్నాయి క్రొత్తక్రొత్త తరంగాలు. ఆ సంకుల సమరంలో కూలిపోతూన్న కెరటాల కుటుంబాల్లో కోటి గొంతుకలు ఆవురుమన్నట్టుంది అక్కడి సముద్రఘోష.

ఎందుకీ రెండు పక్షాలమధ్య యింతటి నిష్కారణ పోరాటం! తీర భూమి ఏమి ద్రోహం చేసిందని ఇన్నికోట్ల కెరటాలు దానిపై దాడిచెయ్యడానికి. కానీ, మంచి, మంచిగానే నిలువరించుకొంటుంది. లక్షన్నర చెడ్డలు దానిపై విజృంభించినా అదేమో దాని ఉత్కృష్టతను కోల్పోదు. విశ్వమంతా కూడా ఈ సామ్యమే అవుపిస్తోంటుంది. మంచీ—చెడ్డా, రెంటిమధ్య ఓ ఘర్షణ. తాత్కాలికంగా చెడే నెగ్గినట్లు అవుపించినా శాశ్వత విజయం మంచివేపే మొగ్గుతూంటుంది.

కృష్ణమూర్తికి బుర్ర వేడెక్కిపోతోంది. ఎంత సేపు ఏకాంతంగా ఆ గట్టుపై నించున్నా అతడు గ్రహించే నగ్నసత్యం అదే. మంచీ—చెడ్డా. రెంటికీ ఘర్షణ. మంచికి శాశ్వత విజయం. తన హృదయంలో కూడా అదే ఘర్షణ. లక్షకోటి తలంపులు ఇరుపక్షాలా ఆర్భాటంగా పోరాడుతున్నయ్. కాని విజయం మంచివేపే.

అటువేపు కేశవరావు—శశి; ఇటువేపు—వంచన—ద్రోహం—వ్యభిచారం.

కూడు గుడ్డకు నోచుకోలేక అష్టకష్టాలూ పడుతూన్న తనకు జీవితంలో ఒక మార్గమంటూ చూపించాడు కేశవరావు. అంధకార బంధురంలో అలమటిస్తోంటే తన బ్రతుకుబాటలో ఒక ఆశాజ్యోతిని వెలిగించింది శశి. వీళ్లిద్దరిలో వంచకులెవరు? ద్రోహులెవరు? కృష్ణమూర్తి కిదంతా ఒక అయోమయంగా అవుపించింది. ఇందులో తానైతేను ఏతీర్పుకూ రాలేకపోయాడు. అతనికి తోచిందల్లా ఒక్కటే. సముద్ర తీరం నెగ్గింది. అలలు ఓడిపోయాయి. మంచి నెగ్గుతుంది. చెడ్డలు క్షణికాలు.

కాని, శశి యిన్నాళ్లవలకూ ఈ విషయాన్ని ఎందుకు దాచింది? ఈనాడు ఎందుకు చెప్పాలి? చెప్పకుండా మభ్యపఱచిఉంటేనే బావుండేది. ఆ చెప్పేటప్పటి ఆమెముఖం ఎంత దీనంగా, వైవర్ణ్యంగా అవుపించింది!—ఇందులో ద్రోహం ఎవరిది? కేశవరావుదా? ఎందుకని! రెండు అనాథజీవితాల్లో ఆశాజ్యోతుల్ని వెలిగించినందుకా? కాదు! ఆయన ద్రోహికాడు. శశి అంతకన్నా కాదు. కానీ—ఏమిటీ వంచన! ఆ ప్రశ్నే కృష్ణమూర్తిని వేధిస్తోంది. దాన్ని నిర్ణయించుకోటానికనే ఏకాంతంగా సముద్రపు హోరుగాలిలో నుంచుండిపోయాడు.

శశికి అయిదేళ్లు వెళ్లకముందే తల్లిదండ్రులు ఆమెను ఈ విశాలప్రపంచానికి అప్పజెప్పి వెళ్ళిపోయారు. అప్పటినుంచీ కేశవరావు చేతుల్లోనే పెరిగి పెద్దదయింది ఆమె. ఒక్కగా ఒక అక్కకూతురిలా అనాథ అవటంమూలాన కేశవరావుకూడా దెబ్బతిన్నాడు. ఆమె నెంతో ఆప్యాయంగా పెంచాడు. నీలవేణమ్మకూడా చాల మంచిదవటంవల్ల శశికి తల్లిదండ్రులు లేనిలోపం తీరిపోయింది. తన కెలాగూ బిడ్డలు లేరు కనుక శశినే తనబిడ్డలా పెంచుకుంది నీలవేణమ్మ. శశిని బాగా చదువచెప్పాలని వారిఆశ.

శశి స్కూలు ఫైనలు చదువుతోంది. క్లాసులో అన్నిట్లోనూ ఘనంగా నిలుస్తోంటుంది. చదువులో ఆమెకున్న చురుకుదనము, చొరవ చూచి ఏ డాక్టరు చదువన్నా చెప్పించాలి అనుకున్నాడు కేశవరావు. నీలవేణమ్మకూడా అదే ఉద్దేశ్యాన్ని బయటపెట్టింది.

శశికి స్కూలుఫైనలు పరీక్షలు ఇక పదిహేను రోజులుంటాయి. కాశీసముద్రంనుంచి ఉత్తరం వచ్చింది. నీలవేణమ్మతల్లి చాలా అనారోగ్యంగా ఉందట. చావు బ్రతుకులమధ్య పోరాడుతూంది. త్వరలో రావాలని వ్రాశారు. నీలవేణమ్మకు ఎటూ తోచకపోయింది. తాను వెళ్ళిందంటే పరీక్షకు చదువుకునే శశికి సౌకర్యాలుండవు హోటలు భోజనం. ఆరోగ్యం చెడుతుంది. కాని—వెళ్ళక తప్పింది కాదు. తల్లిని కడసారిగా చూడకుండా ఉండలేదు. పోతూ పోతూ శ్రద్ధగా చదువుకోవమ్మా అని చెప్పేసి వెళ్లింది శశితో.

ఆరోజు మునిసిపల్ హైస్కూలు వార్షికోత్సవం. హైస్కూలు ప్రదేశమంతా బాగా అలంకరించబడింది. ఆటల పోటీలు, వక్తృత్వపు పోటీలు, డ్రామాలు అన్నీ జరుగుతాయి. కేశవరావుకూడా వానిని చూడడానికని హాజరయ్యాడు. వక్తృత్వపు పోటీలో శశి ప్రథమబహుమతి అందుకుంది. ఆనాడు ఆమె వాగ్ధాటికి ఉపాధ్యాయులందరూ కూడా ఎంతో ప్రశంసించారు. శశి యింత తెలివిపరురాలైనందుకు ఎంతో మురిసిపోయాడు కేశవరావు. ఆమె మీద ఆరోజ తనికేదో ఒక క్రొత్తఅభిమానం పుట్టుకొచ్చింది.

ఆరాత్రి ఏడుగంటలకు శకుంతల నాటకం వుంది. దానిలో శశి శకుంతల పాత్రను ధరించింది. నాటకం చాలాబాగుంది. శశి తనపాత్రను అత్యంతమైన నేర్పుతో నిర్వహిస్తోంది. శకుంతల దుస్తుల్లో ఆమె సౌందర్యం లక్ష చంద్రులను మరపింపజేసేలా వుంది. ఆ కోలముఖం, వాలుగన్నులు, చుట్టలుదీరిన పొడుగాటి వెంట్రుకలు—అన్నిటినీ మించి పదిహేనేళ్ళ యౌవనంలో హెచ్చుతగ్గులు సవరించుకొంటూన్న ఆమె శరీరలావణ్యం—ఆనాటి శకుంతలకూడా యింత అందంగా ఉండలేదేమో అనుకున్నాడు కేశవరావు. పుట్టినదాదిగా ప్రతిరోజూ చూస్తూనే ఉన్నాడు శశిని. కాని, ఈనాడు ఆమెలో ఎన్నడూ లేని ఒక నూతనత్వం గోచరమవుతూంది అతనికి. ఏదో ఒక అనివార్యమైన ఆవేదన—తృష్ణ—అంకురించినట్లు అనుపించింది. నిద్రాణమైన కోరికలేవో జాగృతమౌతూన్నాయి. వాటిని మొక్కల్లోనే త్రుంచివేయాలని విశ్వప్రయత్నం చేశాడతను. కాని—కాని—చేతగాదు. కేశవరావు ఇహ ఆ నాటకం చూడలేకపోయాడు. చక్కా లేచి ఇంటిదారి పట్టాడు.

నాటకం ముగిశాక తొమ్మిదింటికల్లా ఇల్లు చేరుకుంది శశి. ప్రక్కపై కూర్చుని ఏదో ఆలోచిస్తూన్న కేశవరావువద్దకు ఒక్క పరుగులో వచ్చి 'ఎలా వుంది బావా! నాటకం? ఎప్పుడో వచ్చేశావే!' అంది మంచంమీద కూర్చుంటూ. లేతపచ్చనికోక కట్టుకుంది శశి; బూల రవిక; నాటకంలో మొహానికి వేసుకున్న రంగు ఇంకా సరిగా పోలేదు.

'చాలా బావుంది శశీ!' చేతితో తల నిమురుతూ అన్నాడు. చుట్టలు దిరిగిన వెంట్రుకల్లోని మిట్టపల్లాలు అతని చేతుల కేవో క్రొత్త క్రొత్త అనుభూతుల్ని అందిస్తున్నాయి. హృదయంలో భావాలు పోరెత్తిపోతున్నాయి. శశి మొహంకేసి చూశాడు. తల వంచుకుని, కాలివేలితో నేలపై రాసుకుంటూ చిరునవ్వు నవ్వుతూంది శశి. ఆ కోలముఖం—వాలుగండ్లు—ఆ ముఖంలో ఉట్టిపడే కాంతివిన్యాసం—శకుంతల, అక్కడ కూర్చున్నది శకుంతల—శశి కాదు—శకుంతల ఎంత బావుంది. కేశవరావు బుర్రలో కోటి కోరికలు వెర్రిగొంతుకలు విచ్చి కేకలేస్తున్నాయి. లక్ష మన్మథులు వాటిని వెంటాడుతూన్నారు.

'శశీ!' అవ్యక్తమైన ఆర్తనాదంతో అన్నాడు కేశవరావు.

'ఏం, బావా!' అమాయకంగా ప్రశ్నించింది రెండవ కంఠం.

'శశీ!!'—ఆ వెర్రిగొంతుక—కేశవరావు బాహువుల్లో యిరుక్కుంది శశి.

'బావా!!'— — — 'ఎంత బాగున్నావు శశీ! నీవు శకుంతలను మించావు!'—అతని రక్తకవోష్ణత రానురాను దగ్గరిస్తోంది.

బావ — కాదు, తండ్రి. చాకి పెద్దదాన్ని

చేశాడు. తనకు ఉంటే దిక్కూ దశా అంతా అతడే! ఏం చెప్పాలి? ఏం చేయాలి??

*　　*　　*　　*

ఆ రాత్రి కేశవరావుకు నిద్రపట్టలేదు. తల పగిలిపోతోంది. ఏంపని చేశాను! ఎంతనీచానికి పాల్పడ్డాను! కన్నబిడ్డ వాస్తవానికి తనకూ ఓ కూతురుంటే శశిఅంతవుండేది. తెల్లవారింది. శశి లేచి చదువుకోవడం లేదు. కేశవరావు మెల్లగా వెళ్ళి శశి పడుకున్న రూములో లైటు వేశాడు. మంచంమీద బోర్ల పడుకున్న శశి తల పైకెత్తి చూసింది. ఆ ముఖం నల్లబడిపోయింది. కపోలాలపైన కన్నీటిధారలు విస్పష్టంగా అవుపిస్తున్నాయి. కేశవరావు హృదయంలో లక్షా నూరు ఉప్పెనలు తలలెత్తాయి. శశి ముఖం వాడిపోయింది. తన బిడ్డ ముఖం—తాను చేసిన ద్రోహం మూలంగా. తన కాళ్ళక్రింద భూమి గంటకు వెయ్యి మైళ్ళ వేగంతో తిరుగుతూండడం విస్పష్టంగా తోచింది. నుంచో లేకపోయాడు. వెంటనే వెళ్ళి శశి కాళ్ళపై పడి ఏడుస్తూ.

"నన్ను క్షమించాలి తల్లీ—క్షమించవూ!" అన్నాడు. కేశవరావు ఏడుస్తున్నాడు. శశి 'బావా!' అంది—మళ్ళీ ఆ అమాయకస్వరమే.

'క్షమించవా తల్లీ!'

'బావా! తల్లీ—తండ్రి—అంతా నీవే బావా!'

*　　*　　*　　*

శశి ఆ ఏడు మంచి మార్కులతో పాసయింది. గుంటూరు కళాశాలలో చేర్చాలని కేశవరావు ప్రయత్నపడ్డాడు. కాని శశి ఎందుకనో 'నే నింక చదువుకోను బావా! ఇంటివద్దే ఉంటాను', అంది. కేశవరావు, నీలవేణమ్మా ఎంతో బ్రతిమలాడారు. కాని శశి ఒప్పుకుందికాదు. శశి ఉద్దేశాన్ని కాదన లేక పోయాడు కేశవరావు.

స్కూలునుంచీ ఆగిపోయాక శశికి పెద్దపెద్ద కుటుంబాల్లోంచే ఎన్నో సంబంధాలు వచ్చాయి. కాని అవేవీ కేశవరావుకు నచ్చాయికావు. ఒక పెద్దకుటుంబంలో ఇచ్చామంటే శశికి నేను చేయాల్సిన ఉపకారమంటూ అట్టే ఉండదు. ఆమె నన్ను క్షమించడానికి వీలుండదు. అని గొప్ప గొప్పసంబంధాలనన్నీ వదులుకున్నాడు.

కేశవరావుదృష్టిలో మెదలుతూన్నదల్లా కృష్ణమూర్తి ఒక్కడే. కృష్ణమూర్తి కాస్త దగ్గరబంధువు. బీదకుటుంబానికి చెందినవాడు. పుట్టుకతోటే తల్లి చెల్లుకుంది. ఇటర్మీడియట్ పాసయ్యేలోపున తండ్రి కూడా తనను వంటరి చేశాడు. ఏదో నానాయాతనలూ పడి బి. ఎ. పాసయ్యాడు. అతనికష్టాలను చూసి కేశవరావుకూడా అప్పటప్పటా యింతో అంతో సహాయపడుతూండేవాడు.

ఎండాకాలం సెలవులకు కృష్ణమూర్తి వచ్చాడని తెలిసి ఓరోజు ఇంటికి పిలిపించాడు కేశవరావు.

'ఈయేడు చదువువిషయమేమైనా ఆలోచించావా?' నీలవేణమ్మ చేతిలోంచి కాఫీకప్పు అందుకుంటూ అన్నాడు కేశవరావు.

'ఏమి ఆలోచించడమండీ — బి. ఏ. పాఠించడమే దుస్తరమైపోయింది. ఉన్న రెండెకరాల భూమికూడా వెలచేసేశాను. ఇహ నేదైనా ఉద్యోగం చూసుకోవడం నయముగా ఉంటుంది'. కేశవరావు ఆలోచిస్తూ అలానే కాసేపుండిపోయాడు.

'ఏదైనా ఆర్థికంగా స్తోమత గలిగితే చదువుకుంటావన్నమాట—'

అదెలా సంభవం అన్నధోరణిలో ఆశ్చర్యంగా చూశాడు కృష్ణమూర్తి.

'నేను చాలా రోజులుగా నీతో ఓ విషయం చెబుదామనుకుంటున్నాను—' మళ్ళీ అన్నాడు కేశవరావు.

కృష్ణమూర్తి ఉత్కంఠగా తల పైకెత్తి చూశాడు.

'మా శశిని నీ కిచ్చి పెళ్ళి చేద్దామని నా ఉద్దేశ్యం—అందుకు నీకు ఏదైనా అభ్యంతరమా?—'

కృష్ణమూర్తిమీద హఠాత్తుగా ఏదో పూలవర్షం కురిసినట్లు అనిపించింది. ఏమీ చెప్పలేకపోయాడు.

'నీకు—ఏదైనా అభ్యంతరముంటే—'

'అఁ!—నాకేమీ అభ్యంతరము లేదండీ' తల వంచుకుంటూ అన్నాడు కృష్ణమూర్తి.

'అయితే— — నీవు నీకునచ్చినది చదువుకో —నీ ఖర్చు లవ్వాలన్నీ నేను భరిస్తాను. వచ్చే యేడు పెళ్ళి ముగించేద్దాము.'

కృష్ణమూర్తి ఏమీ చెప్పలేకపోయాడు. మౌనంగా అలాగే చాలాసేపు కూర్చుండిపోయారు ఇద్దరూ.

* * *

కృష్ణమూర్తికి ఎం. ఏ. మొదటిసంవత్సరం గడిచిపోయింది. సెలవుల్లో శశికి, అతడికి వివాహం జరిగింది. ఆ వూళ్ళోవాళ్ళందరికీకూడా కేశవరావు లాంటి ధనికుని సహాయం లభించడం కృష్ణమూర్తి అదృష్టం అనిపించింది.

ఎం. ఏ. ముగించుకొని లయోలా కళాశాలలో లెక్చరర్‌గా చేరాడు కృష్ణమూర్తి. శశితో క్రొత్తగా కాపురం పెట్టాడు మదరాసులో. కుటుంబం చాలా సుఖంగా సాగిపోతోంది. అతడు సంపాదించేదికాక, కేశవరావు వద్దన్నా నెలనెలా వందరూపాయలు పంపుతూంటాడు. వాళ్ళు చేయాల్సిందల్లా యింత డబ్బూ ఖర్చుయ్యే మార్గాలు వెదుక్కోవడమే.

కాలచక్రం తన తీవ్ర వేగంలో రెండేళ్ళను తిరగవేసింది. కృష్ణమూర్తికి జీవితం స్వర్గతుల్యంగా సాగిపోతూంది. శశి అతణ్ణి దైవసమానునిగా సేవిస్తూంది. కేశవరావు కన్నబిడ్డలా చూసుకుంటూన్నాడు. జీవితంలో వాంఛలు ఒక్కటిగా మూర్తీభవించి ఫలించినట్లు ఒక బుడుతడు కూడా వెలశాడు. వాడి పుట్టుకనాడు కేశవరావు ఎన్నో విందులు— ఉత్సవాలు చేయించాడు. వాడికి తన తండ్రి జ్ఞాపకార్థం మాధవరావు అని పేరుపెట్టాడు. తన ఆస్తి మొత్తం వాడిపేరట వ్రాయాలన్నాడు.

ఆనాటిరాత్రి శశితో పిచ్చాపాటీ మాటాడుతూ అన్నాడు కృష్ణమూర్తి! 'మన అనాథ జీవితాలమీద ఇతని కింతగా ఆదరణ ఎందుకు కుదిరిందో! వాస్తవానికి అతణ్ణే మనము దైవసమానునిగా పూజించాలిసుంటుంది.'

అవునన్న హీనస్వరంలో తల వంచుకుంది శశి.

'ఇంతకూ నీవంటే అతడి కెంత అభిమానం!— నీకోసం తన సర్వస్వాన్నీ త్యాగంచేయడానికైనా వెనుదీయడు!'

శశి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ప్రక్కకు తిరిగి పవిటచెంగుతో కళ్లు అద్దుకుంటూ 'అంతా మన అదృష్టం' అంది.

'ఎందుకు శశీ ఏడుస్తున్నావు?' అన్నాడు కృష్ణమూర్తి ఆశ్చర్యంగా.

'ఏమీ లేదండీ' ఆమె నిశ్శబ్దంగా ఉండిపోయింది. కృష్ణమూర్తి కూడా అట్టే పట్టుబట్టి అడుగలేదు.

మాసం రోజులు గడిచాయి. కృష్ణమూర్తిలో ఆనాడు శశి ఏడ్చేందుకుగల కారణం కనుక్కోవాలనే ఉత్కంఠ నానాటికీ అధికమౌతోంది. ఆమెలో ఏదో తీరని కోరిక ఉంది. దాన్ని కనుక్కొని తీర్చాలి అని ఆయన ఆరాటం.

ఒకనాడు శశి భోజనం వడ్డిస్తూంటే అడిగాడు.

'ఆ రోజు ఎందుకు శశీ ఏడ్చావు?'

'ఊరకేనండీ.'

'శశీ! నావద్ద రహస్యాలు దాచాలిసినంత అవసరము ఏముంది, ఇలా సంకోచిస్తూన్నావు. ఇన్ని సంవత్సరాల జీవితంలోనూ నీవు నన్ను అర్థం చేసుకోలేకపోయావు.' బాధగా అన్నాడు కృష్ణమూర్తి.

శశి నుంచునుంది. ఆమె కళ్ళల్లో మళ్ళీ ధారలు కడుతున్నయి.

'శశీ! ఏమిటీ వింతవింత ప్రవర్తనలు' కోపంగా అన్నంలో చేయి కడుక్కుంటూ లేచాడు కృష్ణమూర్తి. శశి భావురుమని కృష్ణమూర్తి కాళ్ళమీద పడింది.

'క్షమించండి! నన్ను క్షమించరూ!—బావగారిని క్షమించరూ! — చెప్పండి — బావగారిని క్షమించరూ!' కన్నీళ్ళు ఏకధారగా కారిపోతున్నాయి.

కృష్ణమూర్తి కిది వింతగా—అయోమయంగా అవుపించింది.

'ఏమిటి శశీ! ఈ పిచ్చితనం.'

'అవునండి! క్షమించాలి — క్షమించరూ' క్రుంగిపోతోంది.

'లే శశీ! తప్పకుండా క్షమిస్తాను. అసలు ఏమి జరిగిందని నేను మిమ్మల క్షమించాలి.'

చెప్పింది శశి. జరిగిన కథంతా చెప్పింది.

దీనంగా—గద్గదంగా—క్రుంగి కృశించిపోతూ క్షమాపణ వేడుకుంది.

'నీవు నా దైవము. నీవద్ద నేను నిజాన్ని దాచుకొని ఉండలేకపోయాను.—క్షమిస్తావా బావా!' అంది.

కృష్ణమూర్తి అట్టే కాసేపు నుంచుండిపోయాడు. అతని ముందు మంచిచెడ్డలు విలయంగా పోరాడుతున్నాయి. శశిని చూశాడు కపోలాలమీద కన్నీళ్లు దీనంగా జాలు కడుతున్నయ్. ఎదుట గోడ మీద కేశవరావు ఫోటో వ్రేలాడుతోంది. అతని ముఖం ప్రసన్నంగా శాంతంగా ఉంది. ఆ ముఖంలో దయార్ధ్రతలు ఉట్టిపడుతున్నయ్. కేశవరావు తన జీవితంలో వెలుగు జాడలు లేవదీశాడు. లేకపోతే తా నెక్కడో పలుగాకి మూకల్లో కలిసిపోవాలి సున్నవాడు.

ఎదుట చిన్నపాపడు తొట్టెలో ప్రశాంతంగా నిద్రపోతూన్నాడు. చిరునవ్వు అతని ముఖంమీద లాస్యం చేస్తూంది. అమాయకత్వం ఆడుకుంటూ ఉంది.

'శశీ!'—

'బావా!'—

'క్షమిస్తాను శశీ! తప్పకుండా క్షమిస్తాను. పైకిలే.'

ఆ సాయంత్రం బీచికి వెళ్ళి ఏకాంతంగా నుంచున్నాడు కృష్ణమూర్తి. ఉవ్వెత్తున కెరటాలు తీర భూమిని ఢీకొంటున్నాయి. అతని బుర్రలో మళ్ళీ ఏవేవో ఆలోచనలు పోరాడుతున్నాయి. ప్రేమ—వాత్సల్యం—భక్తి. వ్యభిచారం—కాదు—కాదు కాదు—అంధకారంలో అడుగులో బడ్డ తప్పటడుగు. అడుగు కడుగబడింది. పాదం పరిశుద్ధపరుపబడింది.

విశ్వములో మంచీ—చెడ్డా మధ్య పోరాటం. మంచి దృఢంగా నిలుచుంటుంది. చెడు ఓడిపోతుంది. తీర భూమి నెగ్గింది. కెరటాలు ఓడిపోయాయి. చంద్రుడిలోని కాంతిని పౌజన్యాన్ని చూడాలి—అంతుచిక్కని కలుషాన్ని కాదు వెదుకాల్సింది.

లోకాన్ని చీకట్లు ఆవరిస్తున్నాయి. విద్యుద్దీపాలు వానిని చెదరగొడుతూన్నాయి. మంచీ—చెడూ—పోరాటం. వెనక్కు తిరిగాడు కృష్ణమూర్తి.

శత్రుదమన దేవగిరి దూగామ్ శాసనము

శ్రీ వి. భానుమూర్తి

మూడు రేకులు రాగి కడియమునకు గుచ్చబడి రాజముద్రికతో సంధింపబడిన యీ దాన శాసనము కొలదికాలము క్రిందట శ్రీకాకుళము జిల్లాలోని నరసన్నపేటకు సమీపమునున్న పెద్దదూగాము గ్రామమున నిల్లు కట్టుచున్నప్పుడు భూగర్భమునుండి బయల్పడినది. ఈ శాసనమును సంపాదించి విమర్శనార్థము నా కొసంగిన అప్పటి శ్రీకాకుళం జిల్లాకలెక్టరు శ్రీ కరియప్ప గారికి నేను కృతజ్ఞుడను.

దాత తన తండ్రి తాతల నామములయినను తెలుపకపోవుటయు, రాజులు తమ ప్రభావమును తెలుపుకొను బిరుదములు లేకపోవుటయు, అతి ప్రాచీనమయిన లిపి, దాతయగు రాజు తన రాజ్యకాలమును వ్రాయకపోవుటయు—ఈ శాసనమున గమనింపవలసిన ముఖ్య విషయములు. శాసనమతి చిన్నదియై, ఒక్క దాన విషయమును మాత్రము తెలుపుచున్నది.

కాలము జరిగినకొలది, రాజులు క్రమక్రమముగ గొప్ప బిరుదులను తమ నామములకు జతపరచుట శాసనములతో పరిచయముగలవారికి క్రొత్త విషయము కాదు. మరియు, శాసనకాల నిర్ణయము, దాతచే చెప్పబడకపోయినను, అక్షర తత్వమునుపట్టి నిశ్చయింపవచ్చును. ఉమవర్మ ధవళపేట తామ్రశాసనము, శక్తివర్మ రాగోలు శాసనములవలె ఈ శాసన లిపి ప్రాచీన దక్షిణ లిపులను బోలియున్నది. దాతయగు రాజు తన రాజ్యకాలము నే శకములోను ఇయ్యలేదు. తాను రాజ్యపట్టాభిషిక్తుడైన తొమ్మిదవ సంవత్సరమున ఆషాఢ మాసములో పదియవ దినమున దానమిచ్చెనని మాత్రము తెలియుచున్నది. శాలంకాయన, మాఠరీపుత్ర రాజుల కొన్ని శాసనములవలె ప్రస్తుత శాసనములో కూడ కాలము విశదీకరింపలేదు. ప్రస్తుత శాసనము, ఆపై శాసనముల కించుమించు కాలములో వెలువడియుండవలెనని వూహింపచ్చును. శాసనకర్త కాలమును నిర్ణయించుటకు మాఠరీ వంశపు శక్తివర్మ రాగోలు శాసన మత్యంత ముపకరించును. రాగోలు శాసనము ప్రాచీన దక్షిణ లిపిలో సంస్కృత భాష గల్గియుండుటచే నది క్రీ. వె నాల్గవ శతాబ్దము రెండవ భాగములోనిదని చెప్పబడినది. కావున ప్రస్తుత శాసనముకూడ యించు మించు ఆ కాలములోనిదని నిర్ణయింప వచ్చును.

కళిఙ్గము నేలిన చరిత్ర ప్రసిద్ధమగు రాజకుటుంబములలో మొదటివాడు ఖారవేలుడు. ఈతడు క్రీ. పూ. రెండవ శతాబ్దమున నుండెనని చరిత్ర పరిశోధకులు పెక్కురు హాతి గుంఫశాసనము నాధారముగ జేసికొని చెప్పిరి. ఆ తరువాత, కళిఙ్గరాజ్యమును సముద్రగుప్తుని దండయాత్రవరకు యే యే వంశము రాజులు పరిపాలించిరో తెలియవచ్చుటలేదు. ఈ చీకటియుగమున, ఇక్ష్వాకులు కళింగములో కొంత భాగము నాక్రమించి, పరిపాలించినట్లు నిదర్శనములు గలవు. వాసిష్ఠీ వంశపురాజులు కళింగము నేలినట్లు సిరిపుర తామ్రశాసనము (భారతిలో శ్రీ మండ నరసింహముగారు ప్రచురించినది) చెప్పుచున్నది. ఆ వంశములో అనంతవర్మ ముఖ్యమైనవాడు. ఈ వంశమునకు కొంతకాలము ముందో వెనుకనో, మాఠరీవంశ రాజులు శక్తివర్మ, అనంత శక్తివర్మ, ఉమవర్మ మొదలగువారు పరిపాలించి. ఇప్పుడు మనకు లభ్యమయిన నీ దూగామ్ శాసనమున శత్రుదమన దేవగిరి కూడ కళింగాధిపతియే. ఇతని వంశము మనకు తెలియ వచ్చుటలేదు.

ఈ శ్రీ శత్రుదమన దేవగిరి మహారాజు విజయ సింహ పురమునుండి కళిఙ్గదేశములో వృద్ధిగాంచుచు, వసుసమృద్ధమును, గోసమృద్ధమునయిన దుహోగ్రామ అగ్రహారమును, పట్టుమ గ్రామ వాస్తవ్యులును, సద్బ్రాహ్మణులునయిన వప్పశర్మ శర్వశర్మలకు వేదాధ్యయనముకొఱకు, దానముచేయుట ఈ శాసనములో వ్రాయబడినది.

దాత శ్రీ శత్రుదమన దేవగిరి దమునేశ్వర పాదానుధ్యాతుడు. మహారాజు. శాసనము నొక

తూరి చదివిన రాజు పేరు శత్రుదమనుడేమో యని అని పించును. దమనేశ్వర పాదానుధ్యాతుడయిన రాజు శత్రుదమనుడను పేరుగలిగి యుండవచ్చును. కాని శాసనములోని మొదటి లేక రెండవ పైకి క్రిందివిధముగ నున్నది.

"హీంతో మహారాజ శ్రీ శత్రుదమన దేవగిరి
కలిఙ్గ వర్ధమాన గ్రహారే దుహాగ్రామే వసువాటకే."

కనుక, శత్రుదమన మాత్రము రాజు పేరయిన మిగిలిన భాగమును దేవగిరి కలిఙ్గయని చదువవలసి యుండును. ఇంతవరకు చరిత్రలో దేవగిరి కలిఙ్గ వంశమున్నట్లగుపడదు. కావున శత్రుదమన అనునది బిరుదు. దేవగిరి రాజు నామము అయియుండవచ్చును కాని, దాతయగు మహారాజు బిరుదాకాంక్షియై యుండిన, ఇంకను కొన్ని బిరుదములను తన నామమునకు జతపఱచియుండెడివాడు. అందును శాసనకాలమునాడు బిరుదములను తగిలించుకొను అలవాటు అరుదు. కనుక, శత్రుదమన దేవగిరి అనునది రాజుయొక్క పూర్తి పేరని చెప్పుట సమంజసమే.

విజయసింహపురము ప్రస్తుతము శ్రీకాకుళమునకు ఆరు మైళ్ళ దూరములో నున్నది. దానినే సింహపురమని కూడ వ్యవహరించుచుండిరి. ఇప్పుడది సింగపురమని వాడుకలో నున్నది. సింగుపురము లేక విజయసింహపురము మాఠరీ వంశజులకు కూడ సుమారు క్రీ. శ. 350—450 వరకు రాజధాని అని శ్రీ భావరాజు కృష్ణారావుగారు ఆ వంశపు రాజుల శాసనముల నాధారముగ జేసికొని చెప్పిరి.

దుహాగ్రామము ప్రస్తుత బరంపురము (ఒరిస్సా) నకు కొలది మైళ్ళ దూరములో నున్నదని తెలియుచున్నది. ఇప్పుడు కూడ ఆ గ్రామము దుహా అని వాడుకలో గలదు. పట్టువ గ్రామము లేదు గాని పట్టపురమను గ్రామ మొక్కటి దుహా గ్రామమునకు సమీపమున నున్నది. పట్టువ గ్రామమే ప్రస్తుత పట్టపురమయి యుండును.

సుమారు క్రీ. శ. నాల్గవ శతాబ్దములో విజయసింహపురమును రాజధానిగా నేలిన శత్రుదమన దేవగిరి పేరు వినగనే, ఇతనికి అలహాబాదు ప్రశస్తిలో హరిసేనుడు పేర్కొనిన దక్షిణదేశపు రాజులలో నొక్కడయిన, యేరండపల్లి దమనునికి గల సంబంధమునుగురించి ఆలోచన తట్టును.

యేరండపల్లిని పలువురు చరిత్రకారులు పలువిధములగ గుర్తించిరి. మునుపు అది మహారాష్ట్రములోనిదని చెప్పబడెను. కాని, సముద్రగుప్తుడు పేర్కొనిన రాజులలో యేరండపల్లి దమనుని పేరు కనబడుటయు, యేరండపల్లి పశ్చిమ తీరమున గాక, తూర్పు తీరములోనిదే అని, కొత్తూరు పిదప పేర్కొనబడుటచే, అచ్యుతికి సమీపమని నిర్ధారణచేసి వ్యవహారములో నున్న ప్రస్తుత ఆముదాలవలసే (శ్రీకాకుళము రోడ్డు) యేరండపల్లియని, చరిత్రకారులు చెప్పిరి. కాని సింగుపురమును (శాసన విజయసింహపురము) నకు, ఆముదాల వలసనుండి (యేరండపల్లికి) ఏడెనిమిది మైళ్ళదూరముకంటె అధికము లేదు. మరియు, దమననామము గల్గిన రాజు సముద్రగుప్తుని సమకాలికుడు తప్ప మరెవ్వడును చరిత్రలో కనుపించడు. కనుక మన శాసనపు శత్రుదమన దేవగిరి అలహాబాదు ప్రశస్తిలో పేర్కొనబడిన సముద్రగుప్తుని సమకాలికుడైయున "దమన" ఇరువురు వక్కరే అని చెప్పవచ్చును.

శత్రుదమన దేవగిరికూడ సముద్రగుప్తుని ఎదిరించిన రాజుల కూటమిలో నొక్కడగుటచే. అతని కాలమును నిర్ణయింప కొంత వీలగును. ఆర్యావర్తాధిపతియగు సముద్రగుప్తుని దిగ్విజయము క్రీ. శ. 344–345 లేక క్రీ. శ. 342–343 లో జరిగియుండునని తలంపబడుటచేతను, శత్రుదమన దేవగిరి క్రీ. శ. 342 కు మునుపే రాజ్యమునకు వచ్చియుండెను. కనుక బహుశ శత్రుదమన దేవగిరి సుమారు క్రీ. శ. 335 లేక 340 సంవత్సరమున రాజ్యమునకు వచ్చెననియు మాఠరీ వంశరాజు లతని తరువాత విజయసింహపురమునకు ప్రభువులయిరనియు చెప్పవచ్చును.

శత్రుదమనుడు దమనేశ్వరుని ధ్యానించెను. ప్రస్తుతము సింగపురము కొండపై నొక దేవాలయము గలదు. అందు హాటకేశ్వరస్వామి విగ్రహము కలదు. ఈ దేవాలయము స్వభావసిద్ధమైన గుహాయందు గలదు. ఆ గుహాలోని ముఖభాగమును దొలిచి యొక మంటపముగా నేర్పాటు జేయబడెను. ఈ మంటపమున నాలుగు శిలాస్థంభములు గలవు. అందొక దానిపై 8 వ శతాబ్దపు తెలుగు శిలాశాసన మగుపడుచున్నది. అందు ప్రధాన దేవత 'కొండహోలి' అను పేరుతో ఆనాడు వ్యవహరింపబడుచుండెననియు,

ఆ పోలిశేవతకు కొన్ని దానాదికములు చేయబడె ననియు విశదీకరింపబడినది. కాని నేడు హాటకేశ్వర స్వామి విగ్రహముకలదు. బహుశ క్రీ. శ. మూడు నాల్గు శతాబ్దములలో నీ ఆలయమునసున్న దైవము దమనేశ్వరుడని పిలువబడు చుండెనేమో! నేడు దమనేశ్వరస్వామి ఆలయము సింగుపురమున లేదు. కాని దమనేశ్వరుడు శాసనకాలమున ప్రసిద్ధుడై యుండెను.

ఇక్ష్వాకుల పతనానంతరము కళిఙ్గదేశపు పరిస్థితిని తెల్పుటకు సముద్రగుప్తుని అలహాబాదు ప్రశస్తి మనకుపయోగించును. అందు దక్షిణదేశపు రాజులను గురించి యీ క్రిందివిధముగ తెలుపబడియున్నది.

"కౌసలక మహేంద్రగిరి కౌట్టూరక స్వామిదత్త పైరండక పల్లక దమన కాంచేయక విష్ణుగోప అవముక్తక నీలరాజ వైఙ్గేయక హస్తివర్మ పాలక్కక ఉగ్రసేన, దైవరాష్ట్రి కుబేర కౌస్థలపురక ధనంజయ ప్రభృతి సర్వదక్షిణాపథ రాజగ్రహణ మోక్షానుగ్రహ జనిత ప్రతాపోన్మిశ్ర మహాభాగ్యస్య..."

పై శాసనభాగము మిగిలినవారితో కూడ నలుగురు కళింగరాజులను తెలుపుచున్నది. మహేంద్రుడు, స్వామిదత్తుడు, దమనుడు, కుబేరుడును. ప్రస్తుత శాసనమువలన పిష్టపుర రాజు పేరును తెలిసికొనుట కుపయోగించును. 'పైష్టపురక మహేంద్రగిరి కౌట్టూరక స్వామినాథ' అను వాక్యములో, 'మహేంద్రగిరిపై నున్న పిష్టపురపు రాజ'నియు, చెప్పబడెను. కాని మహేంద్రుడు పిష్టపురరాజనియు, స్వామిదత్త గిరి కొట్టూరులో రాజనియు తలంపబడెను. రెండవ వూహకు కారణములు, ఆంధ్రదేశములో కొండగుడి, కొండకంచేరు అను గ్రామము లుండుటయే. గిరికొట్టూరు లేక కొండకొట్టూరయి యుండవచ్చును. కాని, ప్రస్తుత శాసనకర్త శత్రుదమన దేవగిరి యను నిర్ణయమునకు వచ్చిన, మహేంద్రగిరి అను నామము నాల్గవశతాబ్దములో వాడుకలోనుండి యుండవచ్చుననియు, మహేంద్రగిరి పిష్టపురపు రాజనియు చెప్పిన అసమంజసము కాదు.

కళిఙ్గరాజ్యములో తెలివాహీ నదీతీరమున దేవగిరి యను పుణ్య బౌద్ధపర్వత మొక్కటి కలదు. నేటికిని ఆ పర్వతమందు బౌద్ధశిథిలములు, విగ్రహములు, స్తూపములు, చైత్యములు మున్నగునవి కనబడుచున్నవి. తెలివాహీనది ప్రస్తుతము తేల్ నదియని వ్యవహరింపబడుచున్నది. బౌద్ధజాతక గాథలందీ నదియు, దేవగిరియు విపులముగ చెప్పబడియున్నవి. దేవగిరికి సమీపమున దేవపురమును రాజధానిగ కళిఙ్గ మేలిన వాసిష్ఠీకులప్రసిద్ధుడైన అనంతవర్మ ఈ రాజధాని నుండియే సిరిపుర, కిందొప్ప తామ్రశాసనముల నిచ్చియుండెను. దీనివలన దేవగిరి బహుకాలము నుండి బౌద్ధులకు, వైదికమతస్థులకు పుణ్యక్షేత్రమై ప్రసిద్ధ యాత్రాస్థలమై విలసిల్లుచుండుటచే, శత్రుదమన నామముతో కూడ దేవగిరి నామము కూడ ఈ మహారాజున కిచ్చియుందురు.

ఈ క్రింది చరిత్రాంశములు మనకీ శాసనము వలన తెలియవచ్చుచున్నది. శ్రీగుణదమన దేవగిరి యేరండపల్లి దమన ఇరువురు వొక్కరే. అతడు సముద్రగుప్తుని సమకాలికుడు. విజయసింహపురము రాజధానిగా నేలినవాడు. మహాగ్రామములో రెండుపాళ్లు, వప్పశర్మ కొక పాలు దానమిచ్చుటచేత, ప్రస్తుతం ఒరిస్సాలో నున్న 'బర్హాంపూర్' వరకు తన రాజ్యము విస్తరించియుండెను. దమనేశ్వర పాదానుధ్యాతుడు, వేదాధ్యయనముకొఱకు దానము బ్రాహ్మణుల కొసంగుట చూడ నితడు వైదికమతావలంబియని తెలియును. సముద్రగుప్తుని యెదిరించిన దక్షిణదేశరాజుల కూటమిలో నొక్కడగుటచేతను, సముద్రగుప్తుడు తన దిగ్విజయయాత్రలో దక్షిణదేశమున నీరాజులచే ఓడింపబడెనని తలంచబడుచున్నందున, శత్రుదమన దేవగిరి పరాక్రమవంతుడనియు తెలుపవచ్చును. ఇతడు సుమారు క్రీ. శ. 335–350 మధ్యకాలమున రాజ్యమేలెను.

శాసనమంతయు ఇరువదినాల్గు పంక్తులలో సంస్కృతభాషలో లిఖింపబడినది. వ్యాకరణ దోషములున్నవని సంస్కృతపండితులు చెప్పినను, శాసనకర్త అభిప్రాయము సుస్పష్టముగుచున్నది. శాసనమందలి ముఖ్యభాగము పదునాల్గు పంక్తులలో పూర్తి అయినది. ఆ తరువాత నాల్గు వ్యాపగీతములు లిఖింపబడినవి. తరువాత దానకాలము "సంవత్సరే నవమేతి ఆషాఢమాస దివసే దశమే" అని వ్రాయబడినది. ఈ కాలమేశకమో చెప్పకపోవుటచే ఏలుబడిలోని తొమ్మిదవ సంవత్సరమని మన మూహింపవచ్చును. సాధారణముగా తామ్రశాసనములందు సంధివిగ్రహి

శత్రుదమన దేవగిరి దూగామ్ శాసనము

(*Foreign Secretary*) యొక్క అనుజ్ఞ అనుసను చున్నది. కాని ఈ శాసనమున "దూతో వైద్యకృష్ణ దత్త" అని చెప్పబడియుండుటచేత, వైద్యకృష్ణ దత్త అను దూతయొక్క అంగీకారము చూపబడియున్నది. ఇదికూడ క్రొత్తవిషయమే. దూత రాజధానీ నగరమున ఏల యుండవలెనో తెలియుటలేదు.

మొదటి రేకు — రెండవ పెడ

ఓం విజయసిక్షా పురాద్భగవతో దమనేశ్వర
స్వామినః పాదాను ధ్యాతో భట్టారక పాద పరిగృ
హీతో మహారాజశ్రీ శత్రుదమన దేవగిరి
కలిఙ్గ వర్ధమానగ్రహారే దుమగ్రామే వసువాటకే

రెండవ రేకు — మొదటి పెడ

గోవాటకే సద్బ్రాహ్మణ పురోగద్గ్రామాశ్చరీరాది కుశల
స్ఫులప్యా లిఖత్యస్త్యేతే మయాగ్రామ కాత్మన పుణ్యాయుధాయన
నిమిత్తే బ్రాహ్మణానా పట్టవగ్రామ వాస్తవ్యాయ
కాణ్డిన్యసగోత్రాయ తైత్తిరీయ సబ్రాహ్మచారిణే
యజ్ఞశర్మణం పుత్ర వప్ప శర్మణాయ శర్వశర్మ

రెండవ రేకు — రెండవ పెడ

ణాయచ త్రీణ్యపి గ్రామకాదత్తా అభ్యా బ్రాహ్మణ దేయకృత్వా
ద్విజభోగో విసృష్టస్తద్యస్మాభి శ్రోతవ్యమాజ్ఞాచ కర్తవ్యా
అత్రిచ శర్వశర్మణయకాయ వృత్తిద్వయ వప్పశర్మణాయ
చ వృత్తిరేకా సర్వేచ సముచిత గ్రామాణా పుణ్యాయ
మేయాది ముపనేప్యథ భవన్తి చాత్రశ్లోకాః యుమిక్క్రియాం ధర్మ
సయుక్తానాం మనసాప్యభి నన్దతి వర్ధతే సయేద్ధేష్టేన

మూడవ రేకు — మొదటి పెడ

శుక్లపక్షే ఇవాజుర్మరు॥ బహుభిర్వ సుధాదత్తా
వసుధా వసుధాధిపాః యస్యయస్య యదాభూమి
తస్యతస్య తదాఫలం॥ పూర్వదత్తాం ద్విజాతిభ్యో య
యత్నా ద్రక్ష యుధిష్ఠిర । మహీమ్మహిమతాం శ్రేష్ఠా
దానాచ్ఛ్రేయోనుపాలనం॥ షష్టిర్వర్ష సహస్రాణి

మూడవ రేకు — రెండవ పెడ

స్వర్గేమోదతి భూమిద ఆక్షేప్తాను మన్తాచ
తాన్యేవ నరకేవసేత్ ఇత్యవలిఖిత సమ్వత్సరే
నవమేతి అసాఢమాస దివసే దశమో
దూతో వైద్య కృష్ణ దత్త.

కలగూరగంప

'కోమటి' శబ్దము

శ్రీ కుందూరి ఈశ్వరదత్తు

ఆంధ్రదేశమేలిన రెడ్డిభూమీశులలో కోమటి పదాంకితులగు ప్రభువులు పలువురు గలరు. అనాటి సంస్కృతాంధ్ర కావ్యములు, శాసనములు పై విషయమునకు నిదర్శనములు.

ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశ కావ్యము ప్రోలయ వేమారెడ్డి కంకితమిచ్చుచు, కృతిభర్తను కోమటి వేమా యని సంబోధించెను. వేమారెడ్డితండ్రి ప్రోలయను కోమటి ప్రోలయగా పేర్కొనెను—

అందలి పద్యముల నిం దుదాహరించుచున్నాను.

చం. కులజలరాశి చంద్రుడను
కోమటి ప్రోలనయుఁ డితండనీ
తిలకము పుణ్యరాలు పతి
దేవతయన్నమయుం గృతార్థతా
కలితులు వీరు వేమ విభు
గావగ గాంచిన పుణ్యమెట్టిదో
కొలదుల వెన్ని జన్మముల
గూర్చిరొ నా బొదలుఁ జనస్తుతుల్.

కం. శ్రీమత్కుసుమ శరోపమ
సామగ్రీ జనిత హృదయసంజర విలుక
ద్వామాసచీసమర్పిత
కోమల చరణాభిరామ కోమటి వేమా

కం. శ్రీమత్కవితాగర్విత
ధీమోద్దామావళీ ప్రతిష్ఠిత విభవ
స్తోమ రిపుభీమ కోమటి
వేమ సుజన సార్వభౌమ విక్రమ వేమా

క. శ్రీమత్పెంట కులాంబుధి
సోమ చిరయశో మహత్త్వశోభిత లోభ
వ్యామోహ రహిత కోమటి
వేమ సమిద్ధప్రతాప విపులస్తోమా.

పైని చెప్పబడిన కోమటి ప్రోలయయు, అతని కుమారుడు కోమటి వేమయయు, నాటి సంస్కృత శాసనములలో సహిత మావిధముననే పేర్కొనబడిరి. కోమటి వేముని మద్రాసు చిత్రవస్తు ప్రదర్శనశాలా శాసనములో పై యిరువు రిట్లు వర్ణింపబడిరి.

"వీరాగ్రణీర్జగతి కోమటి ప్రోలనామా ప్రత్యర్థి భూపతి భుజంగ విహంగరాజః"

"సూర్యశ్యైవ సువర్చలా శశిభృతః పుణ్యా యథారోహిణీ రూఢా. కోమటి ప్రోలయస్య సదృశీ భార్యాన్నమాంబా సతీ|"

"మాద్యన్మత్తనృపాలకూల కదనో న్మీలన్మహాబ్ధి కుంభోద్భవః శ్రీమాన్ కోమటి వేమభూపతిరసౌ వీరః కథం వర్ణ్యతే|"

(*Epigraphica Indica Vol V. Page 13*)

పెదకోమటి—పినకోమటి:

పై యిరువురును కొండవీటిరెడ్డి రాజ్యము పాలించిన తొలిరాజులు. ఆ రాజ్యమును పాలించిన కడపటివారిలో పెన్నదగినవాడు పెదకోమటి వేమారెడ్డి. ఈతడు మహా విద్వాంసుడు. గ్రంథకర్త. శృంగారదీపిక, సప్తశతీసారటీక, సాహిత్యచింతామణి మొదలగు సంస్కృత గ్రంథములను రచించెను. కవిసార్వభౌముడగు శ్రీనాథుని పోషించిన భాగ్యశాలి. పెదకోమటి వేమారెడ్డి చరిత్రము నే 'వేమభూపాల చరిత్ర'మను పేర వామనభట్టబాణుడు సంస్కృతమున గద్యకావ్యముగా రచించెను. దానిలో పెదకోమటి వేమారెడ్డిని గూర్చి యతడిట్లు వర్ణించెను.

"తతః క్రమేణ గుణశ్రేష్ఠా| విశేషతః పాలయితో బభూవ చతురర్ణవ మేఖలో యా ధరాలక్ష్మః

......పెద్దకోమటీంద్ర ఇతి రాజనికరావదాతచరితో రాజరాజ ప్రభవో రాజా.”

ఈతడు వ్రాయించిన మాలగూరమ్మ శాసనములో నితడీవిధమున ప్రస్తావింపబడెను.

“క్రమ పరిప్రాప్త సామ్రాజ్య సింహాసనాధ్యాసిరై యఖిల రాజాధిరాజ పరమేశ్వరుండాజి పార్థుండు పెద్దకోమటన్న వేమాధీశుడు”

(శృంగార శ్రీనాథము - అనుబంధము పుట 19)

ఈ పెదకోమటి వేమారెడ్డికి సర్వజ్ఞ చక్రవర్తి యని బిరుదు కలదు.

“మాడామణిర్నృపాణాం గుర్జరపరి
పంథిశిఖరి దంభోళిః।
సర్వజ్ఞ చక్రవర్తీ పెదకోమటి
వేమభూపతిర్జయతి ॥

నిశ్శంక కొమ్మన రచించిన శివలీలా విలాసములో అల్లాడవిభుని వర్ణించుచు, పెద్దకోమటి వేమభూవిభుని సంపద అల్లాడరాజు హరించెనని యిట్లు చెప్పియున్నారు.

సీ. పెద్దకోమటి వేమ పృథ్వీశు జనుజూచి
యతని సంపదలెల్ల నపహరించె.”

పై విధముననే నాటి తెలుగుశాసనములలో సంస్కృతభాగములో సహితమితడు ‘పెదకోమటి’ యనియు “కోమటీంద్రుడని”యు “పెదకోమటివేమేంద్రుడనియు” చెప్పబడెను. కాని వన్నిటిని క్రోడీకరించుట చరిత్ర చర్వణము.

ఈ కాలముననే కందుకూరేలిన రెడ్డి శివలింగ భూపతి తండ్రి పినకోమటి యొకడుగలడు. ఈతడు కోమటి వేమారెడ్డి సోదరుడు మల్లారెడ్డి కుమారుడు.

‘కోమటి’ శబ్దార్థ నిర్ణయము:

సంస్కృతాంధ్ర కావ్యములలోను, శాసనములలోను రెడ్డిరాజుల నామములకు పూర్వము కోమటి పదము చేర్చుటచేత నీ శబ్దార్థమేదో చరిత్రకారులు పరిశోధింపవలసియున్నది. సర్వసాధారణముగా కోమటి పదము ఇప్పుడు వైశ్యులకే వర్తించును. రెడ్లు వైశ్యులు గారుగదా. కాగా ఈ రెడ్డిరాజులకే కోమటి పదమేల చేర్చబడెను? కోమటి, శ్రేష్ఠి, వైశ్యపదములు ఏకార్థకములు కావనియు, భిన్నార్థకములనియు విదితమగుచున్నది. అదియునుగాక సాధారణముగా శాసనములలో సంస్కృతభాగమందు తెలుగు పదములకు సంస్కృత పదములు వాడుట బహుళము.

రట్టకులు—రాష్ట్రకూటులు; ఆర్వేలనాడు—షట్సహస్రదేశము; రొంపి చెఱువుపల్లి—పంకతటాక గ్రామము; కడియము (గ్రామము)—కంకణము; కందుకూరు—స్కందపురము. చిలుకసముద్రము—కీరాంభోనిధి. పైవిధముగ వందలకొలది యుదాహరణముల నీయవచ్చును. కాని సంస్కృత గ్రంథములలోను, సంస్కృత శాసనభాగములలోను దేశ్యశబ్దమైన కోమటి శబ్దమునకు గీర్వాణ సంస్కారమిచ్చి, దాని సంస్కృత సమపదములైన శ్రేష్ఠి, వైశ్యపదములనుపయోగించలేదు. కాబట్టి యీ కోమటి పదమునకు విశిష్టార్థమేదో యుండితీరవలయును.

శ్రేష్ఠి—సెట్టి—కోమటి:

ప్రాచీన హైందవ రాజ్యాంగ తంత్రమునుగూర్చి ‘జయస్వాల్’ (*Jayaswal*) ముజుందార్ (*Muzumdar*) మొదలగు పండితులు వ్రాసిన గ్రంథములలో భరతఖండములో వర్తక గణము లుండెడివనియు, వానికి రాజ్యాంగమునందు ముఖ్యస్థానము గలదనియు వ్రాయబడినది. ఈ గణముల కధికారులు శ్రేష్ఠులను ఉద్యోగులు. దక్షిణ హిందూస్థానమునందును పృథ్వీసెట్టులనియు, సెట్టి పట్టణస్వాములనియు పేర్లుగల అధికారులుగలరు. పూర్వము రాజధానీనగరములు గాక ప్రాంతీయ రాజ్యపాలన స్థానములు (అధిష్ఠానములు) గలవనియు ఆ ప్రాంతీయనగరముల కధికారులకు నగరశ్రేష్ఠులను ఉద్యోగనామము గలదనియు తెలియుచున్నది. శ్రేష్ఠియనగా నగరపాలకుడని యర్థము. ఇట్టి పదవి బౌద్ధమతకాలమునుండియుగలదని గ్రంథస్థమైనది.

“Hindu Polity” by Sri Jayaswal Appendix D.

“Sreshtin or President of the Town.

Divisional Capital or seats of Government (అధిష్ఠానములు) had their Sreshtins under the Guptas. (E. I. XV 130) It gives the Nagara Sreshtin of Koti in the province of Bengal under Kumara Gupta. He is given the honorific title ‘ఆర్య’ before his name and is associated with

the District officer in the administration of the District.

See also Rhys David's 'Buddist India' P. 96-97. for 'Jettahaka Pamukha' taken as alderman or President and Mahasetti. as the Chief Alderman over the alderman of the guilds.

[గుప్తరాజైన కుమారగుప్తుని కాలములో వంగ రాష్ట్రములో కోటి యను అధిష్ఠాననగరమునకు పాలకుడుగా నగరశ్రేష్ఠియను ఉద్యోగికలడనియు, బౌద్ధమత హైందవదేశ చరిత్రమునందును "జెట్టాహాక పముఖ" యను నగరపాలకులు లేక మహాసెట్టి, ముఖ్య నగరపాలకుడను, ఉద్యోగులు కలరనియు పై ఆంగ్ల వాక్యముల సారాంశము.]

అనగా మహాసెట్టి పదమునకు సరియైన తెలుగు పదము పెద్దకోమటి లేక పెదకోమటి.

పెద్దకోమటిపదము—ఆంధ్రనిఘంటువులు:

ఆంధ్రనిఘంటువులలో నొక్క బ్రౌణ్యనిఘంటువునందుమాత్రమే పై పెద్దకోమటి పదముకలదు. ఈ పెద్దకోమటి పదమునకు బ్రౌనుదొరగారు నగరపాలకుడని (*Alderman*) అని యర్థము చెప్పిరి. పైని వివరింపబడిన శాసన శబ్దార్థమునకును బ్రౌణ్య నిరూపణమునకును, పాఠకులు సాదృశ్యము గమనింతురుగాక. ఇది ఆశ్చర్యకరమైన విషయము.

"పెద్దకోటి=పెద్దశెట్టి (*Alderman*) ఆల్డర్ మన్ (*Alderman*) అనగా నగరపాలకుడు (*Brown's Telugu-English Dictionary*); పురాధ్యక్షుడని శంకరనారాయణ నిఘంటువులో కలదు. బ్రౌనుదొరగారు ప్రమాణములు పేర్కొనరైరి. అయినను, పెద్దకోమటి యనగా యొక పదవీవాచకమనియు, వర్ణవాచకముగాదనియు వారు మొదట తెలిపి, ఆంధ్ర సారస్వత, చారిత్రక పరిశోధకులకు మార్గముచూపిరి. ఈ పదార్థనిరూపణము రెడ్డి చరిత్రకెంతో ముఖ్యమైనది.

రెడ్డిరాజులీపదమును వారిపేర్ల మొదట వహించుటకు కారణమేమనగా, వీరు రాజ్యాధిపత్యము వహించుటకు పూర్వము, యువరాజ్యాభిషిక్తులై, ప్రాంతీయనగర పాలకులై, తండ్రులకును, సోదరులకును రాజ్యపాలనమునందు సహాయులై రాజ్యభారము నిర్వహించుటయే. ఈ కోమటిపదము ఆంధ్రదేశమేలిన నరేంద్రులలో ఒక్క కొండవీటిరెడ్లు, కందుకూరు రెడ్లు తప్ప, తదితరులు వహింపలేదు. ఈ పదము ఆంధ్ర సారస్వతమున శ్రీనాథుని తర్వాత పై యర్థమున వాడియుండినట్లు కనబడదు. ఆంధ్ర నిఘంటువులలో నీ పదమీ యర్థమున చేర్పవలెను.

నేటిసాహిత్యము

శ్రీ తిరుమల రామచంద్ర

పెక్రి కింద శ్రీ కురుగంటి సీతారామయ్యగారు ఫిబ్రవరినెల భారతిలో తత్పూర్వ ప్రకటితమైన నా వ్యాసాన్ని గూర్చి వ్రాసినారు. నా విమర్శను సహృదయతతో గ్రహించినందుకు కృతజ్ఞుణ్ణి. ఈ విషయంలో వాదోపవాదాలు పెంచడం నా ఉద్దేశం ఏమాత్రం కాకపోయినా, ఒక్క అంశం మాత్రం చెప్పక తప్పడం లేదు.

"ప్రత్యహపరివర్తనలు" అన్న ప్రయోగం వారికింకా తప్పుగానే తోచడం వింతగానే ఉంది. అహశ్శబ్దానికి టచ్ ప్రత్యయం తత్పురుష కర్మధారయలలోనే కాక అవ్యయీభావంలోనూ వస్తుంది. కాని అది "రాజాహస్సఖిభ్యష్టచ్" అనే సూత్రంవల్ల కాదు. నా మొదటివ్యాసంలోను ఈ సూత్రప్రసక్తి లేదు.

అహని+అహని=ప్రత్యహం. వీప్సార్థంలో "అవ్యయం విభక్తి సమీప సమృద్ధి వ్యృద్ధ్యర్థాభావాత్యయాసంప్రతిశబ్దప్రాదుర్భావ పశ్చాద్యథానుపూర్వ్యయౌగపద్య సాదృశ్యసంపత్తి సాకల్యాంతవచనేషు" అనే సూత్రంతో అవ్యయీభావంవచ్చి, "అనశ్చ" అనే సూత్రంతో సమాసాంతమైన టచ్ ప్రత్యయం వచ్చి, 'ప్రత్యహం' అనే రూపం సిద్ధిస్తుంది.

అహశ్శబ్దం అవ్యయీభావంలో అకారాంతంగా ప్రయుక్తం కావడం సర్వసాధారణమన్నందుకు కొన్ని ఉదాహరణలిస్తున్నాము:

"గిరిశ ముపచచార ప్రత్యహం సాసుకేశీ"

(కుమారసంభవం. ప్రథమసర్గ, తుది శ్లోకం.)

"పాశే సింధు ప్రథిత మథితం ప్రత్యహం వర్ధమానం" (గంఘా భారతం—2-16)

ఇలాగే అన్వహం:

"సుమేరువప్రోన్నహమున్నకారి"- (మాఘం, తృతీయ సర్గ. 37.)

అవ్యయీభావమైన పదం పరమైన పదంతో సమసిస్తుంది. "అవ్యయీభావశ్చ" వృత్తిః—"అయం నపుంసకం స్యాత్." అవ్యయీభావమైనది నపుంసక శబ్దంవలెనే పరమైన పదాలతో సమసిస్తుంది—అని దీని వ్యాఖ్య. దీనితో ప్రత్యహం + పరివర్తనం = ప్రత్యహపరివర్తనం అన్న రూపం సిద్ధిస్తుంది.

ఇక దీని విషయమై ఏవిధమైన సందేహం అవసరం లేదు. ఈలాటి అవ్యయీభావాలు పరపదాలతో సమసించడం క్రింది ఉదాహరణలలో గుర్తించవచ్చు.

యథోత్తరేచ్ఛా హి గుణేషు కామినః"—(కిరాతార్జునీయం, అష్టమ, 4)

యథోత్తరం అనే అవ్యయీభావం పక్కన ఉన్న ఇచ్ఛాశబ్దంతో సమసించి 'యథోత్తరేచ్ఛా' అని అయింది.

"కృతయథాస్వతరుప్రసవ శ్రియా"- (మాఘం, షష్ట.1)

"యావదర్థకరణం కిల సాధోః ప్రత్యవాయ ధుతయే నగుణాయ"—(నైషధం, పంచమ, 9)

"యావదర్థపదాంవాచం"—(మాఘం, ద్వితీయ, 13)

"సోహ మాజన్మశుద్ధానాం, ఆఫలోదయ కర్మణాం, ఆ సముద్రక్షితీశానాం ఆనాకరథవర్త్మనాం"—(రఘు, ప్రథమ, 5)

ఇంతకూ అహశ్శబ్దం అవ్యయీభావంలో టచ్ ప్రత్యయంవచ్చి, తర్వాత నపుంసకంగా పరిగణించబడి పక్కన ఉన్న పదంతో సమసిస్తుందని పై వివరణ వల్ల స్పష్టమైంది.

మొదట శ్రీ సీతారామయ్యగారికి అహశ్శబ్దం అకారాంతంగా ఉండడమే తప్పుగా కనబడింది. తర్వాత వారికి "ప్రత్యహం అయినా, పక్క పదంలో ఎలా సమసిస్తుంది?" అన్న శంకపొడమింది. ఇది సంస్కృతపదం గనుక, సంస్కృతభాష పూర్తిగా వ్యాకృతమైంది గనుక ఇంతవివరణ అవసరమైంది. ఇక దీనిపై అనుమానానికి ఆస్కారం ఉండదనుకుంటాను.

తక్కిన అంశాలలో వారి రెండో వ్యాసం చదివినతర్వాత వివరించవలసినది కనిపించలేదు. కొన్ని విషయాలలో (ఉదాహరణకు దయ్యం) భిన్నాభిప్రాయాలకు తావుండడం సహజం.

అక్షరసాయన శాస్త్రము

శ్రీ రాణీ మహదేవశాస్త్రి

ఆర్యా,

మాన్యులు శ్రీహరి ఆదిశేషువుగారికి రాణీ మహదేవ శాస్త్రి నమస్కరించి వ్రాయునది.

'భారతి' ఫిబ్రవరి సంచికలో ప్రచురింపబడిన మీ వ్యాసము 'అక్షరసాయనశాస్త్రము'ను చదివి ఆనందించినాను. మన ప్రాచీనోన్నతిని ప్రాచీనశాస్త్ర విజ్ఞానమునుగూర్చి పరిశీలించి వ్రాయుట ఎంతో అవసరమైనప్పటికి వాటినిగూర్చి జరిగే పరిశోధన స్వల్పము. ఈ సందర్భంలో మీరు ఈ రచనకు పూనుకొనుట ముదావహము. రసాయనశాస్త్రములో విజ్ఞుడ్ని కానప్పటికీ, ఈ క్రింది అంశములు నాకుతోచినవి మీ గమనిక కొరకై వ్రాయుచున్నాను.

మీరు వ్రాసిన వ్యాసము 1955 లోగాక 1935 లో ప్రచురిస్తే చాలాబాగుండేది. ఆంగ్లపరిపాలనా కాలం ప్రజలు, పరిపాలకులు మన ప్రాచీన సంస్కృతి యెడల చూపే అశ్రద్ధని నిర్మూలించుటకోసము, మన ప్రాచీన సంస్కృతి గొప్పదనీ, మన పూర్వుల శాస్త్ర విజ్ఞానము అపారమనీ చాటుకోవలసిన అవసరం వుండేది. కాని స్వతంత్రభారతదేశంలో మన మీ దృక్పథాన్ని మార్చుకోవలసి వుంటుంది. ఇప్పుడు మనము చేయవలసింది మన పూర్వుల గొప్పతనాన్ని పొగడడమే కాదు; నిష్పాక్షికంగా 'వారికెంత తెలుసును, వారి వైద్యశాస్త్రము, వారి రసాయనసిద్ధాంతాలు, ఏ పద్ధతులపై నడిచాయి, ఏ నమ్మకాలపై ఆధారపడిఉన్నాయి' అనే విషయాల పరిశీలన. మీ వ్యాసము మొదటి తరహాలో నడిచింది.

మీ వ్యాసములో అనేకచోట్ల అక్షరసాయన శాస్త్రవిధానాలను విశదీకరించిన పిదప వాటిని ఆధునిక శాస్త్రసిద్ధాంతాలద్వారా సమర్థింపజూచారు.

మీరు ప్రతిపాదించిన సమర్థనలు ఉల్లిపాషాణ శుద్ధి విధానంలో తప్ప మిగతాచోట్ల అంత సమంజసంగా లేవు. మీ వ్యాసాన్ని మొత్తముమీద పరిశీలించి చూస్తే మీరు ఆర్షరసాయన శాస్త్రము ఆధునిక శాస్త్రానికి ఏవిధంగాను తీసిపోదని నిరూపింప బూనుకున్నారని తోస్తుంది. ఈ ఊహ సత్యమని నాకు తోచదు.

ఈ దిగువ పేరాలలో మీ సమర్థనలను వాటి ఔచిత్యాన్ని పరిశీలిద్దాము.

(1) లోహశుద్ధి విధానము:

మీరు ఆయుర్వేదములోవుండే లోహశుద్ధి విధానాన్ని విపులీకరించిన పిమ్మట 'ట్రేస్ ఎలిమెంట్సు' (*Trace elements*) చేర్చబడతాయేమో నని వ్రాశారు. కాని ఈ ఊహకు మీ రుదహరించిన శుద్ధి విధానం ఏ విధంగా దోహదమిస్తుందో నా కర్థము కాలేదు. కుందేటి నెత్తురులోను, జిల్లేడుపాలలోను, త్రిఫల కషాయములోను (*Trace elements*) ఉన్నాయా లేవా అనేది వివాదాంశము. అథవా ఉన్నా, అవి ఈ లోహశుద్ధి విధానంలో లోహాన్ని గుణవంతం చేస్తాయనడానికి నిదర్శనము గానరాదు.

(2) భస్మీకరణం:

ఈ సందర్భంలో మీరు చేసినటువంటి మూడు సూచనలు అంత సమంజసంగా లేవు.

మొదటిది—భస్మములు తయారుచెయ్యడంలో చరమ లక్ష్యము వాటిని కొల్లాయిడుకణాలక్రింద మార్చడమని వ్రాశారు. ఈ వాక్యానికి అర్థమేమిటో సరిగా బోధపడలేదు. మీ వుద్దేశం కొల్లాయిడుకణాల పరిణతి కల్గిన కణాలక్రింద భస్మకణాల్ని మార్చడమనియా లేక భస్మాల్ని నీటిలోకాని మరితర ద్రవాలలోగాని కల్పిన యెడల కొలైడల్ ద్రావణములు (*Colloidal solutions*) వచ్చేటట్లుగా తయారు చెయ్యడమనియా విశదీకరింపమని ప్రార్థన.

రెండవది—సూక్ష్మజీవులు విద్యుదావేశ పూరితములనీ, భస్మాలు వాడడంలో వుద్దేశం ఈ విద్యుదావేశాన్ని న్యూట్రలైజు చెయ్యడమనీ వ్రాశారు.

భస్మాలు నోటితో పుచ్చుకోవలసిన మందులనుకుంటాను. ఇదే నిజమయినట్లయితే శరీరములో సూక్ష్మజీవులుండే స్థలానికి భస్మాలు భస్మరూపకంగా వెళ్ళవు. జఠరరసము, ప్రేగులలోనుండే మిగతా రసాల ప్రభావమువల్ల వాటిస్థితి మారిపోతుంది. స్థితితోపాటు వాటి విద్యుదావేశముగూడా మారిపోతుంది. బహుశః సూక్ష్మజీవులవద్దకు చేరుకునేసరికి వాటికి విద్యుదావేశం ఉండిఉండదు.

ఈ కారణంచేత భస్మాల ఉపయోగాన్ని గురించి మీ రిచ్చిన సమర్థన అంత సమంజసంగా లేదు.

ఇక మూడవవిషయం. భస్మాలశుద్ధత (*Purity*) ఆర్షరసాయన శాస్త్రవిదులు భస్మాలు నిప్పుమీద వేసినా మారకుండా వుంటే అవి చాలా శుద్ధమైనవని చెప్పారని మీరు వ్రాశారు. ఈ విషయంగురించి వ్రాస్తూ మీరు క్లోరైడు కాని మరితర మలినాలు ఉన్నయెడల భస్మాల రంగు నిప్పుమీద పెడితే మారుతుంది. అందుచేత భస్మాల ప్యూరిటీ టెస్టు బ్రిటిషు ఫార్మకోపియాలోని టెస్టుల కేమాత్రం తీసిపోదని వ్రాశారు.

ఈ ఊహకూడా అంత సమంజసంగా తోచదు. భస్మాలన్నీ వేడి ప్రభావాని కొకేవిధంగా ప్రవర్తించవు. కొన్ని 'ఇన్‌ఫ్యూసిబుల్' (*Infusible*) ద్రవ్యాలకు, వేడిప్రభావమువలన విచ్ఛేదన జరిగినా రంగుమారని పదార్థాలకు మాత్రమే పై టెస్టు ఉపకరిస్తుంది. పైగా మలినపదార్థాలున్నా వాటి పాలు ఎంతో తెలుసుకోవడం పై టెస్టుమూలంగా అసంభవం.

ఇంతకీ నేను మనవిచేసుకొనేదేమంటే, పూర్వ రసాయన శాస్త్రజ్ఞులు కుశాగ్రబుద్ధులైనప్పటికీ, జనాదరణలేకపోవడంచేతా, కొన్ని నమ్మకాల ప్రాబల్యం వలన, ప్రాచీన రసాయన శాస్త్రం ఆధునిక రసాయన శాస్త్రమంతగా పురోగమించలేదు. ఇలా చెప్పుకోవడం మనకిగాని, మన సంస్కృతికిగాని న్యూనత కాదు. సత్యదూరాలైన సమర్థనలతో ప్రాచీన విధానాలన్నీ గొప్పవనీ, ఆధునిక శాస్త్ర విధానాలలో సరితూగగలవని చెప్పడంవల్ల మన సంస్కృతి గొప్పదై పోదు.

ఈ లేఖలో నేను వ్రాసిన విషయాలు "మీరు సహృదయతతో గమనిస్తారని నమ్ముతున్నాను.

యక్షగాన కవులు

శ్రీ కేతవరపు వేంకట రామకోటిశాస్త్రి

ఫిబ్రవరి భారతిలో శ్రీయుత నిడుదవోలు వేంకటరావుగారు పై శీర్షికతో నొక వ్యాసమును వ్రాసిరి. అందు ప్రోలుగంటి చెన్నమంత్రి వ్రాసిన యక్షగానమును ప్రస్తావించిరి. హరిభట్టు రచించిన నారసింహపురాణము—ఉత్తరభాగము—ను అతని కుమారుడు రాఘవమనీషి ప్రోలుగంటి రంగమంత్రికి అంకితము గావించుచు కృతిభర్త వంశావతార మభివర్ణించుచు, రంగమంత్రి పినతాత నాగశౌరి కుమారుని చెన్నశౌరిని పేర్కొని "ఆ మంత్రి పుంగవుం డష్టభాషాకవివర్యుడై..........సౌభరిచరితంబు జక్కుల కథ చెప్పె..............నరసింగరాయలచేతఁ గొనియె నగ్రహారంబులును......" అని చెన్నశౌరిని ప్రశంసించినాడు. జక్కుల కథ యనగా యక్షగానమని విమర్శకుల యభిప్రాయము. కనుక చెన్నశౌరి సౌభరి చరితమను యక్షగానమును రచించెనని చెప్పవలయును. ఆ యక్షగానము ప్రస్తుత ముపలభ్యము గాదు. అయినచో మొదటి యక్షగాన మే యగును.

శ్రీయుత వేంకటరావుగారు తమ వ్యాసమున నీ యక్షగానమును లక్ష్మీకల్యాణముతో నభేదమును నిరూపించుటకు యత్నించిరి. ఈ లక్ష్మీకల్యాణ ప్రస్తావన రెండు గ్రంథములందున్నట్లు శ్రీ రావుగారే చూపిరి. అందు మొదటిది వెల్లంకి తాతంభట్టు రచించిన కవిచింతామణి యను లక్షణగ్రంథము. రెండవది నందిమల్లయ, ఘంటసింగయ కవులు రచించిన వరాహపురాణము. ఈ రెండు గ్రంథములలోను లక్ష్మీకల్యాణము యక్షగానమని చెప్పబడలేదు. తాతంభట్టు లక్ష్మీకల్యాణములోని "ఊకులు" అని వ్రాసినాడనియు, ఊకు లనగా అర్ధచంద్రికలలోని పాదము లనియు అవి యక్షగానములలో ప్రయుక్తము లనియు చెప్పి, అందువలన లక్ష్మీకల్యాణము యక్షగానమని శ్రీ రావుగారు వ్రాసిరి. వరాహపురాణ పద్యాంతము లలో "......లక్ష్మీకల్యాణ నరసింహ విజయపురాణ కథా రమణతాను రాగస్థితికిన్" అని కృతిపతియైన తుళువ నరసింహరాయలను గూర్చి వ్రాయబడి యుండుటచేతను, క్రీ. శ. 1487 సం॥ న విజయనగర సింహాసన మధిష్ఠించిన సాళువ నరసింహరాయల యొద్ద దండనాథుడుగా తుళువ నరసింహరాయలుండి, వరాహపురాణ కృతిభర్తయైనందునను, ఆ పురాణమున 'లక్ష్మీకల్యాణ' మని యుండుటచేతను, 1500 ప్రాంతమున నున్న తాతంభట్టు పేర్కొనిన "లక్ష్మీకల్యాణ" మదియే యైయుండుననియు, అది యక్షగాన మే ననియు శ్రీ వెంకటరావుగారు వ్రాసిరి. 'లక్షణదీపిక' యందు మధురకవిత్వమును గూర్చి యున్నచోట "మధురకవిత్వం బన్నది......గీత ప్రబంధములు...ఏలదావళి...రంగఘోష ... యక్షగానంబున వెలయు పదంబులు...శోభనంబులు...జక్కుల రేకు పదంబులు...అష్టకంబులు...వివియాదిగా గల్గి నన్నియు" అని యున్నట్లు కీ. శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు తమ వ్యాసములలో నొకచోట వ్రాసినారు. పైన నుదాహరించిన దానినిబట్టి జక్కులరేకు పదములను నవి కొన్ని ప్రత్యేకముగా నున్నవనియు, అవి యక్షగానమున వెలయు పదముల కంటె భిన్నము లనియు స్పష్టము. తాతంభట్టు పేర్కొనిన 'లక్ష్మీకల్యాణములోని 'ఊకులు' జక్కులరేకు పదము లను కొనినచో లక్ష్మీకల్యాణము యక్షగానము కానక్కరలేదు. ఒకవేళ మధురకవిత్వములో చేరిన దరువులు, ధవళములు యక్షగానములలో గూడ నున్నవిగదా యనియు, అట్లే జక్కులరేకు పదములును యక్షగానముల నుండవచ్చుననియు, భావింపవచ్చును గదా యనిన, తాతంభట్టు లక్ష్మీకల్యాణము యక్షగానమని స్పష్టము చేసియున్నచో నట్లు సరిపెట్టుకొనవచ్చును. తాతంభట్టట్లు చెప్పియుండలేదు. కనుక 'ఊకుల' ను శబ్దమునుబట్టి యా గ్రంథము యక్షగానమని చెప్పలేము. తాతంభట్టు చెప్పకపోయినను, ఆ యక్షగానము లభించినచో అందు రేకుపదము లున్నవి యున్నచో అది యక్షగానమని యంగీకరింపవచ్చును.

ఇక సౌభరిచరితమును గూర్చి విచారింపవలెను. 'సౌభరి' అను దానికి సరియగు నర్థము కుదురుటలేదనియు, పాఠముకూడ సరిగా నుండకపోవచ్చుననియు, ఇట శబరి చరిత్రంబు జక్కులకథ అను పాఠమే యుండెడుననియు, శబరి, శాబరీ, శౌబరి, సౌబరి యని యిత్యాదిగా నుచ్చారణ భేదముల నిది వ్యవహృత మగుచున్నదనియు శ్రీ వేంకటరావుగారు వ్రాసిరి. ఒక శబ్ద ముచ్చరించు జనులలోని సంస్కార

భేదమును పురస్కరించుకొని మారుట సహజము. పల్లమునకు నీరుదిగునట్లు శబ్దోచ్చారణ సౌలభ్యము వైపునకు మార్పు చెందును. శబరి యను శబ్దమున కంటె సౌబరియను శబ్దోచ్చారణమున సౌలభ్యము లేదు. లేకపోయినను శ్రీ వేంకటరావుగారూహించినట్లు, చెన్నమంత్రి శబరి (చెంచెత—చెంచులక్ష్మి) కథను యక్షగానముగా రచించియున్నాడనుకొనిన, దీనినే రాఘవమనీషి పేర్కొనియుండు ననుకొని. 'సౌబరి' చరిత మనవలయును గాని, సౌభరిచరిత మనుట యేల యను ప్రశ్న యుదయించుచున్నది. అది లేఖక ప్రమాదమని సమర్థించుకొనవచ్చునని శ్రీ వేంకటరావుగా రందురు. అట్లైనచో తాతంభట్టు యీ యక్షగానమునే పేర్కొనియున్నచో, శ్రీ వేంకటరావుగా రూహించిన 'శాబరి, సౌబరి, లేక శబరి చరిత్రము' సాధుపాఠమును గ్రహించి చెప్పియుండ వలసినదిగదా—? దాదాపు చెన్నమంత్రి కాలమునాటివాడైన తాతంభట్టునకు తెలియని సాధుపాఠము ఐదువందల సంవత్సరముల తరువాతి వారమైన మనకు తెలియుననుట అంత సమంజసము గాదేమో నని నా యభిప్రాయము.

ఇక నసలు విషయము. తాతంభట్టు తన కవిచింతామణిలో పేర్కొనిన 'లక్ష్మీకల్యాణము' యక్షగానమైనను కాకపోయినను, వరాహపురాణమున పేర్కొనబడిన 'లక్ష్మీకల్యాణ'మే తాతంభట్టు పేర్కొనిన 'లక్ష్మీకల్యాణ' మనుటకు సందేహమున్నను లేకపోయినను, ఆ గ్రంథములతో ప్రోలుగంటి చెన్నశౌరి వ్రాసిన 'సౌభరి చరితము'నకెట్టి సంబంధము నుండదు. సౌభరి చరితమనునది దానికది ప్రత్యేకమైన యక్షగానమైయుండునని నేనూహించుచున్నాను. సౌభరి చరిత్రము విష్ణుపురాణమునన్నది. శుకుడు పరీక్షిన్మహారాజునకా కథ నిట్లు చెప్పెను. సౌభరియనువాడు ఋషి; బ్రహ్మచారి. ఒకనాడు జలములందుండి మత్స్యకుటుంబమును చూచినాడు. పుత్రపౌత్ర కళత్రాదులతో సుఖజీవితము గడుపుచున్న యా మీనముయొక్క ఆనందమునకు మేరలు వెదకినాడు సౌభరి. తానుగూడ వివాహమాడి సంసార సుఖము ననుభవించిన బాగుండునను భావము కలిగినది. తగిన స్త్రీని వివాహమాడవలయునని సంకల్పించుకొని యతడు బయలుదేరి మాంధాతృ చక్రవర్తి వద్దకు వెళ్లి తన మనోభావములను వెల్లడించినాడు. సౌభరి కురూపిగా యున్నందున చక్రవర్తి సంశయించినాడు. ఋషి యడుగగా కాదనుట పాడిగాదని తన కుమార్తెలను పిలిపించెను. వారా కురూపిని వివాహమాడరని మాంధాతృ చక్రవర్తి తలచెను. కాని వారందరకు సౌభరి సౌందర్యవంతుడుగా కనుపించెను. అందరును వానిని వరించిరి. చక్రవర్తి వారికి వివాహము గావించెను. సౌభరి వారిని తోడ్కొనిపోయి విశ్వకర్మచేత తగిన భవనములు నిర్మించుకొని భార్యలతో సంసారము చేసి, పుత్రపౌత్రులను బడసి సంతుష్టుడై తపమునకు వెళ్ళెను—. ఇది విష్ణుపురాణమునందలి సౌభరిచరితము—ప్రోలుగంటి చెన్నశౌరి "ద్విపదగా నారసింహ పురాణ మొనరించి భక్తి నహోబల భర్త" కిచ్చియున్నందున అతడు వైష్ణవ భక్తి ప్రపత్తులు కలవాడనియు, అందువలననే విష్ణుపురాణమునందలి సౌభరి చరిత్రమును వైష్ణవవాతావరణముతో యక్షగానముగా రచించియుండుననియు భావించుటలో విసందర్భముండదనుకొందును.

ఈ విధమైన సౌభరిచరిత్ర మొకటి పురాణ ప్రసిద్ధమైనదుండగా, 'సౌభరి' శబ్దమున కర్థము కుదురుటలేదని 'శబరి'యై యుండునని యనుకొనవలసిన యావసరము లేదు. ఇంతకును ప్రోలుగంటి చెన్నశౌరి యక్షగానము లభించలేదు. దాదాపు సంవత్సరము నుండి నేనా ప్రయత్నమున నున్నాను. ఆ యక్షగానము జాడ పొడగట్టలేదు. శ్రీయుత వేంకటరావుగారును నా యక్షగానము లభించినట్లు చెప్పుటలేదు, లభించనట్లును చెప్పుటలేదు. లభించినచో ముద్దరాజు పెదరామన యక్షగానము (కృష్ణవిలాసము)ను వలె పేర్కొనియుందురు. లభింపని పక్షమున వెణుతురుపల్లి విశ్వనాథకవి యక్షగానము (శ్రీరామవిజయము) 'మనకు లభ్యముకాలేదు' అని స్పష్టముగా వ్రాసినట్లు వ్రాసియుండవలసినది. అదియును లేదు. పోనీ తాతంభట్టు పేర్కొనిన 'లక్ష్మీకల్యాణము' ఐనను లభించినదా యనిన యదియును స్పష్టముగా లేదు. ఆ లక్ష్మీకల్యాణమే లభించియున్నచో నందీకృతి కర్త పేరుండదా? అపుడు "ఇక లక్ష్మీకల్యాణ యక్షగాన కర్త యెవరో కనుగొనవలసియున్నది" అని పరిశోధన చేయవలసిన యావసరమేమున్నది? కనుక నదియును లభించలేదు. "లక్ష్మీకల్యాణములోని జక్కులు" అను తాతంభట్టు వాక్యములోని 'జక్కుల' నూతగా గొని యది యక్షగానమని నిశ్చయించుకొని, దాని కొక కర్తయుండుట విధి గనుక, ఆ ప్రాంతమున యక్షగాన రచన చేసిన ప్రోలుగంటి చెన్నశౌరిని చిక్కించుకొని, ఇతడు వ్రాసినట్లుగా పేర్కొనబడిన 'సౌభరి' చరిత్రమును 'లక్ష్మీకల్యాణము'ను నొకటిచేసి తత్కర్తగా ప్రోలుగంటి చెన్నశౌరిని పేర్కొనుటకు చేసిన యత్నమే అధికముగా శ్రీ వేంకటరావుగారి వ్యాసమున కనుపించుచున్నది. పొసగని విషయములకు పొత్తు కూర్చుచున్నట్లున్నది.

గ్రంథ విమర్శనము

చొక్కనాథ చరిత్రము

పూర్వకవి శ్రీ పచ్చకప్పురపు తిరువేంగళ రాజ ప్రణీతము: మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత భాండాగారము వారి ప్రచురణ: వెల 7-0-0.

ద్విపదకావ్యం: హాలాస్య మహాత్మ్యము, మధురాఖండము అనే నామాంతరాలు గల సంస్కృత పురాణం ఆధారంగా వ్రాయబడిన తెలుగు రచన. ఈ గ్రంథానికి 'చొక్కనాథచరిత్రి', 'చొక్కనాథ విలాసం' 'చౌషష్టి లీలా విలాసం' 'మధురా పురాణం' అనే వివిధనామాలున్నాయి.

పరమశివుడు మీనాక్షీదేవిని వరించి పాండ్యరాజు మలయధ్వజునకు ఇల్లటపుటల్లుడై మధురా ప్రజలను పునీతులనుజేసిన పుణ్యకథనం ఇందు వర్ణింపబడివుంది. శైవసంప్రదాయదృష్ట్యా దీని ప్రాశస్త్యం మాట అలావుంచి కావ్యంగా ప్రసాదగుణసహితమైన రసవాహిని.

తిరువేంగళరాజు అనంతరం ఈ గ్రంథాన్ని ఆధారంగాచేసుకుని మల్లంపల్లి బుచ్చికవి, తిరుమల సెట్టి జగన్నాథకవి మొదలైనవారు చంపూరూపాలలో రచించారు. అనేక వచనగ్రంథాలు ఘటించి విఖ్యాతులైన, కళువె నందరాజు, మైసూరు దొడ్డరాజు దళవాయి, దీన్ని వచనంలోకి అనువదించారు. అప్పయ్య దీక్షితులవారి తమ్ముని మనుమడు శ్రీ నీలకంఠ దీక్షితులవారు 'శివలీలార్ణవ' మనేపేర ఇరవై రెండు సర్గలలో సర్గబంధంగా సంస్కృతంలో సంఘటించారు.

కవి పచ్చకప్పురపు తిరువేంగళరాజు, భట్రాజు. 'పచ్చకప్పురము' అనేది తొలుత ఈ వంశంవారికి బిరుదుగా లభించి అనంతరం యింటిపేరుగా మారింది. ఈ కవి తాత 'తిమ్మరాజు', ఆయనసోదరుడు 'అయ్యలు' కర్ణాటాధీశ్వరుడు ప్రౌఢదేవరాయలను మెప్పించగా ఆయన వీరిని 'పచ్చకప్పురపు రాజులని ప్రశంసించారు.

'అనఘుడగు మీ తాత యగు తిమ్మరాజు
తన తమ్ముడయ్యలు దాను నిమ్మహిని
ప్రాఘుడై విద్యల బరగమెప్పించి
ప్రౌఢరాయలచేత బచ్చకప్పురము
రాజునాబడె, దిమ్మరాజుకు దిప్ప
రాజుదయించె విరాజితమ్ముగను
రాజులమెప్పించె రసికుడాతని త
నూజుడ వార్యసన్నుత కవీంద్రుడవు'

ఈ గ్రంథం గోర్ల బసవభూపాలుని పుత్రుడు పెదరామభూపతికి అంకితం. వారిది కమ్మవంశం. పెదరామభూపతి, ఆయన తమ్ముడు చినరామనృపతి అచ్యుతదేవరాయల సామంతులుగా రామనాడుజిల్లాలోని తిరుపత్తూరు సీమను పరిపాలించారు. పిప్పాల గోత్రజులు వ్యాసతీర్థులవారి శిష్యులు. పెదరామప్ప క్రీ. శ. 1538 లో తిరుపత్తూరుదేవాలయంలో ఒక దానశాసనం వేయించాడు: అందుచేత కవి తిరువేంగళ రాజుకూడా నాటివాడేనని నిర్ణయించవచ్చు.

నీలకంఠ దీక్షితులవంటి మహాపండితుణ్ణి మోజు పెట్టిన ఈ గ్రంథాన్ని గురించి ఎక్కు ప్రశంస అనవసరమేఅయినా, వానవికి ఒకింత తెలివి చూతాము:

గాజులసెట్టివేషంతో మధురలో తిరుగాడుతున్న పరమశివునివర్ణన:

'చొక్కనాయకుడు గాజులసెట్టి యగుచు
జక్కగా మసుకవేషములోడ జల్లి
పట్టుమాత్రపుతోల్ల పైడుంగరములు
బెట్టు బసవని జేసి పెట్టినముద్ర
పట్టువస్త్రముగూర్చి బాసుగా బిగియ

గట్టిన జేవుందు కంఠాన నమర
నొసలను విభూతి నునుపుగా దీర్చి
రొంటిపై రి పెండ్లికట్టారవుగా బెట్టి
సన్నపు రుద్రాక్ష సరములు వైచి
వస్త్రమ్ము మీఱగను ధోవతి కట్టుగట్టి
ప్రేమించు గజము పచ్చని పచ్చడంబు
వామాంగమున వల్లెవాటుగా వైచి
వెలిమించు తలపాగ చేర్పుగా జుట్టి
కరమెంపు వ్రేళ్ల నుంగరములు బెట్టి
భుజముపై గాజులపోది చాల బెట్టి
భుజగేంద్రభూషుండు పురవీధులందు
గాజులు జోడ్దులు కమ్మగుడ్డులును
గాజులు కొనరారో! గాజులో యనుచు
పచ్చలు బూడిలు పచ్చరట్టాకు
పచ్చలు పొన్నాకుపచ్చ గాజులను
నీలాలు మరితట్టు నీలాల రంగు
నీలాలు పచ్చలనిగ్గు గాజులును
ఆవపూవన్నె రాజావర్తనములు
గోవారి సరములు గోమ్మిసంచులును
పువ్వగ గాజులు పొన్నపూ చింత
పువ్వులు సంపంగిపూ చామపువ్వు
పొగడ గాజులు కెల్లెపోతువన్నియలు
చిగురాకు తేనెలు జీని గాజులను
గలవు మాకడ ననేకములైన నగలు
వలపినవారికి వలపివన్నె
గాజులు దొడగదకన్నె ప్రాయంపు
రాజీవనయనలు రారో యటంచు
వీథివీథుల బెట్టి వేడ్కతో దిరుగు'—

నీలగిరి యాత్ర

కోలా శేషాచల కవి ప్రణీతము. వచన రచన; మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమువారి ప్రచురణ: వెల 1-8-0.

ఇది చిన్నయసూరి 'నీతిచంద్రిక'కు పదిసంవత్సరాలు ముందే వెలువడిన గ్రంథం. అందుచేత చిన్నయసూరి గ్రాంథిక వచన రచనకు మార్గదర్శకుడనేమాట అబద్ధమని తేలిపోతుంది.

ప్రచురణకర్త శ్రీ టి. చంద్రశేఖరన్ పీఠికలో ఇలా వ్రాశారు.

'నీలగిరియాత్ర యను నీ గ్రంథము నీలగిరి యాత్రా చరిత్రలకు సంబంధించినది. మద్రాసు దొరతనమువారు పూర్వము ఏటేటను వేసవిలో తమ పరివారముతో నీలగిరికి వెళ్లుట యాచారమై యుండెడిది. క్రీ.శ. 1846వ సంవత్సరమున నప్పటి గవర్నరగు 'ట్వీడెల్' దొరగారు తమ కార్యనిర్వాహక వర్గముతో గూడ నీలగిరికి పయనమైరి. ఆ కార్యనిర్వాహకవర్గములో నొకడగు "తామస్ పిమ్సన్" అను దొరవారి ఆఫీసున ప్రధానోద్యోగి యగు మాంగాడు శ్రీనివాస మొదిలారియును, గుమాస్తాగానున్న ప్రకృత గ్రంథకర్త యగు కోలా శేషాచలకవియు నా పరివారముతో నీలగిరి వెళ్లిరి. శేషాచలకవి క్రీ. శ. 1846 మే 12వ తేదీన చెన్నపురినుండి బయలుదేరి ఎనిమిది నెలలుండి తిరిగి 1847 జనవరి 13వ తేదీన మద్రాసు చేరుకొనెను. ఈ కాలములో శేషాచలకవి తన ప్రయాణమునుగూర్చి తెలుపుచు, నీలగిరిలోని విశేషములను, తన యనుభవములను సేకరించి పై గ్రంథమును రచించెను'—

శేషాచల కవి చెన్నపట్టణమునందలి చింతాద్రి పేట నివాసి. యాదవకులసంజాతుడు. ఇతని తాత తెప్పలనాయకుడు, తండ్రి వెంకటాచలనాయకుడు. తల్లి మంగమ్మ. మొంగాడు శ్రీ శివాపమొదలియార్ దగ్గర గణితశాస్త్రం అభ్యసించి ఆయన చేతిక్రిందనే సుమారుగా పనిచేశాడు. ఈ గ్రంథం విశాఖపట్నంలోని జమీందారీకుటుంబాలలో ఒకటైన గోడేవారికుటుంబంలోని జగ్గారాయలుగారికి అంకితం చేయబడివుంది.

ఈ దిగువ కారణాల వల్ల ఈ గ్రంథం ఆంధ్ర వాఙ్మయంలో ఒక ప్రధానమైన గ్రంథమనే చెప్పాలి.

(1) మనకు వచనగ్రంథాలు ఎక్కువ లేవు.

(2) చిన్నయసూరికి పూర్వమే చిన్నయసూరికి కూడా మార్గదర్శకమైన వచనరచనాసంప్రదాయమొకటి దేశంలో వున్నదని నిరూపించుతోంది.

(3) గ్రాంథికవచనంలో అన్యభాషా పదాల ప్రయోగం అవసరమైనప్పుడు వాటిని ఆభాషలో కలిపి పోతపోసుకు రావటానికి గల మార్గాలు ఈ రచనను పరిశీలించితే మనకు అవగతమౌతాయి.

"అ యమ్యాలికి గొండొక పేరనుండు పూవిరుంద మల్లి యను గ్రామంబు పైగ్రామంబునకన్న చిన్నది. గానం దాలుకు కచ్చేరియు దాలుకు మునసఫీకోర్టు నున్నయవి"

'త్రైస్త్రిపూశకంబున వేయు నెనమన్నూట పలువది యారవసంవత్సరంబు మేసెల పండ్రెండవ తేదీ భాను వాసరంబున'

'పదునేనవ తేదీ భార్గవవాసరంబునం బలంగుం బె స్తంగతుండైనపిదప నొక్క గడియకక్కడినుండి బయలి వాలను మువ్పాతికకోసున నుండు వాలాజా పేటను, నక్కటికడు నొకటియు నరపరకోసునం గల రాణీ పేటను నప్పేటకు నొకటియు నర మువ్వసము కోసు దవ్వున నివ్వటిల్లు వేలూరను గొప్ప సంవసథంబు మరునాటియహంబున ఘటికాదశకంబునకు ప్రవే శించితిమి!...

ఇత్యాదివాక్యాలు ఈరచన నిండా అనేకం.

దీల్లోఉల్లేఖింపబడిన విషయాలుకూడా చిత్ర విచిత్రంగావున్నయి. నీలగిరిప్రాంతీయ ప్రజల ఆచార నియమాలనుగురించి రచయిత అందించిన ఫోటో ఎంతో ఔత్సుక్యాన్ని కలిగించుతూవుంది.

శ్రీ రామకృష్ణోపనిషత్తు

ఇది శ్రీ చక్రవర్తుల రాజగోపాలాచారిగారు తమిళంలో రచించిన వ్యాసాలకు గా॥ వ్యాయమూర్తి శ్రీ పత్తిపాటి సత్యనారాయణగారి తెలుగుసేత.

అనేకమంది రచయితలు రామకృష్ణపరమహంస జీవితోపదేశాలను రచించారు. కాని రాజాజీ ఈ గ్రంథంలో అనుసరించినపద్ధతి ముచ్చటగా వుంది. ఎక్కడా విసుగుదల కలగకుండా కథలు కథలుగా ముచ్చట కలిగేలా చెబుతూ ఎలాంటిసర్మసూక్ష్మన్నయినా సులభంగా బోధపడేలా చెబుతారు, విసుగు కలగకుండా. శ్రీ సత్యనారాయణగారి అనువాదం ధారాళమైనశైలిలో హృద్యంగావుంది; ప్రాప్తిస్థానం: శ్రీ రామకృష్ణ మఠము; మైలాపూరు, మద్రాసు - 4. వెల 1-4-0.

అల్పజీవి

నవల: రచన; శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి; ఈ రచన లోగడ భారతిలో సీరియల్ గా ప్రచురింప

బడి ఆంధ్రప్రజల ప్రశంస లందుకున్నది. ఈ కథలో శ్రీ విశ్వనాథ శాస్త్రిగారు కథాశిల్పంలో ఒక నూతన మార్గాన్ని అందుకున్నారు. ఇటీవల మరికొందరు రచయితలు ఈ పద్ధతిలో తమ రచనలను మలచటానికి ప్రయత్నించుచున్నారంటే ఆంధ్రకథా సాహిత్యంలో ఈ రచనకు గల స్థానమేమిటో బోధపడుతుంది. ప్రాప్తిస్థానం: సౌరసాహితి: విశాఖపట్నం; వెల 1-8-0.

జాతక పరిశీలనము

(ప్రథమ భాగం)

రచన: శ్రీ కొంపెల్ల సుబ్బారావు ప్రచురణ: జ్యోతిస్సాహితీ ప్రచురణాలయం, విజయవాడ - 2. వెల రు 2-0-0.

వైద్యవిషయిక జ్యోతిషము

రచన: శ్రీ వేమూరి దక్షిణామూర్తి; జ్యోతిస్సాహితీ ప్రచురణాలయం: వెల 2-0-0.

సస్యజాతకము

రచన: శ్రీ వేమూరి దక్షిణామూర్తి; జ్యోతిస్సాహితీ ప్రచురణాలయం; విజయవాడ - 2; వెల 3-0-0.

హరనాథ భగవానుడు

ప్రథమసంపుటి; ద్వితీయభాగం; లీలాకాండ: ప్రచురణ: కుసుమహరనాథ సెంట్రల్ మిషన్: రాజమహేంద్రవరము. వెల రు 1 0-0.

అంతరాత్మ అంత్యక్రియలు

కథలసంపుటి; రచన: శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ; నవయుగ పబ్లిషింగ్ హౌస్; గుంటూరు. వెల రు. 1-0 0.

ఆణిముత్యాలు

ఖండకావ్యసంపుటి; రచన: శ్రీ చల్లా లక్ష్మీనారాయణశాస్త్రి: ప్రాప్తిస్థానం: చల్లా లక్ష్మీనారాయణ శాస్త్రిగారు, బోర్డు హైస్కూలు, సత్యవేడు (పోస్టు) వయా, గుమ్మడిపూడి, చెంగల్పట్టు జిల్లా.

యాత్రామార్గదర్శి: దక్షిణ భారతదేశము

రచన: శ్రీ రాగం వేంకటేశ్వర్లు, ప్రకాశకులు: శ్రీరామనామక్షేత్రము, గుంటూరు: వెల 3-8-0.

జగద్గురువు

శ్రీ శంకరగురు చరిత్ర: పద్యకావ్యము: రచన: కుమారి సుందరి; ప్రచురణ: శ్రీ టి. అప్పన్న యం. ఏ. మురారీ బిల్డింగ్స్, బళ్లారి; వెల: అమూల్యం.

మణిదీపాలు

వచన సూక్తులు, రచన: శ్రీ పులిపాక జగన్నాథరావు, అధ్యాపకులు, హిందూ కళాశాల, గుంటూరు. అమూల్యం.

సూక్ష్మంలో మోక్షం

కథలసంపుటి; రచన: శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ; ప్రచురణ: నవయుగ పబ్లిషింగ్ హౌస్, గుంటూరు; వెల 1-0-0.

Printed & Published by S. Sambbu Prasad at the Andhra Patrika Press, No. 7. Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.